భారతి

మాసపత్రిక

★

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు

(1911-1972)

★

ఏప్రిల్ 1977

సంపుటము : 54 సంచిక : 4

ఒకప్రతి వెల రూపాయిన్నర

విషయానుక్రమణిక

ఏప్రిల్ 1977



15—4—77 వై[illegible]

కళాప్రపూర్ణ, దేశోద్ధారక శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారి

100 వ జయంతి

చైత్రలక్ష్మి

శ్రీ దూపాటి సంపత్కుమారాచార్య

[illegible] నాకులపాటు గా చ్ఛెన్
విశంత నొంద [illegible] విశ్రుతి నిత్యము మారుటాకులన్
[illegible] కళా సమృద్ధిని వసంతుడు గూర్చెను కానిసేందిరా
[illegible] దివ్యోధవాళి వాత్సము నేడిది చైత్రలక్ష్మితో !!

౨. కోయిల్ల కొమ్మల కోకిలమ్మలు గళమెత్తి
యాహ్వాన గీతమ్ము లాలపించె !
పూలు పూచిన లతాంతాలు మకరంద
ధారల సర్వ [illegible] !!
మెరుగు మెరుపుల దీప్తి చిగురాకు చైత్రుండు
[illegible] తోరణాలు వసుధకు !!
[illegible] ఫలముల [illegible] పులకించి
వివిధ [illegible] !!

[illegible]
[illegible]

మా యింటకు [illegible] సమానితవై
రమ్మా ! పింగళ సంవత్సరాది రాజ్ఞి !

౩. నీ పలుకుల తెలుగు ఆంధ్ర వాణి విపంచి స్వర
సుభగము వీనుల విందుగాక !
నీ చరిత్రము రమణీయ సువర్ణ వ
ర్ణాంకిత మ్మగు కీర్తి నందుగాక
నీ కులుకుల శారదా నృత్య మంజీరమై
యువ జనాభ్యుదయమ్ము లౌను!
నీ కళా సృష్టి యువ్వెల పతాకన్ధాయి
నా కాక వీధులందాడుగాక !

మధురతరా నీ యశస్సును మల్లెపూవు
వించు పరిమళ మెల్ల హాసించుగాక !
భారతావని పింగళ వత్సరాది !
నవ యుగాది [illegible] ఉత్సవాలు !

చేతుల్లేని ఆబాధ

శ్రీ కె. శివారెడ్డి

చేతుల్లేని ఆ బాధ
తన మంచంలోని నిప్పు నెలా తోసి మనసు కాల్చుతోంది.

చేతుల్లేని ఆ బాధ
అద్దంలోని పిల్లవాణ్ణి మాట ముద్దాడలేక ఎలా ఏడుస్తోంది.

చేతుల్లేని ఆ బాధ
తన కళ్ళతో చుక్కల పువ్వుల్ని పూలపళ్ళెం ఎత్తి,
తన ముందుపోసి ఎలా తడుముకోమంటుంది.

చేతుల్లేని ఆ బాధ
ఈ రోడ్ల మీద దుమ్ముని దోసిలితో ఎత్తి మన కళ్ళల్లో కొట్టి
తన కళ్ళ చూపుల పేలాలు గడతపడి దారిమూసుకుని
నాలో - దాని బాధ నెలా తెలియచేస్తుంది

చేతులేని ఆ బాధ
చింతబరికె చేతో పట్టుకుని మనవాళ్ళంతా బాగా గొట్టి
పుళ్ళ సలపరపు సూదులు గుచ్చటంలో - తన మనసువడే
క్షోభ-యమ యాతన నెలా తెలియ చేస్తుంది.
చేతుల్లేని ఆ బాధ ఒక మహా సముద్రం.
కళ్ళులేని మనముందు
చేతులేని బాధా సముద్రాలు —
కళ్ళ చేతులోనే ఈ బాధా సముద్రాల్ని
ఎత్తి మన గుండెల్లో పెట్టుకోవాలి —
కాని
కళ్ళులేని మనముందు
మాటల చేతులేని చిన్నపిల్లల మహాసముద్రాలు

లక్ష్మీ పుట్టుపూర్వోత్తరాలు

శ్రీ వసంతరావు దేశ్‌పాండే

లక్ష్మీం క్షీరసముద్రరాజతనయాం, శ్రీరంగధామేశ్వరీం,
దాసీభూతసమస్తదేవవనితాం లోకైకదీపాంకురాం,
శ్రీమన్మందకటాక్షలబ్ధవిభవబ్రహ్మేంద్రగంగాధరాం,
త్వాం త్రైలోక్యకుటుంబినీం సరసిజాం వందే ముకుందప్రియాం.

సకల భారతదేశంలో నివసించే హిందువుల యిండ్లలో కార్తీక అమావాస్య నాటి లక్ష్మీపూజ జరుగుతుంది. దీని కాంతి తోరణాలలో ఇల్లు - వాకిలి దీపావళి - నాడు, శరద్రాత్రిలా వెలిగిపోతుంది. ఆనాటి రాత్రి లక్ష్మి యింటికి వస్తుందని, ఎక్కడా చీకటి లేకుండా దీపాలను వెలిగించి ఆహ్వానిస్తారు.

కొన్ని ప్రాంతాలలో లక్ష్మీమూర్తిని పూజిస్తారు. మరికొన్ని ప్రాంతాలలో చిత్రపటాలను పూజిస్తారు. సాధారణంగా గమనిస్తే, లక్ష్మి విగ్రహాల్లోనయితేనేమి, చిత్రపటాలలో నయితేనేమి, ఒకదానికి యింకొక దానికి కొంతభిన్నత్వం కనిపిస్తుంది. కాని, ఏ విగ్రహంలో నైనా, ఏ చిత్రపటంలోనైనా తప్పకుండా కనిపించేది కమలం.

ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని, హరప్పా, మొహంజదారో, చన్హుదారోలలో పరిశోధనలు జరిపితే ఏమయినా విశేషాలు లభించవచ్చు.

ఆ కాలంలో, ప్రాచీన నగరాలయిన హరప్పా, మొహంజదారో, అమరి, నాల్, కుల్లి, చన్హుదారో మొదలగువాటితో, పశ్చిమ దేశాలయిన రోమ్, గ్రీసు, కిష్, ఉర్, ఈజిప్టు యిత్యాది దేశాలతో వాణిజ్య సంబంధాలు ఉన్నట్లు తెలుస్తుంది. కాబట్టి, ఆనాడు వాణిజ్య సంబంధమున్న ఏదయినా సమాజం లేదా సంస్థ ఉండి వుండాలి. ఈ విషయాన్ని ఖచ్చితంగా చెప్పడం కష్టం. ఎందుకంటే, ఆ కాలంలో వారు ఉపయోగించిన భాషగాని, లిపిగాని, యింతవరకు చదవడం సాధ్యపడలేదు. నాటి లిపిని చదవగలిగితే కొంతలో కొంతయినా ఊహ చేయగలము. సింధు త్రవ్వకాలలో లభించిన ఆనాటి నాణాల పైగల ఆకృతులనుబట్టి, లక్ష్మికి, ఈ నాణాల పైగల ఆకృతులకు, దగ్గరి సంబంధం ఉండి వుంటుందని మాత్రం తెలుస్తుంది. (చిత్రం (1) సింధులోయలోని త్రవ్వకాలలో బయటపడిన నాణెముల పై ఆకృతులు)


ఆదిమవాసులదేవి:

ప్రాచీన కాలంనుండి భారతదేశంలో యక్షిణిని, నాగులను పూజిస్తున్నారు. హానికరము, ప్రమాదము అనుకొన్న వాటినన్నింటిని ఆదిమవాసులు పూజించారు. ప్రాణాన్ని హరించే విషజంతువులనూ, నాగుపాములనూ పూజించారు.

ఎలాగైతే ఫెర్గ్యూసన్ వ్రాసినట్లు, ఆదిమవాసులకు ఒక అంధవిశ్వాసం - పూజలవల్లనే వర్షాలు పడతాయి అని. ఇలా అనుకొనే వారికి, ఒక ప్రాచీన నిర్దిష్ట సభ్యత ఉండి ఉండాలి. సింధులోయల్లో త్రవ్వకాలవల్ల, ఆదిమవాసులు పురుషలింగాన్ని పూజించేవారని కూడా తెలుస్తుంది. ఈ పూజను, ఆర్యులూ అంగీకరించారు.

కాలక్రమంలో, ఆదిమవాసులచే పూజింపబడిన దేవతలే, ఆర్యులచేత కూడా పూజింపబడ్డారు. వారి దేవతలను, ఆలోచనా విధానాన్ని, ఆర్యులంగీకరించారు. కాని, ఆదిమవాసులనుమాత్రం తమకన్నా క్రిందివారిగానే పరిగణించారు.

మహాభారతంలో యక్షిణుల మందిరాలు ఉన్నట్టు ఒకచోట



సింధులోయల్లో లభించిన నాణెములపైగల ఆకృతులు

చరిత్రకు సమందింది. బహుశా, లక్ష్మికూడా ఒక యక్షిణియే కావచ్చు. కాలక్రమంలో యక్షిణియే, లక్ష్మిగా ప్రత్యేకంగా కొలువబడివుంటుంది. ఎందుకంటే. ఆదిమవాసులు తమకు లోబడని ప్రకృతిలోగల ఎన్నింటినో పూజించేవారు అలాగే, యక్షిణులనుకూడా పూజించివుంటారు. ఆర్యులే మొదట యక్షిణులను పూజించి వుంటారనుకోవడం సహజంగా వుండదు. ఆదిమవాసులకన్నా, ఆలోచనా విధానంలో నైతేనేమి, నాగరికతలో నైతేనేమి, ఆర్యులదే ముందడుగు. యక్షిణులు మానవులను ఆశయించి, పీడించేశక్తులు. వీరు దేవతలకన్నా క్రిందివారు. భూత ప్రేతాలకన్నా పైవారు. భూత ప్రేతాలవలే, భయంకరమైనవారు కాదు. చక్కని వారు. తమ చక్కదనంతో మానవులను ఆకర్షించి, ఆశయించి, పీడించేవారు. అందుకే యక్షిణులు మొదట ఆదిమవాసులతోనే పూజింపబడి ఉండాలి. కాలక్రమంతో యక్షిణియే లక్ష్మిగా, ప్రత్యేకంగా కొలువబడి వుంటుంది. ఇదంతా చెప్పడం ఎందుకంటే, లక్ష్మి, యక్షిణులనుండి విడివడిందని అనుకుంటే, ఆదిమవాసుల కాలంలో, లక్ష్మి, యక్షిణిరూపంలో కొలువబడింది. అంటే, ఆదిమవాసుల కాలంనుండి లక్ష్మి వుంది. వారిచే కొలువబడింది అంటే తప్పులేదు.

సింధు లోయల్లోని వ్యాపారస్తులు సముద్రంనుండి ధనాన్ని, బంగారాన్ని సంపాదించేవారు. కాబట్టి, లక్ష్మి సముద్రంనుండే జన్మిస్తుందని అనుకునేవారు.

"బృహత్కథా శ్లోక సంగ్రహము"లో, ఒకచోట,ఒక అందమైన యక్షిణిని పూజిస్తున్నట్లు మనం చూడగలము. మత్స్య పురాణంలో కూడా మనకు యక్షిణిని మరియు లక్ష్మిని విడివిడిగా పూజిస్తున్నట్లు ఆధారాలు లభిస్తాయి.

యక్షిణులు, ఆదిమవాసులచే పూజింపబడి అనార్యుల దేవతలైనారు. ఆదిమవాసుల ఆలోచనా విధానాన్ని అంగీకరించి, వారి సంపర్కములోనికి వచ్చి, తాము కూడా యక్షిణులను ఆరాధించివుంటారు. ఆర్యులు. ఆ యక్షిణే, ఆ తర్వాత లక్ష్మియై వుంటుంది. ఒక కాలంలో ఒకవైపు యక్షిణిని, మరోవైపు లక్ష్మిని పూజించారు. అందుకు, మత్స్యపురాణంలోని ఆధారాలు చాలు. దీనినిబట్టి, ఆనాటివారు, యక్షిణిని, లక్ష్మిని, విడివిడిగా పూజించి, లక్ష్మికి, యక్షిణికిగల ఏకత్వాన్ని మరచిపోయారు. యక్షిణులనుండే విడివడినదే లక్ష్మి అన్న సంగతి పూర్తిగా విస్మరించారు. వాత్స్యాయనునికాలంవరకు కార్తీక శుక్ల ప్రతిపద రోజున యక్షిణి పూజింపబడేది.

సింధు సంస్కృతిలో లక్ష్మి :

నేటికి, సుమారు ఐదువేల సంవత్సరాల కితంనాటి సింధు లోయల్లో, గుజరాత్, పంజాబ్, తవ్వకాలలో లభించిన కంచు నగ్న విగ్రహాలను పరిశీలించిచూస్తే మనకు లక్ష్మీదేవి పోలికలు చాలా కనిపిస్తాయి. లభించిన నగ్నవిగ్రహాల దక్షిణ హస్తాల్లో, ఒకపాత్ర, (దీనిని సంపదల కలశంగా మనం భావించవచ్చు.) ఈ విగ్రహాల మెడలోగల మాలలు తామర కాడలుగా తెలుస్తుంది.

పై సంకేతాలవల మనకు, ఐదువేల సంవత్సరాల కితంనాటి పురాతనమైన ఈ కంచువిగ్రహాలు, లక్ష్మీదేవివేనని, ఖచ్చితంగా చెప్పవచ్చును.

వైదికయుగంలో లక్ష్మీస్వరూపం :

ఋగ్వేదంలో అక్కడక్కడ 'లక్ష్మి' - శ్రీ అనేపదాలు కనిపిస్తాయి. కాని, ఈ పదాలకు ఒక ఆకారము ఉన్నట్లు కనిపించదు. సంపదకు, ఐశ్వర్యానికి. కాంతికి, వేగానికి, ఉన్నతికి, "లక్ష్మి", "శ్రీ" అనే వాటిని పర్యాయ పదాలగావాడేవారనిపిస్తుంది ఋగ్వేదంలో ఎక్కడా మనకు, సంపదలకు సంబంధించిన విశేషమైన దేవతగాని,దేవిగాని. కనిపించదు. సంపదలకు ఇంద్రుడు, అగ్ని కుమారులు, మొదలగు దేవతలను యాచించేవారు ఋగ్వేదంలో అక్కడక్కడా స్త్రీ దేవతలు అగుపిస్తారు. కాని, ఎక్కడా కూడా లక్ష్మి పలుకే లేదు

యజుర్వేదకాలంనాటికి "శ్రీ" మరియు "లక్ష్మి" పరమ పురుషుని పత్నులుగా వెలుగులోనికి వచ్చారు.


అథర్వణవేదం కాలం మొదట్లో, "శ్రీ" పదాన్ని సంపతి, ఐశ్వర్యం అనే అర్థాన్నే స్ఫురిస్తాయి. ఈ కాలంలో శ్రీ కి మరియు లక్ష్మికి అంతగా భేదం ఉన్నట్లు కనిపించదు. కాని, లక్ష్మిని పొందటానికి బలి యివ్వడం అన్నది ఈకాలంలోనే మొదలైంది. మోహంజదారోలో లభించిన ఒక నాణెంపై దేవి సమక్షంలో ఒక మేకపోతు ఉన్నట్లు కనిపిస్తుంది. దీన్నిబట్టి సంపదలను పొందేముందు బలి అవసరం అని వారు అనుకునేవారనిపిస్తుంది. అథర్వణ వేదకాలంలోనే యిద్దరు లక్ష్ములు వెలిసారు. ఒక లక్ష్మిమంచిది. ఇంకొకటి పాపి (లక్ష్మి). మంచి లక్ష్మి ఆర్యుల శ్రీదేవి. పాపిలక్ష్మి అనార్యుల దేవి.

ఈ శ్రీదేవి. పాపలక్ష్మిలే, పురాణకాలం నాటికి, లక్ష్మి, అలక్ష్మి అని పిలువబడ్డాయి.

పురాణకాలంలో లక్ష్మి :

పురాణకాలం నాటికి లక్ష్మి. విగ్రహారాధన పూర్తిగా ప్రచారంలోకి వచ్చింది కాని, యజ్ఞయాగాదులపట్ల ప్రజల విశ్వాసం తగ్గుతూ వచ్చింది. పురాణ కాలంలో లక్ష్మికి చక్కటి రూపకల్పన జరిగిపోయింది పూజా విధానంకూడా వెలుగులోకొచ్చింది.

బ్రహ్మపురాణంలో వర్ణించబడిన లక్ష్మి మరియు దరిద్ర దేవతలమధ్య జరిగిన కథనం చాలా చక్కగా ఉంది. లక్ష్మి అంటుంది,



ఎల్లోరా గుహల్లోని గజలక్ష్మి మూర్తి

"కులము, శీలము, సౌందర్యము, విద్య ఉన్నా నేను లేని మనిషి ప్రాణం ఉన్నా, జీవచ్ఛవంతో సమానం."

జవాబుగా దరిద్ర దేవత, "నేనెక్కడయితే ఉంటానో, అక్కడ కామ, క్రోధ, మద, లోభ, మోహ, మాత్సర్యాలు ఉండవు. అక్కడ ధనోన్మాద ముండదు. ఈర్ష్య ఉండదు."

సమాధానంగా లక్ష్మి, "నా కృపవల్ల హీనుడు, నీచుడు, ఎవడయినాసరే, వాడు పూజ్యుడౌతాడు" అంటుంది.

అప్పుడు దరిద్ర దేవత, "నీవు పురుషోత్తముని ధర్మపత్నివై యుండి, హీనులను, నీచులను, వరిస్తున్నావని తెలిసి చాలా బాధ పడుతున్నాను" అని అంటుంది.

తరువాత, లక్ష్మి, దరిద్రదేవుడు (శని కాదు), శని ఒక గ్రహం పరిష్కారానికి గౌతముని దగ్గరకు వెళతారు. అది యింకో కథ.

బ్రహ్మవైవర్త పురాణము:

సృష్ట్యాదిని రాసలోకమున కృష్ణుని వామ భాగంనుండి ఒక సుందరాంగి ఏర్పడింది. ఆమె, మరల రెండు మూర్తులయ్యింది. ఒకామె రాధ, రెండవది లక్ష్మి. ఆ పురుష రూపము మళ్ళీ రెండు మూర్తులయ్యెను. అందొకడు చతుర్బాహువులు కలిగిన నారాయణుడు. ఈ నారాయణుడే లక్ష్మీ సమేతుడై స్వర్గమును చేరెను.

శుక్ర సంపద స్వరూపిణియగు లక్ష్మి, దుర్వాసుని శాపముచే సముద్రమున పడెను. దానితో దేవతలు సకల సంపదలకు దూరమై పోతారు. దుఃఖితులైన దేవతలు నారాయణునికడకేగి, తమ గోడు విన్నవించుకుంటారు. తరువాత శ్రీమన్నారాయణుని ఆజ్ఞానుసారం సముద్రాన్ని మదించి తిరిగి లక్ష్మిని పొందుతారు. సముద్రమునుండి ఉద్భవించిన లక్ష్మికి, విష్ణువుకు పరిణయం జరుగుతుంది. తరువాత లక్ష్మికూడ విష్ణుమూర్తితోపాటు, అవతారాలు దాల్చుతుంది. కృష్ణావతారమున రుక్మిణిగా, రామావతారమున సీతగా జన్మిస్తుంది.

బ్రహ్మవైవర్త పురాణంలోనే, సీత జన్మ వృత్తాంతం లభిస్తుంది. కృష్ణధ్వజుని కుమార్తె వేదవతి తపస్సు చేయుచుండగా రావణుడు చూచి, ఆమె రూపలావణ్యమునకు విభ్రమునుచెంది, తనను పరిణయమాడుమని కోరెను. వేదవతి, విష్ణుమూర్తిని తప్ప యింకొకరిని గ్రైకొనని చెప్పినా, మోహ పారవశ్యమున, రావణుడామెను ముద్దాడబోయెను. రావణుని చేయితాకి, మలినమైన దేహంతో నుండజాలనని, "నా మనస్సు నిజముగా హరినై యుండెనేని నేనయోనిజగ బుట్టి, విష్ణుమూర్తిని పొంది, నిన్ను నాశన మొనరించెద"నని చెప్పి, యోగాగ్ని కల్పించుకొని భస్మమయ్యెను. పిమ్మట ఆమెయే, లంకయందు, ఒక పద్మమున జన్మించెను. పద్మమున నున్న వేదవతి మొదట రావణుని కంటనే పడుతుంది. జ్యోతిష్కులు ఆమె జననం లంకకు అరిష్టసూచకమని చెప్పడంతో, ఆమెను ఒక పెట్టెలో పెట్టి సముద్రంలో వదిలి వేస్తారు.

ఆ పెట్టె నే మిథిలా నగరం చేరుతుంది. తరువాత జనకునికి నాగటి చాళ్ళలో లభిస్తుంది. ఆమే సీత. ఇక్కడ ఒక విషయం గమనించాలి. లక్ష్మి, కృష్ణధ్వజుని కుమార్తెగా జన్మిస్తుంది. తరువాత ఆమెయే అయోనిజయై, సీతగా మారుతుంది. వేదవతిగా తానొనర్చిన ప్రతిజ్ఞను రాముని పత్నియై నెరవేర్చుకుంటుంది.

లింగ పురాణం :

లింగపురాణంలోకూడా లక్ష్మి జన్మవృత్తాంతముంది. ఇందు కూడా లక్ష్మి సముద్రంనుండే ఉద్భవిస్తుంది. కాని, మొదట అలక్ష్మి తరువాత లక్ష్మి.

పురాణాల్లో, 'శ్రీ' కి, మరియు 'లక్ష్మి' కి, ఎక్కడా భేదం ఉన్నట్లు కనిపించదు. పురాణాల్లో లక్ష్మి, విష్ణుపత్నిగా, పరమ పురుషుని అర్ధాంగిగా, నారాయణుని పత్నిగా, కనిపిస్తుంది. పురాణ కాలం నాటికి లక్ష్మికి, యక్షిణులతో సంబంధం పూర్తిగా విడిపోయింది. గుడ్లగూబ లక్ష్మివాహనంగా గుర్తించబడింది. విష్ణుపత్ని అయిన కార

ణంగా, గరుడపక్షికూడా లక్ష్మికి వాహనమే. గుడ్లగూబ లక్ష్మికి వాహనమెలా ఆయిందనే దానికి, ఒక కథ ప్రచారంలో వుంది.

పూర్వకాలంలో ఒక వృద్ధదంపతులుండేవారు. వారికి తినటానికి తిండి, కట్టుకోవటానికి ఒంటినిండా బట్టకూడా వుండేది కాదు. ఉన్నది ఒక్కటేగుడ్డ. ఒకరు యింట్లో ఉంటే, మరొకరు ఆగుడ్డతో బయటకు వెళ్ళాలి. అంతటి గర్భదరిద్రులు ఆదంపతులు. ఒకనాడు అలా యాచనకు వెళ్ళిన బ్రాహ్మణుడు, ఏమీ దొరకని కారణంగా, విసిగిపోయి, చావాలని అనుకొంటాడు. అలా తన బాధలను తలచుకొని, ఒక చెట్టుక్రింద కూర్చుని విలపిస్తాడు. ఆ బ్రాహ్మణుని రోదనమంతా చెట్టుపైగల గుడ్లగూబ విని జాలిపడుతుంది. పేదబ్రాహ్మణుడి యిక్కట్లను తాను తొలగిస్తానని, అతన్ని యింటికి తిరిగి వెళ్ళమని చెబుతుంది.

దీపావళి రోజున, ప్రతియేడు లాగానే లక్ష్మి నగరంలో ప్రవేశిస్తుంది. ఏ గడపలో కాలు పెట్టినా, గుడ్లగూబ కూత వినిపిస్తుంది. అపశకునంగా దాంతో లక్ష్మి వెనక్కు మళ్ళుతుంది. ఏ గడపలో కాలుపెట్టినా అదేతంతు. చివరకు, బ్రాహ్మణుడి యింట్లో కాలు మోపబోతుంది. గుడ్లగూబ కూయదు. దాంతో లక్ష్మి బ్రాహ్మణుడి యింట్లో ప్రవేశిస్తుంది. లక్ష్మి ఆగమనంతో దరిద్రం తొలగి, బ్రాహ్మణ దంపతులు శ్రీమంతులౌతారు.

తాను వెళ్ళదలచుకొన్న యింట్లోకి వెళ్ళనీయకుండా అవరోధం కలిగించే గుడ్లగూబను, తన వాహనంగా చేసుకుంటుంది లక్ష్మి. అందుకే, గుడ్లగూబ, లక్ష్మికి వాహన మయింది.

అమావాస్యరోజున లక్ష్మీపూజ:

అథర్వణ వేదంలో మనకు యీ విషయమై వివరణ లభిస్తుంది. కార్తీక అమావాస్యరోజు, లక్ష్మి పూజకై ఎందుకు ఎన్నుకోబడింది ? కార్తీక అమావాస్యరోజున, యింద్రుడు, ఇత్యాది దేవతలు ఒకచోట ఏకత్రితమౌతారు. అందుకని కార్తీక అమావాస్య రాత్రి ''దీపావళి''గా లక్ష్మిని పూజిస్తాము.

లక్ష్మీ స్వరూపం:

ఈనాడు మనంచూస్తున్న లక్ష్మి, చతుర్భుజాకార సుందర స్త్రీమూర్తి. రెండు చేతుల్లో కమలాలు. ఒక చేతిలో కలశం కలిగి, మరొకచేత అభయముద్ర. లక్ష్మికి ఇరువైపులా రెండు ఏనుగులు, కమలాలను తమ తొండాలతో పట్టుకొని కనిపిస్తాయి. ఈమూర్తిని, మన సంస్కృతాంధ్ర మహాకవులు, కన్నులకు కట్టినట్లువర్ణిస్తారు.

శ్రీనాథుడు, తన ''హర విలాసము''లో యిలా వర్ణిస్తాడు

సీ॥ ''ఇరు ప్రక్కియలమండి సుర సింధురంబులు। పరిపూర్ణ
హేమకుంభములందాల్చి,

... ...

కలిమి చూపుల పూబోడి కలశజలధి! నర్థిగొలువుండె రత్న
సింహాసనమున'' (హ. వి. ఆశ్వా. 6, ప. 79)

బమ్మెర పోతనామాత్యుడు, తన శ్రీమదాంధ్ర మహాభాగవతములో, క్షీరసాగరంలోంచి ఉద్భవించే లక్ష్మి స్వరూపాన్ని యింకా మనోజ్ఞంగా వర్ణించాడు.

విదేశాలలో లక్ష్మి:

భారతీయ నాగరికత విదేశాలలో ప్రసరించిన కారణంగా, విదేశాలలో కూడా ఏదో ఒక రూపంలో లక్ష్మి కొలువబడుతుంది

పూర్వం బాలి ద్వీపంలోని ''హిందేషియా'' రాజులు; లక్ష్మి తమ రాణిరూపంలో ఉన్నట్లు భావించేవారు హిందేషియా మొదటి రాజు భార్య లక్ష్మి ఆ లక్ష్మి, విష్ణువుతో ప్రేమలోపడి మరణించింది. ఈ కథ అర్థం కాదు. మొదటిరాజు భార్య లక్ష్మి అనే విష్ణువుతో ప్రేమలో పడటం, తత్ఫలితంగా మరణించడం నమ్మదగినదిగా లేదు. కాని, ఈ కథ యిలాగే ప్రచారంలో ఉంది. ఆమెను భూమిలో పాతిపెట్టాక, అక్కడ రకరకాల చెట్లు, చేమలు మొలిచాయి. ఆమె నాభిస్థానంనుండి వరిమొక్క మొలిచింది. సూడాన్‌లో లక్ష్మిని నేటికీ వరి దేవతగా కొలుస్తారు.

జావాలో పురాతనమైన బంగారు ఆభరణాలపై ''శ్రీ'' అని వారి భాషలో చెక్కబడి ఉంది. అక్కడి ప్రజలు లక్ష్మిని పూర్తిగా మరచిపోయారు. కాని, సువర్ణదేవతగా మాత్రం గుర్తుంచుకున్నారు.

డచ్ ''గయానా'' వారు నేటికి కూడా దీపావళిని లక్ష్మిదేవికి ప్రతీకగా జరుపుకుంటారు. వారు దీపావళినాటిరాత్రి చేటవాయిస్తూ, దరిద్ర దేవతను బైటకు గెంటుతూ, దీపకాంతిలో లక్ష్మికి స్వాగతం పలుకుతారు.

కాంబోడియాలోని ఒక పురాతనమైన దేవాలయంలో విష్ణువుతోపాటు, యింకా అనేకమైన మన దేవతల పూజ జరుగుతుంది. శివుడు, వినాయకుడు, బ్రహ్మ మరియు ఉమ. ఈ విష్ణుదేవాలయంలో లక్ష్మిదేవి విగ్రహం కూడా ఉంది. నేటికి కూడా, అందరితో పాటు, లక్ష్మికూడా పూజింపబడుతుంది.

మనకు, ద్రవ్యానికి లక్ష్మి దేవత అనట్లు, జూనో-మోనెటా స్త్రీ దేవత, రోమన్‌లకు ద్రవ్యదేవత. అందుకు సాక్ష్యం, ఆకాలం నాటి నాణేలపై, ఒకవైపు దేవతా ప్రతిమూర్తి, మరొకవైపు ఆ నాణెం విలువ, ముద్రించేవారు. ఈనాడు మనం ఆంగ్లపదంగా ఉచ్చరించే ''మనీ'' అనేది, యీ ''మోనెటా'' నుండే వచ్చింది.



కుడివైపు : తక్షశిలలో లభించిన లక్ష్మీ మూర్తి
ఎడమవైపు : గజలక్ష్మి యొక్క మృణ్మయమూర్తి

దేశ-విదేశాలలో దీపావళి :

దీపావళి ఒక భారతదేశంలోనేగాక, అనేక దేశాలలో వేరు వేరు విధాలుగా ఆచరించబడుతుంది. మనం జరుపుకొనే పండుగల వెనుక ఎన్నో పురాణగాథలు ప్రచారంలో ఉన్నాయి. అలాగే, దీపావళికి సంబంధించికూడా కొన్ని కథలు ప్రచారంలో ఉన్నాయి. ముఖ్యంగా, నరకాసురవధ, శ్రీరామపట్టాభిషేకం, బలిచక్రవర్తి-వామనుని కథ, విక్రమాదిత్య విజయగాథ, దీపకుమారికథ, మొదలగునవి.

మన దక్షిణాదివారు దీపావళిని, నరకాసురవధకు ప్రతీకగానూ, ఉత్తరాదివారు శ్రీరామ పట్టాభిషేక మహోత్సవానికి ప్రతీకగానూ, జరుపుకొంటూంటారు.

సింహళంలో, దీపావళి చాలా వైభవంగా జరుపుకొంటారు.

బర్మాలో, దీనిని "తంగీన్" అనే పేరుతో జరుపుకుంటారు. ఆ రోజున, దివ్యజ్ఞానం పొందిన గౌతమబుద్ధుడు అవతరించాడని వారి విశ్వాసం.

ఇంచుమించు, దీపావళిలాంటి పండుగనే నేపాళీయులు "తిహార్" అనే పేరుతోనూ, చైనీయులు "నాయిమ్-హువా" అనే పేరుతోనూ, స్వీడన్ దేశీయులు "లూసియా-డే" అనే పేరుతోనూ, ఇంగ్లాండులో ప్రతియేడూ, నవంబర్ ఐదవ తేదీన "గైఫాక్స్ డే" అని, ఫ్రాన్స్‌లో జూలై 14వ, ఫ్రెంచ్ విప్లవానికి గుర్తుగానూ జరుపుకుంటారు.

మనలాగే, పెద్దయెత్తున దీపావళి జరిపేవారు జపానీయులు. దీనిని వారు "తోరో-నాగాషి" అంటారు. పెద్దయెత్తున జరిగే దేశాలలో, ఇజ్రేల్ కూడా ఒకటి. దీనిని వారు, "హనుకా" అని అంటారు. ఇక ముస్లిం దేశాలలో జరుపుకునే "షబ్-బరాత్"కూ దీపావళికి చాలా దగ్గరి పోలికలున్నాయి.

ఏది ఏమైనా, మన దీపావళిని పోలి ప్రపంచమంతా జరుపుకొనే పండుగ, ఒక్క దీపావళితప్ప, మరొకటిలేదు.

ఈ వ్యాసరచనలో నాకు ఉపకరించిన పుస్తకాలు

1. బ్రహ్మవైవర్త పురాణము.
2. హరవిలాసము.
3. శ్రీమదాంధ్ర మహాభాగవతము.
4. ప్రాచ్యగాథాలహరి.
5. కీ॥ శే॥ సురవరం ప్రతాపరెడ్డిగారి "హిందువుల - పండుగలు"
6. "ప్రాచీన్ భారత్ మే లక్ష్మీ ప్రతిమ"
   రచన : డా : రాయ్ గోవింద్ చంద్
7. మరికొన్ని పత్రికలు.

చిత్రాలు : నిశికాంత్‌రావు తెలపాండే, యస్. రాఘవన్

ఈనేల - నా కులపాలిక

శ్రీ సోమసుందర్

భూపాలకాల ప్రేతాల దురాగతాలు
భూతాలై తిరిగిన నిన్నటి పాలకులూ ...

వడివెత్తిన మేకులు కొట్టి,
ముక్కులూ కన్నులూ బిగించిన
మత క్రౌర్యం వంటి నిన్నటి మధ్యాహ్నాలు ..

కవిత్వం కన్న ముందుగా నడిచే
సంస్కృత సమాసాల మాదిరిగా
సుదీర్ఘంగా సాగే దుష్ట ఛాందసాలు -
నిన్నటి సాయంత్రాల నీడలు...

సాగర వక్షంపై కదలిపోయే కూలిన గోపురాలు
వెలుగు లేని తునకలైన దీపస్తంభాలు
విరిగి పడిన తాతలు పాతిన తాళవృక్షాలు

ఇదంతా నిన్నటి పాతకథ
అమావాస్యవంటి బాధ్యతా రహిత
గతితా తి తరిస్తే ప్రారంభించింది
అంతం దగ్గరే నరికోత కథ...

2

వ్రేళ్ళు సారించి జాలిగా వల్లగా
పాదప శిఖల చిక్కులు విదళించి,
పిట్టల గూళ్ళు కొల్లగొట్టే పన్నగాల నుక్కణచి
పేద తీర్చిన కారుణ్యమూర్తులు - గాలితెమ్మెల్లు

చిగురాకు చెవుల దోనెలలో
నిశాంత జీవన మాధుర్యాలూగే
ఈ స్వతంత్ర గాలి పెదవులకు తెలుసు...
ఈ వెన్నెని వేకువ తాకిన నేల చెంపలు
పతిహాసాలు వెలిగించిన కెంపులు ...

ఇక తెల్లవారితే గౌరవనీయులు
సృష్టించిన రౌరవాలన్నీ రద్దు !

'హక్కులులేని బాధ్యతలు బానిసత్వం !'
— అది మొన్నటి లక్షణం

'బాధ్యతలులేని హక్కులు అరాజకత్వం !'
... నిన్నటి దుర్లక్షణం
హక్కులూ బాధ్యతలూ కలిసి మెలిసి సాగటం
అదే నేటి అర్ధనారీశ్వరం !

అది శాస్త్రంగా సజీవ సౌందర్యంగా
ప్రవర్తిల్లుతున్న ఈ యుగీన మంగళాచరణం...
నేటి ప్రత్యూష పవనాలకదే నవచైతన్యం ...

3

ప్రశాంతమైన సాయం సంధ్యా సమయంలో
అకస్మాత్తుగా వెరిగాలి విరుచుకు పడినట్లు,
చినికి చినికి పెనువిలా గాలివాన విహరించినట్లు,
హటాత్తుగా పిడుగులై కురిసి విరిగిపడిన చెట్లు
లలిత హృదయాలూ చలించినట్లు ...

మంచు పళ్ళు పెళ్ళలుగా విసిరినట్లు
నా జాతి గుండె గూడుల్లో దూరిన పడమటి ప్రభంజనాలు ★
నా ఆశాసౌధాలకు పక్షంటకాలై
గుడిల్లు గుడిల్లుగా కూల్చినట్లు...

రాత్రిలోకి ...
చీకటిలోకి ...
నిశాలోకి
అజగరంలా ప్రాకింది కాలం !
గాఢాంధకారంలో ...
భీతావహ హాహాకారంతో .
జగాల వారిగా...
యుగాల మరిడీగా
పిశాచంలా మారింది కాలం !

4

చిటి పొటి వెలుగుకోసం
చిట్టి పొట్టలకు పట్టెడు మెతుకులకోసం
మెరుపు దివిటీల ఉటూపు తీవలకోసం
గాలి కొయ్యల గంధపు చెక్కల కోసం
కాగడాలవంటి కన్నుల కోసం
సుస్మితాల దాచుకొన్న కపోల పాళికోసం

అరుణోదయంవంటి అధరాలకోసం
కన్నీటి యేటిలో
కలల పడవల పై
లంకణాలు చేసింది మాతరం!
భీతివంటి రాత్రిని తరిస్తే
తరుణ తరణి కావాహన ...
నాజాతి హృదయాన్ని తరచినదదే చిరస్వప్నం!!

5

స్వర్ణంగా తరంగాల తేలియాడే
రాజహంసల గాత్రాలతో పులికలిసి
నీలి నీలి నిర్మలోదక తరంగాల పై
తెల్లని అనారేఖల వెలుతురు పరచి ...

బుద్ధదేవుని ప్రశాంత వదనంవంటి
శారద నభస్సౌందర్యంతో - ధైర్యంతో
కుటజాల కురూపాల్ని తీర్చిదిద్ది
ధరణికి మధుపర్కాలందించి ...

కవితా శుభ్ర వసన ధారిణై, శివంకరమూర్తినై —
అమృత కలశంతో ఈ ప్రదోషంలో వచ్చాను;
కావి సంజలు జార్చిన నల్లని ముని మాపుల
మసగ తెరల కన్నీళ్ళు తుడిచాను!

6

నా బాహు బంధంలో—పుష్పవతి నేల;
నా పిడికిట బిగించిన పొడియుసుక
అనంత మానవ చరిత్ర;
నా పురిషిట పట్టిన ఉదకం
మహనీయుల తపోధార ...

తలుపులు తెరిచేసరికే అందకుండా
రెపరెపలాడుతూ ఎగిరిపోయే
పావురాల రెక్కలపై మానవగాథ ...
తవ్వి తవ్వగానే సమాధుల గర్భకోశాలనుంచి
వెలికి లేచిన పురామానవ విగ్రహాల వ్యథ ...

దిక్కడ దాచారయ్యా పితృదేవతలారా ?
నా గతాన్ని; సుసంపన్న వారసత్వాన్ని?

ఎలా విశిష్టమైన మీ సర్వోన్నత ధర్మంలోనా?
మహోపాసానికి పరిమితమైన ఛాందస్యంలోనా?

ఆదిమానవులలో విశ్వ సూర్యుడు
మనిషిని మృత్తికా సమానుడన్న నీతులు?
తెంచయ్యా వాడిని నాముందుకు
తోనుల్లో నిలవండి; మట్టు పెట్టండి!
ఉదక నుంచి ఉద్భవించిన
మూర్తిందు బింబాలయని అనితర అద్భుతం!

7

నా బాహుపరిరంభంతో గర్భవతి పుడమి
నా పాదాల క్రింద పితరుల దరహాసాల గడ్డిపూలు
గుడ్డి చూపుల మిణుకుతున్న వంకరదారులు
తృణచ్ఛన్న కూపాల లోతులనుంచి
విలుగత్తె నా పితరుల అంతరాత్మలు
శౌనకాది మహర్షుల ప్రేతాత్మలు...

కదుమూపు మేంలో
తెరచుకొన్న లోయలో
పల్లవించిన సహకార శాఖాగ్రాలు!
కొమ్మలకు చుట్టుకొని
తలలెత్తి మొగ్గతొడిగిన
కోమల మాలతీ లతా గుల్మాలు!

ఒక ఘోరమైన కలి వెల్లువ తిరోగమించాక
ఒక క్రూరమైన తుషార భీతి వైదొలగాక
అక్కడే అక్కడే సృష్టి పునః ప్రారంభం!
నా గుండె కోయిలగామారి
అక్కడే అక్కడే ఆలపించింది తొలిగీతం!
నా దరహసితం అరుణ కుసుమమై
విరిసిన తొలిపొద్దు అక్కడే!!

8

నా [illegible] బంధిత పక్షిగా
మూలాలిగింది నిన్ను...
నా [illegible] తన్మయంగా
వెలిగించిపోరు ...!
మానవ మహేతిహాసం
అనంత గతాన కుంతలాల [illegible] కింద
సొమ్మసిల్లింది నిన్న..

ఆగత మానవ చిరస్మేరం
కాలికక జ్యోత్స్నా పులకిత పారిజాతం
వారుతరంగా విరిసింది వేళ...!

నిన్నరాత్రి నన్నుచూపి కోపంతో ఉరిమిన నింగి
నేటి నిశాంతంలో [illegible] ఒంటి
మెరుపు రేకుల చిరునవ్వు చివురులతో
నా బుగ్గలు నిమిరింది...

నిన్న నే నెక్కడికి వెళ్ళినా
మండుతూ ఎదురైన అగ్నిపర్వతాల్ని
వేటికి దిక్కుచచ్చినట్లు శాంతించి
బలమైన నా నేకువ పాదాల క్రింద [illegible]
దీనంగా మెడలు సాచి
కనులు మిటకరిస్తున్న గడ్డిపూలు!

9

నా సర్వాప్తి ఆప్యాయనంగా
అడుగుతున్న పసవల వసుమతి
వాగర్థాతిరేకం కర్తవ్యదీపంగా
మొలిపించింది నూత్న జీవాంకురం...
అదే రేపటి పతాక కుంజర యూపం!

నేల నా కందించే జీర్ణపత్రాల పై
వేళ్ళ విలిఖించిన బీజాక్షరాలం
ఆమె గుణగణాలను కీర్తించే
యోగ్యతా పతాకం!

ధాత్రీమతల్లీ!...గాయత్రీ!
నా అక్షిద్వయాన్ని ఆ గత భూతాలపై నిలుపు!
నా అనంతాకాంచల గీతికాధారల
నీ సుందర వక్షంపై
కొలది కొలది కురిపింతు!

చైత్రరథము

శ్రీ యామిజాల పద్మనాభస్వామి

ఇది ఒక ఖండకావ్య సంపుటి.

రచయిత, శ్రీ మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి. అప్పుడప్పుడు మొత్తం మున్నదేండ్లలో వ్రాసిన కవితాఖండికలు ఒక ఆకారం ధరించాయి. నేటి తెలుగు పలుకు వెలదికొక వెల మిగిలిననగ అనదగిన కావ్య సంపుటియిది.

గీర్వాణ వాఙ్మయ వేదిక వద్దకు వెళ్ళిచూస్తే, ఖండకావ్యాలు కనిపించకపోవు. వాటిలో 'మేఘసందేశం' భారతావనిలోనేకాక పాశ్చాత్య దేశాలలోకూడా నీరాజనాలందుకున్న ఖండకావ్యం ... ...

మన సాహిత్య క్షేత్రములోకూడా ఖండకావ్యాలు మునుపూ ఉన్నాయి. నేటి వారి కందుబాటులో ఉన్నవి కృష్ణపక్షం, దీపావళి, ఇలా చాలా ఉన్నాయి. ఈ తీరు కొత్తకాదుగాని కవిహృదయ చలన శీలి ననుసరించి కావ్యం రూపు సంతరించుకోడంలోనే ఉంది దోషం గాని గుణంగాని. వెల తక్కువ పుట్టువుతో కొన్ని పుటగొడుగులా వస్తూన్నాయి. వాటి వెల తక్కువ తనాన్ని నేరే చెప్పనక్కరలేదు ప్రతిహతమ మంగళమ్ ! .. .. వాటిని చూస్తే కవియె పుట్టుటకన్న పాప పరిపాకంబుండునే భూవరా ! ... అని ఆనాడు గురుపాదులన్నమాట జ్ఞాపకం వస్తుంది

ఇక 'చైత్రరథము' గూర్చి నాకు తోచిన నాలుగు మాటలు వ్రాస్తాను.

'విశ్వశ్రేయః కావ్యం
తద్దోషా పరిక్ష్య త్రౌచ వాగర్థౌ
సా వాగ్వ్యారసవృత్తిః
సాధ్యోహి రసో యథాయథం కవిభిః'

అని పూర్వ శబ్దశాసనుని కావ్యానుశాసనోక్తి. రసస్పందనం కలిగించడమే వాక్కు పరిపూర్ణత. రసపోషణ కవి ప్రతిభా వ్యుత్పత్తులను బట్టి ఉంటుంది.

రసోపేతములూ, సలక్షణములూ అయిన వాగర్థములే కావ్య శరీరాత్మలు. అలాటి సర్వలక్షణమైన కావ్యం విశ్వశ్రేయస్కరం...

అయితే రసానుభూతి ... ఏ కావ్యానికి వర్తిస్తుందా? అని తెలిసి కొన్ని తెలియక కాని ఎవరైనా అడగవచ్చు. వర్తించాలి అనే సమాధానం 'బండెడు' వ్రాసేనే కావ్యంకాదు. రసాత్మకమైన వాక్యమొక్కటే కావ్యశబ్దవాచ్య మన్నారు ఆలంకారికులు 'వాక్యం రసాత్మకం కావ్యమ్మని.'

మార్పులేని చిత్తమునకు మార్పుకలిగించడమే కావ్యలక్ష్యం. దానినే రసానుభూతిగా చెప్పారు. ఆ అనుభూతి ఆత్మైకవేద్యం. దీనినే కవి కుల గురువు తన శాకుంతలములో

'రమ్యాణి వీక్ష్య మధురాంశ్చ నిశమ్య శబ్దాన్
పర్యుత్సుకీ భవతి యత్సుఖితోపి జంతుః
తచ్చేతసా స్మరతి నూనమబోధపూర్వం
భావస్థిరాణి జననాంతర సౌహృదాని'

అని దుష్యంతుని నోట చెప్పాడు.

రమ్యవస్తు సందర్శనంవల్ల మధురశబ్ద శ్రవణంవల్ల సుఖియైయున్న ప్రాణికూడా ఉత్సుకత పొందిన వాడయ్యాడంటే అది మనసా జన్మాంతర సౌహృదములను స్ఫురింపచేసే భావావేశ ప్రభావం అన్నమాట. ఆ అనుభూతిని మనసా గ్రహించడమే తప్ప మాటలతో ఆవిష్కరించడం అసాధ్యం అని పై శ్లోకానికి సారం.

రసాత్మకమైన వాక్యం పఠించడంవల్లగాని వినడంవల్లగాని హృదయం కదిలిందంటే అదీ కావ్యత్వ సిద్ధికి మూలధాతువని నిర్ణయం...

'నాతిగల బహ్మచర్యము' అనేది చూడండి ఎంతరసాత్మకమో !!...

'ఏ బాసి మొగుడు ఏపూరు వెళితే ఏమి ?' వివరించ నక్కరలేదనుకుంటాను. ఒకప్పుడు పద్యమంతా ఒకే వాక్యముగా స్వీకరించవలసిఉంటుంది.

'సిరిగల వానికి చెల్లును
తరుణుల పదియారువేల తగ పెండ్లాడన్
తిరిపెమున కిద్దరాండ్రా ?
పరమేశా ! గంగవిడుము పార్వతి చాలున్'

ఈ పద్యములో ... లేదని వాదించారు పరోక్షంగాగాని ప్రత్యక్షంగాగాని ఉంటే ఏరసముందో యథాశక్తిగా వ్యాఖ్యానించి చూపుతాను.

'జరిగోన్నయ మహా యనాదినుండి
వసుమతీ భార భరణ సంభవ దఖండ
తాపమును స్వైచి యెవని పాదముల పొందెటు
నటు గవేషణ చేయునో' - అన్నారు శాస్త్రిగారు.

కిపర్ణన్ !' అనే శీర్షికతో వ్రాసిన పద్యమాలికలో మొదటి పుష్ప మిది. దీనిలో అహల్యకాని హల్య కనిపించి 'అయ్యో! నన్నుద్ధరించే పురుషోత్తముడు లేడా ? రాడా ? అని శోకిస్తున్న అవస్థ సరస హృదికి కనిపిస్తుంది అయితే అది ఏక శిలగాఉంటే 'ఏమగునో ? శిలోచ్చయం కనుక వసుమతీ భారమును భరించి ఆ తాపం అనుభ వించ వలసిందే. మనం ఏమిచెయ్యడానికీ అసమర్థులం. పరోపకారం కోసం పాటుపడేవారికి భరింపరాని తాపమే ప్రతిఫలం. కొండంత వస్తువును గుండెల కద్దుకుని (హత్తుకుని) ఓదార్చగల వ్యక్తి ఏవ డుంటాడు. 'కవి'గా శాస్త్రిగారు ఘంభోభంగివలో సానుభూతిని వ్యక్తపరచగలిగారు.

ఈ హృదయ పరితాపం 'దాగుడు మూత'లో సరకోటి నధి రోహించి భవభూతి చెప్పిన వైరాగ్యమునూ, భర్తృహరి బోధించిన తదాత్మ్యమునూ విశదహృదయముతో విశదీకరించింది.

'వసుధైక కుటుంబికి నొక
యసదృశ్మేధావి కొక మహావిబుధునకున్
రసమయునకు మృత్యువటే !
'న స పునరావర్తతే' యనన్ శ్రుతి దినపే'—

సర్వేపల్లి రాధాకృష్ణపండితుని అస్తమయమును విని కవిహృదయం కదిలి యిలా పలికింది:

'రసోవై సః' అనే శ్రుతి వాక్యాన్ని అన్ని అంశములనుంచి సమన్వ యించి తెలుసుకున్న మహా విబుధుడు రాధాకృష్ణుడు. బ్రహ్మపదార్థం అంటే ఏమిటి ? 'ప్రజ్ఞానం' - దానిని దేశవిదేశాలలో ప్రసంగించి ఆనాల గోపాలం తెలుసుకుని అభినందించేట్లు మృదుమధుర వాగ్విల సనంతో బోధించిన అసదృశమేధావి. కనుకనే 'వసుధైక కుటుంబి' అయాడు. అలాటివానికి 'మృత్యువు' లేదు. రాదు. మానవసహజ మైన శరీరత్యాగం యోగులకు సమన్వయించదు. ఆయన రసయోగి. కాబట్టి

సః = రసమయః (యోగి) ఆయోగి
పునః = తిరిగి
'న, ఆవర్తతే=వచ్చువాడుకాడు —

అనే శ్రుతి ఆయనపట్ల సార్థకం. బ్రహ్మమే రసం అయినప్పుడు శాశ్వత పదార్థమైన దానికి జనన మరణాలు అనే వికారాలుండవు. ఈ 'లాటి' బోధ ధ్వనింపడమే కావ్య ప్రయోజనం. మన ప్రథమా చార్యులు నన్నపార్యులు పలికిన 'విశ్వశ్రేయః కావ్యం' అనే పలుకున కిది ఉదాహరణ. ఇదీ టీక ...

పండువేసవి. వడగాడ్పు ఎండదెబ్బకి ఒక కాకిపిల్ల తట్టుకో లేక క్రిందబడి కావు కావు మంటుంది. ఆ సమయంలో దాని బాధ ఈ కందిపద్యం.

'తెక్కల నల్లనల్లఁ బచరించుచు ముక్కున రాయునేల, నల్
దిక్కులనుండి చేరి యుదలించెడి యల్లరి పిల్లలం బల
ద్రొక్కులఁగాంచి బిక్కగయు తీరునఁ బక్షము లప్పళించి యే
పక్కికి నోఁగఁజాలని విషాదమునంబడి దొర్లు మేదినిన్'—

అని చెప్తారు. చావు బ్రతుకుల నడుమ గిజగిజలాడుతూ గింజా కుంటున్న ఆ 'బలిపుష్పం' బాధ 'అల్లరి పిల్లల'కు ఒక వేడుకగా ఉంది. ఇదే 'ఎలుకకు ప్రాణసంకటం పిల్లికి చెలగాటం' — మూడు నాలుగు తత్సమ పదాలు తప్పిస్తే అంతా తెలుగే. తేట తెలుగులో ఆ కాకి బాధ తెలుసుకుని కనికరపు డెందం కనుల యెదుట జరుగు తున్నట్లు కరుణామయ మవుతుంది. ఇదే అనస్య నటనాత్మకమైన అక్షర విలాసం. ఉపయోగించుకునే శక్తి ఏ కొందరికో జన్మతః లభి స్తుంది. ఆశక్తిని అర్థంచేసుకునే శక్తికూడా అందరకూ అబ్బదు. దాని అవస్థ గాలి కబురుగా తెలిసి చుట్టుప్రక్కలఉన్న కాకులు ఒను మిక్కిలిగావచ్చి మూగాయి. ఒకదాని వెనుక ఒకటి కావుమనుచు కూస్తూ రోదిస్తున్నాయి. కాని ఏ ప్రకృతి ఆ రోదనమునకు 'ప్రతి' చెప్పలేదు, చెయ్యలేదు 'కావు కావుమటున్న కాకముల యార్తనాదముది మిగిలె నరణ్య రోదనముగ'— అయిదు పద్యాలలో 'అరణ్య రోదనం' ఆవిర్భవించింది. నిజమే. సార్థకమైన 'ఖండిక' ఇది. పాషాణ హృదయుల కానీయండి. చెమ్మగిల్లుతుంది ఈ 'అరణ్య రోదనము'లో ఒక పద్యములో ఆ కాకిపిల్ల కావు కావుమని ఏడు స్తూంటే చుట్టూ ఉన్న మానవ స్వరూపాలు 'వింతగ' చూస్తాయి గాని 'తన గొంతుక ఒక్కడు ఇంతలో యమున్ పోయడు' — ఇదీ ప్రకృతివ్యాఖ్య. అవస్థా ప్రదర్శనములో ఆ బలిపుష్పమునకు అక్కడ వింతగా దాని బాధనుచూస్తున్న మానవ బలిపుష్పాల స్వభావ వికృతిని గ్రహించి సిగ్గుపడాలి... దీనికన్న దారుణమైనది 'మబ్బు'...

భారత స్వరాజ్యమునిచ్చి స్వారాజ్యము పుచ్చుకొన్న గుణకంది గాంధిజీ అస్తమయమునుచెప్పే 'ఖండిక'...మన గాంధి 'ఒక మహా విటపి. కైలాస శిఖరి. ఒక జగజ్జ్యోతి, ఆచార్యుడు, అవతారమూర్తి. భారతా భముతో మబ్బు అలముకొన్నది. శుక్రతార నిట్టూర్పు సాగక ఆగిపోయింది.

భారతీయులకేకాక ప్రకృతికీ గాంధి రామనామ మహిమ నుప దేశించిన ఆచార్యుడు. భారత రణరంగములో ఆచార్యుడనిపించు కున్నాడు కురువృద్ధు భీష్ముడు. నేటి భారత స్వాతంత్ర్య రణ రంగంలో గాంధిజీ ఆచార్యుడు కాదని ఎవరూ కాదనలేరు. ఈ ఆచా ర్యుణ్ణి పొట్టను పెట్టుకున్న శిఖండి అందరికీ తెలిసినవాడే...... భీష్ముడు యుద్ధవిద్యకే కాదు మానవుని ధర్మబద్ధ జీవితమార్గ బోధకుకూడా ఆచార్యుడని భారతం చదివి అర్థం చేసుకున్న బుద్ధి మంతుడు ఒప్పుకుంటాడు. అలాగే మన గాంధిజీ ఐహికాముష్మిక జీవన మార్గ బోధగావించిన అపర భీష్ముడని పర్యాయ విదితమే.

మిగిలిన నాలుగు మాటలకు వివరించాలంటే గ్రంథం పెరుగుతుందని వదిలి పెట్టుతున్నాను.

ఇలా ఖండిక తరువాత చెప్పదగినది 'తెలుగుసింగము' పేరు వినుతుండగానే గ్రహించవచ్చు. ఈ శీర్షికతో ఉన్న అయిదు పద్యాలూ అయిదు నాదిరత్నాలే. వీటిలో

'త్యాగంబన్న గుణంబొకండె అమృ
తత్వ ప్రాప్తికిన్ హేతువై
సాగుంబోయని నిరూపించిన బుధుల్
వ్యాఖ్యల్ల సంఖ్యాకులే
యోగ్యాంగాలమై రాజకీయ గతితో
అల్పోద్ భోగైక వాం
ఛ్రాళ్ళెల్ మది 'టంగుటూరి' యను
'సింహాస్యపు' మక్కెంచరే' -

అనేది చిరస్మరణీయమైన వాక్యం పూస అని నా అభిప్రాయం.

'త్యాగేనైకే అమృతత్వ మానశుః' అనేది శాస్త్రి గారి చేతిలో గాండీవమయింది. త్యాగం న సవదన్నకు రెండు విధాలు. ఒకటి ధన త్యాగం. రెండు ఆత్మత్యాగం. అయితే దానానికీ త్యాగానికీ ఏమిటి భేదం? ప్రతిఫలాపేక్ష దానానికి ఉండవచ్చు కేవలం ఈ విధానం... ప్రతిఫలాపేక్షారహితమైన దానం త్యాగం. ఏ జీవమైనా ఎక్కడ ఉన్నప్పు త్యజించి వచ్చేదే...కాని అది సర్వసామాన్యధర్మం. అమృతత్వం పొందే త్యాగం సర్వసాధారణం కాదు. కర్మవీరులకూ, ధర్మవీరులకూ, దానవీరులకూ మాత్రమే అమృతత్వం సిద్ధిస్తుంది. అదే త్యాగం. కీర్తికి యశస్సుకి ఉన్న భేదం ఎక్కడ జన్మకీర్తికై అమ్ముకోవాలి త్యాగి మరణాంతమందు పునరావృత్తి రహితమైన శాశ్వత యశస్సును పొందుతాడు. ఇక్కడ మానవ పొందేటటువంటి స్మృతిధర్మాన్ని పొందినా త్యాగఫలముగా సర్వదా సర్వసంయమ్యమానుడై ఇక్కడ కూడా అమృతుడుగానే ఉంటాడు. ఈలాంటి అమృతత్వాన్ని కొందరు త్యాగమున్నానే పొందుతారు. టంగుటూరి రాజకీయ జీవితములో దేశంకోసం త్యాగంచేసిన కర్మవీరుడు కనుక అమృతత్వం పొందిన ధన్యజీవులలో ఒకరయ్యారు. ఉపయోగకరమైన రాజకీయ జీవితము గడపేవారికి ఆదర్శముగా ఆ కర్మయోగి పేరు 'సింహాస్యం' అయింది. అవుతుంది. రాజకీయ జీవితం పూలపాన్పు కాదు నాగదూరాలే, స్వార్థరహితులై, త్యాగమూర్తులై ... నవతి ఉండండి'—అనే సింహగర్జన చేసిన నాడు మన తెలుగు సింగం అని మనునాడుతుండని మృదుమధుర గంభీరభావభరితంగా ఉద్బోధించడం ఈ పద్యములో గ్రహించాలి.

'బంతిపూలు' అనే శీర్షికతో ఉన్న పద్యాలు కూడా అమృతే. ముందు వీటిని 'భారతి' ... పరచుకున్నాది.

'ద్యాంతోరణ మాలలుగా రచించి

గృహాగృహమునందు దిద్ది తీరిచిరి మిమ్ము
గంధ ముండెను లేకుండుగాక మీది
రాజ్యమె వెల్గునేడు సం కమున చేశ' -

గుణహీనులకు కూడా సమయ సందర్భాలలో గౌరవం కలుగుతుంది అనే నిత్యరహస్యం ఈ బంతిపూలవల్ల తెలుస్తుంది.

'గోపికా నౌక' 21 పద్యాలలో ఒక అద్భుత రసగంధిగా రూపొందిన కవితా ఖండిక.

ఒకనాడు కృష్ణునితో గోపికలు యమునలో నౌకా విహారం చేస్తారు. ఆ సమయములో వారికి గర్వం.. ఎందుకు? మాకంటె కృష్ణుడు నౌకను బాగా నడుపుతాడా? అని...వారు పడవ నడుపడములో జాణలట... సరే అనుకున్నాడు కృష్ణుడు. తెడు అవల పార వేయండి పడవ ఎలా నడుస్తుందో తెలుస్తుందన్నాడు. సరే అని పారవేశారు. పడవ నీటిలో వెళుతూంది అంతలో ఒకచోట చిలి పడి నదీజలం లోపలకు రాజొచ్చింది. ఊరకే నదులు కూడా ఆకరంగా గాలి వానవచ్చి పడవ చిలు వడింది. ఏమి చెయ్యాలో గోపికలకు తోచలేదు కాని వారికి కృష్ణుని పైగల అమాయక ప్రేమ అలాటిది. ఆపదలో చిక్కుకుని ఆ పడతులు ఇలా వాపోయారు

'అశలు దక్క వహా బతుకు లాఉడమె
యమునా పవంతి కా
పోశన మౌటకుం బోగుల మక్కట!
కౌగిటబటి యుపాయః
కోశములో యశోద కొడుకున్
దిగడంతుమె యన్న గోపికా
(కోశము వెన్న దొంగ విని కూర్మిగ గంగుచు
వారికిట మున్ -

మేమీ యమునానదికి 'ఆపోశనం' అయ్యేందుకు చాలి వచ్చి యశోద కొడుకును ఎలా విడుస్తామని ఏడిచారు. వెన్న దొంగ వాని మనస్సు ఆ అమాయక సుందరుల ఆ కోశానికి కరిగింది. 'ఆపోశనం' 'వెన్నదొంగ' ... ప్రయోగం ఈ పద్యానికి రత్నాకవచం.

'మీ వె కలుపిపి ఆ చిల్లిని కప్పండి'— అన్నాడు. ఆ ముగ్ధలు అలాగే చేశారు ఆ ప్రయత్నమంతా నీట గలిసింది. గుండెలు బాదుకుని ఏడిచారు. 'శ్రీహరీ! గతి నీవేయని నమ్మి మాకు ఇది పరీక్ష కాదా?' - అన్నారు. అంతే తెరచాప ఆశ్చర్యంగా పడవ పీదికిదిగింది. సురక్షితంగా నౌక గట్టు చేరింది 'త్వమేవ శరణం మమ' — అనేది ఈ స్తోత్రానికి జీవధాతువు.

'సూర్యసప్తతి'-అనే శీర్షికలో ఉన్న పద్యపుష్పహారం ఋషిప్రోక్తమగు పరావమును అరుణస్మృతిలో జీవలోకానికి పావన భావ గంధలహరితో జీవనంతర్గుణమై ఉన్న పవిత్ర కావ్యమనే చెప్పాలి.

'సిరిహొత్రాశను వర్షించి చెందవలయు
పశుపతిం గొల్చి భాగ్యమ్ము పడయవలయు
మోక్షము జనార్దనుని గొల్చి పొందవలయు
భాస్కరా! విశ్వలక్ష్మి నీ వరముగాదె'—

'శివరూపాత్ జ్ఞానమహం
త్వత్తో ముక్తిం జనార్దనాకారాత్
శిఖిరూపాదైశ్వర్యం
భవతశ్చారోగ్యమిచ్ఛామి'—అని సూర్యస్తుతి పరకమైన దాదిశార్యాసప్తతములో స్ప శ్లోకం ఒకటి. శాస్త్రిగారి పై పద్యానికన్నీ ఈ శ్లోకానికీన్నీ కొంత అర్థభేదం ఉంది. అది గమనించవలసి ఉంది.

తెలుగు పలుకుబడి, సంస్కృతపద లాలిత్యం పడుగు పేకగా నిత్యవసంగా ఈ 'చైత్రరథము'లో జైత్రరథయానం చేశాయి.

వివిధ నామములతో మున్నది రెండు శీర్షికలున్నాయి దీనిలో. సీసం శ్రీనాథునిదే. కాని శాస్త్రిగారి సీసంకూడా సువర్ణ ... ఆజానేయులాగా ...

'విష్ణులోకము' ఖండికలో నాల్గవ పద్యం నాల్గవ పాదంలో 'మెరపునే సందొలంగిన పాదుకవు' అని యతి తప్పింది 'సందొలంగిన' అని అనడంవల 'పాదు' అక్కరలేదు 'కనపాలందు'-అని సరిచేసుకుంటే సమన్వయం కుదురుతుంది ఇలాగే చైత్రరథము అనే ఖండికలో చివరి పద్యములో 'రత్నాలోకంబుల కల్మి జైత్ర చైత్ర రథ' అని 'చైత్ర' పదం ఒకటి ఎక్కువై గణభంగ దోషం కలిగినట్టుంది అందువల్ల 'చైత్ర' పదం తీసివేస్తే నిర్దుష్టం అవుతుంది.

అన్ని శీర్షికలూ పునః పరం పొత్తంగాని దిజ్మాత్రంగా తీసుకున్నాను. ఉభయ భాషలలో తలస్పర్శియైన పాండిత్యం, తగిన శబ్దాధికారం సందర్భానుసారంగా పద ప్రయోగ వైదగ్ధ్యం ఉన్న రసహృదయ కనుక శ్రీ సత్యనారాయణశాస్త్రిగారు అందమైన ఖండకావ్య సంపుటిని వెలయించారు.

విశేష మేమిటంటే ఈ కృతిని స్వీకరించిన శ్రీ కరుటూరి సత్యనారాయణగారుకూడా కవి యవడం మహాభాగ్యం అనే చెప్పవచ్చు. ఆనంద గజపతి మహారాజును దర్శించి గురజాడవారు చెప్పిన

ఏ భూమిం దుని జాడలో ... నీ తానే
పద్యముం చెప్పి తా
నే భావంబును చెప్పకోవలయు నిం
కే ... ఆ
నే భావంబు ... మనాడుపుటం
నీకే కప్పమిదేరా
హా! ఓ సత్కవి పూర్వజన్మ సుకృతంబా!
... దిర్జ్యాయువై —

అనే పద్యం జ్ఞాపకం వచ్చి చాలా సంతోషించాను. ఈలాటి అదృష్టం అందరికీ పట్టదు. ఇంతకంటె యిప్పుడు చెప్పదానికేమీ లేదు.

సరస్వతి పవర్ ప్రెస్సువారు చక్కగా ముద్రించారు.

(శాస్త్రిగారిపేర రాజమహేంద్రవరం వ్రాసి ఈ కృతి తెప్పించుకోవచ్చు. వెల లోపల 4 రూపాయలు, వెనుక అట్టపై రు. 5/- అని ఉంది. కనుక వెల యింత—అని నిర్ణయించడం ?)

వైర భక్తి

జమదగ్ని

(గతసంచిక తరువాయి)

తృతీయాశ్వాసము

3

బాలవారత్నము భీష్మకాత్మజకుఁ గల్యాణంబగున్ మాఘమం
దేలమిన్ బూర్ణిమ రాత్రియంచు విని శ్రీకృష్ణుండు గంభీరుఁడై
పిలువన్ లేదు స్వయంవరం బనుచుఁ దిన్నన్ నేఁడు పెండ్లాడు? పెం
డిలి యెట్లా? వధు వచ్చుటన్ వరుఁడిటన్, దండాల పెండ్లానొకో?

ఉవిద స్వయంవరంబనక యుద్వహ మంచని యేరికిచ్చునో
వివరము తెల్పకే వృపులఁ బిల్వఁగఁ బంచుటతో నిదో రహ
స్య విషయమువ్వమాట స్ఫుటమయ్యెను, రుక్మియు చైద్యమిత్రుఁడై
యువతిని వీకె యిత్తునని యుండును. తం డిని చెల్లి నెన్నకన్.

బావ జనించుటే మనకు వైరముతో నగు టాతఁడింతికై
తావున నిల్చి యత్నపడి తాలిమికిన్ దెనుమున్న తెచ్చుటన్
దీవరుఁడీ విలసిల్లెరెఁ, దెల్పఁ యొకింతుక లేని నే డుఁడెం
ధావలి తుండగున్ బడిశ మట్లు గ, తక్కునా? బాలిహాసునో?

నాకై పుట్టిన నాతికై యిటుల పంతంబూను వీరోనా డు
ర్వీకుం డీతఁడు నేటి దాయయగునే? తెల్పిం గనంబోఁడు చిం
తా కంతైవను, భార్య దొంగిలినవాఁడై నేఁడు పత్యర్థి చిం
తాకన్ పుత్రియ నడ్డుకోఁ దలఁచు, ప్రాణాల్ దక్కునే వీనికిన్

అరరే చచ్చుటకై జనించుటయె లక్ష్యంబైన యిట్టాని కు
ర్వరపై మోహములేదు, చావు వుతార్థంబైన యుద్ధానినే
వరియింపందగుఁ, దానెఱుంగు గద తత్ప్రాణంబు నాచే విస
ర్జ్వర పరౌనంచు, నెఱిం గెఱింగియులు తీవ్ర ద్రోహ బుద్ధింగనున్॥

నన్నున్ జంపు మటంచు వచ్చినను ప్రాణాల్ తీయుచెట్లౌను? నా
యన్నన్ దొంగిలి, నాకు నా ప్రియకుఁ దావడ్డైన, గ్రుడ్డస్థితి
చిన్న గ్రివు వొనర్పవచ్చు, నిది లక్ష్యవుండు వాంఛించు నై
నన్వాఁడట్లు వరంబు గైకొనియె కానన్వేదు దారాదహో!

నూరౌ దాకను పెచియుఁడునని వన్నున్ నేఁడె మేనత్త . నో
రారం గోరి తల్లి కటె యని. దుర్వార కుధామోహమై
తీరె బొమ్మని తీర్ప రాదితని, మాత్ర మేను నిస్త్రాయిసై.
వైరిత్వమ్మున మృత్యు సన్నిధికిఁ ద్రోవఁ దీయు నఁ టలంబునన్॥

నాఁడేకాదరి, యేర్పరాతమునె కృష్ణస్వామి దుర్వేగి వెం
టాడన్ దద్గతమైన భావము చైత్యార్తిన్ వెతన్ దోల, నా
దూడల్ తల్లుల మేను లొల్ల కోఁ మదుల్ మూటల్లైపోవ, లో
లో డెంపంబున శ్రీసతిన్ దలఁచి కల్లోలంబు నందెంగడున్॥

ఈ సంసార మిదెల్ల మాయ బదుకె యెద్దాని కెద్దానికో
తా సిరి దుడు రోషముం గనుచు సారాసార విధిసూటా
భాసింతైన మనో విభావనల ప్రేమ బాం కల్గాదు లో,
నీసంబే నటు శాంతి పొంద నగునే వీని పరాధీనమ్మై॥

వైరింగూర్చి తలంచుచోఁ దొలఁగె దుర్వారంబు చైత్యంబు. త
న్నారిం జేఁతన నేయఁ గ్రమ్ముకొనియెన్, నానాని నానాది దు
ర్వ్యాపార్తి మహా విపత్తు లను ప్రేమంబొను నన్నేఁడనా
చేరం జీదునొ డెంద మందునికి వాంఛించున్ బలవ్వంబునన్

జనకుని మొలుగుకు లాన, వృద్ధాప్యాల కాంతి దేహ నా
మనసున బూనుదేను మనుమలంబు మాల, రసాలవాల, ఊగా
నును పొగ నెప్పుల వెన్నెల వొప్పను జేయు నాండేయు చం
ద్రునకు వినుంగు రోదని, నమం దలపోయు మనెంతకుందునో?

మనికి సమస్త మాను కయి మున్నని పేయుదుగాక, నాకు నా
యుకకికి భంగమేటి కల, దున్నరి కన్నది నందనమ్ముగా
ననుగతి నుందు నెల్లెడల నయ్యెయి నేఁల వ్యక్తమౌచు, నా
యను గటు తాప మందునెద వ్యక్తము కాకెటు బూరకొందుటల్॥

నిలువున నిల్పినట్లు రమణీమణి రుక్మిణి మోల వెలఁగ
మ్ములఁగని పొక్కుచున్ దివమునున్ నిశయుంచును భేదమేమియున్

దెలియక కృష్ణ మురారి సుదతీగత చిత్తుఁడుగాఁ, జతుర్దశిన్
దెల దెల వారు వేళ నతిథింగనె సన్నిధి వాలు బ్రాహ్మణున్॥

ప్రత్యుత్థాన పురస్సరంబుగ పదాబ్జాతంబులన్ శిరసం
బత్యంతంబగు భక్తి వాంచి మహాత్మా! మీరు మత్ప్రాణ సం
తత్యాశీయము గూర్ప దేవతలు, రాకన్ జేసెనో నిశ్చిదన్,
బత్యంబిద్ది, దయామతిం గొనుఁడు మత్పర్యస్యంబు మీదేయగున్॥

అని కృష్ణుండన, బ్రాహ్మణుండతని నే తాబ్జంబులన్ జాఁచి పో
వునో యన్నట్లుగఁ జాచి, నవ్వుచును, యో నోస్వామి! నీకేమి చి
ద్ఘనతన్ జిక్కకయుంటి నిచ్చట. రమాకంజాక్షి తానచ్చటన్
వనధిం బొచ్చిన చందమై నవయు బాష్ప స్విన్న నేత్రాబ్జమై॥

విన్నకు విన్ననన్ బిలిచి, నీ విపుడిట్లుగ వేగి, ద్వారకన్
వెన్నున కింపు నే మనికి నెల్లడిసేసి, శ్రమంబు నెన్నకన్
దిన్నగ తోడి తెమ్మనుచు దీనముగాఁ బలవించి వేడినన్,
దెన్నవి తిప్ప యుంచవక దీక్ష వహిన్ బయనించి వచ్చితిన్॥

అన్నియు నీకుఁ జెప్పగల నావక దుందుభిసూత! ముందుగా
గన్న ప్రయాణపుం బడలికల్ చన స్నానముచేసి వార్చి నీ
యున్న తెఱంగెఱింగి కొని మనమున్పూనుండి యిటే ప్రయాణమై
తిన్నగ వేగి కుండినము దేలవలెన్ సుకుమారి తేరగన్॥

అనచునె బ్రాహ్మణుం డపుడు వ్రచ్చు ఘటంబుల కృష్ణుఁడందియా
ద వుగ సర్వదిన్ దలమ దాల్చిన యట్లుగ స్నానమాడి. సం
ధ్యను గావియాడి. తేజిన యనంతర, మా యదుసింతు రాకకై
పెనగొను మత్తు కత్యమున వేని, యతండెదురైన యంతటన్॥

స్వామీ! యేమని చెప్పమందు, నట హాస్యాల్పకష్టమ్ము నీ కోసమై
నీమంబూని నిరంతర వ్రతములన్ నిర్నిద్రయై వేవేడినన్
హామూల్యంబనుకోకు క్షిప్త సహవాసంబై తెగం ద్రెంచుకో
నే మాత్రంబును నీలుకాక యడలున్ బ్రేమగ్ధ దైన్యంబునన్॥

తోడంబుట్టినవాఁడె వేడకట తోడ్తోడ ప్రాణంబులన్
బ్రీడా శూన్యుఁడు, స్నేహితుండనచుఁదన్నిన్ వాని కందియుగా
జాలన్, వాఁడు దురంత మోహమునఁదన్ జాడించి, నన్నాని దా
పీడన్ బాపి కొనంగ నన్ బిలిచి పంపించెన్ నిమం దేరగన్॥

అంతటి దుఃఖమై యతిన యాటు మఁదుచు, నిన్ దలంచియే
వ్వాంతము నిల్చి కొన్నయది, స్వామిని నీ నరుదెంచి తత్పురీ
ప్రాంత మహేశ్వరాలయము పార్వతీ గౌళ్ళిడు వేళనన్ను ని
శ్చింతగ మద్రహించుచును జేర్చి రథంబును సాగుదంచుమన్॥

తెముల్చుము, వెంటనే బయలు దేరుము, తేరున గూరుచుండి యా
యమను గురించి నీ పడుగు పన్నిటి కప్పుడె చెప్పుచుందు, దే
రమరువఁడంఘ మింక. నిసుమంతయు జాలము సైపఁజాలఁదా
సుమనద్వ్రశాంతరంగ, యిటు చూపు మరల్పక చూచుచుండెడిన్॥

అని కడు తొందరించెడి మహాత్ము నకారణ వత్సలత్వమున్
గని ముద మందుచున్ యదుకులామణి, బ్రాహ్మణుఁడాతిథేయమున్
గొనకయె సాగుబెట్టు ననుకూలము కాదిది యోట, తన్ముఖం
బుననె స్వకాంత కాంత గుణముల్ వినఁగోరి, చమత్కరించుచున్॥

చనపున విట నెవ్ వగుచు సొంపలోపముఁ, డింత తొందరై
వనువరె స్వామి నా గృహమునన్ వరిషేచన మాచరింపకే
చనుట పాసంగునే తమకు? చాన వివాహము నేడు కాదు. కుం
డినకు రథంబునన్ జనుట డెప్పంమే? వడకంత వెట్టునే?

నిలువక రాతిరెల్ల సయనించి బహూ శమకోర్చి వృద్ధులై
వలపెలుఁగంగఁజెప్పినను ప్రేమయుతున్ బొనరించినారు. మీ
యలయక నూతియున్ దలఁగ, దంత త్వరపడి పోవ హేతువుం
గనుగడు, చాన విభ్రమము కంటిరిగా? భయమేమి లేదటన్॥

అంతానన్ గడు స్వల్పమే యయిన నా యాతిథ్యమున్ గాంచి వి
శ్రాంతిన్ గైకొని, సావధానముగఁ దద్వార్తా మణిన్ నేను వి
శ్రాంతం గుర్తిడు చిన్నె లప్పియును వాక్యింతంబుగా దెల్పి, నా
కింతిన్ దక్కగఁజేయు పుణ్యమున సొం, డెంతున్ మిమున్ స్వామిగన్॥

అను శ్రీకృష్ణు ముఖారవిందమున మాపై బ్రాహ్మణుం, డంబుజా
క్షునిలో కాతిశయాత్మ లక్షణము, నకో భ్యత్వమున్ మెచ్చి, యా
తనికిన్ బ్రీతి ఘటించుటే పరమ తాత్పర్యమ్ముగా, లక్ష్మి రు
క్మిణి సాక్షాత్కృతి వందినట్లుగనె. స్వామిన్ ముగ్ధ గావించుచున్॥

స్వామీ! నన్ను పరీక్ష చేసెదవా. నా చాదన్ముమున్ జాచి క్రీ
డా మోదంబునకై సరాదికము లాడంగాఁ దలంపూనెదో,
శ్రీమా తాకృతి వర్ణనా మహిమ నీ చేతంబు మెప్పించునాఁ
డీ ముల్లోకములం దొకండు గలఁడే ప్రాహిమఁడే కానిచో॥

అయినన్ సర్వ మెఱింగియున్ దెలియనట్లా మానినిన్ గూర్చియె
ట్లయినన్ నన్ బలుకంగఁజేయు మతి నీ కయ్యెన్, మహాభాగ్యమో
నయశాలీ! వినవయ్య, నా సలుపు యత్నం బెల్ల నిర్వ్యాజమౌ
దయకున్ బాత్రముగా నొనర్చు, చరితార్థత్వమ్ము సిద్ధింపఁగన్॥

వెలపురుడైన సోని కమనీయ శిశుత్వము నాటినుండి క
న్నుల గనుచుంటి నా యనను. నూతన నూతన శోభలీను నా
లలిత మనోహరాంగకములన్ గవిసంతవ, మానసంబు ని
శ్చలమయి, సర్వసం స్తుతికి జన్మరహస్యము కాంచినట్లగున్॥

ఉయ్యాల తొట్టెలో నున్న యప్పుడె బిడ్డ
యోంకార సౌందర్య మొలుకఁబోసె

తన టద్గులు వేయువవ్వడే లోకాల
కొప్పల కుప్పయ్యె యొప్ప బిడ్డ
బోసినోటను నవ్వు పువ్వులు విరియుచో
వెన్నెలయుల్లము అల్లిసేసి
తొక్కు పలుక్కులయందె క్రొత్తక్కలు మెఱపుల
బీజాక్షరముల నావిష్కరించె

పంచ మాట్లంబు ప్రాప్తమై పరికిణీ ధ
రించి పరికయున్ బలపమున్ గొంచువచ్చి
తండి తోడుత నా ముందు తల్లి నిలువ
చదువు చెప్పుట సేరవే బదుకుకొంట॥

అనాటినుండి నేటి వఱకయ్యు మరియు సమస్త జీవం
బున్ని బిడ్డకోసమునట్లుగ సాగును, నా బుజాలపై
చయ్యన వెక్కి తాతయని స్వారిగ నెగిన యా దినాల నె
వ్వాడు విస్మరింప, వవి యీ జనికంతకు శిఖరంబగున్॥

కొంచెము పెద్దదై తనువు గొప్పది కాన లోకపర్ణనం
బించుక యించుకె తెలియు, వేనొక యెజ్ఞపటన్న యూహ కే
ర్పించిన పెదవారి నుడి పెద్దరికంబును నిల్పుపాంపు మ
న్నించిన దాత్మ శిక్షణము, నేను గురుండన నవ్వులాట యా

ఎదుటను గూరుచుండి వలికించిన యటుగ మన్మథంబునం
దొరగఁజేసి విద్యలను, మల్లె మెఱుంగక నేను పల్కుచోఁ
గుదురుగ దాను విన్నటులఁ గోమలి తోచిన దయ్యయుండె. నా
బ్రదుకున కామెకున్ గురుత పక్షపరంబగ యెంతు విప్పుడున్॥

అతుల మహత్త్వమున్ దెలుపు దన్ని మియ్యెనపుడె గురూత్తమా
ప్రీతియు కోటివిద్యలను జెందగఁజేసి విమర్శ రూపిణీ
స్ఫుతయగు నామె. తల్లిఁగనుచున్ గననేరని విద్యయుండదో
మతిమహిమావదాత నవనూతన లోకవికాస! కేశవా!

అడిగితి నామె నెట్టిదుట వద్దమునందున దూమనట్లుగా
మనసు మటంచు. నెవ్వడు నూల్కొవి తల్లి సమము కాదు. న
వ్వఁడె తమవెల్ల విస్మృతినిపొంది సమస్త జగత్స్వరూపతన్
బడసి నమ్మైక్య మందెదను, వ్యక్తివి నా కవివర్తనం బెటుల్॥

పంచదశీ స్వరూపమున బాలికయుండగఁ, గంటి ముంగలన్
మించు అసంఖ్యమై విరిసి మేదినిలేదనిపించునట్లుగా
తీవె మువన్నమాధ ప్రపలింపగఁ జేసెడి దివ్యలాస్యమున్,
కించిత పూర్వ పుణ్యమున స్వామి! నిరంతరమట్లె గాంచెదన్॥

షోడశి నేడు నా యెదుట సోగకనుల్ దరమీళితంబులై
ప్రౌఢ తనంబులో గరుణపొంగు నెలొద్దుముగ జూచుచుండ, నీ
క్రీడ సమస్తముం గనెడి యేమి యెఱుంగవి విస్మయుండనై
పీడఁ తలి వక్షమున ప్రేలెడి బిడ్డగ హాయినందెదన్॥

స్వామి! నన్ను క్షమించి యా జనని సౌభాగ్యంబు నీకేమనో
భూమిం గాంచుము, చాల నద్భుతమయి నా పుణ్యంబు తానెట్టిదో
యామెం జూచినయంతఁ బొంగుడుచు ప్రాయంబంది వాత్సల్యము
ద్రా మాధుర్యమునావి సొమ్మసిలఁ బో ధన్యత్వ మందెదెదన్॥

ఆమెన్ గుర్తిడు చిహ్నముల్ దెలుపు మంచన్నావదో స్వామి, నీ
వే మెన్ గాంచుచు నిన్ను నీ వెఱుఁగవో యేమాత్ర, నా చాన యే
శ్రీ మన్మోహన రుక్మిణీ మహిళగాఁ జిత్రించుమయ్యా! మరే
హేమాంగంబగు చిహ్నముల్ దొరక నా సౌందర్య దుగ్ధాబ్ధిలో॥

తలి పాలవెల్లి మిన్నులమధ్య తెలిదీవి
వెలు దరమ్మున తమ్మి విరిసినంత
వరదాభయౌదార్య భద్రాంఘ్రి పంకజ
ద్వంద్వ మాధారమై ప్రభవమంద
వసపాకు పొట్టాల పాదిజంఘా యుగ్మ
మంతరంగమ్ము వంతంతఁ గమ్మ
పిల్లి నంతానమ్ము స్వేచ్ఛమై విహరింప
యోగ్య మౌ వ్రుకలోరు యుగము విరియు

సర్వ భువన ప్రతిష్ఠా స్థలాల కనక
పూర్ణ తలిన నాభి నితంబములు జనింప
వరవి వ్యమ్ము హేమ పీఠస్థ్య మొసఁగ
తలి యెదయందు శాంతి పండంగ వచ్చు॥

ఆనన పద్మ మందెసగు నంబక పద్మము, లిందుసూర్య తే
జోనిధు, లంతరంగముల చిమ్ములు చుట్టిడి చిమ్మచీకటుల్
లూన మొనరు జాలు నతిలోకల వితము, లమ్మహాలమం
దైన వెలుంగి లోకముల నస్పిట బో డి తల్లి కాయయ్యరో!

కుంకుమ కుప్పన్ పీనటు కోమలి దేహము కాంతులీను, వ
ర్యాంకుర పాగమైనటుల నామె చరింపగ జంగవాగరు
వ్యంకు మదాది సౌరభము లంతటఁ బర్వుచు సాగుదెంచు, నే
త్రాంకుల కోటి మన్మథులునై పరిపింతురు తల్లి వచ్చిన॥
ఆమె నెతింగి నిన్నెఱుఁగ నట్టెరు. విన్నెఱుఁగంగ నైనచో
నామె నెఱుంగ నట్టెరు నహోభువనంబులనుండలోరు నీ
నామెకు, నామెకీవ నగుచున్నది బంధుర నిత్యలక్ష్మియో
స్వామి! నిరంబ మేల యుగ పాగుము కుండినకున్ రగంబునన్
అనుచున్ బ్రాహ్మణుఁ డానసన్ గనుచునా కృష్ణ! నచ్చుమున్నాఁడిదే
వినయౌదార్య పరాక్రమాంబుధి దేవిన్ నిన్ను గొంపోవ, నా
జవి సాఫల్యము పంచె నీ పగిది కృష్ణా! యంచు నేల్మోడ్చెనన్;
గములన్ జప్పిలు మోదబాష్పములు పక్షాళించి తత్పాదముల్॥
శివుడన్నట్లుగ సర్వ గౌరవముతో శ్రీకృష్ణుడానాడు చెం
త వినీతుండయి లాల వృత్తమును చేతం బాని సేవించుచున్
ఇదియో షడ్రస దివ్యభోజనమువన్ నంతృప్తు గావిం చె భూ
దివిజున్. బిమ్మట తానునుం గొనియె వింతిన్ మిమ్ము వేడంబునన్॥
మోయగలేమ వెనవంగ మోసెడి మా రథమున్నదంచు దే
వాయు వముశ్శివాయ యని నల్పుచు నర్చనసేసి స్వర్ణభూ
షా యుత దివ్యవస్త్ర మహిమాన్విత పక్షపుటంబు సెస్సయో.
హాయువి భక్తి మొక్కుచును బ్రాహ్మణు దీవనలంది పొంగుచున్॥
అంతట దారుకుం డదివు వాసనముం గని తెమ్మ తేరిపి
వెంతను బ్రాహ్మణుం డధివసింపఁగ స్వామియు కూరుచుండి, య

య్యంతని గూర్చియే తిరిగి యెన్నఁగఁజేయుచు మోదమందుచున్
స్వాంతముతో సకాలముగ సాగహయంబులు కుండినన్ గనెన్॥

వచ్చెను కృష్ణుఁడన్న నుడి వచ్చిన భీష్మకుఁడాదరంబుతోఁ
దెచ్చిన యర్ఘ్యపాద్యములఁ దృప్తిని బొంది విశాల సౌధ మొం
డచ్చుగ నిల్వనిచ్చి, విడియన్, వినయంబున వేగెఁ, దక్షభా
భృత్యయు మాదరించుటకుఁ, బెండిలి చూతురు గన్నతండ్రియై॥

అగ్రిద్యోదమునఁబంత నాతనికి ధర్మాగ్రజ్ఞుఁడై మొక్కి, తా
నగ్రిం జేర్చునో యేమొ బిడ్డ, నను కింతాలస్య మయ్యెన్, మహో
ద్యోగ్రం తాంతక నాకునై నిలుచు సౌధిన్ గాంచి నీరోడనే
లగ్గంబేసని తెల్పి రావలయుఁ గాలంబయ్యె నచ్చంపుమా!

అనుచున్ నిల్చిన బ్రాహ్మణుండదిగో వచ్చె త పవేశంబు తన్
వినుచున్ సఖ్యులు దారి చూచుచును గన్పింపన్ వెనంతోయు క
న్యాకమున్ రుక్మిణీ. ద్వారదానఫ దద్భుత స్వచ్ఛ వేళావిధీ,
గను గొంచున్ దను సౌణమూడు కళఁతోక్కంబేయు కల్యాణినిన్॥

వచ్చెను వాఁడున్నఁ దరి వర్ణము నెట్లుండబోవ నిన్ను దా
మెచ్చఁగఁ గొంచుబోవు, నిక నీకు సమస్త శుభంబులయ్యెడున్;
వచించెన్ని నేను, గురునై నినుగొల్చిన విప్రుడా తుండనే,
పచ్చు సుధాబ్ధిఁబుట్టి గుణధాము వరించిన శ్రీ తనూజవే!

అని యూహించుచునుండఁగా రమణి పాదాబ్జంబులన్ వ్రాలి మొ
క్కిన నేత్రాంబులు ధారలై కురియ నా కృష్ణాంతరంగన్ దమా
జను డౌదన్ బయుకత్తెవై నిమిరి వర్ణా! కృష్ణుఁడేతెంచె, నిన్
గొనిపోవం బనుచెంచె నమ్ముమిఁక. నాకున్ మేలు చేకూర్చెనే!

అని ద్విజోత్తమ కమాట చెప్పి యవ్వని నిల్చియున్నంతలో
విఁపించెన్ గుణదేవ యాత్రకు కృష్ణుం గూర్చి తూర్యధ్వనుల్
వినఁగా నాను శ్రీ విలాసినియు దేవా! నన్ను రక్షించి, తీ
ఋణ మెటు గుడు? సంచలింగొనుము తండ్రీ! యంచు ప్రార్థించినన్॥

నా కా? నీవా ఋణపడు,
టి కోరుట్నను తోఁటంగు మేలా తల్లీ!
సాకారదే సేనం గొని
శ్రీకైవల్య పద సిద్ధిఁ జెందెడు దాఁకన్॥

పఁగొనన్, విభుచెంత నుండెద శుభ ప్రారంభవాదాంక. ద
లిని శ్రీపార్వతిఁ గొల్వఁ బోవ్యుటకుఁ గేళీమోహనుం డెత్తు, ని
నన్నుగున్ బాణి గ్రహించ యొత్తి రథ మందారూఢఁగాఁజేసి వెం
టనె గొంపోఁగలఁడంబుజాక్షుఁ, డరి వెంటన్ బడ్డ నిర్భీకుఁడై॥

అని తన్వాంగిని పొత్తుగాంచి చనె నాయాచార్య వర్యుండు కృ
ష్ణుని సాన్నిధ్యము నందునంత, నటఁ గృష్ణుండున్ వినోదార్థియై
తనకుం దోడగు బ్రాహ్మణోత్తమునితోఁ దత్త్వ పసంగమ్ములన్
వినుచున్ లగ్నముహూర్త కాలమునకై వేచెన్ ప్రసన్నాత్ముఁడై॥

యాదవుఁ డేగుదెంచి పురమందున నుండిన వార కు డినన్
మోదము గూర్చె నెల్లరకు, మోహన కృష్ణుఁడు రుక్మిణీమణిన్
పేదుకొనున్ స్వతంత్రముగఁ జెంతకు నంచు; విరుద్ధ బుద్ధులై
చేదిప రుక్మి ముఖ్యులిది చేదయి నందఁగఁ దీ వరోషమున్॥

వచ్చిన కృష్ణుఁ డొక్కఁడయి వచ్చెను. దెచ్చెను బ్రాహ్మణుఁడు నా
లచ్చి వరించు వాని, నిఁక లాభము లేదని యూరకుండ, కా
వచ్చిన వాఁడొకం డగుట వందలు నేలగుఁ దాము పూనుచో
నచ్చి యెటేగునం చనరి, లజ్జ యొకింతుక లేనివారలై॥

అటు నటు నూరి నత్తినల నా హవనాడి యెట్టైన కన్య న
చ్చోటు కదలంగ నీక, మనమున్ బలవంతముగాగనైన మా
ర్పుట్రకయుసిద్ధమై నిలుచు మాటుల చైద్యుఁడు రుక్మి. సైన్యముల్!
పటుతర శంఖ్యాన్ని విలిచి, పార్థిపులన్ దమవారి నెల్లరన్॥

అన్నయు శుద్ధి లేని యొక యౌవన మాత్రుఁడు రాజకన్య రా
జాన్వయుమెల్లఁ జూడఁగఁ గన్యాగ్రహణంబున గొంచుబోవ నెం
చు, న్యాయహీన మిద్యుది పశ్చ పకరమ్ముల గాచు గొల్లఁడే
చె, స్వధి వైపరీత్యమిది చెల్లగ జూతురె క్షత్రియోత్తముల్

కదలుఁడు, కత్తిఁబట్టుఁడు, దరికంత నిక్రాంతన దక్కు లోచు, రా
పాదవిన యుప్పుడున్ నిదురఁ గొందుచు మత్తత నూరకుందురే?
యెదనుట. కన్యకిష్టమయి యిప్పటికిన్ బిలిపించెనంట, తా
నదనని వచ్చెనంట, మనసైనది చేయుటె ధర్మమౌనొకో?

ఇప్పనుబట్టి ధర్మమని యెంచెడు చైద్యుఁడె యుబ్బులాడి, భూ
భృత్ప్రయ తీ వరోషమును పెంచగఁ గొందఱు బుద్ధిహీనులై,
యెన్నటి కేగు కృష్ణుఁడని యెడ్డెఱ మూపగ నిల్చియుండి, రా
పచ్చని పెండ్లి పందిళులు భగ్నవమందెడి యుద్ధభూమిగాన్॥

సామ్యము సృష్టియం దెపటు సాధ్యముకాదు, గుణత్రయంబువై
షమ్యము పొంది యేర్పడుట, సత్త్వర జస్తమముల్ విచిత్రమై,
సాఁమ్య మయాయి భేదములు సల్పక తప్పదు, తద్గుణంబులే
సామ్యమునంది కేవలత సాగిన నయ్యది బ్రహ్మతత్త్వమౌ॥

ఒక్క గుణంబు పెచ్చుగను నుండును తక్కిన రెండుగాఁడ, వే
రొక్కటి మాత్రమే యయిన దిందుల నుండదు, జ్ఞాన దగ్నియౌ
చిక్కని సత్త్వ, మైహికము చెందు ప్రవృత్తి రజంబొసంగు, పెం
పెక్కగ నీక తామసము హీన దశన్ గనఁజేయు నిత్యమున్॥

ప్రాచుర్యమ్మునుబట్టి సాత్త్వికుఁడు గోప శ్రేష్ఠుఁ, డుద్యద్రజో
వైచిత్ర్యమ్మున కాలవాలముగ నా వైదర్భి, ముప్పొక్కప్పెఁ
దోచున్ దామస మాత్మ నాశకముగా దుష్టాత్ముఁడౌ చైద్యుఁడం,
దీ చెర్లాటమె విశ్వలీల. త్రిజగంబీ మాయయై సాగెడిన్॥

[ఇంకా ఉంది]

మహాభారతము-నృతత్త్వశాస్త్రము

(నిషాదాదిగిరి జనోత్పత్తి-వారు ఆచరించదగు విధులు ఆచార వ్యవహారములు)

శ్రీ తాపీక ప్రకాశరావు

శ్రీ వ్యాసమహర్షి కృతమహాభారతము పంచమ వేదమని విశ్వసింపబడుచున్నది. శ్రీ [illegible] వ్యాఖ్యాతలు మహాభారతమును "ధర్మశాస్త్రమని, వేదాంతము, నీతిశాస్త్రమని, మహాకావ్యమని, పర్వలక్షణమని, యితిహాసమని, పురాణమని..." వక్కాణించియున్నారు. పాశ్చాత్య విద్వాంసులుకూడ యీ *మహాభారతము ప్రపంచములోని కెల్ల పెద్ద గ్రంథమని, నూరువేల శ్లోకములుగల గ్రంథము ప్రపంచములో యితర యే భాషలందును లేదని వ్రాసియున్నారు. మహావిద్వాంసుడు, ప్రాచ్య పాశ్చాత్య వేదాంత శాస్త్రములను క్షుణ్ణముగా అధ్యయనము జేసినవాడేగాక ఆర్షన్ వాఙ్మయములో (ప్రత్యేకించి శాక్ కృతులకు ప్రాణము పోసిన) తనకు తానే సాటియని నిరూపించుకున్న సంగీత విశారదుడు, అన్నిటికిమించి మానవత్వమే మనిషి రూపుధరించినదా యన్న కరుణార్ద్ర హృదయవైద్యుడు, నోబెల్ శాంతిబహుమతి గ్రహీత ఆల్బర్ట్ ష్వైట్జర్ "మహాభారతములో లేని విషయము ప్రపంచములోని యితర యే గ్రంథమందును గానరాదు. ప్రపంచ సారస్వతమునకే యీ గ్రంథము తలమానికమువంటిది. యిందుకు అందులోనిగల సావిత్రీ నలోపాఖ్యానములే పరమ నిదర్శనములు" అని పేర్కొన్నాడు. బహుధా ప్రశంసించియున్నాడు. యిందులో లేని విషయము ప్రపంచ మందెక్కడను గానరాదన్న విషయము పరమ సత్యమని తోచుచున్నది. యిందుకు ప్రత్యక్ష నిదర్శనము గత మూడు శతాబ్దములుగా ప్రచారములోనికి వచ్చిన ఆర్థిక, రాజకీయ, మానసిక, సాంఘిక, నృతత్త్వశాస్త్ర విషయములిందు గానవచ్చుట గమనార్హము. యింకా యితర శాస్త్రముల విషయములుగూడా [illegible] గాని నాకు కేవలము సాంఘిక, నృతత్త్వశాస్త్రములతోనే కొంచెము పరిచయముండుటవలన ఆయా శాస్త్రవిషయములవరకే ముఖ్యముగా నృతత్త్వ శాస్త్రమువరకే పరిధిని యేర్పాటు చేసుకొని మహాభారతములోని ఆ శాస్త్ర విషయములనే యీ వ్యాసములో చర్చింతును.

నృతత్త్వ శాస్త్రమునకు సంబంధించిన విషయములు మహాభారతములోని ఆది, సభా, విరాట, భీష్మ, శాంతి అను శాసన పర్వములలో కాననగును. ఈ వ్యాసములో కొన్ని ముఖ్య విషయములనే ప్రస్తావించి ముందెప్పుడైనా అవకాశము దొరికినచో యితర పర్వములలోని విషయములను వ్రాయగలను.

* *

నృతత్త్వశాస్త్రము క్రీ. పూ. శతాబ్దములలోనే గ్రీకు తత్త్వవేత్తలు పేర్కొన్నను గత మూడునందల సంవత్సరములనుండియే యీ శాస్త్రమభివృద్ధి గాంచినది. నృతత్త్వశాస్త్రముగా మానవుల రంగు-రూప రేఖావిలాసములను మరియు వారి సంస్కృతి సమాజ పరిస్థితులను అధ్యయనము చేయు శాస్త్రము. పాశ్చాత్యదేశస్థులు ముఖ్యముగా యింగ్లీషువారు, డచ్చివారు, ఫరాసులు, బెల్జియనులు, స్పెన్ దేశస్థులు పలురాజ్యవిధాన మవలంబించి సామ్రాజ్యముల నేర్పరుచుకొన్న తర్వాత యీ శాస్త్రమున కధిక ప్రాముఖ్యత లభించినది. వారు తమకు తెలియని కొత్తదేశములకేగి, రాజ్యములు స్థాపించి, ప్రజలను లోబరుచుకొని రాజ్యపాలన మారంభించినపుడు అచ్చటి ప్రజల జీవన విధానము, వారి ఆచార వ్యవహారములు [illegible] యొక్క పరిపాలన యిబ్బందులలోనై, అచ్చటి జనుల జీవన విధానము, ఆచార వ్యవహారముల తెలుసుకొన్నచో సజావైన పరిపాలన [illegible] యోచించి వారి సాంఘిక సంస్కృతీ అధ్యయన [illegible] ఒక ప్రత్యేక శాస్త్రముగా నృతత్త్వ శాస్త్రమునకు స్థానము [illegible]నది. యీ శాస్త్రము సమస్త మానవాళికి సంబంధించినదియు అన్ని జాతుల, మతములవారి రంగు రూపు-రేఖా విలాసములు [illegible] వారి సాంఘిక-సాంస్కృతిక విషయముల నధ్యయనము చేయు[illegible] యున్నప్పటికి ముఖ్యముగా 1950వ సంవత్సరమునుండి [illegible] శాస్త్రపరిశోధన గిరిజనుల సాంఘిక - సంస్కృతి [illegible] పరిమితియై యున్నది. (గిరిజన సాంఘిక సాంస్కృతిక[illegible]

★ పాశ్చాత్య విద్వాంసులు వ్యాసకృత మహాభారతము [illegible] యున్నటువంటి పెద్ద గ్రంథము నాటిది, [illegible] క్రీ. పూ. 4వ శతాబ్దములో [illegible] క్రీ. శ. 4వ శతాబ్దమువరకు [illegible] జరిగినవనియు [illegible]. [illegible] రచనాకాలము క్రీ. పూ. 2వ శతాబ్దము[illegible] క్రీ. శ. 2వ శతాబ్దమని [illegible].

యీశాస్త్రముఖోద్దేశమైనది) యీ శాస్త్రము జాతుల రంగు రూపరేఖా విలాసములను పరిశీలించినప్పుడు ప్రకృతి శాస్త్రములకు సంబంధించినదియు, సాంఘిక సాంస్కృతిక విషయములను పరిశీలించినప్పుడు సామాజిక శాస్త్రములకు సంబంధించినదియై యొప్పుచున్నది.

* * *

మహాభారతములోని శాంతిపర్వాంతర్గత రాజధర్మాను శాసన పర్వము లోని 59వ అధ్యాయములోను మరియు 65వ అధ్యాయములోను నృతత్వశాస్త్రమునకు సంబంధించిన విషయములు గలవు. నృతత్వశాస్త్రము ముఖ్యముగా గిరిజనుల రంగురూపురేఖా విలాసములను మరియు వారి సాంఘిక సంస్కృతి విషయములను పరిశీలించు శాస్త్రము పైన తెలిసికొన్నాము. గిరిజనులను సంస్కృత సాహిత్యములో నిషాదులు, శబరులు, మ్లేచ్ఛులు, కిరాతులు, పుళిందులు, దస్యులు, బర్బరులు, తుషారులు మొ॥ నామములతో పేర్కొనబడినారు. ఈ నిషాదాది గిరిజనులెవ్వరు? వారెట్లు జనించినారు? వారాచరించదగు ఆచారవ్యవహారములు, విధులెవ్వి? అను ప్రశ్నలకు పై అధ్యాయములలో సమాధానములు లభించును. యీ ప్రశ్నలు యుధిష్ఠిరుడు భీష్ములవారి నడుగగా వారిచ్చిన సమాధానములు 59వ అధ్యాయములో 88వ శ్లోకమునుండి 97వ శ్లోకమువరకు నిషాదాది గిరిజనోత్పత్తి, మరియు 65వ అధ్యాయములో 13వ శ్లోకమునుండి 2?వ శ్లోకమువరకు వారికై నిర్దేశించబడిన విధులు, ఆచార వ్యవహారముల ప్రకటింపగలదు:

భీష్ముడు యుధిష్ఠిరునకు తెలిపిన విషయము—శాంతిపర్వము, రాజధర్మాను శాసనము, 59 అధ్యాయము.

భీష్మః :-

శ్లో॥ (88) తతః సంచిత్య భగవాన్ దేవో నారాయణః ప్రభుః।
తైజసం వై విరజసం సోఽసృజన్మానసం సుతమ్॥

[శ్రీమన్నారాయణుడు తన శక్తిచే విరజుడను వానిని పుట్టించెను.]

(89) విరజాస్తు మహాభాగః ప్రభుత్వం భువి నైచ్ఛత।
న్యాసాయైవాభవద్బుద్ధిః ప్రణీతా తస్య పాండవ॥

[విరజుడు రాజ్యపాలన మందిష్టములేక సన్యసించుటకై కుతూహల పడుచుండెను.]

(90) కీర్తిమాంస్తస్య పుత్రోఽభూత్ సోఽపి పంచాతిగోఽభవత్।
కర్దమస్తస్య తు సుతః సోఽప్యతప్యన్మహత్తపః॥

[విరజుని కుమారుడు కృత్తిమత్ మరియు వాని కుమారుడగు కర్దముడు తపస్సునందే మనస్సు నిలిపి ఐహిక సుఖములు వాంఛించరైరి.]

(91) ప్రజాపతేః కర్దమస్యత్వనంగో నామవై సుతః।
ప్రజానాం రక్షితా సాధుర్దండనీతి విశారదః॥

[కర్దముని కుమారుడు అనంగుడు. అతడు సాధుశీలా స్వభావుడై ప్రజారంజకుడై ప్రజాసంరక్షకుడై, దండనీతి విశారదుడునై యుండెను.]

(92) అనంగ పుత్రోఽతిబలో నీతిమానభిగమ్యవై।
ప్రతిపేదే మహారాజ్యమథేంద్రియ వశోఽభవత్॥

[అనంగుని పుత్రుడు అతిబలుడు (అతివలుడు) గా తడు రాజనీతి విశారదుడై యుండెను. తన అంతట సువంతర మితడు మహారాజ్యమునకధిపతియై, విషయ లోలుడయ్యెను.]

(93) మృత్యోస్తు దుహితా రాజన్ సునీథా నామ మానసీ।
ప్రఖ్యాతా త్రిషు లోకేషు యా సా వేనమజీజనత్॥

[మృత్యువను వాని పుత్రిక సునీథ. ఆమె త్రిలోకములలో సౌందర్యవతియని పేరొంది యుండెను. ఆమెను అతిబలుడు (అతివలుడు) వివాహమాడి, వేనుడను పుత్రుని బడసెను]

(94) తం ప్రజాసు విధర్మాణం రాగద్వేష వశానుగమ్।
మంత్రపూతైః కుశైర్జఘ్నుః ఋషయో బ్రహ్మవాదినః॥

[వేనుడతి గర్వోద్ధతుడును మరియు మహాక్రూరుడునై యుండెను. అతడు ప్రజలందరిని హింసించుచుండగ బ్రహ్మవాదినులు మంత్రపూతములైన దర్భాస్త్రముల తో వానిని చంపివేసిరి.]

(95) మమంథుర్దక్షిణం చోరుమృషయస్తస్య మంత్రతః।
తతోఽస్య వికృతో జజ్ఞే హ్రస్వాంగః పురుషో భువి॥

(96) దగ్ధస్థూణ ప్రతీకాశో రక్తాక్షః కృష్ణమూర్ధజః।
నిషీదేత్యేవమూచుస్తం ఋషయో బ్రహ్మవాదినః॥

[మంత్రోచ్చారణచేయుచు ఆ బ్రహ్మవాదినులు దర్భాస్త్రములతో వేనుని కుడితొడను మథించిరి. ఆ తొడనుండి అతి నల్లని స్వరూపమును, పొట్టి అవయవములు గలవానిని, ఎఱ్ఱని కన్నులు గలవాడును, నల్లని వెండ్రుకలుగల ఒక పురుషుడుదయించెను. బ్రహ్మవాదులు వానిని నిషీద యని యాజ్ఞాపించిరి.]

(97) తస్మాన్నిషాదాః సంభూతాః క్రూరాః శైలవనాశ్రయాః।
యే చాన్యే వింధ్య నిలయా మ్లేచ్ఛాః శతసహస్రశః॥

[ఇట్లు ఉద్భవించిన వాని సంతానమే నిషాదులై వింధ్యారణ్యపర్వత ప్రాంతములందు నివసించెడు సహస్రాధిక మ్లేచ్ఛులైరి].

* * *

శాంతిపర్వము, రాజధర్మానుశాసనము.

65 అధ్యాయము.

భీష్ముడు యుధిష్ఠిరునకు తెలిపిన యింద్ర – మాంధాత సంవాదము)

మాంధాత :

శ్లో॥ (13) యవనాః కిరాతాగాంధారాశ్చీనా శ్శబర బర్బరాః।
శకాస్తుషారాః కంకాశ్చపహ్లవాశ్చాంధ్రమద్రకాః॥

(14) పౌండ్రాః పులిందారమఠాః కాంభోజాశ్చైవ సర్వశః।
బ్రహ్మక్షత్ర ప్రసూతాశ్చవైశ్యాశ్శూద్రాశ్చమానవాః

(15) కథం ధర్మాంశ్చరిష్యంతి సర్వే విషయవాసినః।
మద్విధైశ్చకథం స్థాప్యాః సర్వే వైదస్యు జీవినః॥

(16) ఏతదిచ్ఛామ్యహం శ్రోతుం భగవంస్తద్బ్రవీహిమే
త్వం బంధు భూతోహ్యస్మాకం క్షత్రియాణాం సురేశ్వర॥

[మాంధాత యింద్రుని ప్రశ్నించుట:– ఆర్యులరాజ్యములలో నివసించు యవనులు, కిరాతులు, గాంధారులు, చీనులు, శబరులు, బర్బరులు, శకులు, తుషారులు, కనకులు, పహ్లవులు, ఆంధ్రులు మద్రకులు, పౌండ్రులు, పులిందులు, రమఠులు, కాంభోజులు మరియు తదితరు లనుసరించవలసిన విధులెవ్వి? పర్వతారణ్య ప్రాంతములందు నివసించెడి ప్రజలు తప్పనిసరిగా పాటించదగు విధులపై మనమెటువంటి ఒత్తిడి తేవలయును? క్షత్రియులకు మిత్రులైన ఓ దేవలా చక్రవర్తి! ఈ విషయములన్నియు నే వినగోరెదను. దయచేసి తెలపిండు.]

ఇంద్రః :

శ్లో॥ (17) మాతాపిత్రోర్హి శుశ్రూషా కర్తవ్యాసర్వ దస్యుభిః।
ఆచార్యగురు శుశ్రూషా తథైవాశ్రమవాసినామ్॥

[గిరిజనులు తమ మాతా పితృలను, గురువులను, తమకంటె పెద్దవారిని, అరణ్యములందుండు ఋషీశ్వరులను సేవించవలెను.]

(18) భూమి పానాంచ శుశ్రూషాకర్తవ్యా సర్వదస్యుభిః।
వేదధర్మ క్రియాశ్చైవ తేషాంధర్మో విధీయతే॥

[గిరిజనులు తమ రాజులను సేవించవలెను. మరియు వారు వేదసమ్మతములైన అన్ని ధర్మములను పాటించవలెను.]

(19) పితృయజ్ఞాస్తథాఃకూపాః ప్రపాశ్చశయనానిచ।
దానానిచ యథాకాలం ద్విజేభ్యో విసృజేత్సదా॥

[వారు పితృయజ్ఞములను జేయవలెను. యితర జనుల ఉపయోగార్థమై బావులు త్రవ్వవలెను. బాటసారులకు సలివేంద్రములను నడుపవలెను. మరియు బ్రాహ్మణులకు శయ్యాది దానములు జేసి బహుమతు లొసంగవలెను]

(20) అహింసా సత్యమ క్రోధోవృత్తి దాయాను పాలనమ్।
భరణం పుత్రదారాణాం శౌచము ద్రోహ ఏవచ॥

(21) దక్షిణా సర్వయజ్ఞానాందాతవ్యాభూతి మిచ్ఛితా
పాక యజ్ఞా మహార్హాశ్చ దాత వ్యా సర్వ దస్యుభిః॥

[యితరులను గాయపర్చకుండుట, సత్యము పలుకుట, క్రోధమును దగ్రమించుట, బ్రాహ్మణులకు మరియు యితర బంధుకోటికి వారికి జేయవలసిన సపర్యలు జేయుట, భార్యా బిడ్డలను పోషిస్తూ శాంతిమార్గ మనుసరించుట, మొదలగునవి గిరిజనులాచరించదగును తన అభివృద్ధి కొరకు ప్రతి గిరిజనుడును బ్రాహ్మణులకు తగు బహుమతు లొసగి వారిని సేవించి తృప్తిపరుచవలెను. వారు పాకయజ్ఞాది కర్మలుజేసి, స్వశక్త్యనుమిడి, ధనాదులొసంగి మరి యితరములగు దక్షిణాది బహుమతులొసంగి బ్రాహ్మణులను సన్మానించవలెను.]

(22) ఏ తాన్యేవం ప్రకారాణి విహితాని పురానఘ।
సర్వలోకస్య కర్మాణి కర్తవ్యానీ హపార్థివ॥

[పై విధులను, ఆచార వ్యవహారములను గిరిజను లాచరించ దగునని పూర్వకాలమునుండియు నిర్దేశింపబడియున్నది. గాకయిదియేగాక యితర వర్ణముల వారాచరించదగు ధర్మానుష్ఠానము లన్నియు గిరిజనులు గూడా ఆచరించదగునని యింద్రుడు మాంధాతకు తెలిపెను.]

* * *

(శ్రీమదాంధ్ర మహాభారతము. తిక్కన సోమయాజి ప్రణీతము. (సుశోధిత ముద్రణము, 1972. ఉస్మానియా విశ్వవిద్యాలయము. సంపుటము VI. శాంతిపర్వము, ద్వితీయాశ్వాసము)

వ్యాసమహర్షి కృతమగు మహాభారతములోని పై విషయము లను శ్రీ తిక్కన సోమయాజి యీ క్రింది విధముగా ననువదించినాడు :

(205)వ॥..."విశ్వలోకేశ్వరుండగు విష్ణుపాలికిం జని తగం గని కార్యంబు విన్నవించి నీతిశాస్త్ర ముద్భవం బెఱింగించి దీని నధిగమింపను దదీయాచారంబు నడపను శక్తుండగువాని నొక్కరుని నిర్దేశింపవలయునని యభ్యర్థించిన నద్దేవుండు నిజ తేజోమయుండుగా నొక్క మానసపుత్రు నిర్మించి విరజుండను పేరిడియె. వతండు భూమికి ప్రభువుగా నొల్లకుండె. దద్పుత్రుండు కర్దముండు నన పేక్షిత రాజ్యండై తపంబున కరిగె. దదీయ పుత్రుం డనంగుండు దండ నీతినయించి ప్రజల బాలించెనతని కొడుకు నీతి యనువాడమ్మహా రాజ్యంబున కభిషిక్తుండై యింద్రియ వశత్వంబు నొంది మృత్యుపుత్రి సునీథ యను కామినిం గమనీయాకారవతి మనోహర ... విభాసినిం బరిణయంబైన దానియందు వేనుండు గలిగె మాతా

మహాదోషంబు నంజేసి రాగద్వేషంబులం బ్రజకు విరుద్ధుండయ్యె నటు గుటయు మహామునులు గూడ యేకించి మం త్రపూతంబుగు కుశసంచయంబుల నతనిం బ్రకామితుంజేసి తద్దక్షిణోరు తలంబు మథించిన

206 [illegible] వెడు కాలిన కొఱవి తెఱం
గున నల్లదనంబు [illegible] [illegible] నె
ఱ్ఱని కన్నులునై యకుచి
త్వ నిరూపుండొకడు పుట్టె ధర్మతనూజా.

207 [illegible] వానింజూచి యా ఋషులు నిషీదయని
పలికి వర్జింపుటంజేసి తత్సంతాన జాతులు
"నిషాదు"లనం బరగి వింధ్యాది గిరివన ప్రదేశం
బుల [illegible] [illegible] [illegible] ..."

ఇక్కడ సౌపుయాణి 60వ అధ్యాయముమండి 67వ అధ్యాయములవరకు చాలా సంక్షిప్తముగా నమువదించి 65వ అధ్యాయము లోని యుధిష్ఠిర మాంధాత సంవాదమందుగల దస్యు లాచరింపదగు [illegible] [illegible] [illegible] విషయమును పూర్తిగా వదలివేసి [illegible]. ఆ విషయము:

(242) "[illegible] మాంధాతృడను మహావల్లభుండు
[illegible] [illegible] [illegible] యొక మ
[illegible] [illegible] [illegible] [illegible]
[illegible] [illegible] [illegible] విధులను.

(243) [illegible] [illegible] [illegible]

(244) [illegible] [illegible] [illegible]
[illegible] [illegible] [illegible]
[illegible] [illegible]
[illegible] [illegible] [illegible] [illegible]

(245) [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible]
[illegible] [illegible] [illegible] [illegible].

(246) [illegible] [illegible] [illegible] [illegible]
[illegible] [illegible] [illegible] [illegible]
[illegible] [illegible] తలపెట్టి [illegible]
[illegible] [illegible].

(247) [illegible] [illegible] [illegible] [illegible]
[illegible] [illegible] [illegible] [illegible]
బిన దృఢముగ నొందింపుము
[illegible] జరితార్థునిగ [illegible] [illegible].

(247) మ॥ దరణీశా స్వపధర్మముత ప్పమ సద్ధర్మం [illegible]
తెరువున్ రాజరయంగగాదె తగసిద్ధింబొ. దుగాపంబు గో
ధరయంబున్ మగిడించి దండము సమర్థ [illegible]
[illegible]
ధర [illegible] రాజహింసాగతి [illegible] [illegible]
[illegible].

(248) [illegible] అని పలికి [illegible] [illegible] [illegible]
మంగొని

(249) తె॥ లోక పాలాత్ముఁడు మీరు మీకు శ్రే ష్ఠ
చరణమర్గమే పజ బోవు సమరయుక్త
దేహాలంకటయు నమ్మేలు దెమ్మనంశ
యంబు వలవదు మీపదమధికతరము

(250) [illegible] [illegible] [illegible] [illegible] [illegible].

* * *

మహాభారతంలోని ముఖ్యవిషయములను సంక్షిప్త పరచటంలోనో కొన్ని విషయములకు ప్రాధాన్యమియ్యక వదలిపెట్టటందువ, అప్పటి కాలానుసారము ఆ విషయముల కంత ప్రాముఖ్యత లేకపోయినను, నేటి కాలమున క్రొత్త క్రొత్త శాస్త్రములు వెలయుచున్నందున శ్రీమదాంధ్ర మహాభారతములో కొంత వెలితి కనుపించుచున్నది. సంస్కృత మహాభారతము జదువక కేవలము ఆంధ్రభారతమే చదివినచో 65వ అధ్యాయములోనున్న ముఖ్యమైన శాస్త్ర విషయములు తెలియనేరవుగదా! అట్లే యితరశాస్త్రములకు సంబంధించిన విషయములు మూలమందుండి తెలుగు అనువాదములో వదలివేయబడి యుండుట. మూలములో రాజనీతి, మానసిక, ఆర్థిక (ఎకనామిక్స్) శాస్త్రములకు సంబంధించిన విషయములెన్నోగలవు. అవి [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible]. అందువలన సంస్కృతమూలమునుండి తెలుగు భారతమునే చదివినచో [illegible] ముఖ్యమైన విషయములు తెలియరావు. ఈ కారణముగా సంస్కృత భారతములోని ప్రతి శ్లోకమును తెలుగు గద్యానువాదముగలదొక్క [illegible] అవసరమున్నది. యిది ఒక మహాకార్యము. ఆంధ్రదేశ సాహిత్య [illegible] [illegible] అంతర్గతమైన తెలుగు [illegible] [illegible] [illegible] [illegible] [illegible]. [illegible] [illegible] [illegible] [illegible] [illegible] [illegible]! [illegible] [illegible] సంస్కృత మహాభారతమునకు పర్వ, అధ్యాయ, శ్లోకానుసారముగా తెలుగు గద్యానువాదమెంతో అవసరమై యున్నది. సంస్కృతమురాక యితరశాస్త్రము లభ్యసించువారికి యిది [illegible] [illegible] నాకు తోచిన చిన్న అభిప్రాయము. [illegible] [illegible] కాదో పండితులు [illegible].

ఈ నీడన చెట్టుక్రింద

డా. మాదిరాజు రంగారావు

మనసులో ఆరి నుండి ఆనందం
బ్రతుకులో ఊహనుండి అనుభవం
వెలిగిస్తూ కదలేను నవోషస్సు
ఏ నీడ జాడ లేని హృదయంతో.

మంచు మెట్ల పై నుండి నాలోకి
అనంత కాలానికి దర్శనియై.

చూపుమేరలో స్మృతి నాక్రమించి
ఉంది నిల్చిన మహావట వృక్షం,
శాఖోప శాఖలుగా వ్యాపించి
చలచల్లని నీడలు పరచి క్రింద
కథలకూ గాథలకూ సాక్షిగా
పిపీలికనుండి - ఆశ్రయ పదమై.

తలఎత్తి ఆకాశంలోకి
గాలికి కదలే ఆకులతో
నిటారుగా నిలచి నిండుగా
చక్కని రమ్య మహావటవృక్షం.

దీనిపై నుండి నిశ్శబ్దంగా
చంద్రుడు ఎగురుతాడు విహంగంవలె
పై నుండి నిదురలో స్వప్నమై,
చీకటి దూకుతుంది అశ్వంవలె.

చుట్టూ చిన్నపిల్లల గుంపువలె
కొంతసేపు తిరుగుతుంది వెన్నె

దిక్కుల కడుపులో భయంతో
చేరి, పగలు తల దాచుకొన్న
చీకటి గుండెలోని నీడలు,
చూడొచ్చు ఊడల చిక్కులో.

దూరం దూరం కొమ్మలు చాచిన

దీని నీడ ఎందరినో పగలు
ఆకర్షిస్తుంది స్నేహంతో
స్వాగతం చెబుతూ అందరికీ.

నిప్పులు కురుస్తున్నా రవి పైన
భరిస్తూ హృదయం హిమ భమై.

ఆదమరచేను గ్రీష్మ వేళలో
దీని పంచనే ప్రాణి సమూహం.
కదలే పవమాన తరంగం పై
తేలే అనుభవ చైతన్యంతో.

ఎండలో కాళ్ళు కాలి ఆగేరు
చెట్టు క్రింద విశ్రాంతికై జనం,
కాసేపింతో అనుబంధంతో
మరచిపోయి జాతివర్ణభేదం.

మెదలుతాయి స్మృతి పథాన
దగ్ధమైన భూమినుండి
తలలెత్తిన జ్ఞాపకాలు,
పచ్చని ఆలోచనతో.

బీటలు వారిన భూతలం
వర్షంతో సమమైనట్లు,
చీలికలైన హృదయ రూపం
ఒకటౌతుంది రాగంతో.

జ్వాలలవలె సాగి దహించే
ఊహలంతలో శమించేను.
అలజడి పైబడి వచ్చినంత
త్వరగా అవతరించదు శాంతి.

ఈ చెట్టు దాపునకు రాగానే
పొందేను శాంతి మండలంలోకి

ప్రవేశించిన, సంపూర్ణానుభవం;
అంచులు చూచే శాంతి తృప్తితో.

ఇక్కడికి రాగానే కళ్ళు
మూస్తాయి నిదుర పొలిమేరలు.
ఊహసాగేను స్వర గతితో
మతిలో ప్రశాంత రసధునియై!

పూర్తిగా ఆగేను కాలం
చైతన్య మగ్నమై సర్వం,
ఇపుడు తలపుకు రానేరాదు.
మృత్యువు ఏ రూపంలోనూ,

రాత్రివేళలో, కొమ్మకు పూచే నక్షత్రం
ఉదయం చేతిలో పడితే ఫలమై అదృష్టం.

పగలు పైన కొమ్మవెనుక, దాగిన నక్షత్రం
కాళ్ళపైబడి అంగారమైతే దురదృ

ఈచెట్టు చరిత్రకు చిహ్నం.
దీని భుజస్కంధాలపైన
ఉదయిస్తాడు బాలసూర్యుడు
మానవశక్తికి ప్రతీకగా.

దీని ముఖాన ఒదిగేను ఆకాశం
దీని భుజాలపై నిలచేను క్షితిజం,
దీని పరిచయంతో అనుభవచిత్రం
పొందేను, శాశ్వతంగా ప్రతి హృదయం.

ఇక్కడ వినిపిస్తుంది స్పష్టంగా
శ్రుతి సుభగంగా నదించే కాలం.
వర్తమాన ధరణీ ఖండంనుండి
నాలో గభీర భవిష్యత్తులోకి.

"వసంతోత్సాహము"

శ్రీ బులుసు వేంకటేశ్వర్లు

ఉత్సాహ వృత్తము :

1. శ్రీవసంత దివ్య రుచిర సేచనా విమోహనం
భావనములు కామరు మిగిలె-ప్రకృతి పచ్చపచ్చనై
తీవసాగి పూలుపూచె-తేంట్లు సన్మరందమున్
భావమునకు తృప్తి కొలది పానరతినిఁ జొక్కెడిన్

2. కిసలయముల నెఱ్ఱబాఱె కింశుకమ్ము-కోయిలల్
మసలి కంఠమెత్తి పంచమస్వరానఁబాడగా
రస పిపాసతోడ-నవ్యరాగ పూర్ణభావనా
ప్రసరమైన నవ వసంత భాగ్యరేఖ తోచినన్

3. నవ వసంత నవలతాంతనందనమ్ము తోచెనో
భువి ప్రతియ గమ్మ క్రొత్తపూత పూచె-లోచనో
త్సవ మొసంగె-పరిమళాత్త చలితపవనమాలికల్
కవిసె పల్లెదెల్ల వాఱ కాలనియతిఁ దెల్పుచున్

4. వేమ క్రొత్త పూత పూచె-వెల్లిగొడుగుభంగి-చాం
ద్రీమహస్సుభంగి-ప్రచురతేజమై-కషాయగం
ధామల ప్రసిద్ధమైన తత్సుగంధ బంధురో
ద్దామమై కుమార మారుతములు వీచె సంధ్యలన్

5. దిగ్దిగంతములను నవ్య దీప్తి వెలిగె-చేతనా
స్నిగ్ధవీచి వీచెయెదల-శిశిరప్రభుప్రతాపముల్
దగ్ధమయ్యె-నవ వసంత దర్శనానుభూతిచే
ముగ్ధయయ్యె ప్రకృతికాంత - ముద్దులొలికె రాగముల్

శివరావు కోట

శ్రీమతి ఆర్. వసుంధరాదేవి

శివరావు గొప్ప మేధావి. అతను సైకో ఫిజిక్స్, సైకోడెలిక్ మిక్స్‌లలో చేసిన పరిశోధనల వలన ప్రపంచ వ్యాప్తమైన కీర్తి గడించాడు చిన్న వయసులోనే. ఇప్పుడు 'మానవుని అనుభవాన్ని నిత్యసత్యంగా మార్చడం ఎలా?' అన్న విషయంమీద పనిచేస్తున్నాడు.

దైనందిన జీవితంలో మనిషి ఎన్నో అనుభవాలకు లోనవుతున్నాడు. అందులో చాలభాగం అర్థం లేనివి, స్వల్పమైనవీను. కొన్నిటిని అనుభవిస్తున్నట్లు అతనికే తెలియదు. కొన్నిటిని నెమరువేసి సాగదీసి అనుభవిస్తాడు. కాని ఒక్కటికూడా అతనికి మిగలటంలేదు! రుచికరమైన పదార్థాలెన్నో తింటాడు. రుచి అనే అనుభవం ఎక్కడకు పోతుందో మరి, ఆ క్రియతోటే అదీ మాయమైపోతుంది. వాసన, సుఖము, భోగము, నవ్వు, ఏడుపు అన్నీ ఏమైపోతున్నవో. కొన్ని కొంత కాలంవరకూ జ్ఞాపకాలుగా నిలిచినా తరువాతైనా జారిపోతాయి. తాను కోరుకున్న కొన్ని ముఖ్యమైన అనుభవాల్ని శాశ్వతం చేసుకుంటే మానవ జీవితానికి పూర్ణత వస్తుంది. ఆ ప్రక్రియ కనిపెడితేగాని మానవజాతికి నిజమైన మనుగడ వుండదు. దానికోసమె శివరావు ప్రయత్నం.

శివరావుకు తన పరిశోధనలమీద తప్ప మిగతా ప్రపంచంలో ఆసక్తి లేదు. అనురాగాలు, అనుబంధాలు మొదలైన భావనలు అతనికి ప్రస్తుతం అప్రియములన్న నిర్లక్ష్యం. కాని యీ మధ్యనే జీవితం విసిరే ఉచ్చులో చిక్కుకున్నాడు. గౌరి అనే అమ్మాయి అతన్ని బలంగా ఆకర్షిస్తోంది. ఇది యౌవన సహజమైన కామవాంఛయొక్క గుడ్డి రూపాంతరమే నని అతను అనుమానించినా, యింకా ఒక నిర్ధారణకు రాలేదు.

గౌరి ఎక్కువ ఆలోచనా పటిమగల వ్యక్తికాదు. శాస్త్రీయమైన ఆలోచనా ధోరణి ఆ పిల్లకులేదు. పైగా శివరావు పరిశోధనలతో సహా మానవ ప్రయత్నాలే అపహాస్యం చేస్తున్నట్లు మాట్లాడుతుంది. ఆకాశంలో స్పష్టంగా కనిపించే నక్షత్రాలసంగతి వుంచండి. కనిపించీ కనిపించని నక్షత్రాలుంటాయి, అవి నేరుగా, శ్రద్ధగా, పరీక్షగా చూస్తే అసలు కనిపించవు. ప్రక్కగా ఎటో చూస్తున్నప్పుడు మరింత కాంతితో ప్రత్యక్షమౌతాయి.

ఏదైనా విషయం గుర్తుకు తెచ్చుకోవాలంటే ఎంత ప్రయత్నించినా గుర్తుకురాదు. ఆ ప్రయత్నం ఒదిలేశాక, వేరేపనిలో వున్నప్పుడు గబుక్కున గుర్తుకొస్తుంది.

ప్రపంచగతినే ప్రభావితం చేసిన ఎన్నో పరిశోధనలు యిలాగే ప్రయత్నం విరమించాక సిద్ధించినవే... కాబట్టి మీరు యింత తీవ్రంగా ఆలోచించకుండా ఒదిలెయ్యండి. సమాధానం ఎక్కణ్ణుంచో వస్తుంది అని నవ్వుతుంది. ఎప్పుడూ నవ్వుతూ; గలగలాపారే సెలయేరులాగా వుంటుంది గౌరి. ఆ నవ్వే శివరావుని అతివిలువైన పనిలోనుంచీ కళ్ళెంవేసి లాక్కొస్తున్నది.

శివరావుకి 'ఎదురుచూడ్డం' అంటే సరిపడదు. అతనికి కాలం విలువైనది కాని యివాళ గౌరికోసం ఎదురు చూస్తున్నాడు. ఊరి బయట తోటప్రక్కన గుట్టలుండే విశాలమైన బయలు అది. గౌరికి యిలాంటి చోట్లంటే యిష్టం. అందుకే యిక్కడికి రమ్మన్నది. కాని చెప్పిన ప్రకారం ఆ పిల్ల రాలేదు. శివరావుకి విసుగ్గా వుంది. గౌరి జ్ఞాపకాల తియ్యని మత్తులో గడ్డిమీద వెల్లకిలా పడుకున్నాడు. పనిలేకపోవడాన్నో, తీవ్రమైన పరిశ్రమ తర్వాతి అలసటవలననో క్రమంగా నిస్పృహగా మగతలోనికి జారిపోయాడు.

అప్పుడు ఈ విచిత్రం జరిగింది. పడుకున్న అతని నోట్లోంచి అప్రయత్నంగా 'మంచితనం' అన్నమాట బయటికి వచ్చింది.

ఆ భావం అతని కళ ముందే బయటకువచ్చి ఘనీభవించి రాయిగా రూపొందింది ఎలా? ఏమిటా? అనుకున్నాడు ఎదురుగా రాయి వున్నది—గట్టిగా, నిజంగా, తెల్లగా, తేలిగ్గా, కాంతి నిరోధకమైన దీర్ఘఘనం. దాన్ని చూస్తేనే మంచితనంలో తేలిపోతున్నట్లుంది. సందేహానికి తావులేదు! అతనికి భయంవేసింది. కొంతసేపటికి తేరుకున్నాడు. 'సుఖం' అన్నాడు. ఆ మాట కూడా ఘనీభవించింది. ఈసారి భయం వెయ్యలేదు. దాన్ని పట్టుకుని చూచాడు. ఎంతో సుఖమనిపించింది. గట్టిగా, నిజంగా, పచ్చగా, కాంతినిరోధకమైన ఘనం. ఈసారి అతనికి సరదా పుట్టింది. 'చలి' అన్నాడు. బూడిదరంగు రాయి ఏర్పడింది. సరదాగా చాలా రాళ్ళు తయారుచేశాడు. అందమైన రాళ్ళకుప్ప ఏర్పడ్డది.

తాను చేస్తున్న పని విషయంలో, అతనికి సందేహం పోలేదు. ఎవరైనా చూస్తున్నారేమోనని చుట్టూ చూశాడు. దూరాన పచ్చని చెట్టు. దానికింద ముసలివాడు. అస్థిపంజరానికి చర్మం తొడిగినట్లున్నాడు. ఒక్కోసారి అస్థిపంజరం మాదిరిగానూ కనిపిస్తున్నాడు. శివరావునే చూస్తున్నాడు. ఏ భావంలేకుండా పూరికే చూస్తున్నాడు. తాను చేస్తున్న పనికి నవ్వినా, తిట్టినా, ఎగతాళిచేసినా శివరావుకి బాధగా వుండేదికాదు. కాని యీచూపు అతనికి సరిపడలేదు. ఏమీ చెయ్యలేక, తలత్రిప్పి రాళ్ళగుట్టను పరిశీలిస్తూ కూర్చున్నాడు. చూడగా చూడగా రాళ్ళన్నీ ఒకేమాదిరిగా కన్పించసాగాయి.

వాటిని కూర్చి అర్థవంతమైన ఆకారంయిస్తే ఎట్లుంటుందో అన్న ఆలోచన వచ్చింది. ఒకదానిమీద ఒకటి పేర్చాడు. చక్కగా అతుక్కుపోయాయి. ముసలి వానికీ తనకీ మధ్యన గోడలా కడుతూపోయాడు. కొంతసేపు కట్టి ఒక చివరకుపోయి తొంగిచూశాడు. ముసలివాడు అలానే చూస్తూనే వున్నాడు. శివరావుకి చాలా కోపంవచ్చింది. అర్థం లేకపోవడాన్ని శివరావు సహించలేకపోతున్నాడు. ఆ చూపును భరించాల్సిన అవసరం తనకులేదు! తన చుట్టూ అనుభవాలకోట కట్టి, ఆ ముసలాడు ఎప్పటికీ కనపడకుండా చేసుకోగలడు...రకరకాల యిటుకలు చేస్తూ చిత్రవిచిత్రాలుగా పేరుస్తూ కోట కడుతూ పోతున్నాడు శివరావు. బాహ్య ప్రపంచాన్ని మరిపించేటంత ఆసక్తి పుట్టింది పనిలో. చుట్టూ గోడలు పైకి లేచినై.

గౌరి యిప్పటికైనా వస్తున్నదేమోనని గోడపైకి ఎక్కి చూశాడు. గౌరి రావటంలేదుగాని ముసలాడు అట్లాగే చూస్తూ వున్నాడు. ఈసారి శివరావుకి చాలాకోపం వచ్చింది. 'ఈ అస్థిపంజరంతో నాకేం పని' అనుకుని కోట పైనంతా శుద్ధంగా మూసేశాడు. అందమైన కోటలో కూర్చున్నాడు. కోట అందమే మనసంతా ఆక్రమించుకున్నది. బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా, తన పరిశోధనలు చేసుకుంటూ హాయిగా వుండొచ్చు యీ అందాల కోటలో! అనుకున్నాడు వాకిలిగా వదలిన సందులోనుంచీ గౌరి కనిపించింది. గబగబా నడిచి వస్తోంది. తన ఆలస్యానికి క్షమాపణ చెప్పుకుంటున్నట్లుగా వేగంగా వస్తోంది. గౌరిని చూస్తున్న శివరావు కళ్ళకి గౌరి వెనుగ్గా చెట్టుక్రింది ముసలాడు కన్పించాడు. ఇద్దరూ ఒకటిగా కన్పించారు. తల విదిలించుకున్నా భ్రాంతి ఒదల్లేదు. అప్పుడు శివరావుకి అనుమానం వచ్చింది. ఈ గౌరి కోటలోకి వస్తుందా? ముసలాడి దగ్గర చెట్టుకింద హాయిగా వుందామంటుంది! శివరావులో గౌరి వస్తున్నదన్న సంతోషం పోయింది నడిచి నడిచి అలసటగా వస్తున్న గౌరి దూరాన్నించి పరిశీలనగా చూశాడు ఆ వంకరటింకర నడకా, లావూ, తెలివిలేని నవ్వూ...యిటాంటి మనిషిమీద నాలో అంత ఆకర్షణ ఎట్లా కలిగిందని ఆశ్చర్యపోయాడు.

ఆ గౌరి లోనికి రాకూడదు. ఆ వాకిలి కూడా మూసేస్తే, కాని తనకు శాంతిలేదు! ఇంతవరకూ అతను మాటగా యిటుకగా మార్చని భావం ఒకటి ఉండిపోయింది 'ప్రేమ' అన్నాడు. వెంటనే ఆ మాట బయటకివచ్చి, వ్యాపించి, ఘనీభవిస్తుండగానే విరిగి విసుగు, కోపం, భయం, అసహ్యం ఆయి వాకిటలో కుప్పబడిపోయింది. ఇప్పుడు వాకిలే లేదు.

అసలు వాకిలితో ఏం పని? కోటలో శివరావు ఆనందంగా వున్నాడు. అనుభవాల్ని నిత్యసత్యంగా మార్చే ప్రక్రియ అతనికి తెలిసిపోయింది. ఎంతో శ్రమకు ఫలితం అది! తన అనుభవాలన్నీ శాశ్వతాలైపోయాయి. తనకు పూర్ణత్వం సిద్ధించింది. ఇది కేవలం తన కోట! మనసులో పలురకాల భావాలు ముప్పిరి గొంటూంటే ఆనందంగా అటూ యిటూ పచార్లుచేశాడు కోటలో.

కొంతసేపటికి అతనికి ఊపిరాడనట్లు, ఉక్కిరిబిక్కిరౌతున్నట్లు, శరీరం బిగుసుకుపోతున్నట్లు అనిపించింది. ఇక్కడ గాలి చాలటంలేదు! ప్రాణవాయువులేదు. క్షణక్షణానికీ అతని శక్తి క్షీణించిపోతున్నది. వున్నట్లుండి ఢమామని క్రిందపడిపోయాడు శివరావు.

గుట్టమీదవున్న మనిషి ఎప్పట్నుండో శివరావుని గమనిస్తున్నాడు. శివరావు చేష్టలు అతనికి విచిత్రంగా వున్నై. ఆలోచనలో పడ్డట్లు, చేతిలో ఏమో వున్నట్లు, ఏదో పని చేస్తున్నట్లు శివరావు చేస్తున్న చేష్టల్ని చోద్యంగా చూస్తున్నాడతను. శివరావు పడిపోవటం కనిపించింది. గుట్ట దిగి దగ్గరకెళ్ళి చూశాడు శ్వాస నిలిచిపోయింది. 'పుత్తినే యిట్లా చచ్చాడేమిటీ? అనుకుంటూ వెళ్ళిపోయాడతను...

ఒక టన్ను ముడిఖనిజంలో ఐదు గ్రాముల బంగారం

తరంతరం - సమాలోచనలు

ఒక దృక్కోణంనుంచి చూస్తే ఇది కవితా సంకలనాల (ANTHO-LOGIES) యుగమని పేర్కొనవచ్చు. వ్యష్టికన్న సమష్టికి ప్రాధాన్యత పెరగడం ఈ యుగ వైలక్షణ్యమేకదా!

పాల్ గేవ్ సంకలించిన గోల్డెన్ ట్రెజరీని ఆదర్శంగా తీసుకొని స్వర్గీయ ముద్దుకృష్ణ 1935లో వైతాళికులు ప్రచురించాడు. ఒక యుగానికి సంబంధించిన గొప్ప కవితా సంకలన కర్తగా ఆద్యగౌరవం పొందారు.

ఇంతటి మహత్తర కవితా సంకలనం రూపొందడానికి నిష్పక్షపాత పరిశీలన ఎంతో అవసరం. అభిరుచి ప్రధానమైన నిర్లిప్తత ప్రదర్శింపబడాలి. అలాంటి బాధ్యత-రెండు ఉత్తమ హృదయాలు కలిసినపుడు మరింత విజయవంతంగా నిర్వహింపబడుతుంది. ఆ విధంగా వైతాళికులు ఆనాటి ఉత్తమ కవితా సముచ్చయానికి ప్రాతినిధ్యం వహించగలిగింది. అయినా వైతాళికులపైనే ఆనాడు ఎంతో విమర్శ చెలరేగకపోలేదు. వైయక్తిక అభిమాన దురభిమానాలు ప్రాధాన్యం వహించాయని ఆరోపించబడింది. కొందరు ఉత్తమ కవులు వైతాళికుల నుంచి బాధ్యతారహితంగా మినహాయించబడ్డారనీ, సంకలనకర్త అభిమానానికి పాత్రులైన కొందరు అల్పప్రతిభులకు గౌరవం లభించిందనీ ఎంతో అసంతృప్తి చెలరేగింది.

ఆనాటి ప్రఖ్యాత కవులెందరో ప్రవేశం లభించక మూలమూలలకు తప్పుకొన్నారు. మాధవపెద్ది బుచ్చిసుందరరామశాస్త్రి, ఏటుకూరి వెంకటనర్సయ్య, గుర్రం జాషువా, తుమ్మల సీతారామమూర్తి చౌదరీ, త్రిపురాన వేంకటసూర్యప్రసాదరాయకవి ప్రభృతులెందరో విస్మరింపబడ్డారు.

సుమారు పదేళ్ళ తర్వాత శ్రీ వేంకటపార్వతీశ్వరకవుల షష్టిపూర్తి సందర్భంగా రాజమహేంద్రవరంనుంచి అద్దేపల్లి లక్ష్మణస్వామిగారు ప్రచురించిన 'మహోదయము' వెలువడింది. దీనికి సంకలనకర్తగా శ్రీ తల్లావఝుల శివశంకరశాస్త్రి వ్యవహరించారు. వారి ప్రతిష్టకిది తగినది కాలేదు. పుటల విరివిలోనూ, కవుల ప్రాతినిధ్యంలోనూ, ఈ సంకలనం బృహత్ స్వరూపాన్ని పొందింది. కవితా సంకలన పద్ధతుల గురించి శ్రీ శాస్త్రి ఉదాత్త పీఠికను సంతరించారు. ఇందులో ఎనభై ఐదుగురు కవులు, వివిధ మందుగురు కవయిత్రులు ప్రదర్శింపబడ్డారు. ఎంపికలో విచక్షణ కొంతలోపించి ఈ సంకలనం దొడ్డి సంభావనగా రూపొందడం కొందరి విమర్శకుల పాత్రమైంది.

1946లో నవ్యాలోకంఅనే ఒక లఘుకవితా సంకలనం తెనాలి నుంచి ప్రచురితమైంది. దీని సంకలన కర్తలు శ్రీయుతులు పోతాప్రగడ శ్రీరామారావు, సారంగు నరసింహారావులుగా పేర్కొనబడినా స్వర్గీయ బాలగంగాధర తిలక్ సారథ్యం దీనికెంతో లభించింది. పై రెండు సంకలనాలలోనూ విస్మరింపబడినవారో, లేదా సముచిత ప్రాతినిధ్యం లభించనివారో ఈ సంకలనంలో పాత్రధారులయ్యారు. శ్రీశ్రీ, నారాయణబాబులు మినహాయింపబడ్డారు. పదకొండుగురు కవులకు ప్రాతినిధ్యం లభించింది. వీరిలో భీమశంకరం, వీరయ్య అనువారు సాహిత్య లోకంలో మళ్ళీ కనిపించలేదు.

1951లో కల్పన అనే అభ్యుదయ కవితా సంకలనం వెలువడే పర్యంతం ఒక దృక్పథానికి సర్వసమగ్ర ప్రాతినిధ్యంగల ఆధునిక కవితా సంకలనమే లేకపోయిందని చెప్పవచ్చు.

ప్రారంభంనుంచీ తెలుగుదేశంలో కవితా ప్రచురణ వ్యక్తిపరంగానో, సాహితీ మిత్రసంఘాల పరంగానో సాగుతూవచ్చింది. వ్యాపార సంస్థలేవీ కవితా ప్రచురణ కంతగా పూనుకోలేదు. ఈ కారణం వల్లనే తెలంగాణా రచయితల సంఘం ఏర్పడిన తర్వాత 1952లో శ్రీయుతులు దాశరథి, నారాయణరెడ్డి సంకలన కర్తలుగా 'ఉదయ ఘంటలు' అనే కవితా సంకలనం ప్రచురింపబడింది. ఇందులో వైవిధ్యమూ, సామంజస్యమూ ప్రస్ఫుటమయ్యాయి. తదాదిగా గడచిన రెండు దశాబ్దాలలోనూ ఎన్నో కవితా సంకలనాలు వెలువడ్డాయి. ముఖ్యంగా గత దశాబ్ది కాలంలో ప్రచురింపబడిన కవితా సంకలనాలు పుంఖాను పుంఖాలే! స్థానిక రచయితల సంఘాలన్నీ దాదాపు తమ తమ కవితా సంకలనాలు ప్రచురించాయి. అభిప్రాయ సామ్యంగల రచయితల సంఘాలన్నీ తమ కవితా సంకలనాలు ప్రచురించాయి.

పదహారు సంవత్సరాల క్రితం కేంద్ర సాహిత్య అకాడమీ ఆజ్ఞానుసారం స్వర్గీయ కాటూరి వేంకటేశ్వరరావు సంకలనం చేసిన తెలుగు కావ్యమాల వెలువడింది. 1950 దశాబ్దికే ప్రఖ్యాతులై ఆంధ్రకావ్య ప్రపంచంలో స్థిరపడినకవులలో సంకలనకర్తల వైయక్తికాభిమానాన్ని చూరగొన్నవారు మాత్రమే ఇందులి ప్రాతినిధ్యానికి పాత్రులయ్యారు. ఏమైనా ఇది యావదాంధ్ర సాహిత్యానికీ ప్రాతినిధ్యం వహించగల గొప్ప సంకలనం! ఆదికవి నన్నయ్య మొదలు అద్యదవరకూ ఏందరో కవులకు ప్రాతినిధ్యమ్మూ లభించింది.

ప్రస్తుతం మనకిన్ని విశ్వవిద్యాలయాలున్నాయి. ఏ యూనివర్శిటీలోనైనా తెలుగు కవిత్వాన్ని గురించి డాక్టరేట్‌కు పరిశోధన చేయబూనుకొన్నవారికి 'తెలుగులో కవితా సంకలనాలు' అనే అంశం ఒక ఉదాత్త పరిశోధనాంశం కాగలదు. పరిశోధనా మార్గదర్శకులకు ఈ అంశం పై ఎందుకు దృష్టి ప్రసరించలేదో అనూహ్యమే! ఇప్పటికేనా, ఎవరైనా యువపరిశోధకులీ బృహద్విషయాన్ని శోధించి విపుల విమర్శను సాధించడం వాంఛనీయం.

2

గడచిన మూడు సంవత్సరాలలోనూ గణనీయ ప్రతినిధి కవితా సంకలనాలు ప్రచురితమయ్యాయి. 1974 జనవరిలో ఆంధ్ర అభ్యుదయ రచయితలసంఘం ఆధ్వర్యాన మద్రాసునుంచి యువకవిత అనే పేర నూరుమంది యువకవుల కవితా సంకలనంవెలువడింది. సర్వశ్రీ అనిసెట్టి; సోమసుందర్‌లు సంకలన కర్తలుగా వ్యవహరించారు. యువతకు స్వాగతం అనే శీర్షికతో శ్రీ కుందుర్తి ఉపోద్ఘాతం రాశాడు. రచయితల్లో ఏర్పడుతున్న వర్గవైషమ్యాల గురించి ప్రస్తావిస్తూ ఒక చక్కని మాట అన్నాడు. ''కవి తన కవిత్వపు సరిహద్దులు దాటి రాజకీయరంగంలో ప్రవేశించి అక్కడ తానుచేసే చర్యవల్ల వచ్చేకీర్తి ప్రతిష్ఠల సహాయంతో గొప్ప కవిగా పేరు తెచ్చుకోవాలనే ప్రయత్నం చేస్తూ ఉండడంవల్ల'' అని కొంచం పలచగా చెప్పినా సరైన కారణమే చెప్పాడు. యువకవిత కేవలం సార్థక నామమై యువకవులకు మాత్రమే పరిమితమైనా చక్కని ఒడబోతలు పొందింది. హృద్యమైన సమ్మేళనంగా తనరారింది. 1975లో సర్వశ్రీ నండూరి రామమోహనరావు, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారి కుమారుడు శ్రీకాంత శర్మ సంకలన కర్తలు కాగా, విజయవాడలోని చైతన్యభారతి అనే సాహిత్య సంస్థ ప్రచురించగా-మహాసంకల్పం వెలువడింది. దీనిని 1940-75వరకూగల 35 సం॥రాలలో వచ్చిన ఆధునిక కవిత్వానికి ప్రతినిధిగా తీర్చిదిద్దాలని సంకల్పించారు. ''ప్రక్రియకు సంబంధించినంతవరకూ ఇది వచన కవితాయుగమని నా అభిప్రాయం'' అని వక్కాణించారు శ్రీ నండూరి. ఏ కాలపు కవిత్వంలోనైనా తుక్కూ దూగరా కావలసినంత ఉంటుందనీ, వచన కవితలోనైనా చెత్తాచెదారం తొలగించడం కష్టమేననీ వారన్నారు. మహాసంకల్పానికి శ్రీ నండూరి రామమోహనరావు గొప్ప పీఠికను రచించారు. వారందులో ఈ యుగీన భావనా జిగీషలన్నిటినీ చక్కగా వివృతం చేశారు. ఒక కవికి అసలు పేరున, కలంపేరునా కూడ ప్రాతినిధ్యం లభించగా మొత్తం నలభై తొమ్మండుగురు కవులకిందులో స్థానం లభించింది.

ఈ రెండూ రెండువిధాలుగా-ప్రస్తుతం సమీక్షింపబడుతున్న కవితా సంకలనం-''తరంతరం''తో పోలికలు గలవి. సంకలన కర్తలు చిత్తశుద్ధితో, రుచిబద్ధతతో కృషిసల్పితే మంచి కవితా సంకలనం రూపొందించడాని కెలా అవకాశముందో యువకవిత రుజువు చేసింది.

సంకలన కర్తలు అపేమాపీగా వ్యవహరిస్తే కవితా సంకలనాలు ఎలా వన సంతర్పణలవలె నీరసించగలవో మహాసంకల్పం కొంతవరకూ రుజువుచేస్తే తరంతరం పూర్తిగా ధ్రువపరచుకొంది. యువకవితవలెనే తరంతరం నూరుమంది కవులకు ప్రాతినిధ్యం కలిగించింది. మహాసంకల్పంవలెనే తరంతరం ఈ యుగ కవితా ప్రక్రియారాజం ముక్తఛందమేనని విశ్వసించింది. ఈ విధంగా పై మూడు సంకలనాలకూ అంతర్గత సంబంధ బాంధవ్యం ఉంది. పైగా ఈ మూడు కవితా సంకలనాలూ వర్తమాన కవితా వాణిని యథాశక్తి ప్రతిధ్వనించాయి. ఈ యుగప్రతినిధులుగా నిలచాయి. అనుస్యూతంగా మూడు సంవత్సరాలలోనూ ప్రచురితమై కవితా రసజ్ఞులకు దీప్తినిచ్చాయి. ఈ కారణంవల్లనే-తరంతరంను సమీక్షిస్తూ-యితరేతర కవితా సంకలనాల ప్రసక్తి తీసుకురావలసి వచ్చింది.

ఈ తరం తరం అనే కవి శతసమాహారానికి కుందుర్తి గౌరవ సంపాదకుడు. 'ఊరక పేరుకు పెద్దగా మాత్రమే' తాను వ్యవహరించానని కుందుర్తి చెప్పుకున్నాడు. ఐనా పెద్దగా నిలచిన కుందుర్తి విపుల పీఠిక రాశాడు. శీలా వీరరాజు, నాగినేని భాస్కరరావు, సుభాష్ చంద్ర, వి. మధుసూదనరావు అనే కవిచతుష్టయం సంపాదక మండలిగా వ్యవహరించారు. ''తరతరాల దాస్యాన్ని ఛేదించిన తరం'' అనే అర్థవంతమైన శీర్షికతో ఐదున్నరపుటల పీఠికలో శ్రీకుందుర్తి- 'చేర్చిన కవుల సంఖ్యాదృష్ట్యా యింత భారంగా ఉండే సంకలనంలో ఉండవలసినవారు కొందరు లేకపోవడం-అవసరం లేనివారు కొందరు వచ్చి దూరడంవంటి అసంగతాలు వుండకపోవు'' అని ఒక నమ్ర వాక్యం ప్రకటించారు. ఇలా అనడంలో ఒక చమత్కారం ఉంది. అసంగతాలున్నవని తమకే తెలిసినపుడు తాము ఎందుకు తొలగించే ప్రయత్నం చేయలేదు? అనే ప్రశ్నకు జవాబు దొరకదు. కాని అలా చెప్పకోవడంలో ఒక క్షమాపణ నమ్రతతో చెప్పుకొన్నట్లు పైకి భాసించి, అందరినీ తృప్తి పరచే ధోరణి కనిపిస్తుంది.

పీఠిక శీర్షిక ననుసరించి స్వాతంత్ర్య సముపార్జనారంగభూమికి సమకాలికులైన కవులు మాత్రమే పరిమిత మవుతారన్న భావం కలుగకపోదు. ముఖ్యంగా ఏతదావేశ స్ఫూర్తితో తమ కవితాగళాన్ని మలచిన ఆధునిక అభ్యుదయ కవుల ఉత్తమ రచనలుంటాయని పాఠకులు సహజంగానే ఆశించవచ్చు. కాని ఆ స్వాతంత్ర్య సముపార్జనా మహా

'కతువునాటికి పుట్టనివారో, గర్భస్థ శిశువులైనవారో ఇందులో అధిక సంఖ్యాకులు కావడం ఆశాభంగమే కలిగిస్తుంది.

''నూరుమంది కవుల అభ్యుదయ కవితా సంకలనం'' అని ముఖపత్రంపై గోత్రనామాదిక వివరణాంక స్ఫురణ ననుసరించి నూరుగురు కవులను చేర్చడమే జరిగిందితప్ప - నూర్గురి గొప్ప కవితలను సంకలితం చేయడానికి, సముచిత ప్రజ్ఞా, శ్రద్ధా, జాగరూకతలు నిర్వాహకులు ప్రదర్శించలేక పోయారు. అసలు ఈ నూరు సంఖ్యకి అంత ప్రాధాన్యత దేనికో? కౌరవ సంతానంలాగ! అచ్చుకు పోయేముందు వ్రాత ప్రతిని ఒకటికి రెండుసార్లు పరిశీలన చేసిన జాగరూకత ప్రదర్శితం కాలేదు. వర్తమాన కవులలో కొందరు ముఖ్యుల్ని పరిహరించడం ఎంత ప్రమాదమో, అనర్హులను ఆహ్వానించి నెత్తికెత్తుకోవడమూ అంత దుస్సహమే. ఈ రెండు అరిష్టాలూ ఈ సంకలనానికి చేకూరాయి. ఇంత పెద్ద కవితా సంకలనం ప్రచురిస్తున్నపుడు ఆధునిక ముక్తచ్ఛంద కవితా పరంపరకు ఉత్తమ ప్రాతినిధ్యం కల్పించాలి. ఆధునిక కవుల ఉత్తమాంగ ప్రదర్శన కావించి గౌరవ భాజనం కావాలేతప్ప – నీచాంగ ప్రదర్శనం చేయడం న్యాయంకాదు

ఈ అసంగతాలను మేము పూర్తిగా జయించామని చెప్పలేను గాని చాలవరకు జాగ్రత్త పడ్డాం — అని ఒక ఆత్మపరితృప్తిని వెల్లడించాడు శ్రీ కుందుర్తి. ఇది సోపపత్తికం కాదని పరిశీలకుల కెవరికేనా ఇట్టే తెలిసిపోతుంది. అలాంటి జాగ్రత్త పడివుంటే—సుమారు ఇరవై సంవత్సరాల పైచిలుకుగా ఆధునిక ముక్తచ్ఛంద కవితకు ఆదరణ కలిగిస్తున్న 'భారతి' సంపుటాలను వీరు తప్పక పరిశీలించి ఉండేవారు. బాగా ప్రఖ్యాతులైన కవులే ఇందులో చోటుదొరకక వెనక్కి తిరిగిపోవలసి రావడంకన్న విచారకరం మరొకటి ఉండదు. ఉదాహరణగా కొన్ని ప్రముఖనామాలు పేర్కొనక తప్పదు. సర్వశ్రీ పణతుల రామచంద్రయ్య, వరిగి రాధాకృష్ణ, డాక్టర్ తంగిరాల, దిలావర్, కౌముది, ప్రత్యూషనంటివి కొన్ని మాత్రమే.

''ఒక్కొక్కరికి కొన్ని పేజీలే ఇవ్వగలిగినందుకు ఇంతకంటె వారిని మంచి కవితలు ఉన్నవని తెలిసినా వాటిని స్వీకరించడం సాధ్యం కాలేదు'' అనికూడా కుందుర్తి చెప్పకొన్నాడు. ఇది శుష్క ప్రియమూ, పసలేని ఎపాలజీ మాత్రమే అనక తప్పదు. ఒక్కొక్కరికికొన్ని పేజీలు యివ్వడమనేది అందరికీ సమానంగా జరిగిందా? లేక ముఖమో పేరో చూసి జాగా కల్పించబడిందా? అనే ప్రశ్న వెంటనే ఉదు తగులుతుంది. దురదృష్ట వశాత్తూ ఈ సంకలనంలో అలాంటి మర్యాదలే జరిగాయి. సుమారు పదిహేనుమంది కవులకు రెండేసి కవితల ప్రాతినిధ్యం కల్పించబడింది. సుమారు ముప్ఫయి మంది అర్హతలేని కవుల రచనలు స్వీకృతమయ్యాయి. ప్రఖ్యాత కవుల రచనలే సుమారు ఏభయి కవితలు ఏ సంకలనానికీ అర్హంకానివి ఆదరింపబడ్డాయి. వెరసి ఈ తరం తరం-లో ఈ తరం సాధించిన ఉత్తమ కాంతులనుగాక, క్రీనీడలనే అధికాధికంగా ప్రదర్శించవలసివచ్చింది. దీనికి కారణం ఏదికాని క్షంతవ్యం మాత్రంకాదు!

''ఇందులో వేసినవి మంచివైతే రచయితలకు ఆ గౌరవం యివ్వండి. బాగులేకపోతే వాటిని ఎన్నికచేసిన దోషం మామీద వెయ్యండి'' అని ఎంతో నమ్రతతో ప్రధాన సంపాదకుడు చెప్పిన మాట ప్రకారమే —''ఈ సంపాదకులంతా వెరసి దోషులుగా నిలువవలసి వస్తోంది. ఈ సంకలనం సంపాదక మండలిలో నేనూరిక పేరుకు పెద్దగా మాత్రమే ఉన్నాను. రచనలను ఏరుకునే పనంతా యువకవి మిత్రుడు డా. నాగినేని భాస్కరరావు చేశారు. స్పష్టత, సౌలభ్యం క్లిష్టాన్వయ దోష పరిహరణకోసం నేను ఒకటో అరో ఆయన యిచ్చినవి తీసివేసి కొత్తవి చేర్చాను. గాని మొత్తంమీదా ఎక్కువభాగం ఆయన ఏరినవే!'' అని కుందుర్తి రెండోపేరా చివర ఒక సంజాయిషీ ఇచ్చుకొన్నాడు. ఈ సంజాయిషీవల్లకూడా పాప పరిహరణం కాదు. కారణ మేమంటే, ఈ డాక్టర్‌గారెవరో సాహితీ లోకానికి తెలిసినవారుకాదు. ఇందులో పాల్గొన్న కవులంతా కుందుర్తి మొగంచూసి మాత్రమే అనుమతించారు. ఒకడు సాహితీలోకానికి తెలియని వాడైనంత మాత్రాన కవితాభిరుచి-సౌభాగ్యానికి విదూరుడని చెప్పడం నా అభిమతంకాదు.

కాని ఒకడు గతంలో చేసిన పని నలుగురికీ తెలిసినందువల్లనే ఒకడి అభిరుచి గురించి నలుగురికీ అంచనా దొరుకుతుంది. ప్రచురించబోయే సంకలనపు నిమ్నోన్నతాల గురించి సోదర కవులూ, పాఠకులూ, బేరీజువేసుకోగలుగుతారు. అలాంటి వారందరికీ 'తరం తరం' తీవ్ర ఆశాభంగమే కలిగిస్తోందని చెప్పవలసి వచ్చినందుకే విచారం కలుగుతోంది.

3

అభ్యుదయ కవిత్వం 1940 లలో ప్రధానంగా మాత్రాఛ్ఛందస్సులనే స్వీకరించింది. కాని అభ్యుదయ కవిత్వం యావత్తూ ప్రక్రియా పరంగా మాత్రాఛంద బంధురమే అనడానికి వీలులేదు. 1930ల నుంచి ప్రచలితమవుతూ వచ్చిన ఆధునిక కవిత యావత్తూ మాత్రాఛంద, ముక్తఛంద ప్రక్రియలను ఓతప్రోతంగా సమాదరించింది. తదుపరి దశాబ్దికూడా అదే సంప్రదాయాన్ని ముందుకు తీసుకుపోయింది. కేవల వచన పద్యాలవంటి గమన సుభగతలేనివికూడా ప్రయుక్తమయ్యాయి. అభ్యుదయ సాహిత్యోద్యమంతో గత చతుర్దశాబ్దకాలంగా సన్నిహిత సంబంధం కలవారి కందరికీ యీ విషయం సంపూర్ణంగా తెలిసిందే. గాన వాహనం ద్వారా అభ్యుదయ కవితను సామాన్య ప్రజల శ్రవణాలకు తొందరగా చేరవేయ వచ్చుననే ప్రధానాశయంతోనే అభ్యుదయ కవితకూ మాత్రాచ్ఛంద స్వరూపానికీ అవిభాజ్యసంబంధం పెంపొందింది. సత్యమిదై ఉండగా — అభ్యుదయ సాహిత్యోద్యమం కుంటుపడ్డాకనే వచన కవిత్వోద్యమం ఉద్భవించిందని చెప్పడం చరిత్రకు వక్రభాష్యం చేయడమే కాగలదు. పైగా అలా

పుట్టిన స్వచ్ఛంద కవితా ప్రక్రియకు వీరిలో ఒకరే ఆచార్య పీఠం అధిష్ఠించగలవారున్నారని పదే పదే జరుగుతున్న ప్రచారంకూడా అసంగతమే !

వర్తమానకాల పరిస్థితులు నేటి కవిత్వంలో బాగా పెనవేసుకొని ఉంటాయి. అస్మదాదులం ఇది మంచిదే అనుకుంటున్నాం. కాదను కునేవారూ వర్తమాన కాలంలో ఉన్నారని తెలుసు. అన్నాడు కుందుర్తి. వర్తమానకాల పరిస్థితులు కవితాభివ్యక్తిలో పరిణత చేతోభూత సావేశప్రతి బింబాలుగానే నెలకొనాలి తప్ప—అపక్వ ముడి ఖనిజంగా రూపుదాల్చడం కవితకు గర్వకారణం కాదని నేటి అంతర్జాతీయ కవితారంగంలో ప్రఖ్యాత విమర్శకులంతా నిర్వివాదంగా తేల్చిన సత్యం ! సమకాలీన సామాజిక రాజకీయ వాస్తవికతను యథా మాత్రకంగా ప్రతిబింబించాల్సిన బాధ్యత కవితకు అక్కరలేదు. అదే కవిత బాధ్యత అనుకుంటే — ఇరవై సూత్రాలపై ప్రభుత్వ ప్రచార శాఖ ముద్రిస్తున్న కవితా స్వరూపం ధరించిన నాసిరకం రచనలవంటి వాటినే ఉత్తమ కవితలుగా పూజించే అధ్వాన్నస్థితి దాపురిస్తుంది. మరిగి ఆవిరిగా మారిన వాస్తవిక స్వరూపాన్నే కవితాఘనాఘనం స్వీకరిస్తుంది. ఈ సత్యాన్ని అధిక సంఖ్యాకులు గుర్తించకపోవడం వల్లనే, ఆధునిక కవితా స్వరూపంలో — అంధపరంపర వ్యాపిస్తోంది. అనుభవశాలురైన కుందుర్తివంటివారు అనుయాయుల అజ్ఞానాన్ని నిశ్శంకగా ఖండించకపోవడంవల్లకూడా ఈ దుష్ఫలితం సంభవి స్తోంది ...

ఎనిమిదో పేరాలో కుందుర్తి ఇలా అన్నాడు : "ఈ సంకలనంలో లేని ప్రసిద్ధులైన వచన కవులుకూడా ఉన్నారు. ఒకరిద్దరికి ఇందులో చేరడం ఇష్టంలేనందున వదలివేశాము. కొందరికి ఇష్టం ఉన్నా వంద సంఖ్యకు పరిమితం కావాలనుకుని వారినీ వదలవలసి వచ్చింది. నిజానికి సంఖ్యను అయిదారు వందలకు పెంచుకోగలిగితే..." మరింత చెత్తా చెదారమూ చేరివుండేది. దుమ్మూ దూగరా యిప్పటికే టన్ను బరువుకు చేరింది. అందుకు కారణాలను పైన ఉల్లేఖించిన వాక్యంలో కంఠోక్తిగా కాకపోయినా ధ్వని పూర్వకంగా వివరించాడు. ఇలాంటి వాటిని కారణాలనాలో, సాకులనాలో పాఠకులే తేల్చుకోవాలి. ఇందులో చేరడం ఇష్టంలేని వారి జోలి మనకేల ? మనమూ వది లేద్దాం ! కాని ఇష్టపడిన వారి కవితలేనా ఉత్తమమైన వాటినే ఎందుకు ఎన్నుకోలేకపోయారు ? ఈ ప్రశ్న ప్రశ్నగానే మిగిలి పోతుంది ...

అలాంటప్పుడు — "ఉన్నంతలో దీనిని సర్వ సమగ్రంగా చేయాలనే ప్రయత్నం..." చేసినట్లు కుందుర్తి ఎలా సంతృప్తి పడు తున్నాడో మనకు తెలియదు. "భూమిలోనుంచి ఆలస్యంగా బయటికి వచ్చినా బంగారం బంగారమే అని రుజువు..." చేసినందుకు కుందుర్తి స్వాభినందన తెలుపుకుంటున్నాడు. ఇంతకీ సమీక్షకునిగా నేను చెప్ప వలసివచ్చిన మాట ఏమిటంటే ఆలస్యంగా వచ్చినా, తొందరగా వచ్చినా ఇందులో బంగారం ఉన్నదనడంలో నేనూ ఏకీభవిస్తాను. కాని దుర దృష్టం ఏమంటే ఒకటన్ను ముడి ఖనిజంలో ఐదు గ్రాముల బంగా రమే లభ్యమైనందుకే విచారించాల్సివుంది. దీనికోసం ఎంత శ్రమా, ఎంత మదుపూ వెచ్చించవలసి వచ్చిందో ?

దీనికి స్థూలమైన కారణాలు వివరిస్తాను :

1. ప్రఖ్యాత కవుల రచన లెన్నుకొనేటప్పుడు ఉత్తమ ప్రతినిధులుగా నిలవకలిగే కవితలను ఎన్నుకోక పోవడం. ఉదాహరణ కుందుర్తి కవితనే ప్రథమతః స్వీకరించవచ్చు. 'స్వాభినందన' అనే కవితకు బదులు—'నగరంలో వాన' స్వీకృతమై ఉంటే సహృదయుడు కళ్ళకద్దుకుని ఉండేవాడు. స్వాభినందన అతని ఉత్తమ రచనలలో నేను చేర్చక పోవడానికిగల కారణాలు తర్వాత వివరిస్తాను.

మరో ప్రఖ్యాతకవి శ్రీ కె. వి. రమణారెడ్డి గొప్ప వచన కవితలను ఎన్నింటినో 'భారతి'లో ప్రచురించాడు. అందులో 'గవేషణ' అనేది సర్వోత్తమమైనది. అట్టి ఉత్తమ రచననుగాక ఒక అల్పిష్ఠ రచనను రమణారెడ్డి కవితాకృషికి ప్రతినిధిగా నిలపడం అతనిపట్ల సంకలన కర్తలాచరించిన అపరాధమే ! ఈ కవితలో ఎవరో ఒక కవిని గురించిన అధిక్షేపం శ్లేషార్థదోష భూయిష్ఠంగా; అందలి ధ్వని రచయితకే స్పష్టంకాని రీతిగా కంగాళీ అయింది

అట్లే ఈవ్యాసకర్త 1956 ప్రాంతంలో 'మేఘరంజని' అనే ఒక సంపూర్ణ కావ్యం రచించాడు. 63లో గ్రంథంగా ప్రచురిత మైంది. అది ఆరు ప్రకరణాల దీర్ఘకావ్యం. ఆ కావ్యంలోని మొదటి ప్రకరణంలో 49 పంక్తులను అటు తలా, ఇటు కాళ్ళూ తెగనరికి ఒట్టి మొండాన్ని ప్రదర్శించడం జరిగింది సంకలనంలో. దీనివల్ల ఈ కవి ఆధ్యాత్మిక వాదిఅనే అవగాహన కలిగించే అవకాశంఉంది. ఇంతకన్నా చెప్పుకోతగ్గ కవిత్వమేదీ ఇతనిది లేదు— అన్న పిరికి ప్రదర్శనగాతప్ప దీనికి వేరే ప్రయోజనమేమిటో సంకలనకర్తలే చెప్పాలి.

2. సాంకేతికంగాకూడా ఎంతో దోష భూయిష్ఠంగా ఉన్నదీ సంకలనం. కవులపేర్ల అకారాదిగా పట్టిక రూపొందించడమే ప్రథమతః దోషం. ఒక కవి పరిణతికి అతను పుట్టిన కాలమూ, చేసిన కృషి నికషం కాగలదు కాని అతని నామాక్షరాలు కావుకదా ! పోనీ అలా అకారాది పట్టికలోనైనా ఒక క్రమంలేదు. కొందరిని కలం పేరునుబట్టీ, కొందరి ఇంటిపేర్లనుబట్టీ, కొందరి వ్యక్తి నామాలను బట్టీ ఎక్కడ ఏది ఎలా అవసరమనుకుంటే అలా కూర్చుకుంటూ పోయారు. దీనివల్ల ఈ యుగానికి మేరు సమానులైన కవులు చిట్ట చివరికి పోయారు. కొత్తగా మీసాలు మొలిచిన అర్భకులు కొందరు ముందుకువచ్చి కూర్చున్నారు.

3. వరలక్ష్మి ప్రెస్ అధినేత స్వయంగా కవి. ఈ సంకలన కర్తలలో ఒకరూను. ఐనా ముద్రణాస్ఖాలిత్యాలు కోకొల్లలు ! ఒక కవితలో వాక్యాంతంలో 'శలాలు' అని ముద్రింపబడింది. అది శల్యాలో, శకలాలో తేలక పాఠకుడు సాగర మథనం చేయవలసిందే !

నామాక్షరక్రమాన్నింటి కాక జనన కాలానుసారంగా కవితా సంకలనాలు రూపొందించడం నేడు సర్వే సర్వత్రా ప్రపంచ సాహిత్యమంతటా కనిపిస్తుంది. ఇదే సరైన పద్ధతిగా పేర్కొంటూ శ్రీ శివశంకరస్వామి 'మహోదయం'లో ఎన్నో ఉపపత్తులు పేర్కొన్నారు. అన్ని యుగాల కవితలకూ ఉత్తమ ప్రాతినిధ్యం కల్పిస్తూ పెంగ్విన్ సంస్థ ఎన్నో ఉత్తమ కవితా సంకలనాలను ప్రచురించింది. 'కాన్టెంపరరీ వెర్సు' అనే గొప్ప కవితా సంకలనం ప్రచురిస్తూ సంకలనకర్త కెన్నెత్ ఎల్మాట్-1918-48 సంవత్సరాలమధ్య మూడు దశాబ్దాలలో కవితలు రచించిన 61 మంది కవుల కవితా సర్వస్వంనుంచి తాను ఉత్తమమైనవని భావించిన రచనలను స్వీకరించానని సాధికారంగా చెప్పాడు. ఆ సంకలనం మనం చదివి అనుత్తమ కవితను ఎన్నిక చేయడమే సాధ్యంకాదు. కవితా సంకలనంలో స్వీకృతం కావలసిన కవితకు కనీసం పదేళ్లయినా ఆయుర్దాయం ఉండటం మంచిదని విజ్ఞులు చెబుతారు.

The sorting out process of time has operated more on the twenties than the thirties and more on the thirties than the forties, so that I have been less and less selective as I approached the present.

అని కెన్నెత్ ఎల్మాట్ అంటాడు. అలాంటి నైశిత్యం సంకలనకర్తకుండాలి. కాలవాహినిలో ఎదురీది వచ్చిన కవితలనే ఎన్నుకోవాలి. ఈ విషయంలో స్వర్గీయ ముద్దుకృష్ణ గొప్ప ఒరవడి పెట్టారు. ఆ ఒరవడిలోనే కల్పన, ఉదయ ఘంటలు, అడుగుజాడలు వంటివి నడచి ఉత్తమ ప్రతినిధులుగా నిలవగలిగాయి. పుబ్బలో పుట్టి మఖలో అస్తమించే కవితాస్వరూపంగల అంబేద రచనలను తలకెత్తుకోవలసిన దుర్గతికి సంకలనకర్తలు దిగజారకూడదు. తరంతరంలో ఆ దోషం స్పష్టంగా దర్శనమిస్తోంది.

ఇతరేతర సాహిత్య ప్రక్రియలలో లబ్ధ ప్రతిష్ఠులైనవారు ముక్తచ్ఛంద కవితా రచనకూడా ఒక హేలగా స్వీకరించి, మంచి పంటలు పండిస్తే - అలాంటివారికి అలాంటి సంకలనంలో ప్రవేశం లేకుండా దేవిడీమన్నా చెప్పడంలో ఔచిత్యమేమీ నాకు కనిపించదు. ఉదాహరణకు సర్వశ్రీ వానమామలై వరదాచార్యులు, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, జంధ్యాల పాపయ్యశాస్త్రి, పిలకా గణపతిశాస్త్రి, రావు గంగాధర రామారావు (పిఠాపురం యువరాజా) ప్రభృతులను విస్మరించడం-తరంతరం అని పేరు పెట్టుకొన్న సంకలనానికి బొత్తిగా వివేకంకాదు.

ఏమైనా మనతరంలో ప్రచురించే కవితా సంకలనాలు మన అసంస్కార పూరిత హృదయాన్ని ప్రదర్శించేవిగా ఉండకూడదు. మన సంస్కృత రుచి శుద్ధతనూ, (Refined Sensibility)అధు

నిక భావచేతనా బద్ధతనూ ప్రదర్శించేదిగా ఉండాలి. ఆ పరమ బాధ్యతను ఎంతవరకూ తరంతరం-విజయవంతంగా నిర్వహించిందో, అనే ప్రశ్న చర్చనీయాంశంగానే మిగిలిపోతుంది.

4

ముందు పేర్కొన్న శ్రీ కుందుర్తి స్వాభినందన అనే కవిత ధ్వనిప్రాయంగా కూడా కాకుండా, శుద్ధవాచ్యంగా స్వోత్కర్షగా రూపొందింది వచన కవితా భాగీరథత్వం తానూ నిర్వహించినందుకు తానుగా స్వాభినందన చేసుకుంటున్నానన్న ధోరణి ప్రదర్శించాడు కవి. "సాహిత్య సరస్వతీ ప్రతిమకు ప్రాణప్రతిష్ఠ చేసి నవ్యుల హృదయ వేదికలమీద నాట్యంచేయించినందుకు" తన్ను తాను అభినందించు కుంటానని ఈ కవి కంఠోక్తిగా వెల్లడించడం ఉత్తమాభిరుచికాదు. ఆ అభినందన అస్మదాదులద్వారా జరగవలసింది. ఒక పక్క ఈ తరం తరానికి ప్రధాన సంపాదక బాధ్యత నిర్వహిస్తున్న కుందుర్తి ఈ కవితనే ఈ సంకలనానికి లగించడంలో ఔచిత్యం లేకపోయినా ఒక చమత్కారం ఉంది.

తరంనుంచి తరానికి అవిచ్ఛిన్నకవితాధారగా ప్రవహిస్తున్న ముక్తచ్ఛంద స్వరూపానికి తానే అధినాథుడనని చెప్పకుండా అభివ్యక్తం చేయడం చమత్కారంకాదా? ఈ స్వాభినందనను ఈ కవితా స్వరూపంలోనే గాక-వ్యాససంచయంలోకూడా శ్రీ కుందుర్తి అనేకపర్యాయాలు సల్పుకున్నాడు.

1930లకు పూర్వమే తెలుగులో వచన కవితా స్వరూపం ఏర్పడింది. అడవి బాపిరాజు, ముద్దుకృష్ణగార్లు, 'జ్వాల' పత్రికలోనే ఈ ప్రయోగాలు ప్రచురించారు ఎందరో అనుజన్ములైన కవుల ప్రయోగశాలితవల్ల పెంపుత విర్చుకుంటూ వచ్చింది. ఇది మన భాషకు సంబంధించినంతవరకూ చారిత్రకమైన తొలి ఘడియ!

గత శతాబ్ది పొడుగునా, అంతర్జాతీయ కవితారంగంలో-దేశదేశాల మహాకవులెందరో ఎన్నో అమూల్య పరిశోధనలు జరిపి ఈ అపూర్వమూ, ఓ జస్యంతమూ అగు కవితా ప్రక్రియను సాధించారు. 'వెర్స్ లిబ్‌ర్' అనే ఫ్రెంచి పదానికిగాని, దానికి సమానార్థకమైన ఫ్రీవెర్సు అనే ఆంగ్లపదానికిగాని వెర్సు నిర్మాణంలో స్వేచ్ఛను సాధించడమనే అర్థాన్ని ప్రోక్తం చేశారా మహనీయులంతా! నడుములు విరిచిన వచనపు తుంటలను నిలువుగా పేర్చడమనే దురర్థాన్ని వారుద్దేశించలేదు

షెటోబ్రియా అనే ఫ్రెంచి రచయిత నూరేళ్ళ క్రితం రాసుకొన్న స్వీయచరిత్రాత్మకగ్రంథం శుద్ధవచనంలో రాయబడ్డదే అయినా కవిత్వావసర ఓజస్సౌందర్యాన్ని పుష్కలంగా సమకూర్చుకుంది. దీనిని చదివిన ఫ్రెంచి మహాకవి బోదలేర్‌కు దీనిని కావ్యం అని ఎందుకు పిలవకూడదు అనే ప్రశ్న ఉదయించింది. కవితకు ప్రధానమైనది ఆత్మభూతమైన పదార్థమా, లేక భౌతికపరమైన ఛందస్సౌందర్యమా అనే ఆలోచన కలిగింది. కావ్యాత్మను నిసర్గ సుందరంగా ఆవిష్కరించేందుకు అడ్డుగా నిలిచే ఛందస్సును ఎందుకు తొలగించరాదని ప్రశ్నించుకున్నాడు. ఈ ప్రాథమిక ప్రశ్నలే అతనిలో నూత్న కవితావతారానికి దోహదం చేశాయి వెర్సు లిబ్‌ర్ అనే ప్రక్రియకు అగ్రేసరుడయ్యాడు. ఐతే బోదలేర్ రచించిన వచన పద్యాల్నీ మొత్తం ఇరవైఐదు మాత్రమే. అవే మకుటాయమానమయ్యాయి. గూవత్తు ప్రపంచ కవితా రీతినీ తారుమారు చేయగలిగాయి అమెరికన్ జాతీయ కవి వాల్ట్ విట్మన్ ఈ సంవిధానాన్ని స్వీకరించి పెంపు చేకూర్చాడు. తర్వాత ఇంగ్లండులో ఈ శతాబ్దపు రెండో దశాబ్ది ఆరంభంనాటికి ఇంగ్లండులో ఈ కవితా స్వరూపం నిలదొక్కుకో గలిగింది ఇంగ్లీషుద్వారా మన దేశానికి ఈ ప్రక్రియ ప్రవహించి గవీంద్రుని వంటివారికి బలం చేకూర్చడంవల్లనే వంగభాషలో మాత్రా ఛందస్సులలో రచించిన గీతాలను ఆంగ్లంలోని కనువదిస్తున్నపుడు ముక్తఛందప్రక్రియను స్వీకరించే ఆత్మస్థైర్యం కలిగింది. యాతావతా ఈ శతాబ్దపు మూడవ దశాబ్దిలో మన భాషలోనికి ఈ ప్రక్రియ వచ్చి చేరింది. స్థూలంగా ఇంత చరిత్రగల ఫ్రీవెర్సుకు ఎవడో ఒకడే తాను అద్యుడనని చెప్పుకొని స్వాభినందన చేసుకోబోతే చరిత్ర వెక్కిరించక విడువదు. అద్యతన మానవచరిత్ర సమష్టి నాయకతాన్ని తప్ప-వ్యష్టి దాక్షిణ్యాన్ని సుతరామూ అంగీకరించదు!

అక్షర క్రమంలో ప్రచురించ సమకట్టిన పతీకవితా సంకలనం లోనూ ప్రథమస్థానంలో కనిపించే కవి అజంతా. ఇతను రాసిన కవితలన్నీ కలిపి ఏ పది పన్నెండో కన్న మించవు. ద్రవ్యాత్మకంగాకన్న గుణాత్మకంగా అతని కవితలు మిన్నలే! ఇంతవరకూ వచ్చిన ఆధునిక కవితా సంకలనాలన్నీ ఆ కవితలనే ఆద్యస్థానంలో ప్రచురించుకొంటున్నాయి. అసలు అల్పసంఖ్యాక కవితలను మాత్రమే రచించిన కవులకు కవితా సంకలనాలు గొప్ప వరప్రసాదాలు. వనభోజనపు చాపకూడులో సముచితస్థానం వారికి లభిస్తూనే ఉంటుంది. సంకలనం అనేది వచ్చేసరికి, కవులందరూ తరతమభేదాలు లేకుండా సమాన హోదానే పొందుతారు.

తరం తరంలోని అజంతా కవిత పరిత్యాగి పరివేదన. ఇదివరకే కొన్ని సంకలనాలలో ప్రచురితమైంది. ఐనా ఇందులోనూ ప్రథమ దర్శన మిచ్చింది కవి తన స్వాత్మక పరిదేవనలను యథాలాపంగా లేఖా రూపంగా చెప్పుకుంటూ పోతాడు. తాను పరిత్యాగినన్న ఆత్మోపశమనం పొందుతాడు. 'రాత్రివేళ స్వప్న కన్యలను భూస్థాపితం చేయడం ఇటీవలి తన కార్యక్రమం...తన అడుగు జాడ ఏ సారవంతమైన ఏ శ్మశానం మీద పడుతుందో నిర్ధారణగా చెప్పలేడు.' శ్మశానాలు సారవంతం అనడంలోనె ఒక చమత్కారమూ, మృత్యుభీతీ, నిరాశావృత కర్మణ్యత్వమూ ద్యోతకమవుతాయి. తల్లితండ్రుల ఆశను మొక్కగా ఉన్నపుడే తాను వంచేశాననడం ఒక గొప్ప వక్రోక్తి. మొక్కగా ఉన్నపుడు వంచకపోతే మానయ్యాక ఒంగుతుందా అని పిల్లల విషయంలో పెద్దలు చెప్పే సామెత. దాన్ని ఈ కవి తిరగేసి తల్లి తండ్రుల పరంగా వాడి గొప్ప వక్రోక్తి సాధించాడు తన చిన్నతనంలో తల్లి తండ్రులు తనపై ఆశలు పెంచుకోనారంభించారు. ఆ ఆశ మాను కడితే ఒంగదని తనకు తెలుసు. కనకనే దాన్ని మొక్కగా ఉన్నపుడే వంచేశానంటాడు.

రెండోస్థానం లభించిన అద్దేపల్లి రామమోహనరావు కవిత

'జీవజ్వాల'. మేధాహృదయ భావన నిరాశాపథంలో ప్రారంభమై ఆశాలోకాలకు తన చూపుడు వేళ్లను ఎత్తడం ఈ కవితలోని చమత్కారం. "అరణ్యాలమధ్య గర్జించిన పురాతన కిరాతుడు వర్తమాన హృదయంలో నిలబడి అరుస్తుండడం" వినిపిస్తుంది. "సూర్యుని పేగు నుండి విడిన భూమి తొలినాటి అగ్నిఘోషల్నే ఆవరిస్తూండటం' కనిపిస్తుంది. కవిగుండె వెనుక మోగే జాలిపాటలో తన కవితను అనుశ్రుతించి కోట్ల సోదర జనాల గుండెల్ని స్పందించగలనా — అనే ఆశావహసంశయంతో ఈ కవిత ముగుస్తుంది.

తరువాతి కవిత శ్రీ అనిసెట్టి 'పృథ్వీసంగీతం'. ఇది ముప్ఫయ్యేళ్ల క్రిందటి రచనే; అయినా నేటికీ వన్నెవాసి కోల్పోక మెరుస్తూనేఉంది. ఊహతెగిన ఏ లోకంనుంచో ఉవ్విళ్లూరుతూ ఈ లోకంలోకి వచ్చాడు మానవుడు. కాని అతని కాలిక్రింద నోరు తెరచిన మృత్యువు కోరలు సదా దర్శన మిస్తున్నాయి. స్మృతి ప్రవాహంలో గెడవేసుకుంటూ సడవ వడచి వచ్చిన దారి కలసిపోగా, మరచినట్లు తను వచ్చిన దారికూడా మరచాడు. తానా పసుపు తెలుపు లోహాల పట్ల పేరాశలు లేనివాడు. తాను పూరించిన శంఖం ఫక్కున వవ్వి బ్రద్దలైపోయింది. నాదమూర్తి విస్మృతిలో రోదించింది. ఇలా భావన కొవలు సాగిన అనిసెట్టి కవితలో ఆత్మీయతా ముద్ర, మెత్తని ఆలింగనంలాంటి సౌకుమార్య స్పందనా అడుగడుగునా దర్శనమిచ్చి అతని కవితా వ్యక్తికి కవిత ఉజ్వల ప్రతినిధిగా నిలువగలుగుతోంది.

'అతన్ని గురించి కథలుతేవు' అనే అరిపిరాల విశ్వంగారి కవితలో అజంతా ఊపిరి చెరగని ముద్రగా అనుస్యూతం ప్రతిధ్వనిస్తుంది. రచయిత సంతకం లేకపోతే ఈ కవిత ఎవరిదో పోల్చుకోవడం కష్టమే మరి. "కాలం కన్న అతణ్ణి లోకం తిన్నది. చరిత్రను సృష్టించిన వాడికి చరిత్రలో చోటులేదు. గెలిచినవాడి గొప్ప తప్ప చరిత్రకు నిర్వచనం ఏమిటి?" అంటూ మన ఆలోచనలను పరివరి విధాల ప్రసరింపచేస్తుంది. కవి గురి దేనిపై కేంద్రీకృతమైందో అంతు చిక్కదు. ఒక్కోసారి బాపూజీనికూడా స్పృశిస్తుంది. 'మీరు సహించలేని అతని పేరు సత్యం!' అని ముగిసినపుడు ఈ స్ఫూహ కలుగుతుంది. చెప్పదలుచుకొన్నది నర్మగర్భంగా గుప్తం చేయడంలో కవశీల్పం ఆత్మ సంకేతాలనూ, వపుష్యార్థాలను స్వావలంబనం చేసుకొన్నట్లు ద్యోతకమవుతుంది.

'కత్తెరలో కంఠం' అనే కవితలో స్వర్గీయ అవసరాల సూర్యారావు మెత్తగా కరుణాత్మకంగా తన అమర కంఠాన్ని వినిపించాడు. 'ఇవట సెలయేరులు గళమెత్తి పల్లవులు పాడతాయి. అచట కలిల అలల ఉద్యమం లేస్తుంది. మొత్తంమీద బ్రతుకే మోయలేని బరువులు దింపుకుంటుంది. ప్రతిక్షణంటి పిదప మనయింటి గడప పూయవే పసుపు' అన్న వాక్యంలో అన్ని ఇళ్లకూ శుభం పూశాకనే మనయింటికీ శుభం మెరుస్తుందన్న ఉదాత్త భావన మెరుస్తుంది. 'ఏ వాకిలి లేదా కవి!' అనడం మరింత హృద్యమైన కవితోక్తి. ఇందులో వ్యాకర్తల పంతానికి కత్తెర లేకపోలేదు. వ్యాకర్తల సుడిగుండాలకు కవిత్వ పరిధి అందదు. ఇది కల్పనలో ప్రచురితమైనదే! అయినా మరోసారి—

"అందరూ మన బాట! అందరూ మనపాట. ముందుకేముకిక్తే!" అనే ఆశా మహోజ్వల కాంతిరేఖలతో సామాన్యుని భావనాలోకాన్ని ముందుకు నడిపించే గొప్ప కవిత!

ప్రతి పద చిత్రం వెనుకా బోలెడు కథా, కమామీషూ సాంద్రతరంగా దట్టించబడిన కవిత—ఆరుద్ర – గుమాస్తా ప్రేమ గీతం. ప్రతిపాదానికీ వ్యాఖ్యానం రాసుకోవలసిన గొప్ప కవిత. ఇందులో వాస్తవికతా, అధివాస్తవికతా, అస్తిత్వవాద భావనా చిత్రాలు రమ్యంగా సమ్మేళనం పొందాయి. ఒక గుమస్తా ప్రేమకలాపంలాగే ఈ కవిత దర్శనమిస్తుంది. మధ్యతరగతి మేధావికి నిత్యం అందీ అందక జారిపోయే సకల జ్ఞానాంశాలూ పదచిత్రాలుగా ఉపయుక్తమయ్యాయి. ఐతే క్లుప్తంగా — బీజాక్షరమాలలో పొదగబడిన కవిత ఇది. "పాబ్లోపికాసో గుయిర్నికా బొమ్మలోమాదిరి సూర్యబింబాన్ని బ్రెడూం లేంపుతో వెలిగిద్దాం!" వంటి వాక్యాలకు సుదీర్ఘ వ్యాఖ్యానం సంతరించుకుంటేతప్ప అనుభూతి పారమ్యత సామాన్యుని కందదు. కాని నూరుగురు కవితల కోలాహల బృందగానంలో రమణీయార్థ ప్రతిపాదక శబ్దాల ఘలం ఘలలు ఏవరు వినిపించుకోగలరు?

స్వచ్ఛంద కవితఅంటే కవితకు సంపూర్ణ స్వేచ్ఛనిచ్చి వదలివేసి, వచనపు తుంటలను పేర్చడంగా అపార్థం చేసుకోబడుతున్న వర్తమానానికి ఒకరు పటకుటీరాన్ని నిర్మించినా, వేరొకరు ఋతుచేతన సంతరించినా—గుండెపట్టుకునే ఒక్క ఉక్తి శకలమైనా మిగలదు! నేటి అసంఖ్యాక యువకవులలో ఆబాపిపాసా సర్వత్రా ద్యోతకమవుతున్నాయేతప్ప కవితాశక్తిని పెంపొందించుకునే సాధనాబలం వ్యక్తం కావడంలేదు. తెలుగు కవిత్వానికి అభ్యుదయ భావధార చేకూరిందిలగాయతు ప్రతి అరిపేద నాశిరకం కవీ — తానొక గొప్ప ప్రవక్త కాబోలుననుకొని, లోకపు అన్యాయాలపై విలుగెత్తుతాడేగాని, అనుభవపూర్వకంగా అనుభూతిని పలవరించడం నేర్చుకోలేకపోతున్నాడు. ప్రభుసమ్మిత ఉపదేశ కర్మకాండ కొంత మరుగుపడితే తప్ప మన కవిత్వానికి మంచి రోజులు రావేరవు!

సాయం సంధ్యా సమయపు మసగ మసగలను కాక ఉదయ సంధ్యాకాంతుల ప్రవర్తతను ప్రదర్శించటంటే 'తరం తరం' కవితా సంకలనంగా సార్థక్యం పొంది ఉండేది. ఏ అంశమైనా ఊహల పొలిమేరలనుంచి దిగి వాస్తవరూపం పొందేసరికి వికృతంగా రూపొంది ఆశాభంగం కలిగించడం వర్తమానకాలానికి తీరనిశాపంలా కనిపిస్తోంది.

* ఏమైనా తరం తరం కవితాప్రియులంతా చదివి ఉత్తమ కవితలను ఏరుకోవడం ఎంతైనా అవసరం. అందుకై ఫీవెర్ను ఫంటు – హైదరాబాద్–36 అనే చిరునామాకు పదిరూపాయలు పంపి ఈ పుస్తకానికి స్వంతదారులు కావడం వాంఛనీయం!

"ముంచుకొచ్చే మార్పు తెరలు విప్పిచూపిన వారికి" హృదయపూర్వకంగా స్వాగతం పలుకుదాం.

— శ్రీ సోమసుందర్.

"ప్రకృతిని గుప్పిట్లో పట్టుకొచ్చి..."

శ్రీ రామాచంద్రమౌళి

రైలు ఎక్కాలనుకున్నప్పుడు టికెట్టు తీసుకోవాలి
కాని—గమ్యం లేని నేను ఎక్కడికెళ్ళాలి
ఆశకు నైసర్గిక స్వరూపం లేకుంటే,
మనసుకు ఆకారం లేకుంటే,
స్పందన ఎగిరే పక్షులు
అనుభూతి రాలిన చుక్కలా—ఎక్కడికి కూలిపోతావు
ఉల్లిపాయను విప్పి పొరలు ఒలిచినా
గర్భం కనబడ్డం లేదు
ఆత్మాంతర్ముఖంగా లోపలికి చొచ్చుకుపోయి
టార్చిలైటువేస్తే
బిందువులు నదులై
నదులు సముద్రాలై—ఏమిటో గ్రహాలు మాట్లాడుతున్నాయి
నా లోపలినుండి ప్రవాహాలు పక్షుల్లా ఎగిరి
ప్రకృతిని గుప్పెట్లో పట్టుకొచ్చి
నా హృదయపు చపతంతో పిండుతున్నాయి
ఫ్రాయిడ్, ఆడ్లర్ చెప్పిన సిద్ధాంతాల భిన్నిస్తున్నాయి
మేక పాలనలో పెరిగిన పులి మేకవుతుందా—
ప్చ్ —
మళ్ళీ ఎక్కడికి ... పాతాళంలోకి,
పునఃసింహావలోకనంలోకి దిగజారిపోవాలి,
యిప్పుడంత ఓపిక లేదు
"సంభవామి యుగే యుగే..." అన్నట్టు ఎవని కర్మనో...ఎవడో బాగుచేస్తాడా... ?
పాతరాతినాటి రాళ్ళను భూతద్దం క్రింద విశ్లేషిస్తే
ఆ రాళ్ళలో
యిప్పటి మనుషుల మనసులు కనిపిస్తున్నాయి నాకు !
ఎందుకు— ?
యీ ప్రశ్న ఆకాశంలోకి నేను ఊస్తున్నది
శూన్యంలోనుండి జవాబు కురవాలి నాపై ...ఎప్పుడు
నిరీక్షణ—బలహీనతకు బ్రదర్ అని నేను యిదివరలో ఎప్పుడో అనుకున్నట్టు గుర్తు
నిరీక్షణలో నువ్వున్నంతకాలం ప్రపంచం నిన్ను బనాయిస్తుంది
కళ్ళతో "ఉటోపియా"లను నములుతున్నంతకాలం
నువ్వు "ఫూల్"వన్న బిరుదును మోయక తప్పదు

యింకెన్నాళ్ళు బిరుదుల కాడిని మోస్తావు —
సమ్మోహాల్లో శూలువాలతో ఎందరినో సమాధి చేసిన చరిత్రలు నాకు తెలుసు
క న్ నువ్వే మొన్నటి చాణిక్యునికీ,
ఆనాటి అపర ఆదిశక్తికీ,
యివ్వాల్టి సెంట్రల్ జైలులోని దొంగకూ వారసుడివి
చౌరాస్తాలో నిలబడి దిక్కులుచూస్తే నిన్ను చాలాన్' చేస్తారు
ఎటో ఓ దిక్కు పరుగెత్తు —
పుస్తకాలను వడబోసి పిండుకుంటే
నీకు విజ్ఞానం దొరుకుతుందిగాని—యింగితం దొరకదు
మనిషికి మనిషి లక్షణాన్ని యీ గాలి...యీ నేల...యీ పూలు నేర్పుతాయి—
కొన్ని అంతే

అనుభవించరాదు...ఆనందించగలుగుతావు
కాంతిని తాగుతావా, స్నానం చేస్తావా
ఒట్టిగా కనుపాపల్లో దాచుకుని కలలను సృష్టించుకుంటావు
ఐనా—నువ్విప్పుడు కొత్తగా హీరోవికావు
నీకంటే ముందు ఎందరో హీరోలు హీరోయిన్లతోసహా గతించిపోయారు
నీ తర్వాతకూడా యింకా వస్తారు హీరోలు
కాని—విలన్‌లు లేకుండా ఉండాలనే నేను యిదంతా చెప్పడం
యింతకూ యిదంతా ఏమిటీ...యింటీరియర్ మోనాలాగ్‌లా
నల్లమందును తింటూ ఎవడో గొప్ప సాహిత్యాన్ని సృష్టించాడని విన్నాను
ఐనా- చదివేవాడికో... రాసేవాడికో ఏదో ఓ మత్తు ఉంటేనే మాత్రం
ఉమర్ ఖయ్యాం వివరోకాదు—మన బంధువే
ఔ ! యీ అన్ని దేశాల నాయకులందరూ కలిపి
ప్రపంచమంతా మనది....,
యీ దేశాలకు, మనుషులకు పేర్లు, మతాలు, కులాలు విందుకు" అని ప్రపోజ్ చేయరేం]
అందుకే నాకు స్వర్గం సూర్యునికన్నా ప్రకాశవంతంగా కనిపిస్తూంటుంది
కాలిన సిగరెట్లు గురించి ఆలోచించేవాడు సైంటిస్ట్ కాదు ఎన్నడూ
చచ్చిపోయిన ఔరంగజేబు బొందపై వ్యాసంరాయి డాక్టర్ నౌతావు
పగిలిన అద్దాలూ,
నలిగిన పువ్వులూ,
మూగవోయిన మువ్వలూ—గుడిలో పగిలిన విగ్రహాల్లాంటివి
లంచం తీసుకుని ఎవడో పూజారి దీపం వెలిగించవచ్చు వాటి ముందర
కాని—నిజం మాత్రం పగిలిన అద్దం పగిలినదనేదే.
మనం ఆకాశమెత్తు నిదిగి
పుస్తకంలో పేజీలుంటాయని చెప్పినట్లు,
గాలిలో ఆక్సిజన్, హైడ్రోజన్ etc., ... ఉన్నాయన్నాంగాని
గాలిని మళ్ళీ తయారుచేయగలిగామా

(మిగతా 40 వ పేజీలో)

తెలుగులో కవిత చెప్పిన తమిళుడు
తి. సు. మురుగేశం పిళ్లై

శ్రీ చల్లా రాధాకృష్ణశర్మ

"ఈ వయస్సులో ఎందుకు చేరినట్లు మీరీ ట్రెయినింగు కోర్సులో? సైకాలజీ, ఎలిమెంటరీ సైన్సు యివన్నీ మీ కెందుకు?" అని ఒక యాభైయేళ్ల వ్యక్తిని యువకుడైన వైస్ ప్రిన్సిపాల్ అడిగాడు.

అందుకు ఆయన యేమీ మాట్లాడలేదు.

అయితే, ఆ తర్వాత అయిదురోజులు ఆ తరగతిలోని పన్నెండుమంది విద్యార్థులూ తరగతులకు హాజరు కాలేదు.

1924లో చిదంబరంలోని శ్రీ మీనాక్షి ఓరియంటల్ ట్రెయినింగు కాలేజీలో జరిగిన సంఘటన యిది. కళాశాలాధ్యక్షులైన కృష్ణమూర్తిశాస్త్రిగారికీ, తదితరులకూ ఈ విషయం తెలిసింది. చివరికి అణ్ణామలై విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులదాకా ఇది పాకి పోయింది. అందరూ ఆశ్చర్యపోయారు.

ఆ సంవత్సరమే తమిళ పండితులకు ట్రెయినింగుకోర్సు అంటూ ఒకటి పెట్టారు. అంతకుముందు అది లేదు. ఆ సంవత్సరమే మీనాక్షి ప్రాచ్య శిక్షణా కళాశాల చిదంబరంలో వెలిసింది. కళాశాల వెలిసిన మొదటి సంవత్సరమే సమ్మె ప్రారంభం కావడం, అందులోనూ ప్రాచ్య పండితులు దానిని నిర్వహించడం అధికారులకు ఆశ్చర్యం కలిగించింది.

చివరికి వైస్ ప్రిన్సిపాలుచేత క్షమాపణ చెప్పించారు.

అంతే; యథాప్రకారం ఆయనా, ఆయన సహాధ్యాయులూ తరగతులకు హాజరయ్యారు. ఆ సంవత్సరం పరీక్షలు లేవు. శిక్షణ పూర్తి అయిన తర్వాత అందరూ కృతార్థులైనట్లు ప్రకటించారు.

ఇంతకూ ఆయన ఎవరో కాదు; తెలుగు తమిళ భాషలలో పండితుడని పేరుప్రఖ్యాతులు గడించిన తి. సు మురుగేశం పిళ్లైయే ఆయన. ద్రావిడాంధ్ర భాషల అన్యోన్య సంబంధమును తెలియజేసిన పండితుడూ, కంబ మహాకవి జీవితము త్రిశిర గిరీశ శతకము మొదలైనవాటి రచయితా శ్రీ మురుగేశంపిళ్లై. ట్రెయినింగ కోర్సులో చేరినప్పుడు ఆయన సుమారు యాభైయేళ్లవాడు! ఆ వయస్సులో ఉన్న పండితుణ్ణి వయస్సులో ఉన్న వైస్ ప్రిన్సిపాలు అపహాస్యం చేస్తూ మాట్లాడటమే ఆ సమ్మెకు మూలకారణం!

ఆయన సహాధ్యాయులలో ఒకరు బహుభాషా పండితులూ మదరాసు విశ్వవిద్యాలయంలో తమిళ భాషోపన్యాసకులూ అయిన శ్రీ వి. వెంకటరాజులురెడ్డిగారు. సుప్రసిద్ధ తమిళ పండితులూ వైద్య జ్యోతిషశాస్త్రాలలో నిష్ణాతులూ అయిన శ్రీ ఇ. ము. సుబ్రహ్మణ్యపిళ్లై మరొకరు.

మురుగేశంపిళ్లై, సుబ్రహ్మణ్యపిళ్లై వరుసకు మామా అల్లుళ్లు. 'మురుగేశంపిళ్లై నాకు గురువు వంటివాడు' అని సుబ్రహ్మణ్యపిళ్లై అన్నారు. ఆ రోజుల్లో వారికిచ్చిన ఉపకారవేతనం నెలకు పదిహేను రూపాయలు.

మురుగేశంపిళ్లై జన్మస్థలం తిరుచ్చిరాపల్లి (త్రిశిరపురం). తండ్రిపేరు సుబ్రహ్మణ్యపిళ్లై. కనుకనే ఆయన తి. సు. మురుగేశం పిళ్లై అయ్యాడు. ఆయన చదువు సందెలు తిరుచ్చిరాపలి లోనే సాగాయి. తర్వాత ఎట్టయాపురంలోని రాజావారి ఉన్నత పాఠశాలలో గుమాస్తాగా చేరారు. ఎట్టయాపురం పాలకులు ఆంధ్రద్రవిడ భాషా పోషకులు. వేంకటేశ్వరెట్టప్ప మహారాజాగారి ఆశ్రయం లభించిన తర్వాత, మురుగేశం పిళ్లై ఎట్టయాపురం సంస్థానంలో తెలుగు పండితుడుగా నియుక్తుడయ్యాడు. సుబ్బరామదీక్షితులు రచించిన సంగీత సంప్రదాయ ప్రదర్శినిలో ఆ మహారాజుని ప్రశంసిస్తూ మురుగేశంపిళ్లై చెప్పిన యీ కంద పద్యాలు పరిశీలించదగినవి.

"శ్రీ వేంకటేశరెట్ట
క్ష్మావరు డిల కార్తికేయ చరణద్వయ ప
ద్మావేశిత హృదయుడు దీ
నా వన పావన చరిత్రుడై విలసిల్లున్."

చంద్రకుంద మృగేంద్ర చందన చంద్రవిస్ఫురదీ సుధా
సాంద్రహార తుషార శంకరసామ్య కీర్తిధురంధరుం
డింద్రతుల్యుడు వేంకటేశ్వర యెట భూమి విభుండు ని
స్తంద్రగంధము లుద్వహించెడి సంతసంబున మండగన్."

తమిళ నవయుగ ప్రవక్త, అయిన మహాకవి సుబ్రహ్మణ్య భారతి కూడా ఈ మహారాజుని ప్రస్తుతించాడు. శ్రీ ఎట్టయపురం రాజరాజేంద్ర మహారాజా వెంకటేశ రెట్టప్ప భూపతి అవర్‌గళ్(గారి) సమూగత్తుక్కు (సముఖానికి)-అని సంబోధించాడు. 'తమిళనాడులో తమిళం తెలిసిన ప్రభువులేడన్న అపఖ్యాతి నీవు మకుటం ధరించిన తర్వాత తొలగిపోయింది-' అని పేర్కొన్నాడు. దక్షిణాపథాన్ని సుమారు మూడు శతాబ్దులపాటు తెలుగు నాయకరాజులు పరిపాలించడం, వారి తర్వాత వారి సామంతు లనదగిన పాళెగార్లు వివిధ ప్రదేశాలలో ప్రబలులు కావడం-ఈ విషయాలను భారతి మాటలు సూచిస్తున్నాయని చెప్పవచ్చు. వారందరూ తెలుగు భాషాపోషకులు.

ఆ తర్వాత, మురుగేశంపిళ్లై మధురా జిల్లాలోని పెరియ కుళం పట్టణంలో మునిసిపల్ హైస్కూలులో తమిళపండితుడుగా చేరారు. అప్పట్లో ఆ పురపాలక సంఘానికి వడగరై జమీందారు ఒకాయన అధ్యక్షుడుగా ఉండేవాడు. ఈ జమీందారీ తెలుగువారిది. కాగా, మురుగేశంపిళ్లై వడగరై సంస్థానంలో తెలుగు పండితుడుగా కూడా వ్యవహరించేవాడు.

మురుగేశంపిళ్లై నల్లగా, పొట్టిగా ఉండేవాడట. దృఢ గాత్రుడు. ఆరోగ్యవంతుడు. మెడలో రుద్రాక్షమాలలు; నుదుట విభూతి రేఖలు. పరమ శైవుడు. శివపూజా ధురంధరుడు. నాయన్మారులలో ప్రముఖుడైన మాణిక్యవాచకుడు వెలయించిన తిరువాచకమును ప్రతి నిత్యమూ భక్తి శ్రద్ధలతో చదివేవాడు. నియమనిష్ఠలన్నీ పూర్తి అయిన తర్వాతనే భోజనం చేసేవాడు. రోజూ భార్యాద్వితీయుడై గుడికి వెళ్లేవాడట. ఆయన మేనరికమే చేసుకున్నట్లూ, వారికి ఒక మగపిల్లవాడూ, ఇద్దరు ఆడపిల్లలూ కలిగినట్లూ తెలియవస్తున్నది.

తెలుగు, తమిళ భాషలలోనేకాక, జ్యోతిష శాస్త్రంలోకూడా మురుగేశం పిళ్లై అందెవేసినచేయి! నాట్య, సంగీతములలో సైతం ప్రావీణ్యం గడించాడు. ఆయన గుణగణాలలో ముఖ్యంగా పేర్కొనదగింది, ఆయన నిర్భయత్వం. ప్రతివిషయాన్ని మొగమోటము లేకుండా చెప్పేవాడు. లోపల ఒకటీ వెలుపల మరొకటీ మాట్లాడేవాడు కాదు. ఎవ్వరికీ హాని చెయ్యలేదు. శిష్యులంటే అమితమైన వాత్సల్యం ప్రదర్శించేవాడు. చివరికి మురుగేశంపిళ్లై పెరియ కుళంలోనే శివసాయుజ్యం చెందారు.

2

తమిళపండితుడైనా, మురుగేశంపిళ్లై తమిళంలో రచనలు చేసినట్లు తెలియడంలేదు. ఆయన చేసిన తెలుగు రచనలు ప్రకటితములు కావడంవల్ల, ఆయన్ని తెలుగు రచయితగా భావించడం ఏమాత్రమూ అసమంజసంకాదు.

శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు తమ దక్షిణదేశీయాంధ్ర వాఙ్మయములో (1960) మురుగేశంపిళ్లైని గురించి వ్రాస్తూ, 'తెనుగుభాషలోను, ద్రవిడ భాషలోను సమమాన పాండిత్యముగల విద్వాంసులలో తి. సు. మురుగేశము పిళ్లను మించినవారు లేరని చెప్పవచ్చును' అన్నారు. మురుగేశం పిళ్లై రచనలను కనుక పరిశీలిస్తే, యిది సత్య సంపూర్ణమైన ప్రశంస అని తోచకమానదు.

యశశ్శరీరులు జయంతి రామయ్య పంతులుగారి కృషి ఫలితంగా ఆంధ్ర సాహిత్య పరిషత్తు సప్తమ వార్షిక సభ తమిళ దేశాలంకారం అనదగిన మధురలో 1918, మే 11, 12 తేదీలలో మహావైభవంగా జరిగింది. ఆనెగొంది రాజాగారయిన శ్రీరంగదేవ రాయలు బహద్దరు వారు ఆ సభకు అధ్యక్షత వహించారు. తెలుగు భాషాభిమానులతో కిటకిటలాడిన ఆ మహా సభలో నుదురుపాటి వెంకన్న వంశీయుడూ విస్తృత తెలుగు గ్రంథాలు సేకరించిన ప్రముఖుడూ అయిన హరిసేతు రామయ్య, తంజనగరం తేవప్పెరుమాళయ్య, మురుగేశంపిళ్లై మొదలైన పండితులు అమూల్యమైన వ్యాసాలు చదివారు. మురుగేశంపిళ్లై 'ద్రావిడాంధ్ర భాషాన్యోన్య సంబంధము' అనే వ్యాసం చదివారు. ఇది ప్రశస్తమైన రచన అని వేరే చెప్పనవసరంలేదు. అప్పట్లో ఆయన ఎట్టయపురంలో తెలుగు పండితుడుగా ఉండేవాడు. ఈవ్యాసం ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రికలో ఆ తరవాత ప్రకటించబడింది. అచ్చులో 24 పుటల వ్యాసం. ఈ రచన మురుగేశంపిళ్లై పాండిత్యమును నలుగురికి తెలియజేసింది. సూర్యరాయాంధ్ర నిఘంటు సంపాదకులుగా ఉండిన జయంతి రామయ్య పంతులుగారు నిఘంటువునకు ద్రావిడ భాషా సజాతీయ పదములను సమీకరించుటకు మురుగేశం పిళ్లైని నియమించారనీ, ఆయన అతిశ్రద్ధతో 7,500 సజాతీయ పదములు సేకరించారనీ శ్రీ వేంకటరావుగారు పేర్కొన్నారు. భాషాతత్త్వ పరిశీలకులకు ఈ వ్యాసం అవశ్య పఠనీయం.

తమిళసాహిత్య సదనంలో మణిదీపిక వెలిగించిన కంబమహాకవి జీవితవృత్తాంతమును ప్రౌఢమైన వచనంలో మురుగేశంపిళ్లై వ్రాశారు. ఇదికూడా ఆంధ్రసాహిత్య పరిషత్పత్రికలోనే వెలువడింది. (12 వ సంపుటం) దీన్ని ఆధారం చేసుకుని శ్రీ దుగ్గిరాల భుజంగ శర్మగారు ప్రసన్న శారద (కంబమహాకవి) అనే చిన్న నవల ఒకటి వ్రాశారు (1954).

తమిళ కావ్య పంచకంలో ఒకటి అయిన సిలప్పదికార కావ్య కథను మురుగేశంపిళ్లై సంగ్రహంగా వ్రాశారు. ఇదికూడా ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రికలో ప్రచురితమయింది. (ప్రభవ సంవత్సరపు పత్రిక, 1927-28). దీని శీర్షిక నూపుర మహిమ లేక కన్నకి చరిత్రము.

త్రిశిర గిరీశా! అనే మకుటంతో మురుగేశంపిళ్లై ఒక కందపద్య శతకం వెలయించారు. (ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక, సంపుట 21, 15-24 పుటలు). మాతృభూతస్వామి త్రిశిర గిరీశుడు. ఆ దేవునిమీద చెప్పబడిన శతకమిది.

> 'పరమేశ్వర పద చింతా
> పరుఁడను గారాళ వంశభవుఁడను త్రిశిరః |
> పురి మురుగేశుఁడ ముక్తికిఁ
> దెరువుగ శతకం బొనర్తుఁ ద్రిశిర గిరీశా.'

అని ఆయన చెప్పుకున్నారు. తన గురువు వీరరాఘవార్యుడని పేర్కొన్నారు. ఈ శతకంలోని మరి 50 పద్యాలు అచ్చతెలుగులోనే సాగాయి. శతకం చివర అష్టవిధ కందం చేర్చబడింది. రాజా వేంకటేశ్వరెట్ట

మహేశుని ప్రశంసకూడా ఇందులో ఉన్నది.

మురుగేశంపిళ్ళై పండితుడేకాక కవి కూడా అనడానికి ఈ శతకం సాక్ష్యమిస్తున్నది. చక్కని భావసంపదా, మంచిధారా ప్రతి పద్యంలోనూ కనిపిస్తాయి.

'కావేరి తోయ ముండఁగ
బావిని నీరాడువారి పగిదిని విన్నన్
సేవింపక పెఱదయ్యము
దేవునిగాఁ గొలువనేకు త్రిశిర గిరీశా ?

అచ్చ తెనుగులోసాగిన పద్యాలుకూడా హృద్యంగా ఉన్నాయి. ఈ పద్యం పరికించండి.

'ఆఱుం బైకము బిడ్డలె
పేఁ అంచును నీదు తమ్మిమెట్టులఁ దలఁపం
జాలని పన్ బెంద్రోపం
దేలఁగ నెటు సేయఁగలవొ త్రిశిర గిరీశా.'

శివభక్తుడైన మురుగేశంపిళ్ళైకి నాయన్మారుల కథలు హృద్గతము లవడం చర్విత చర్వణం. కుమ్మరి అయిన తిరునీలకంఠ నాయనారు కథనంతా ఒక్క కందంలో వివరించిన తీరు హృదయ రంజకంగాఉంది.

'శివ జంగములకు మృణ్మయ
నవ పాత్రము లొసఁగి జవ్వనము గెల్చిన ప్రా
భవు నీలకంఠ కుమ్మరిఁ
దివురుగ నిమఁ బెనచినట్టి త్రిశిర గిరీశా?

ఆంధ్ర ద్రవిడ భాషాపండితుడూ కవీ అయిన మురుగేశం పిళ్ళై రచనలను పునర్ముద్రణగా ముద్రించి, వాటిని నలుగురికీ తెలియజేయడం తెలుగు వారమైన మన కర్తవ్యం. తమిళుడైనా ఆయన ప్రదర్శించిన ఆంధ్ర భాషాభిమానం ప్రశంసార్హం!

3

సుమారు పదేళ్ళక్రితం మదరాసులో నాకు శ్రీ ఇ. ము. సుబ్రహ్మణ్యపిళ్ళైగారి పరిచయభాగ్యం కలిగింది. ఆయన ప్రసిద్ధ తమిళ పండితులేకాక, వైద్య జ్యోతిష శాస్త్రాలలో కూడా నిష్ణాతుడు. శైవమత రహస్యాలు ఆయనకి హృద్గతములు. ప్రాచీన తమిళ సాహిత్యం గురించి ఆయనతో మాట్లాడుతూ వుండగా, మాటల మధ్యలో మురుగేశంపిళ్ళై ప్రస్తావన వచ్చింది. 'మురుగేశంపిళ్ళై నాకు తెలియకపోవడమేమిటి? ఆయనా నేనూ దగ్గరి బంధువులం. మురుగేశం పిళ్ళై నాకు గురుతుల్యుడు' అన్నారు సుబ్రహ్మణ్య పిళ్ళై. ఆ తర్వాత ఆయన మురుగేశం పిళ్ళైని గురించి ఈ వ్యాసంలో నేను పేర్కొన్న విషయాలు తెలియజేశారు. ఆయనకి నేను బహుధా కృతజ్ఞుణ్ణి. ఈ విషయాలు, నాకు తెలిసినంతవరకూ, తమిళంలో కూడా గ్రంథస్థం కాలేదు. నేటి తమిళ రచయితలకు మురుగేశం పిళ్ళైని గురించి తెలియదన్నప్పటికీ సాహసం కాదు. ఆయన్ని గురించి యింకా తెలుసుకోవలసిన విషయాలు ఉన్నవని నా అభిప్రాయం. తెలిసిన పెద్దలెవరైనా వాటిని తెలియజేయాలని సవినయంగా కోరుతున్నాను. అంతేకాక మురుగేశంపిళ్ళై రచనలను పునర్ముద్రణగా ముద్రించాలని సహృదయులనూ, సాహితీ సంస్థలనూ కోరుతున్నాను.

ప్రకృతి గుప్పెట్లో

(37 వ పేజీ తరువాయి)

మువ్వు యిర్వాళ వేసే రంగు రేపు మాసిపోతోంది —
వేల సంవత్సరాలనాటి రాతికాలపు మనిషి 'రంగు' యింకా మాయలేదంటున్నారు
—ఎవరు గొప్ప
అతిగా విద్యలు నేర్చిన నువ్వా
కోతిలా నీతిగా బ్రతికిన 'రాతి' మనిషా—చ్ ...,
నాకు తెలుసు నువ్వు సిగ్గుపడతావు
కాని—రేపు నీ పిల్లలు కూడా సిగ్గుపడకూడదని నా తపన
జీవితం
తూర్పునూ, పడమరనూ కలిపే చాపరేఖ
సగం పొంగడానికీ, సగం కృంగడానికే సరిపోతుంది బ్రతుకు
కనీసం మిట్ట మధ్యాహ్నమన్నా
విప్పలా వెలుగు
కాంతి కొవ్వులా విలువు

మధ్యప్రాచ్య ప్రాచీన మహాకావ్యము - 'గిల్గమెష్'*

—డా. సి. వి. రామచంద్రరావు

'గిల్గమెష్' (GILGAMESH) మధ్య ప్రాచ్య ప్రాచీన మహాకావ్యము. క్రీ. పూ. 3000 ప్రాంతమునకు చెందినది. 'రామాయణము', 'ఇలియడ్' కావ్యములవలె ప్రపంచ ఆదికావ్యములలో ఒకటి. 'ఇలియడ్' కన్నను మిక్కిలి పురాతనము. మెసపొటేమియా (ఇరాక్) దేశములోని ప్రాచీన మహానగరములలో ఒకటియగు 'యురుక' (నేటి వార్కా) నగర ప్రభువు, పురాణ పురుషుడు నగు గిల్గమెష్ అద్భుత చరిత్రము నభివర్ణించును.

ఈ 'గిల్గమెష్' గాథాచక్రము, ప్రళయము తర్వాత యురుక నగరమును పాలించిన రాజులలో ఐదవ వాడైన గిల్గమెష్ అతిలోక, అద్భుత, సాహసోపేతా కార్యములను అభివర్ణించును. ప్రాచీన నాగరకతా జాతియైన సుమేరియన్ల భాష 'సుమేరియన్'నందు, ప్రజా సమూహముల ఎదుట గానమొనర్పబడుటకై గేయ రూపమున కూర్చబడినది. తరువాతి కాలమున, క్రీ. పూ. 2000 ప్రాంతమున గ్రథిత మొనర్చబడినది.

మహాపురుషుడైన గిల్గమెష్ గాథ మధ్య ప్రాచ్య ప్రజా బాహుళ్యము నందు బహుళ ప్రచారమున నున్నట్లు పురాతన స్థల ఖనన ఫలితముగ, మధ్యప్రాచ్యమున వివిధ స్థలములలో, వివిధ భాషలలో లభించిన వివిధ ప్రతుల వలన తెలియుచున్నది. ఈ గాథయొక్క అసంపూర్ణ ప్రతులు ప్రాచీన హిట్టైట్ (Hittite) రాజధాని నగరము బోఘజ్‌కాయ్‌నందు, హిట్టైట్, సెమెటిక్, హుర్రియన్ భాషలయందును, దక్షిణ టర్కీయందలి సుల్తాన్ టెపెయందు అక్కేడియన్ (Akkadian), సుమేరియన్ (Sumerian) భాషలలోను దొరికినవి. ఈ గాథలో ఒక ముఖ్యభాగము పాలెస్తీనాయందలి మెగిడ్డోయందు లభ్యమై, బైబిలు రచయితలు కూడ ఈ గాథాపరిచయము కలిగియుండవచ్చునని ఊహించుటకు తావిచ్చుచున్నది. నేడు మనకు లభించిన దీని సమగ్రప్రతి, క్రీ. పూ. 700 ప్రాంతమున, 'నినెవె' నగరమును రాజధానిగ, మధ్య ప్రాచ్యమంతయు నిర్జించి పాలించిన అస్సీరియా చక్రవర్తి అస్సురబనిపాల్, తన రాజధానియందు ఏర్పరచిన బృహత్తర గ్రంథాలయమున లభించినది. అక్కేడియన్ (AKKADIAN) భాషలో ఉలి ఆకారపు 'క్యూనీఫారమ్' (Cuneiform) లిపిలో, నాలుగు మాత్రలతో కూడి లయాన్వితమైన గేయరూపమున పన్నెండు ఫలకములపై గ్రథితమైనది. జిజ్ఞాసులైన అస్సురబనిపాల్ పండితులను దేశము నలుమూలలకు పంపి. వివిధ ప్రతులు సేకరింపచేసి, పాఠభేదములను పరిమార్చి, ఈ మహాకావ్యమునకు అక్కేడియన్ భాషా ప్రతిని తయారుచేయించినట్లు తెలియుచున్నది.

కాలక్రమమున విస్మరింపబడినట్లు తోచుచున్న ఈ కావ్యము యొక్క ఉనికిని ఆధునిక లోకమునకు తెల్పిన పురావస్తువేత్త జార్జి స్మిత్ (George Smith). బ్రిటిష్ వస్తు ప్రదర్శనశాల, లండన్, నందు కానవచ్చిన ఫలకభాగము ఆధారముగ 'నినెవె' (నేటి కుయున్జిక్) నగరమున త్రవ్వకముల జరపించి, గిల్గమెష్ గాథా ఫలకములను వెలికి తీసినాడు. వీనికి మొదటి ఆంగ్లేయానువాదమును, మూలగ్రంథము వివరణలతోపాటు, 1928, 1930 లలో క్యాంప్‌బెల్ థాంప్సన్ (Campbell Thompson) ప్రచురించినాడు. ఇది ప్రామాణిక అనువాదముగ భావింపబడుచున్నది. మిగిలిన అనువాదములలో జె. బి. ప్రిట్చర్డ్ (J B. Pritchard) సంపాదకత్వమున వెలువడిన 'Ancient Near Eastern Texts Relating to the Old Testament; Second edition, 1955 లో E. A. Speiser గావించిన పద్యరూపక అనువాదము. Alexander Heidel, 'Gilgamesh Epic and Old Testament Parellels, Second Edition, 1949' పేర్కొన తగినవి. ఈ అనువాదములన్నిటిని తరచిచూచి, వీనిలోని గ్రంథ గ్రంథులను విడదీసి, ఆధునిక పాఠకులకు పఠనయోగ్యమైన సులభ శైలిలో N. K. Sandars గద్యరూప అనువాదము కలదు. ఈ అనువాదమున Sandars మూల ఫలకములందు కానరాని, వేరొక సుమేరియన్ భాషా ప్రతియందు లభించిన

---

* నేను చేసిన 'గిల్గమెష్' తెలుగు అనువాదమునకు ఉపోద్ఘాతము.

'గిల్గమెష్ మరణము' అను చివరి అధ్యాయమును, వింతో సమంజసముగ చేర్చినారు. ఆంగ్లేయానువాదములేకాక, ఈ మహాకావ్యమునకు ఫ్రెంచి, జర్మన్ అనువాదములు కలవు.

Sandars గారి ఆంగ్ల అనువాదము ప్రధానముగ, మిగిలిన అనువాదములు సహాయముగ, ఆంధ్రానువాదమును నేను చేసినాను. ప్రచురణకు సిద్ధముగనున్నది.

కావ్య విశిష్టతనుగూర్చి, నాయకునిగూర్చి ఒకటి రెండు మాటలు. 'గిల్గమెష్' రహస్యమగు కావ్యము. నీతిబోధకము. అద్భుత విషాద రస సమ్మిళితము. మానవుడు అనాదిగ చావు, పుట్టుకల రహస్యము నెరుగుటకై నెరపుచున్న తత్వాన్వేషణ, మృత్యువును జయించుటకై మానవుడు నెరపిన ప్రయత్నము ఇది మనకు ఎరుక పరచును. గిల్గమెష్ ధీరోదాత్తుడు. మహావీరుడు. ప్రపంచ కావ్య విషాద నాయకులలో మొదటివాడు. అతని తమ్ముడు ఎంకిడు ఋష్యశృంగతుల్యుడు; లక్ష్మణునివలె భ్రాతృభక్తి పరాయణుడు. గిల్గమెష్ జీవితము దుష్టశిక్షణకు, మానవుల చిరవాంఛితమైన అమరత్వమును సాధించుటకు అంకితమైనది. ఎంకిడు చావు అతని ఎదను మానవజీవిత పరిశాన్యముతో నింపినది. నచికేయునివలె చావు పుట్టుకల గుట్టునెరిగి, నిర్జరత్వమును, అమరత్వమును సాధింప ఉద్యమించినాడు.

కాకలీ కాంతిస్వనాలు

శ్రీ దిలావర్

చీకటి దుకూలాలు నిండుగా కప్పుకొని
తమశ్చటల కాటుక కళ్లలో నింపుకొని
జాగృతి శిఖరాలమీంచి ఎందుకు పారిపోతున్నావు ?
నిదుర లోయల్లోకి ఎందుకు జారిపోతున్నావు... ?

తరుణీ !
బృహదాశా హృదయ వాటిక కవాటాలు తెరచి
తరణి వీణా సహస్ర తంత్రులను మీటి
కాకలీ కాంతి స్వనాలు వినిపిస్తోంది ప్రాచి !
శోకాకుల నీరవ నిశ్శబ్ద మరుధాత్రిలోంచి —
యీ చీకటి రాత్రిలోంచి
రాగరక్త రుచిమైన వెలుగు మెట్లమీంచి
కలికీ ! వెలికిరా !
నలివాపు మృణాళాన్ని
కబళిద్దామనుకున్న "కరి" మొయిళ్లు
ఒక్కటొక్కటే జడిసి తప్పుకుంటున్నాయి !
వృక్షాల గుండెల్లోంచి ఎగిరిన స్వేచ్ఛాగీతాలు
అంతరిక్షాన పక్షాలు విప్పుకుంటున్నాయి !

పంకజం, స్వేద జలాల్లోంచి
జీవన మకరందం పులుముకుంటోంది !
చిరంతన చింతా హిమ ధూళి కరగి
మోద మధూళి అధరాల అలుముకుంటోంది !

నెచ్చెలీ !
చలచ్చలిత ఆశా హరిణ శాబకాలను
మదూదయ శాద్వలాలకు తరలిద్దాం మేలుకో !
కోరికల కోరకాలై సుమించే యీ సుప్రభాతాన్ని
హృత్పాత్రిక నిండా ఏరుకో ... ...

ఫిలిపైన్ కవిత

మేము ఏమిటో నీకు తెలుసుకోవాలనివుంటే!

మూలం: కార్లోస్ బులోసన్   తెలుగుసేత: నిఖిల్

మేము ఏమిటో నీకు తెలుసుకోవాలనివుందా ?
అడవుల్లో, కొండల్లో, నదీతీరాల్లో నివసించేవాళ్ళం
పశువులను మచ్చిక చేసుకుంటూ
ఉక్కులా జీవిస్తూ
యుద్ధభేరీలతో [వర్గరహితభాష] సాగేవాళ్ళం.
శ్రమను, వివేకాన్ని, రక్తపుశాంతిని పూజిస్తుండేవాళ్ళం
మేము ఏమిటో నీకు తెలుసుకోవాలనివుందా ?
వర్షపుధారలోని మెరుపుతీగలో
గూడుకట్టినరాయిబలంలో
జీవంతో తూణికిసలాడే మేము
గాలివీచినపుడు నిలువునా పులకించే మేము
సూర్యుడివైపు నోరుతెరచిన
పువ్వులతోబాటు మైమరిచే మేము.
మేము ఏమిటో నీకు తెలుసుకోవాలని వుందా ?
లెక్కలేనన్ని మా పోలికల్లో
చావులేకుండా శక్తివంతంగా పెరిగేవాళ్ళం.
ప్రతి అంశం ఆశతో గర్భంతాల్చి
ప్రతిఆశ మహోన్నతంగా
ప్రతి మహోన్నతమైన వర్గరాహిత్యం
ప్రతి వర్గరహితమైన వ్యవస్థ
పరిపుష్టమవుతుంది ఉన్నతోన్నతంగా
హద్దులులేని సహోదరభావంవల్ల.
విశ్వవ్యాపితంగా
ప్రతిచోటా కోట్లాదిమందిమి,
కర్మాగారాల్లో, రోదల్లో, బాధలమురికివాడల్లో,
గుంపులునిండిన నగరాల్లో, ఆకాశంలో
సముద్రంలో—భూమిపొంతం
ఎటుచూసినా మాసంఖ్య పెరుగుతూనేవుంటుంది,
విశాలమైన ప్రపంచంచుట్టూ వలయంలా
తిరుగుతూ పెరుగుతూనే వుంటాయి
కోపావేశాలు, ఆకలి, రోగం, చావు.
పుస్తకాలు చదువుతున్న స్త్రీ—పురుషులం మేము
చరిత్రలో జారిపోయిన శబ్దంకోసం
సజీవమైన శాంతిరహస్యపుతాళం చెవికోసం
నశించని ఆనందం కోసం
అన్వేషిస్తున్నాము మేము,
ఎటు చూసినామేమే పొలాల్లో
ఫ్యాక్టరీలల్లో—మిల్లుల్లో కూలీలం.
మా చేతుల్లో మలచబడుతూ
సృష్టిస్తూ—నిర్మిస్తున్న కట్టడాలు
మునుముందుకే దూసుకెడుతున్న నిర్మాణాలు.
భావికోసం గుండెలో పొదుగుతూ,
రోగాలను, నైరాశ్యాలను—[illegible]
నిర్మూలిస్తున్న మేము డాక్టర్లం, రసాయనశాస్త్రవేత్తలం,
బ్రాబల్యంగా జీవించలేని
మనిషి అనంత ఆత్మవిశ్వాసాన్ని
కాపాడుతున్న మేము
సైనికులం, నావికులం, పౌరులం
చచ్చినవాళ్ల చావని కలలకు
ప్రతిరూపాలుగా ప్రతిచోటా మేమే.
చావులేని మానవత్వంకోసమని
అనంతమైన ఆనందంకోసమని
సోదివిప్పిచెప్పే అపఖ్యాతిపాలైన
ఈ ప్రపంచపు పోకడలను
ఛిన్నివేసిన
దాహంతీరని నిజాన్ని సృష్టించే
వర్గ పోరాటపు స్మృతులం.
ఎక్కడైనా మేమే జీవిస్తున్నవాళ్ళం
చచ్చిపోయినవాళ్ళం . .

2

మేము ఏమిటో నీకు తెలుసుకోవాలనివుంటే
బడితెలకింద పగులుతున్నతలల్నిచూడు
బయోనెట్లు దూర్చబడిన జారిన రొమ్ముల్ని చూడు
దయాదాక్షిణ్యాలు లేకుండా
పౌరులగుండెల్ని దూసుకపోతున్న బుల్లెట్లనుచూడు
బలహీనమైన ఊపిరితిత్తుల్ని—
నులిమివేస్తున్న భాష్పవాయువులనుచూడు.
మేము ఏమిటో నీకు తెలుసుకోవాలని వుంటే
చూడు చిగురిస్తున్న నరకబడినచెట్లు
దొమ్మిలోకి దిగిన వెర్రిమూక,
చేయని నేరాన్ని ఒప్పించడానికి
అమాయకులైన ఖైదీలను
విపరీతంగా బాదుతున్న మఫ్టీ పోలీసులు.
జాగ్రత్తగాచూడు నిర్దోషి ఖైదీవైపు
తీర్పుచెప్పే ఏడుమంది న్యాయ[illegible] ఎదుట
ఒంటరిగా నిలుచున్న ఖైదీ
స్వార్థపు అధికారంలో
విర్రవీగుతున్నన్యాయమూర్తి విధించిన శిక్ష.
అంతే చూడగలవా
మూకలో దొమ్మిజరిపి
తప్పించుక పారిపోయిన రౌడీలను
రహస్యాలను [illegible] ద్రోహులను
ప్రాణాలను [illegible] ఖూనీకోర్లను.
మనిషి మనిషికోసం
వెదజల్లే సహజమైన ప్రేమకోసం
తల్లడిల్లే వాళ్ళం మేము
ప్రతిమనిషి మానవత్వాన్ని స్మరించేవాళ్ళం మేము
ఆకలిగొన్న భూమిని
సమృద్ధమైన ప్రాంతంగా
దుక్కిదున్నేవాళ్ళం మేము.
పంటపొలాలను
అనశ్వరమైన సువాసనలు వెదజల్లేట్లు చేసేవాళ్ళం
సువిశాలమైన భూసంపత్తిని పెంచిపోషిస్తూ
తరగని వెలుగులను విరజిమ్ముతూ
సర్వత్రా వ్యాపించిన
అజ్ఞాతమైన మనుషుల కోరికలముమేము.
మేమే వినూత్నభావాలం
కొత్తపునాదులం
మెదడుకువేసే కొత్తవిరువులం
కొత్త ఆశలతో కొంగ్రొత్త జీవితాలతో
ప్రతిచోటా సరచుకున్నవాళ్ళం మేము.
ద్రష్టలుగా
విషాదంలోని విశ్రాంతిగా
తారలుగా మేమే.
జిజ్ఞాసలోని కొత్తమెట్లుగా
నూతన పోరాటాలలో తెగనిలంకెగా
బాధలోపలి లోకాలలోని అనేకదారులుగా
మానవ ప్రతిష్టలోని ఆత్మవిశ్వాసంగా
పుష్పిస్తున్న జాతికి
సజీవంగా ఉన్న శాసనంగా మేమే.
మేము ఏమిటో నీకు తెలుసుకోవాలని వుందా
మేము విప్లవం.

పసిగుండె

“నాలకల్హారి”

కటికి చీకటి.

కుండపోతగా వాన.

హోరుగాలి.

కిటికీ చెక్కల్ని, వాకిలి తలుపుల్ని గాలి వూపూపి కొడుతూ వుంది.

వాన విసిరిసిరి కురుస్తూవుంది.

ఆరిపోవాలో వెలగాలో తెలియక కొట్టుమిట్టాడుతున్న కోడిగుడ్డు దీపం చీకటికి దిద్దిన బొట్టులాగావుంది. గాలి ఈలకి కన్ను కొడుతూ వుంది.

వానలో హోరులో చీకట్లో చేతిగడియారం ఆడుతూవుంది. తొమ్మిది గంటలకే అర్ధరాత్రిలాగా వుంది చీకటి.

చాపతోపాటు చుట్టిన బెడ్‌మీద గోడకానుకొని కిటికీ దగ్గర కూర్చున్నాడు సుధాకర్.

ఎదురుగా నాప బండలు పరచిన నేల. క్షిరవి ద్రవంతో గ్లాసు. వలిచిన గుడ్డు. అరటిపండు!

సుధ కిటికీలోంచి చూశాడు. చీకటి! హోరు! వాన! కరెంటు పోయింది. ఊరంతా చీకటి ముద్ద!

సుధ కళ్ళు మూసుకొన్నాడు. కోడిగుడ్డు దీపంలాగావుంది ముఖం. కళ్ళు తెరిచాడు. ప్రేమగా, దయగా, జాలిగా, చీకటిని చూశాడు. గ్లాసు ఒక్క గుటక! గొంతులో కోడిగుడ్డు. నమల్లేదు. మింగలేదు. లోపలికి పోయింది కళ్ళవెంట నీళ్ళు, ముఖంలో ఉబ్బు, నరాల్లో పొంగు. వెంటనే అరటిపండు. సునాయాసంగా దిగింది.

నోట్లో గొంతులో పేగుల్లో ఇనపముళ్ళ గొలుసు లాగినట్టు నొప్పి! మంట! పోటు! నరాల్లో జ్వరం. తలలో తిమ్మిరి. తేలిపోయే కాళ్ళు. పీక్కుపోయే కళ్ళు. విరగ్గొట్టినట్టు ఒళ్ళు. కూర్చో బుద్ధిపుట్టలేదు. నిలబడటం ఇష్టంకాదు.

మంచో, చెడో చేయటం కొత్తలో కష్టమే! అలవాటు అయితే ఆ తోవవేరు. ఒకపని అనుభవమో, ఫలితమో తట్టుకోలేని వాళ్ళు సాధారణంగా అపని జోలికి పోరు. సుధకిది కొత్తగానూలేదు, పాతగానూలేదు. దేనికదే! మింగిందాకా కష్టమయింది, మింగిన తర్వాత కష్టంగావుంది.

ఇప్పుడు సుధ గరళం మింగిన శివుళ్ళా గొంతు పట్టుకొని కూర్చున్నాడు. సారాయి తాగిన టూలాయి టూలాయి గాళ్ళలాగా చేతులూకాళ్ళూ పీక్కుంటున్నాడు. శివుడు చచ్చేంత చావు అయినా తట్టుకొంటాడు. టూలాయి టూలాయిగాళ్ళు చావురాకపోయినా శివాలు తొక్కుతారు.

సుధ మామూలు మనిషి!

సుధ ఆలోచన ఈ పెద్ద పల్లెనుంచి బయలుదేరి పట్నం చేరుకొంది. తను ఆ సంవత్సరమే చేరిన డిగ్రీ కాలేజి దాటింది. రాధ చదివే జూనియర్ కాలేజి చుట్టూ తిరిగింది. అత్తింటికి పోయి రాధ గదిలో చేరి కూర్చుంది.

రాధ యువతీకాదు, బాలికా కాదు. వోణీ వేసుకోవటమయితే చేతనయిందికాని చీరె కట్టుకోమంటే చుట్టుకోవటంకూడారాదు. పదహారు సంవత్సరాలంటే ఎక్కువ. పద్నాలుగంటే తక్కువ. ఎనిమిదింటికే నిద్రవచ్చి ఆవులిస్తూవుంది.

అత్తకుకూతురు ప్రాణం. లేకపోతే భాగవతం ప్రాణం. ఒక ప్రాణం ఆవులిస్తుండటంవల్ల రెండోప్రాణంతో గొంతెత్తి అరుస్తూ వుంది అత్త.

అత్తకు తోడున్న ప్రాణి రాధ. భర్తపోవటం రాధపుట్టటం ఒక్కటే ముహూర్తం! అత్తకు రాధకంటే ముందూ ఎవరూ పుట్టలేదు. తర్వాత పుట్టలేదనటం అనవసరం.

రాధవయస్సుకంటే అత్త వయస్సు ఇప్పటికి రెట్టింపు!

కడుపులో గ్నేడుపెట్టి కోసినట్టుంటే అత్తా,రాధల ముఖాల ఆలోచన తలుపుమూసి సుధ పేగుల్లోకి చూసుకొన్నాడు. తంటా! పేగులు కములుకు పోతున్నాయి.

సుధ కిటికీలోంచి చూశాడు. వానలో తడిసి ఈదురుగాలి! చీకటి వణికిపోతూవుంది. అప్పుడొకటీ, ఇప్పుడొకటీ మెరుపుకి క్షణంలో సగం వెలుతురు, ఆకాశం చిరిగినట్టు మెరుపు. ఓటికుండ లోంచి విక్కొలికినట్టు వెలుతురు.

'రావు!'

సుధ పెదాలు స్పష్టంగా పలికాయి.

ఏమిటీ పదాలకర్థం! సుధకు తెలుసు!

మండేగుండె రాధను చుట్టుముట్టింది. కాంతివలయంమధ్య చంద్రబింబంలాగానో, పిడుగుల్లో కాలుతున్న రెండెడ్లబండి చక్రం పైనున్న ఇనపగాను మధ్య కాళీస్థలంలాగానో, రాధ కదలకుండా కాలకుండా కునుకుతూ చలిగాచుకొంటున్నటుంది.

తండ్రి చెల్లెలు అత్త కావటం తప్పుకాదు. అత్త కూతురు వరసకావటం వింతకాదు. ప్రేమించినవాడు పెళ్ళాడతాననటం అన్యాయంకాదు.

కాని సుధవిషయంలో అంతా తారుమారు. గొడవ! రభస!

రాధతో సుధ పొంచునేడు,

'మనం పెళ్ళి చేసుకొందాం'

నిక్కచ్చిగా చెప్పాడు.

'మనమా?'

రాధ దిక్కుతెలియకుండా ప్రశ్నించింది.

'నిన్ను పెళ్ళి చేసుకొంటా'

'నన్నా?'

'ఏం?'

'నిన్నా?'

'ఏం?'

'పెళ్ళా?'

'ఏం?'

'ఎందుకు?'

'ఏం?'

'పెళ్ళెందుకు?'

'ఏంటి నువ్వనేది?'

'ఏం పెళ్ళి?'

'మన పెళ్ళి!'

'అమ్మనడుగు!'

వాళ్ళ సంభాషణలో సమాధానాలకంటే ప్రశ్నలెక్కువ. ఆలోచనకంటే ఆశ్చర్యం ఎక్కువ. అవసరంకంటే ఆతురత ఎక్కువ.

రాధ తల్లిచాటు పిల్ల. పెళ్ళిమాట ఇంకా శరీరంమీద పాకి గుండెలోకి చేరలేదు. మొదటిగా పెళ్ళిమాట వింటే అంతకంటే మాట్లాడలేకపోయింది. తెలియలేదు. ఏం చేయాలో దిక్కుతోచక పోతే అమ్మ అండ చేరే అమాయిక! అంతే! అమ్మదగ్గరకుపోయి కూర్చుంది.

అత్తదగ్గరకుపోయి సుధ చెప్పాలనుకొన్న నాలుగుమాటలూ చెప్పి, అత్తను అనుమతి, ఆశీర్వాదం అడిగాడు.

అత్త మధ్య నోరు తెరవలేదు. ఇప్పుడు తెరిచినోరు మూసుకోవటం మర్చిపోయింది. భూకంపం అయిందన్నంత ఆశ్చర్యం! అగ్నిపర్వతం బద్దలయిందన్నంత భయం! ఆ తర్వాత నోరు మూసుకొంది. తల తలుపు తీసింది. గదినిండా గాలి. ఆలోచన.

అన్న ప్రయోజకత్వం ఆమెకు అక్షరాలా తెలుసు. ఆ తండ్రి కొడుకే సుధ! అన్నమీద మమకారం! పరిస్థితులమీద ఉక్రోషం! ఉరుమురిమినట్లు చూచింది. పిడుగుపడ్డట్లు కదిలింది.

'నీ కప్పుడే ఏం పోయేకాలం! బొడ్డూడని పసిగుడ్డు! పెళ్ళా? అయ్య! నీకు తలకాయుందా? ఇంత తొందరేం ముంచుకొచ్చింది? ఏనాటిమాట! అంతా సల్లగావుంటే అప్పుడు సూద్దాం—తెలిసిందా? ఆ చదువూ సట్టుబండలు—సరీగ్గా సదివి సావు'

ఇటువంటి మాటలు వడ్డించి కడుపునింపి సుధను సాగనంపింది.

సుధ నోట్లోంచి చొంగ వూరుతున్నట్లు కిటికీలోంచి వాకిట్లోంచి వాననీళ్ళు వస్తున్నాయి బార్లా తెరిచివున్న తలుపులూ, కిటికీలు వాన గాలి చీకటి రాకపోకలకు రాస్తాలయ్యాయి.

రెండు చేతులతో పేగులు మెలివేసి పట్టుకొని, కిటికీ నాపబండమీద గడ్డం ఆనించి కిటికీలోంచి చీకటి నృత్యాన్నీ, వాన హోర్నీ, హోరుగాలి సన్నాయినీ చూస్తూ వింటూ గొణిగాడు.

'రావు!'

సరీగ్గా ఇటువంటిరాత్రే—సంవత్సరం క్రితం ఇంటరు సీనియర్‌లో ఉన్నప్పుడు-అత్త ఇంటినుంచి దురుసుగా తిరిగివచ్చిన రోజు రాత్రి రావు వచ్చేసరికి రూంలో సుధ తూలుతూ, పేలుతూ, నవ్వుతూ, దేవదాసులాగా, మజ్నూలాగా, మరో కొక్కిరాయిలాగా ఉన్నాడు. ఏమయిందిరా అంటే ఎనిమిది నిద్రమాత్రలు మింగానని గ్యారంటీగా చచ్చిపోతాననీ, సంతోషంగా చస్తున్నానని కూనిరాగాలుతీసి ఆనందించాడు. రాధతో పెళ్ళి కాకపోతే బతకటం వ్యర్థమన్నాడు. ప్రపంచంలో అత్తలుండకూడదన్నాడు. చావు ఎంత సుఖంగా ఉందో వివరించాడు. చావు తిమ్మిరి సరదాగా వ్యాఖ్యానించాడు. చావు గొప్పని ద అన్నాడు. మెలకువగా ఉన్నంతసేపూ ప్రేమ పుట్టుపూర్వోత్తరాలు, దాని ఉన్నత్యం అగాధత్వం సాంగోపాంగంగా విడమరుస్తున్న రావుకు బోధిస్తూనే వున్నాడు. మెలకువగా ఉన్నంతసేపూ మెలికలు తిరిగిపోతూ చేతికి దొరికితే ఒట్టు. రావు పడిన పాట్లు ఒకటి రెండూ కావు. నా చావుకు నేనే కారణం అంటూ ఒక ప్రేమలేఖ రావు చేతుల్లో పోస్టుచేసి పరుపుమీద విలాసంగా వాలిపోయాడు.

స్పృహ తప్పిన సుధను హాస్పటల్‌కి తీసుకొనిపోతే రెండు రోజులు సమాధ్యవస్థ అనుభవించిన యోగి దులవారు కళ్ళు తెరిచారు. ఎదురుగా రంభ! చుట్టూ దేవతలు! స్వర్గం! దేవేంద్ర భవనం!

'బావా!'

'ఎవరూ?'

'బావా!'

'ఎవరూ?'

'నేను బావా రాధని!'

'రాధవా?'

'ఆఁ!'

'రంభవు కావూ?'

'కాదు బావా రాధని!'

'కృష్ణుడేడీ?'

'ఏమిటి బావా ఇది?'

'తప్పురాధా ఏడవకు! వెళ్ళు! కృష్ణుడితో పాటుండు!'

'బావా?' అవురుమని ఏడ్చింది.

సుధను రాపు పట్టుకొని కుదిపాడు.

స్వర్గం నేలమీదికి దిగివచ్చింది. హాస్పటల్ బెడ్ కనబడింది. దేవేంద్రభవనం మాయమయింది. దేవతలు పరారయ్యారు. రాధ అత్త కూతురయింది. చావురాలేదని తెలిసింది. అవురుమని ఏడవాలని పించింది. తన కలలన్నీ కల్లలయ్యాయి.

రాధ ఇంకేం ఏడుస్తుంది. అత్తమరేం గుండెలు బాదుకోదు. కాలేజికి సెలవు ఇవ్వరు! విద్యార్థులంతా హాస్పటల్‌కో. రూంకోవచ్చి ఏడుస్తూ చూడరు. బాధపడుతూ బ్యాండుమేళంతో సిధులన్నీ వూరేగించి వల్లకాటికి తీసుకుపోరు. పవిత్రప్రేమికుల వరుసలో స్వర్గంలో కూచోలేడు.

ఎన్ని కలలు కన్నాడు. ఎంత ఆశపడ్డాడు. అంతా విఫల మయింది. ఛీ ఛీ చాతకాని బతుకు అని తిట్టుకొన్నాడు.

రాధ కళ్ళలో నీళ్ళు. చూళ్ళేకపోయాడు. మెల్లగా చేయి ఎత్తి తుడిచాడు. రాధ అవురుమని ఏడ్చింది. ఏడుపు మానేసి అడిగింది.

'నాకోసం సద్దామనుకొన్నావా?'

'ఆఁ!'

'నాకోసం?'

'ఆఁ!'

'నిజ్జంగా?'

'ఒట్టు!'

ఎంతో సంతోషంగా గాలి పీల్చుకొంది.

'మన బతకాలంటే మనవేఁవి జేయాలి?'

'నాతో పెళ్ళి!'

'నాకా?'

'ఆఁ!'

'నీతోనా?'

'ఆఁ!'

'పెళ్ళా?'

'ఆఁ!'

'అమ్మిష్టం!'

ఇది మునుపటి సమాధానంకంటే ఏమంత గొప్పది కాదు. అమ్మ అవబడే అత్త యమదూత.

'అలాకాదు' అన్నాడు.

'మరి?' ప్రశ్నించింది.

'ఏంటి నీయిష్టం?'

'నాకిష్టం!'

'మరి పెళ్ళెప్పుడు?'

'నీ యిష్టం!'

'ఇవాళే!'

'నీయిష్టం!'

'ఇప్పుడే!'

'నీయిష్టం!'

సమాధానాలు, అంగీకారాలు, ఇష్టాలు సంభాషణలో సంసంగా ఒదిగి కూర్చున్నాయి.

సుధ చనిపోతాడంటే ఎందుకు ఏడుపు వచ్చిందో, బతుక్కీ పెళ్ళికీ సంబంధం ఏమిటో, తను అన్నమాటలమీద అతనికెంత ఆశ పుట్టిందో, అక్కణ్ణుంచి అతని దుఃఖం ఎలావుందో రాధకేమీ తెలి యదు. అర్థంకాని లెక్కను చేయలేక, తల బద్దలు కొట్టుకోలేక పుస్తకం మూసేసి పడుకొనే విద్యార్థినిలాగా హాస్పిటల్ సన్నివేశం సంభాషణ సినిమా, నవల, కథలలోలాగా సరదాగా గుర్తుపెట్టుకొంది. సహజంగానే మర్చిపోయింది. ఆ ఆలోచనేలేదు. ఆ అవసరమే రాలేదు.

ఆ సన్నివేశం ఆమెలో మార్పుతేలేదు. మర్చిపోకుండానూ చేయలేదు. అయితే ఆ మాటలన్నీ టేప్ రికార్డులోలాగా గుండెలో రికార్డు అయిపోతే భద్రంగా ఉంచుకొన్నాడు సుధ. అతడి గాలిమేడ లకు ఈ శబ్దాలు పునాదిరాళ్ళు.

పెద్ద చప్పుడు! పిడుగుపడినట్లుంది. చెట్టుకొమ్మ విరిగి పడి నట్లు, పక్కనెక్కడో పాతగోడ కూలినట్లు అనిపించింది.

మెరుపు మెరిసింది. నేలంతా నీళ్ళమీద తేలినట్లు తళుక్కు మంది. చీకటి తలలోనుంచి జారిపడ్డ మల్లెచెండులాగా మెరుపు!

కిటికీ వెలుపల చీకటి. వాన వాగె తోవ తెలియకుండా పరుగు

హోరుగాలి చెట్టుకి చేమకీ, గోడకీ, మేడకీ కొట్టుకొని కళ్ళు తిరిగి, వళ్ళు పగిలి, దిక్కులేని దానిలాగా ఏడుస్తూ పోతూవుంది. ఒకటే రొద! నస!

కిటికీ ఊచలు గిరవటంకోసం తొంగిచూస్తున్న దొంగలాగా వెలుపలికి చూస్తున్నాడు సుధ.

'రావు!'

చపాతీలు తెస్తానని పోయాడు రెండుగంటలయినా రాలేదు. సినిమాకి పోయాడో ఏమో! టెంట్‌లో చాలా పాత సినిమా! జనం ఎగబడుతున్నారు! ఏం చూడాలి?

రావు ఇంటరు పోయి. ఇంటిపట్టునే ఉండక పట్టణంలోనూ చేరక, పల్లె వాళ్ళకు బస్తీ. బస్తీ వాళ్ళకు పల్లె అయిన ఈ వూళ్ళో ఈ గది అద్దెకు తీసుకొని చదువును కూర్చోబెట్టి, పడుకోబెట్టి చంపుతున్నాడు. ఈసారి పరీక్షల అంతుతేల్చుకోవాలని దృఢ సంకల్పం!

పరుగు పందెంలో ఆరంభంలో ముందు పరుగెత్తి క్రమంగా వెనకబడిపోయే ఆరంభ శూరత్వముండే ఆం ధుడిలాగా, బండి లాగ లేని ముసలి గుర్రంలాగా సుధ గుండె మొరాయించి యాలిగిలబడుతూ వుంది.

అసలే అలిసిపోయిన గుండె ఒంటెమీదికి చివరి గడ్డిపరకలా రాధ పడింది.

నిన్నకు నిన్న 'రాధతో నీకేం పని? పెళ్ళి? ఛీ పో' అని అత్త అంటే 'నువ్వెవరు? నేనెవరు? నీతో నాకేం మాటలు' అని రాధచెప్పి వెళ్ళిపోవటం తలుచుకొంటే చావే వయమనిపించింది. చావు ప్రయత్నం లేకుండా రాగలిగితే వెంటనే వసే బాగుండుననిపించింది

సుధ ఆ క్షణంలో చావు కోరుకొన్నాడు. మునుపు చావలేక పోవటం గుర్తుకు వచ్చింది. చెప్పరాని బాధ కలిగింది. ఆపుకోలేని ఏడుపువచ్చింది ఎలా చావాలో దిక్కు తెలియకపోతే, దేవుళ్ళా రావు గుర్తుకు వచ్చాడు. అందుకనే పట్టణంనుంచి పల్లెకు మైత్రిని వెతుక్కుంటూ వచ్చాడు.

'ఏరా ఇలా వచ్చావ'ని మిత్రుణ్ణి రావు అడిగాడు.

'చావాలని వచ్చా'నన్నాడు సుధ.

'మా బాగా చచ్చావుగాని' నన్ను చదువుకొని చావనీ' అని పుస్తకాలలో కూరుకుపోయాడు.

రావుని పుస్తకాల శిథిలాలలోంచి వెలుపలికి లాక్కువచ్చి సమయం దొరికినప్పుడల్లా అత్తా రాధా తనకు చేసిన, చేస్తున్న, చేయ బోతున్న అన్యాయాల అధర్మాల పట్టికలు చదివి, అందుకు ప్రతి కారంగా చావదల్చుకొన్న సంగతి చెబితే, తక్షణం రావు భయపడ్డా, చచ్చేవాడెవడూ చెప్పిచావడనీ, చావదల్చుకొన్నవాడు ఇంతదూరం వచ్చి చావడనీ, ఒకసారి చచ్చి బతికిన వాడికి మళ్ళీ చావు లేదనీ, నిర్ణయించు కొని పోరా పో అని చదువుకోవటమనే పురావస్తు ఖనన కార్యక్రమంలో తలబంటి మునిగిపోయాడు

మిత్రుడి దగ్గరనుంచి వస్తుందనుకొన్నంత కనీసం రావలసినంత సానుభూతి రాకపోయేసరికి సుధకి తలతీసేసినట్లయింది. ప్రాణం పైపైనే పోయినట్టు అనిపించింది. ఇంతకంటే చావే నయమనిపించింది. సుధ పొద్దున్నించి ఆలోచించాడు చావాలని నిర్ణయించు కొన్నాడు. కానీ నిదమ్మాళలతో పాతచావు చావటం ఇష్టం లేదు. రావు ఒకవేళ రక్షిస్తే రాధ వస్తుంది. కన్నీళ్ళు పెట్టుకొంటుంది. నాకోసం చనిపోయావా అంటుంది. పెళ్ళాడతానంటుంది. ఆడేస్తుంది. అంతకంటే తనకేం అక్కరలేదు. ఒకవేళ తను చనిపోతే - చనిపోగలిగితే ఇంకేం—రాధలేకుండా బ్రతకటంకంటే చావటం నయం.

కాబట్టి విషం కావాలి. వెంటనే చనిపోయేదిగా ఆ విషం ఉండకూడదు. రావు రక్షించటానికి అవకాశం ఇవ్వాలి. చనిపోవడం ఎంతహాయిగా, సుఖమయిన బాధగా వుంటుందో రుచి చూడాలి. చని పోయినా ఫరవాలేదు. బ్రతికినా ఇబ్బందేంలేదు ఏమయినా తనకే మేలు!

రావు రావచ్చు. బ్రతికించవచ్చు. రాధతో పెళ్ళి కావచ్చు. నిజానికి అదే జరిగేది.

'రావు!'

గొణిగాడు సుధ. రాలేదురావు ఎదురు చూస్తుంటే నరాలు పీక్కుపోతున్నాయి కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి. వళ్ళంతా పది నిండులారీలు ఒక్కసారిగా పోతుంటే ఊగుతున్న బ్రిడ్జిలాగా జవజవ లాడుతూవుంది.

అంతుపట్టని చదువు, అర్థంకాని చదువు చదివిచదివి అలిసి పోయిన రావు ఆ గది వదలి ఎటయినా పారిపోయి రెండూ మూడూ గంటలు తిరిగి వద్దామనుకొన్నాడు. వాన ఒకటి పీడగా దాపురించింది తనకీ సుధకీ చపాతీలు తెచ్చుకోవటం కోసమే బయలుదేరాడు కాని అంత తొందరగా తిరిగివద్దామన్న ఉద్దేశంతో మాత్రం బయలుదేర లేదు. అడిగితే వెంటనే వస్తానని చెప్పాడు కానీ అదీ ఉద్దేశ పూర్వకంగా చెప్పిందికాదు యధాలాపంగా అన్నాడు.

'రావు!'

తోవలో మొదలయిన జల్లు రైల్వేస్టేషన్ దగ్గర రైలుకట్ట దాటిపోబోయేముందు ఎక్కువయింది. తడవటం ఎందుకని స్టేషన్ లోకి దారితీశాడు రావు స్టేషన్ అంతా తడిసి ముద్దయింది ఏ.ఎస్.ఎం కూర్చున్న గదే బుక్కింగు ఆఫీసు. ఇక మిగిలిన గదే వెయిటింగు రూం

వెయిటింగ్ రూం నిండావున్న జనం రైలు కోసం వచ్చినవాళ్ళు కారు. వాళ్ళు వాన తగ్గితే ఊళ్ళోకి పోతారు. ఒక పక్క గోడకు ఆనుకొని నిలబడ్డాడు. వాన విదిలించి విదిలించి కొడుతూవుంది. జల్లు గదిలో పడుతూవుంది. రావు గోడకు ఆనుకొని నిలబడ్డాడు.

ఎదురుగా సుందరి!

రావు ఆశ్చర్యపోయాడు. అక్కడు సుందరిని అక్కడ చూస్తా నని రావు అనుకోలేదు. ఏడో తరగతిదాకా కలిసి చదువుకొన్నారు. ఇంతలో ఇద్దరు పిల్లల తల్లి. పెద్దది సుందరి చీరపట్టుకొని నిలబడి వణుకుతూ వుంది. చంటాడు సంకలోంచి లోకం చిద్విలాసం చూస్తూ ఆశ్చర్యపోతూ వున్న నోరు తెరవని యోగి.

సుందరి ఒకమూలకు ఒదిగి నిలబడింది. కూర్చుందామంటే నేలంతా తడి. బీడీపీకలు, చుట్టముక్కలు, బఠాణీ పొట్లాలు, వేరు సెనక్కాయ తొక్కలు, కాగితం ముక్కలు, పారేసిన విస్తరాకులు, కాల్చిన అగ్గిపుల్లలు, కాళ్ళ ఇసుక, దుమ్ము, చెమ్మ, గది కంగాళీగా వుంది.

రావు జనంలోంచి దారిబడి, నెట్టుకొంటూ తోసుకొంటూ, పడుతూ, లేస్తూ, బతిమాలి, కోప్పడి, తిట్టి, తట్టించుకొని సుందరివున్న ఆ మూలకు చేరాడు

'సుందరీ!' పిలిచాడు.

ఆమె రావును తప్ప అందర్నీ చూసింది.

మళ్ళీ పిలిచాడు.

నువ్వెవరివి అన్నట్టు ఆశ్చర్యంగా చూసింది. 'నే నావుని' పరిచయం చేసుకొన్నాడు. ఆమె గుర్తు పట్టింది. రావు ఎంతెత్తు పెరిగాడూ అని ఆశ్చర్యపోయింది,

రావుకి పక్కనున్న సుందరి ఎంతో ఎత్తులో వున్నట్టు అనిపించింది. ఇద్దరి పిల్లల ఎత్తూ బరువూ ఆమె ఎత్తూ బరువుగా అనిపించాయి. లెక్కలు రాకపోతే తలగోక్కుంటూ ఏడుస్తూ చెప్పించుకొనేది. కసిరితేఏడ్చేది.నవ్వుపొమ్మని మందివద్దా వెంటబడి ఇంటిదాకా వచ్చేది. తిడితే నవ్వేది. అంతా తనమీద ఆధారపడ్డట్టుండేది. ఏదో అధికారం సందుదొరికితే చెలాయించేది. అంత అమాయిక ఎంతగా మారిపోయింది!

ఇద్దరు పిల్లలతో ఉన్న సుందరి తనకు రాని లెక్కలు సునాయాసంగా చేసేసినట్టుంది. తనకు కూడా రాని ఇంగ్లీషు స్టోరీ కంఠతా పట్టేసినట్టుంది. తనకు తెలియని రహస్యం విద్య చదువు తెలిసినట్టు, పొందినట్టు, నేర్చినట్టు ఉంది. సృష్టిరహస్యం దానికి టీకాతాత్పర్యంతనకుపూర్తిగా వచ్చినట్టు,ఇక మాటకేమాయమార్కులు వచ్చేస్తాయన్నట్టు కనిపించింది. తనని చుట్టుకు తిరిగిన సుందరి అయిదేళ్ళలో తనకు అర్థంకాని సుందరి అయిపోయింది. సుందరిలోతెలియని, అర్థంకాని, అస్పష్టమైన ఆకర్షణ ఏదో అతన్ని ఆమె దగ్గరగా నిలబెట్టింది.

సాయంకాలం రావలసిన రైలు రాత్రయినా రాలేదు. ఈ వాన లకు ఎక్కడ ఏం జరిగిందో, ఎప్పుడు వస్తుందో! పుట్టింటినుంచి అత్తవారింటికి పోతున్న సుందరి తను పల్లెనుంచి వచ్చి పట్నం రైలురాక ఇక్కడ ఉండిపోయింది. రైలు టైంకివస్తే ఈపాటికి ఇంటికి చేరి వుండేది.

పిల్లవాడు ఏడిస్తే తీసుకపోయి పాలు తాగించి తీసుకు వచ్చాడు సుందరి తింటానికి ఏమయినా కావాలంటే చపాతీలు తెచ్చి ఇచ్చాడు. పిల్ల నిద్రకుపడితే నేలంతా తుడిచివడుకోబెట్టాడు.

వాన తగ్గింది. జనం ఊళ్ళోకి పోయారు. ఆ రైలుకి పోయే ప్రయాణికులు ఎవరూలేరు. వెయిటింగ్ హాలులో సంసారం పెట్టిన ఇద్దరు బిచ్చగాళ్ళు. ముసలి అవ్వ, రెండు కుక్కలు వీళ్ళకు తోడుగా వున్న ప్రాణులు.

వాన తగ్గినా గాలి ఆగలేదు. వాన పూర్తిగా తగ్గనూలేదు. సన్నగా పెద్దగా ఉండివుండి వాన పడుతూనే వుంది. చలిగా వుంది.

వాళ్ళు పెద్దగా మాట్లాడుకొన్నదేంలేదు. చిన్నగా గొణుక్కుందీలేదు ఎదురెదురుగా నిలబడ్డారు. సిగ్గుపడుతూ నిలువెల్లా చూసుకొన్నారు. గంటలతరబడి మౌనయోగుల్లాగ విశ్వబ్దంగాఉన్నారు. విసుగయినా సుందరి ఏమయినా అడిగితే 'ఆ!' 'ఊ!' అనిమాతం రావు సమాధానం చెప్పాడు. రావు ఏమయినా అడిగితే సుందరి తలతో, చేతులతో బదులు చెప్పింది.

రైలు రాలేదు. కాలం ఆగలేదు వాన తగ్గలేదు రావు నిలబడే వున్నాడు. సుందరి పెట్టకొంగు నెత్తిమీద వేసుకొంది. వణికే వుంది. పిల్లలిద్దరూ బుద్ధిమంతుల్లా నిద్రపోతున్నారు. కుక్కలు ముసగర దీసుకొన్నాయి. అవ్వకు కునుకు పట్టింది. బిచ్చగాళ్ళు గురక పెట్టారు.

వాన పెద్దదైంది. వూపి వూపి కొడుతూ వుంది.

సుందరి నిలబడే వుంది.

రావు నిలబడే వున్నాడు.

'రావు!' మధ గొణిగాడు.

కిటికీ అక్కుండా కొట్టుకొంటూ వుంది. తలుపు ఊగుతూనే వుంది.

టౌంటేలోంచి జనం ఇళ్ళకు వెళ్ళిపోతున్నారు. సినిమా వదిలారో, ఆపారో! వాన హోరు చీకటి త్రిమూర్తుల్లా ముప్పేటవ పేనుకుపోయాయి.

'రావు!'

సుధకు భయం పట్టుకొంది. రావు రాకపోతే తాను చనిపోతే ఏం లాభం? రాధకు తన త్యాగం తెలియాలి. ముగిసిన త్యాగం తెలిసినా ప్రయోజనంలేదు. చేయగలిగిన త్యాగం చేస్తున్నప్పుడే తెలియాలి.

బ్రతుకు పజావుగా ఉన్నంతకాలం చావాలని తీవ్రంగా అనిపించింది. చావు సమీపం ఐవుతుంటే బ్రతకాలనిపిస్తుంది! తనిప్పుడిలా బ్రతికి చావటం?

'రావు!'

బలంగా లేచినిలబడ్డాడు సుధ. తను చావరాదు. 'బతకాలి. రాధకోసం బ్రతకాలి.' తలుపు దగ్గరకు చేశాడు. వీధిలోకి నడిచాడు. ఊరంతా చీకటి రాట్నంలాగా తిరుగుతూవుంది. కాళ్ళు తేలిపోతున్నాయి. ముమ్మరంగా వాన! ఊపుగా జల్లు! వీధంతా నీళ్ళు! విపరీతంగా చలి! దట్టంగా చీకటి!

పల్లె బస్తీ ఉరఫ్ బస్తీ పల్లె చీకటిలో ముడుచుకొని పడుకొంది. వీధిలో మనుష్యులు లేరు.

సుధ హాస్పటల్ కి పోవాలని సంకల్పం. నోట్లోంచి నురుగు ఎక్కువయింది. నాలుక పీక్కుపోతూవుంది. కాళ్ళు లాగుతున్నాయి. తల ఉంగరాలు తిరుగుతూ వుంది.

ఎవరో ఎదురయ్యారు. అడిగితే తెలిసింది. ఆ వూళ్ళో హాస్పిటల్ లేదు ఇద్దరు డాక్టర్లున్నారు. ఒకరు వీధి చివర, రెండోవాళ్ళు పై వీథి మొగదల డిస్పెన్సరీలు పెట్టుకొన్నారు ఆ సమయంలో వాళ్ళు డిస్పెన్సరీలో ఉండవచ్చు. వర్షమని మానేసివుంటే చెప్పలేం!

హాస్పటల్ లేదన్నప్పుడు దాదాపు ఆగిపోయిన గుండె డాక్టర్లున్నారనగానే ఆడటం మొదలుపెట్టింది.

సుధ బలమంతా కూడదీసుకొని వీధి చివరకు చేరుకొన్నాడు. వానలో తడిసి ముసుగు పెట్టుకొన్న మనిషిలాగా నర్సింగ్ హోం అనబడే గది వేపచెట్టుకింద చీకటితో మంతనాలు ఆడుతూ కూర్చుంది. పోయి చూస్తే తలుపు వేసివుంది. ఎంత తట్టినా ఎవరూ పలకలేదు. బాదినా తలుపు తీయలేదు. మోత ఎక్కువయిందేమో పక్కింటి మనిషి బైటికి వచ్చాడు.

'ఎవ్వడాడు?' ప్రశ్నించాడు.

'నేనే! సుధని-అదే దిక్కులేనివాణ్ణి-డాక్టరుకోసం చావు బ్రతుకులో ఉన్నాను' కష్టపడి చెప్పాడు.

పక్కింటి మనిషి మూడు ముక్కల్లో చాలా సంగతి చెప్పాడు. డాక్టరుకి ఏభయ్యేళ్ళు! పిల్లల్లేరు. అయితే ఈమధ్య లేక లేక నెల తప్పింది. ఎక్కని కొండ ఎక్కకుండా, మొక్కని దేవుడికి మొక్కకుండా, మునిగిన గంగలో మునక్కుండా, డాక్టరు పూజలు చేయలేదుకానీ చూపిన డాక్టరుకు చూపకుండా, తిరిగిన హాస్పటల్ కి తిరక్కుండా, పోయినవూరికి పోకుండా వైద్యసదుపాయం చేయించాడు. పెరటిచెట్టు వైద్యానికి పనికిరాదంటారు. ఇంత పెద్ద డాక్టరు, ఇంటావిడకు పురుడు పోయలేకపోవటం పెద్దవింతే! వారం తర్వాత వస్తుందనుకొన్న పురుడు అర్జెంటుగా వారం ముందువచ్చి వారెంటు లేకుండా అరెస్టు చేసింది.

ఆ వూళ్ళోవున్న తన ప్రత్యర్థి కు రడాక్టరు ఎ రినాగమ్మ పిల్లకాకికేం తెలుసు ఉండేలు దెబ్బ! అందుకని, పట్నం తీసుకుపోవటానికి వీల్లేని వీలివ్వని భార్యనీ, తను పురుడు పోయలేని వీల్లేని భార్యనీ, తనకు పోటీ డాక్టరయిన ఎ రినాగమ్మ దగ్గరకు తీసుకుపోలేని పోరాని భార్యనీ, బీదా బిక్కీకి, దిక్కూ దివాణం లేనివాళ్ళకి,అలగావాళ్ళకి అనువ్రతి మంత్రసాని మంగమ్మ. ఆమె కొండంత బలంగా అండకావలసి వచ్చింది.

మంత్రసాని మంగమ్మ చేతులు కాళ్ళులాగా పట్టుకొని, విదిలించి కొడితే ఓర్చుకొని, డాక్టర్లంతా చేతకానివాళ్ళంటే నమ్మి నిజమని అంగీకరించి, తన డాక్టరికం ఎంత గొప్పదో ఆమెచేత చెప్పించుకొని ఒప్పుకొని, ఆమెని ఏ విషయంలోనూ కాదూ కూడదూ అనకుండా, ఆమె ఒత్తిన ఒత్తుల్సన్నిటికీ ఓర్చుకొని, ఆమె ఆడమన్నట్లు అల్లా ఆడి, పాడమన్నట్లు అల్లా పాడి, మంత్రసాని మాటిస్తే డాక్టరు కిట్టులాగా పట్టుకొని పాతసైకిల్ మీద పెట్టుకొని, రిక్షా తీసుకురమ్మంటే తీసుకువచ్చి, టాప్ వేయమంటే వేసి, తన ముసలి సైకిల్ రిక్షాతో పోలేక వెనకబడితే ఆమె కసిరితే పరిగెని, ఇంటికి ఆమెను చేర్చి, తాను సురక్షితంగా చేరి భార్య బాధని, మంత్రసాని మంగమ్మను మరో అధ్యాయంలో భార్య పడుతున్న నొప్పులకు అప్పజెప్పి, వరండాలో నిక్షిక కథానాయకుల్లా పచారు చేస్తూన్న డాక్టరు సింహను పుచ్చుకొన్న కలెక్టరు పోజ పెడుతున్నాడు.

అందువల్ల హాస్పటల్ కి రాలేదు.

అంతా తెలిసిన పక్కింటాయన అటూ ఇటూ అవుతున్న సుధను తేరిపార చూసి ఎందుకొచ్చిన బెడద అని రపీమని తలుపు వేసుకొన్నాడు.

పక్క వీథి మొగదలదాకా తాను పోగలిగితే ఎంత బాగుండును. దేవుడిమీద నమ్మకం పెరిగింది సుధకు కాళ్ళు నీళ్ళలో తడుస్తుంటే కళ్ళలో నీళ్ళు పుడుతున్నాయి. పెరుగుతున్నాయి. వాగయి చెక్కిలి మైదానంలో చిమ్మంచి కొట్టాయి.

డాక్టరు ఆనందరావు క్లీనిక్ చేరేసరికి గగనమయింది. తల ప్రాణం గాలిలో కలిసినట్లు అయింది. సుధ మెట్లు ఎక్కుతుంటే డాక్టరు ఆనందరావు దిగటానికి మెట్లవైపు వస్తున్నాడు.

ఆనందరావు హస్తవాసి మంచిది. మూడేళ్ళలోనే ప్రాక్టీసు ముమ్మరమయింది

తనొక్కడే, క్లినిక్ ప్రారంభించినప్పుడు అన్ని పనులూ చేసుకొనేవాడు. ఇప్పుడొక కాంపౌండరు, నర్సు ఉన్నారు. కొద్ది రోజుల్లో తన క్లినిక్కి పక్క బిల్డింగ్ కట్టించుకోవాలని చూస్తున్నాడు. ఇంకా ఇద్దరు నర్సులను,కాంపౌండర్లను చేర్చుకోవాలని చూస్తున్నాడు.

ఈ విధంగానే ప్రాక్టీసు రోజురోజుకీ పెరుగుతూ వుండటం, దేవుడిదయవల్ల ఈ వూరికింకా హాస్పటల్ లేకపోవటం ఇంకా కొంత కాలందాకా రాకపోతే, ఇప్పుడు కట్టించబోయే పదిబెడ్ల హాస్పటల్ ఎంతగానయినా పెంచటానికి వీలుండటం ఆనంద రావుకు సంతోష సంగతులు.

ఊరు మధ్యలో రెండెకరాల ఖాళీస్థలం కొనుక్కోగలిగాడు. ఆలోచనల్లో భవిష్యత్తును భద్రంచేసుకొంటున్నాడు.

ఆ చుట్టుపక్కల పల్లెలకు డాక్టరులేడు. ప్రైమరీ హెల్త్ సెంటర్ కొంతదూరానవుంది. అది దాటిపోవటం, రావటం ఈపల్లెల కింకా అలవాటు కాలేదు. ఆ ఏర్పాటు జరగలేదు.

పట్టణాలలోనేకాదు పల్లెల్లోనూ నానాటికీ రోగాలు పెరుగుతున్నాయి. జనానికి పాతమందులమీద, పల్లె వైద్యంమీద రోత పుట్టింది. పట్నం డాక్టరు మీద మోజు పెరిగింది. డాక్టరు ఆనంద రావు మొదట్లో దిగాలుపడ్డా, దిన దిన ప్రవర్ధమానంగా పెరుగుతున్న రోగుల్నిచూసి ఆనంద పరవశుడవుతున్నాడు. రోగంతో జనం అరుస్తుంటే, తన్నుకులాడుతుంటే ఎక్కళ్ళేని సంతోషంతో ఆనంద రావుకూపిరి తిరగదు. ఆనందరావు అదృష్టమో, రోగుల దురదృష్టమో వాళ్ళు రోగంతో చిరంజీవులవుతున్నారు. చేతినిండాపని, చేసినంత సంపాదన. డాక్టరు ఆనందరావు రోజు రోజుకీ దర్జా ఆనందరావు అయిపోతున్నాడు.

అంతకుముందే కాంపౌండరుని పూలు తెమ్మని పంపాడు డాక్టరు ఆనందరావు. నర్సు ముందే వెళ్ళిపోయింది. తలుపుకు తాళం వేయబోతున్నాడు. ఏప్పుడయినా కాంపౌండరు రావచ్చు. పూలు తేవచ్చు. తను స్కూటర్ స్టార్ట్ చేయవచ్చు.

పూలూ, ఇల్లూ గుర్తుకువస్తే ఆనందరావుకు కాలునిలవదు కాలుగాలిన పిల్లిలాగా తిరగడు. ఊగిపోతూ వుంటాడు. పూలవాసన గుర్తుకువస్తేనే పై ప్రాణం పైనే పోతా వుంటుంది.

ఆనందరావు సుధనుచూసి ముఖంలోని ప్రశ్నను కనుబొమల్లో ఏడేసి నిలబడ్డాడు.

'విషం తాగాను. బతికించండి'

ఆనందరావుకు అర్థంకాలేదు. రెండు క్షణాలు కనుబొమలు అలాగేవుండిపోయాయి. క్వశ్చన్ పేపరులోని ప్రశ్నలేవీ అర్థంకాని విద్యార్థిలాగా వున్నాడు డాక్టరు.

'మీకు దణ్ణం పెడతాను. నన్ను బతికించండి.'

'వీల్లేదు. నేను పోవాలి' ఆనందరావు ముందుకు వచ్చాడు.

'నేను బతకాలి! బతకాలి!' సుధ అరుస్తున్నాడు.

నర్సులేదు, కాంపౌండరు లేదు. పూలువస్తాయి. ఇల్లుంది. పోవాలి. డాక్టరు ఆనందరావు నిలబడలేకపోయాడు. ముందుకు సాగాడు.

సుధ వెర్రివాళ్ళా వున్నాడు. డబ్బుదస్కం వున్నట్టు కనపడటంలేదు. వెంట ఎవరూలేరు. ఆగినా లాభసాటి పనిగాలేదు. ఎందుకొచ్చిన ఆయాసం. పోవాలి. డాక్టరు ఆనందరావు కదిలాడు.

సుధ వాకిట్లో అడ్డంగా నిలబడ్డాడు. 'నేను బతకాలి బతకాలి' ఏడుస్తున్నాడు.

ఆనందరావు ఆగాడు. అర్థ ధర్మం చెలామణి అవుతున్న కాలంలో దేవతలెవరో పారేసుకొన్న గుండెకాయముక్క పడిన నేలలోని మట్టి తన శరీర నిర్మాణంలో ఏ మాత్రమో కలిసివుంటుంది. దయ లాంటిదేదో గుండెలో తళుక్కుమంది.

పోనీ ఆగితే, మందువాడితే, కుర్రాడు బ్రతికితే - రెండు క్షణాలు గడిచాయి.

తనకేం లాభం ?

లాభంలేని పని ప్రపంచంలో ఏ ప్రాణీ చేయదు. తనెందుకు చేయాలి. డబ్బురాదు! పోనీ కీర్తి వస్తుందా ? ఏమో! ఏమవుతుందో! ఇతనికి విషం ఎవరయినా ఇచ్చారో, తనే తాగాడో! ఏం ప్రమాదమో! వెళ్ళాలి.

పూల సువాసన నసాళం అంటేటట్టు తగిలినట్టు అయింది. ఆనందరావు నిలబడలేక పోయాడు. పోవాలి. బయలుదేరాడు.

సుధ డాక్టరు కాళ్ళమీద పడ్డాడు.

మళ్ళీ ప్రాచీన దేవతల గుండెకాయ వాసన! ఆగాడు, మేలు లేకపోయినా కీడు రాకపోతే ఫరవాలేదు. బ్రతికితే దేశజనాభాలో ఒక ప్రాణి తగ్గదు. చస్తే ఎవరో, ఏవూరో, ఏమో! కోర్టు పోలీసులు సాక్ష్యం గోల! అంతవరకే అయితే ఫర్వాలేదు. ప్రాక్టీసు ఏమవుతుందో! ముసలి పీనుగ అవకాశంచూసి ఏం ప్రచారం చేస్తాడో! కట్టబోయే హాస్పటల్, కొనబోయేకారు, రాబోయే నర్సులు, కాంపౌండర్లు, రోగులు అంతా నాశనం.

ముందుకు పోబోయే ఆనందరావుని సుధ గట్టిగా కాళ్ళు పట్టుక్కూర్చున్నాడు.

రాక్షసుల కోరల్లోని పదార్థం ఆనందరావు కాళ్ళ తయారీలో చేరింది. అందులోంచి జాలిరాదు. చెమటరాదు. చలనంలేదు. విదిలించుకొన్నాయి. కదిలాయి.

ఆ కడుపుకు విషం తలకెక్కి తబ్బిబ్బు అవుతున్న సుధ ఆశ అడుగంటి చస్తున్నసుధ, బ్రతుకుమీద క్షణక్షణం మమకారం క్షీణించి పోతున్న సుధ, మూడు మెట్లమీంచి జారి రోడ్డుమీద పడ్డాడు.

వాన పూపూపి కొడుతూవుంది. ఈతలు మోతలుగా హోరు గాలి గోల పెడుతూవుంది. చీకటి గుండెలు బాదుకొంటూ ఏడుస్తూ వుంది.

తలుపులువేసి, తాళంవేసి, క్లీనిక్ మెట్లు దిగుతున్నప్పుడు కాంపౌండరు వచ్చాడు. స్కూటర్‌స్టార్ట్‌చేసుకొని పూలుతీసుకొని ఆనందరావు వెళ్ళిపోయాడు.

నీళ్ళను చీల్చుకొంటూ, బెల్లు వాయించుకొంటూ, లైటు వేసుకొంటూ కాంపౌండరును మోసుకుపోయింది, రోడ్డుమీదపడ్డ సుధను చూడని సైకిల్.

సుధ లేచాడు. కొక్కెర తెగులు తగిలిన కోడి మెడలాగా తల నీలుగుతూవుంది. జాయింట్లు తొలగిన ఇనుం కడ్డీలులాగా కాళ్ళూ చేతులూ ఎటుపడితే అటే పోతున్నాయి. గొంతులోంచివచ్చే నురుగులో గురక తడిసి మొరటుగా మోగుతూవుంది. గుండె ఆడుతూ వుందో లేదోకాని తల చిందువేస్తూవుంది. అంతసేపట్లో ఆమాత్రం దూరంవచ్చి సుధ పడిపోయాడు.

మంత్రసాని మంగమ్మ కూర్చోమంటే కూర్చుని, నిలబడ మంటే నిలబడి, రమ్మంటే దగ్గరకువచ్చి, పొమ్మంటే దూరంగాపోయి డ్రిల్లు చేస్తున్నాడు ముసలిడాక్టరు ఉరఫ్ పాతభర్త ఉరఫ్ కొత్త తండ్రి. భార్య అరుపువినబడితే శివం తొక్కుతున్నాడు.

స్నానంచేసి, భోజనంచేసి, పూలుజల్లి పూలుపెట్టి, చలిలో, వానలో, చీకటిలో మత్తు సువాసనతో మంచంమీద దొర్లుతున్నాడు. కుర్రడాక్టరు భార్య సన్నాయి నొక్కులకు వళ్ళంతా చిక్కుదారం ఉండలా చుట్టుకుపోతూ వున్నాడు.

సుందరిని చూస్తున్న రావు మాట్లాడకుండా అక్కడే, కదల కుండా, అలాగ్గే, సృష్టివిచిత్రాన్ని మళ్ళీ తల్చుకోకుండా, పనేమీ లేకుండా, ఊరికనే, ఆలోచన రాకుండా, మామూలుగా, ఏమీ పాలు పోక, ఏమీతోచక అక్కణ్ణుంచి పోబుద్ధి పుట్టక, సరదాగా కదలక ఊసుల్లేక, మెదలక విలబడే వున్నాడు.

పట్టణంలో అమ్మ పక్కలో పడుకొన్న రాధ వళ్ళు నిక్క బొడుచుకొంటే చలిగాలి అని తలుపు వేసుకొని, నిద్రపట్టటంలేదని, అమ్మదగ్గరకు జరిగి, మరీ అతుక్కొని, కిటికీలోంచి, చీకట్లోంచి, వానలోంచి, గాలిలోంచి దూరంగా కనిపించని నక్షత్రాలు, వినిపించని అరుపులు, ఎదురుకాని దృశ్యాలు, లేని బొమ్మలు రానిభయం, ఉండ లేని ప్రశ్నలు జవాబులు–కళ్ళుమూసుకొంది.

సుధ తోకతెగిన తొండలాగా కొట్టుకొన్నాడు. మెడకోసి వది లితే ఎగిరే పశువులాగా పక్షిలాగా కొట్టుకొన్నాడు. కాళ్ళూ చేతులూ నాలుగు దిక్కులకూ చాచి చాచి నీళ్ళలో తపతపా కొట్టుకొంటు న్నాడు.

అప్పుడొకరు ఇప్పుడొకరు వస్తున్నారు పోతున్నారు. కొందరు శబ్దం విన్నారు. కొందరు వినలేదు. విన్నవాళ్ళు కొందరాగలేదు, కొంద రాగారు. ఆగినవాళ్ళు కొందరు చూశారు, కొందరు చూళ్ళేదు. చూసినవాళ్ళు కొంతమంది గొణిగారు, కొంతమంది మూలిగారు. ఒకళ్ళిద్దరు వెర్రికేకలు వేసి వెళ్ళిపోయారు. ఎవరూ నిలబడలేదు.

సుధ కాళ్ళూ చేతులూ ఆడించటంలేదు. ఎటు అంటే అటే పడేసి రోడ్డుమీద పడుకొన్నాడు. వాననీళ్ళు కాళ్ళమీదుగా తొడమీదుగా గుండె, గొంతు దాటిపోతున్నాయి. ఎన్నినీళ్ళు మింగాడో, ఎన్ని నీళ్ళు ఉమిశాడో అతనికేం తెలియదు. తాగటం తాగకుండా ఉండటం అతనికేం నిమిత్తంలేదు.

అక్కడ వీధి వుంది. దానికేం పట్టదు. అక్కడ వూరుంది. దానికేం తెలియదు. నిండా మనుషులున్నారు. వాళ్ళకేం లెక్కలేదు. కుక్కలున్నాయి. పురుగులున్నాయి. తిరుగుతున్నాయి. గాలివుంది. వాన వుంది. చీకటుంది. కదలికవుంది. రాత్రి వుంది. రోడ్డు వుంది. వూరు వుంది. సుధ ఉన్నాడు.

రాత్రంతా నొప్పులువడి అరిసి అరిసి గగ్గోలెత్తిన ముసలి డాక్టరుభార్య తెల్లారుగట్ల పసికేక విని ఆనందంగా ఏడుస్తుంటే బట్ట ఊడిపోతున్న పెద్దడాక్టరు వరండా పొడుగూ వెడల్పూ తొర తొరగా కొలుస్తున్నాడు.

పూలు నలిగి, మంచం నలిగి, రాత్రి నలిగి, తెల్లారు జాము మునగర దీసుకుపోతే చిన్న డాక్టరు ముడుచుకొని మూడంకె వేసుకొని నిద్రపోయాడు.

రాత్రంతా రాని రైలు తెల్లగా తెల్లారినప్పుడువస్తే సుందరిని ఎక్కించి, పిల్లల్ని అందించి, సంచీ చేతికిచ్చి వస్తానంటే 'ఊఁ!' అని వెళ్ళిపోయిన రైలుని చూస్తూ నిలబడ్డ రావు కాసేపటికి తెప్పరిల్లి వెనక్కు తిరిగాడు.

కెవ్వున కేకవేసి దభీమని మంచంమీంచిపడి పీడకల అని గొణు గుతూ వణుకుతూవున్న రాధను కసిరి విసిరి మంచంమీద పడేసుకొని, కడుపులోకి లాక్కుని దుప్పటికప్పి నిద్రపోయిన తల్లిప్రక్క మేల్కొన్న రాధ!

తెల్లారేసరికి బ్రతుకు తెల్లవారిన సుధ చేతి గడియారం మాత్రం ఆడుతూ వుంది.

కల

శ్రీ జ్వాలాముఖి

కల

నిజంగా కల

మాట్లాడుతున్నాను మహాశక్తిలా
అనాల్సింది అనేస్తున్నాను ఒక వ్యక్తిలా
అడగాల్సింది అడిగేస్తున్నాను జన్మహక్కులా —
ఆందోళనలో ఆక్రందనలా మూర్తీభవించాను
మందహాసాలతో మచ్చిక నుచ్చరించారు
విచ్చుకత్తులు ఝుళిపించి హెచ్చరించారు
నా ప్రశ్నలు కొడవళ్ళ వానలా తారెత్తించాయి
తట్టుకోలేక కత్తులు కుక్కి నోరు నొక్కేశారు—
చిత్రం !
కలియబడ్డ నాలుక పడగలా లేచింది
వేయిచేతులతో దాడిచేసి పీకి పారేశారు
మహాబోధినయ్యాను మానవత ప్రవచించాను
వేదాలు సత్యం పుక్కిలించి అజ్ఞానం ధిక్కరించాయి
కేకులుగా కోసి పీడ విరగడైందనుకున్నారు—
విరిగిన బుగ్గలు నిగ్గుతేలి అగ్నిమొగ్గలై ఆడాయి
ముళ్ళతీగతో ముఖం చుట్టి పడేశారు కంచెలా
కళ్ళు కాగడాలై సుందర సత్యమై ప్రతిఘటించాయి
కళ్ళు నూడబెరికి కసి మసంగుతూ ఉఫ్‌మన్నారు అమాసలా
వెలితిపడ్డ కళ్ళ నూతులు ఘాతుకాల్ని ఖండించాయి నిశ్శబ్దంగా
ముప్పిరిగొన్న మౌనం మొండి ఘటమై మానిషాద ఘోషించింది
తలకోసి తుత్తునియలు చేసికాని ఊరుకోలేదు ఉద్భటులు
అద్భుతం !
మొండెం మాట్లాడసాగింది
కోతికి తేలుకుట్టినట్లైంది
కల కిరాతకులు స్లైసులుగా మెడను కోయసాగారు
చెంగునెగిరి గుండె ఆకాశాన్నావరిస్తే పట్టి చెండారు
ఆశ్చర్యం !
కత్తివేటుపడినచోటల్లా పాటల ఊట
విముకలగూడు ఎడతెగని ప్రశ్నలవాడ
మెదడు. ఘాతకుల్ని ఖాతరు చేయలేదు
ప్రాణంజాడ పాపులకు పట్టుబడలేదు
పళ్ళు పట పటా కొరికి కళ్ళ నిప్పులు రాల్చారు
మాంసాన్ని ముద్దచేసి పేగుల పాడెలో పడేశారు
ఖండితాంగాల్ని ఆఖరిసారిగా తగలేశారు
విచిత్రం !
మంటలు మాట్లాడసాగాయి
మెదడు విముక్తిగీతం అందుకుంది
తలతిరిగి, చితిని నెత్తుటి నదిలోకి నెట్టారు
కదం తొక్కుతూ నది నాట్యం చేయసాగింది
కలకసాయిూలు నదిని సముద్రంలోకి మళ్ళించారు
లోతుతెలిసీ, పోటుకాసిన మహా సముద్రం
ఉవ్వెత్తున లేచి ఉప్పెనై విజృంభించింది
గజ ఈతగాళ్ళు గొల్లుమన్నారు
తల్లడిల్లారు తలకిందులయ్యారు
తలాతోకా సర్దుకోలేక తికమకపడ్డారు
కడసారి చావు తెలివికూడా పడవ కాలేదు
నదీనాం సాగరో గతి
పాపీ చిరాయుః వు కధోగతి —
చోద్యం !
సముద్రగర్భంనుండి మూట మోసుకొచ్చాడు 'చరిత్రతాత'
అక్షయ అంగాంగాల్ని అతి భద్రంగా అప్పగించి వెళ్ళాడు
నెత్తురు చెండులా ఎగసిపడుతూన్న గుండెయధాస్థానం చేరింది
జ్వలిత జ్వాల లాంటి మెదడు కాంతి కిరీటమై ధగధగలాడింది
కాళ్ళూ చేతులూ కెరటకెరటాలుగా కవాతుచేశాయి
మహాగ్నిగోళం ఆటుపోటులమించి నడచివచ్చింది
సకలచరాచర జగత్తు ఉజ్వల హృదయంతో పులకించింది
శతసహస్ర కిరణారుణజ్వాలా తోరణ తూర్యారావాలు
ప్రపంచ మానవాళి మోసులెత్తిన కల్యాణవేళ
సూర్యోదయం
సుప్రభాతం
అనూహ్య మచింత్యం
అత్యద్భుతమీ చిత్రవిచిత్రం —
కల
నిజంగాకల

ప్రథమాంధ్ర విప్లవకవి పాల్కురికి సోమన్న

శ్రీ ముదిగొండ ఈశ్వరచరణ్

యే రుద్ర లోకాదవతీర్య రుద్రా
మానుష్య మాశ్రిత్య జగద్ధితాయ
చరంతి నానావిధ చారు చేష్టాః
తేభ్యో నమశ్శంకర కింకరేభ్యః !

కవిత్వం వ్రాయాలంటే ప్రతిభ, పాండిత్యం, లోకానుభవం, దైవతానుగ్రహం కావాలి అంటారు. కాని ఆలోచిస్తే అసలు మూలం 'ఆవేశం' అని తెలుస్తుంది. ఆవేశం గుండె నిండినప్పుడే కవిత్వం దండిగా వస్తుంది. 'మానిషాదం' పుట్టింది ఆవేశంలోనే! సహజ కవులు, సహజ పండితులు పుట్టేది ఆవేశంలోనే! ఐతే ఆవేశానికి ప్రతిభ తోడ్పడితే పూవుకు తావి అబ్బుతుంది.

పాల్కురికి సోమన్న తావిగల పూవు. నిండైన ఆవేశంతో దండైన కవిత్వం సృష్టించినవాడు. వేదవేదాంగాలు, పురాణేతిహాసాలు, దర్శనాలు, ఆగమాలు, కావ్యనాటకాలంకారాలు సమ్యగా జీర్ణం చేసుకున్నవాడు. తత్త్వ విద్యాకలాప కవితాసారుడు. అష్టభాషా ప్రవీణుడు. అన్యవాద కోలాహలుడు. సంగీతశాస్త్ర పారగుడు. భాషాభూషణుడు. మాతృమార్గ ప్రవర్తకుడు. శైవవాఙ్మయ ప్రతిష్ఠాపకుడు.

అతడిని గూర్చి మనకు తెలిసింది చాలా తక్కువ. కాని మనం పెంచుకున్న వాదాలూ-వివాదాలూ చాలా ఎక్కువ. అతడు క్రీ. శ. 1240 ప్రాంతంలో ఓరుగల్లు సమీపంలోని పాల్కురికి గ్రామంలో జన్మించాడు. తల్లి శ్రియాదేవమ్మ. తండ్రి విష్ణురామిదేవుడు. దీక్షాగురువు గురులింగార్యుడు. శిక్షాగురువు కట్టకూరి పోతిదేవర. సాహిత్యగురువు కరస్థలి విశ్వనాథుడు.

అతడి సాహిత్య తత్త్వాన్ని పరామర్శించేముందు ఆనాటి రాజకీయ, మత, సాంఘిక, సాహిత్య రీతులను తొలుత అర్థం చేసుకోవాలి. ఆనాడు ఓరుగల్లు రాజధానిగా కాకతి రెండవ ప్రతాపరుద్రుడు రాజ్యం చేస్తున్నాడు. ఉత్తర భారతంనుండి తురకల వడగాలులు వీస్తున్నా మొత్తంమీద దేశం సుస్థిరంగానే ఉంది. తొలి కాకతీయులు జైనులైనా తరువాతివారు శైవులు కావటంచేత జైన బౌద్ధాల ప్రాభవం ఒక అడుగు వెనుకబడ్డా పూర్తిగా చెరగిపోలేదు. నన్నయగారి భారతాంధ్రీకరణతో వైదికం కొత్త ఉత్సాహంతో ప్రజలను ఆకర్షించుకొన్నది. క్రమంగా అన్ని అనాచారాలు, దురాచారాలు, దౌష్ట్యాలు, దుండగాలు మతం ముసుగు కప్పుకొని చెలామణి కాసాగాయి. కులతత్త్వం మితిమీరి బ్రాహ్మణుడి ఆధికారం అంతులేకుండా తయారయింది. నన్నయగారు అవసరమున్నా లేకున్నా తమ మహాభారతంలో బ్రాహ్మణాధిక్యతను పెంచి సుస్థిరం చేశారు. మానసికమైన పవిత్రతకన్నా యజ్ఞాలు, యాగాలు మొదలైన కర్మకాండకు విలువ హెచ్చి ఒకరకంగా మతాన్ని, దేవుడిని, సామాన్యుడి అందుబాటులో లేకుండా చేశాయి. నన్నయగారు ప్రారంభించిన సంస్కృతపద భూయిష్ఠమైన రచన తెలుగు పీకనొక్కి మార్గ సాంప్రదాయాన్ని ప్రతిష్ఠాపించింది. తిక్కనగారిలాంటివారు కొంత తెలుగుతనాన్ని నిలబెట్టినా సంస్కృత ప్రభావాన్ని త్రోసి రాజనలేకపోయినారు. తనది 'దేశి'యని 'వస్తుకవిత' అని చెప్పుకున్న నన్నెచోడుడు కూడా 'మార్గ'ను మరచిపోలేక పోయినాడంటే ఆ ప్రభావం ఎంత బలీయమో అర్థం అవుతుంది.

ఈ పరిస్థితులలో దక్షిణాపథాన ఉన్న కన్నడ దేశంలో అల్లమప్రభువు, బసవన్నలు అవతరించారు. మతంలో, భావంలో, భాషలో వారు కొత్త త్రోవలు త్రొక్కారు. కులము, మతము అనే భేదం లేకుండా సర్వజనులు సమానమే అని, యజ్ఞాలు యాగాలు లేకుండా కేవలం స్వచ్ఛమైన భక్తిచేతనే పరమేశ్వరుడి దర్శనం పొందవచ్చని ప్రబోధించారు. సంస్కృత పద భూయిష్ఠమైన 'మార్గ' కవితా మార్గాన్ని వదలి ప్రజల భాషలో, ప్రజలకొరకు, ప్రజల సాహిత్యాన్ని సృష్టించారు. ఈ క్రొత్త మతం ప్రజలను ఆకర్షించింది. ముఖ్యంగా మానవులంతా ఒక్కటే అనే నినాదం వారిలో క్రొత్త చైతన్యాన్ని కలిగించింది.

పొరుగునున్న తెలుగునేల నాలుగు చెరగులా బసవన్న వీరశైవం, దేశి సాహిత్యం గట్లుతెగిన ప్రవాహంలా పొంగి పొరలింది. మల్లన్నవంటి పండిత మాన్యులు ఈ క్రొత్తదనానికి స్వాగతం చెప్పారు. ఈ వీరశైవం ఒకవంక బౌద్ధ జైనాలను, మరోవంక వైదిక కర్మకాండను తీవ్రంగా ప్రతిఘటించింది. కులాలు, మతాలు నిర్మించిన అడ్డుగోడలను నిర్మూలించి సంఘంలో అట్టడుగున పడివున్న సామాన్యుడిని రాజుల సరిగద్దెపై కూర్చోపెట్టింది. గుళ్ళలో,

గోపురాలలో, కోంతకుంది గర్భాలలో దాగుకొన్న దేవుడిని బయటకు లాగి అందరికీ అందుబాటులోకి తెచ్చింది. సామ్యవాదానికి ఈనాడు 'కమ్యూనిజం' లాగా ఆనాడు 'వీరశైవం' ఆటపట్టైంది.

సరిగా ఈ మార్పు ప్రారంభం ఐన కాలంలో జన్మించాడు పాలకురికి సోమన్న. తెలుగు నేలమీద మొదటి సారిగా విప్లవం ప్రాణం పోసుకున్నది. తన చుట్టూ గాఉన్న పరిసరాలు ప్రాభవాలు ఆతడికి రుచించ లేదు. సమకాలీన సంఘంమీద, బ్రాహ్మణాధిక్యత మీద, భాషమీద, భావంమీద, కట్టుబాట్లమీద ధ్వజమెత్తాడు. అతడు ఉత్సాహవంతుడు. యువకుడు. అమేయ ప్రతిభా సంపన్నుడు. అలౌకిక పాండితీ మండితుడు. అన్నింటికన్నా మిన్నగా అత్యంత ఆవేశ పరుడు. హిమగిరి శిఖరాగ్రంనుండి జారిపడే గంగా ప్రవాహంకన్నా ఉరవడి కలది అతడి ఆవేశం. బసవన్న వీరశైవం ఆ మహాప్రవాహాన్ని పరియరిలి కట్టుకట్టి నిలవేసి తనలోకి మలచుకొన్నది.

తొలి నాళ్ళలో సోమన్న మల్లికార్జున పండితారాధ్యుని రచనలు చదివాడు. అనుసరించాడు. పండితయ్య 'శివతత్వసారం' వ్రాస్తే తాను 'అనుభవసారం' వ్రాశాడు. ఆయనకు వలెనే తానుకూడా మార్గ కవితా రీతులనే అవలంబించాడు. ఆతరువాత బసవన్నకు చేరువ అయ్యాడు. ప్రథమాంధ్ర విప్లవకవి వెలుగులోకి వచ్చాడు. మొట్టమొదటి ప్రజాకవి ప్రభవించాడు.

ఆయన కాలంలో "వృత్తానిది పెత్తనం. చంపూ కావ్యాలది సామ్రాజ్యం. సంస్కృత సమాస భూయిష్ఠమైన రచనది సార్వభౌమత్వం. కావ్యం వ్రాయాలంటే వ్యాసుడి దగ్గరకు పరుగెత్తాలి. పురాణాలను వెతకాలి. ఇతిహాసాలను నెమరువేసుకోవాలి." ఈ బానిస భావానికి వ్యతిరేకంగా కత్తికన్నా వాడియైన గంటం పట్టాడు సోమన్న. ఆయనకు దంపుళ్ళ పాటలు వినిపించాయి. వెన్నెల పదాలు హాయినికూర్చాయి. తుమ్మెద పదాలు చెవులలో గూళ్ళు కట్టుకున్నాయి. తెలుగు కన్నెపిల్లల నోళ్ళలో నలిగి వంకలుదీరి కయ్యాచ్చు సాగిన తరువోజ చేతికందింది. దానిని విరచి త్రుంచి మార్చి ద్విపదగా స్వంతం చేసుకున్నాడు. ఛందస్సు సిద్ధమైంది. భయంకరాలైన పులులను, ఏనుగులను మూలకు నెట్టి జానపదుల గుండె గొంతుకలో కొట్టాడే ద్విపద రంగస్థలాన్ని ఆక్రమించింది. సోమన్న రెండవదాడి భాషపై ప్రారంభించాడు. ప్రజలకూ పండితులకూ మధ్యవున్న అగాధాన్ని పూడ్చివేసి తాను వారిలో ఒకడై వారి పలుకుబళ్ళను, వారి ఉక్తులనూ, సూక్తులనూ సమాదరించి వ్యాకరణపు శృంఖలాలను ఛేదించుకొని వారి మాటలను వేదాల సరిబంతిలో కూర్చోబెట్టాడు. ఆయన నాయకత్వంలో ఓరుగల్లు దేశ్యాలు రాజమహేంద్రవరం తత్సమాల మీద తిరగబడ్డాయి. అంతవరకు సాహిత్యాన్ని స్వంతం చేసుకున్న రాజుల ముట్టడులను, రాణుల ప్రేమ పురాణాలను బహిష్కరించి సమాజం చేత హీనంగా చూడబడే చాకళ్ళకు, మంగళ్ళకు, పంచములకు పెద్దపీటవేశాడు. కుక్కపిల్లలూ, అగ్గిపుల్లలూ 13వ శతాబ్దంలోనే కవితకు బలం కూర్చాయని మరచిపోకూడదు.

ఇన్ని కొత్త దనాలను ఒక్కసారే ఏ సంఘంఐనా ఆమోదించడం కష్టమే! ఎన్నో నిందలు. మరెన్నో అపనిందలు తిప్పవు. "పాల్కురికి సోమ పతితుడు మధ్య వళ్ళుబెట్టి ద్విపదలో వ్రాసిన క్రొత్త పురాణమిది అప్రమాణము. అనాద్యము" అని ఈసడింపులు. సోమన్న దేనినీ లక్ష్యపెట లేదు. తిరుగబడి తిట్టాడు తన ఉద్యమం పరమ పవిత్రమని చాటి చెప్పాడు.

"తెలుగు మాట లనంగ వలదు
వేదముల కొలదియ జూడుడి!"

"ఉరుతర గద్యపద్యోక్తులకంటె
సరసమై పరగిన జాను తెనుంగు
చర్చింపగా సర్వ సామాన్యయగుట
గూర్చెద ద్విపదలు గోర్కి దైవార"

"జాతులు మాత్రాను సంధాన గణవి
నీతులు గాన 'యనియతి గణ్యై' ర
నియును 'ప్రాసోర్వా' యనియు 'యతిర్వా' య
నియు జెపమి ఛందో విసిహితోక్తిగాన
ప్రాసమైనను యతిపై వడియైన
దేసిగా నిలిపి యాది ప్రాస నియతి
దప్పకుండంగ ద్విపదలు రచియింతు!"

"ఉపమింప గద్య పద్యోదాత్త కృతులు
ద్విపదయు సమయ భావింప నెట్లనిన"

"అ వికల వేద వేదాంతేతిహాస
వివిధాగమ పురాణ విహిత సూక్తముల
నిద మిత్థమనుచోట నిదియ ప్రామాణ్య
పదములుగాగ ద్విపదలు సంతింతు!"

"సన్నుతి సేయుచు సత్కవు లలర
దిన్నని సూక్తుల ద్విపద రచింతు
పదియును గాక హైహికాముష్మిక ద్వి
పద హేతువగుట ద్విపద నాగ బరుగు."

అంటూ ద్విపదయొక్క వైశిష్ట్యం వైభవం బహుపలలో వర్ణించి సాహిత్య సామ్రాజ్యానికి తిరుగులేని పట్టంకట్టాడు. ఆ తరువాత తన శక్తికి సక్తికీ, భక్తికి కారకులైన బసవన్నను పండితయ్యను ఆలంబనం చేసుకొని తన ప్రజలను, దేశభాషలను, ఆచార వ్యవహారాలను తన కవితా కళచేత చిరంజీవులను చేశాడు.

సంఘ సంస్కర్త, మతప్రవక్త అని అశేష ప్రజానీకానికి ఆరాధ్యుడైన బసవన్న అంటే ఆయనకు అమితమైన భక్తి. ఆ పేరు వింటే చాలు ఒళ్ళు పులకరిస్తుంది. ఆవేశం పరుగులు తీస్తుంది.

"బసవేశు శ్రీపాద పద్మసేవకుండ,
బసవన్న పొగడ బాల్పడు పాఠకుండ,
బసవన్న దూత నే బసవన్న బంట,
బసవన్న లెంక నే బసవన్న లెంగి
బసవన్న యిలువుట్టు బానిస కొడుక
బసవన్న శరణన్న బాపక్షయంబు
బసవని శరణన్న బరమపావనము
బసవని శరణన్న భవరోగ హరము."

అదొక అంతులేని మహాప్రవాహం. అందులో ప్రసక్తానుప్రసక్తంగా "యాతత సకల పురాతన భక్త గీతార్థ సమ్మతియై మాతృక కాగ" "వాయార భక్తుల వర్ణింపగంటి, బాయక నా జిహ్వ పావనం బయ్యె"నన్న పవిత్ర భావనతో తొంబదిమంది భక్తుల భవ్యచరిత్రను గానం చేశాడు. ఆ ఒడలెరుగని భక్తిచేత వారు పునీతులైనారో లేదో గాని ఆ మహాకవితా ప్రవంతిలో దోగులాడటంచేత చిరంజీవులైనారనేది మాత్రం సత్యం!

కేవలం ఒక మతాన్ని, ఒక తత్వాన్ని ప్రచారం చేసేది కవిత్వం కాదు. అది జనులకు ప్రీతిపాత్రం కాదు. కవిత్వం ఒక కళ. మానవుడు పొందిన మహావరం. ఉపదేశం దాని లక్షణాలలో ఒక్కటి కావచ్చు. కాని ప్రధానంగా ఆనందింపచేయటం దానితత్వం. సోమన్న ఈ రహస్యం తెలియని వాడుకాదు. తన మతాన్ని ప్రబోధిస్తూనే కమనీయ కవితా శిల్పాన్ని, అమేయ వర్ణనా నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. ఆనాటి ఆలంకారిక సిద్ధాంతాలను ఆమూల చూడం మననం చేసుకొని వాటిని అనుసరించాడు. అతడు తిరగబడ్డది పై పై మెరుగులమీద. అతడు తలపెట్టింది మూలచ్ఛేదంకాదు. రాజ్యాంగానికి లోబడి రాజ్యాంగ పద్ధతులద్వారా విప్లవం కాంక్షించే రాజకీయ యోధుడాతడు. ఆయన తన కవితా సిద్ధాంతాలను ఈ రకంగా చెప్పుకున్నాడు.

"సత్కృతియన మాత్ర సంగతి దవర
దొమ్మిది రసములు దులుకాడు దాని
యిమ్మడి వర్ణన లెసగంగ ద్విగుణ
మగు నలంకారంబు లసరారు దాని
ద్విగుణార్థ భావముల్ దీటుకొనంగ"

"అల్పాక్షరముల ననల్పార్థ రచన
కల్పించుటయె కాదె కవి వివేకంబు".

"పటు గద్య పద్య ప్రబంధ సామ్యముగ
గావ్యకళా ప్రౌఢిగల్పింతు ద్విపద".

"ఉభయకావ్య ప్రౌఢి బాటించు శిల్పమునన్ బారగుడ"ననిచెప్పుకున్నాడు తిక్కనగారు. ఆయన గద్య పద్య ప్రబంధాలతో దీటుగునట్లుగా తాను కావ్య కళాప్రౌఢి ద్విపద కల్పిస్తానంటున్నాడు సోమన్న. అవి ఒట్టిమాటలు కావు. చివరంటా నిలచి తెలుగుకొక క్రొత్త వన్నెను కూర్చిన వనడ మాటలు. లోకోత్తర వర్ణనా నిపుణుడైనవాడు కవి అని ప్రతీతి. అతడి వర్ణనలు ఇందుకు ప్రత్యక్షర సాక్ష్యాలు. తల్లిలేని పిల్లల కడగండ్లు, తొలికోడి కూత, భక్తులు, పిచ్చుక కుంటలు, చెంచులు, వారి నడకలు, వారివేషాలు, చివరకు వారి చేతులలోని పలువన్నె బెత్తాలు ఆయన వర్ణించిన తీరు అనిదం పూర్వం. ఆ వర్ణనలను, ఆ పదబంధాలను, ఆ భావాలను తరువాత సాహిత్య సామ్రాజ్యం ఏలిన కవిరాజులు గుట్టుచప్పుడు కాకుండా 'కాపీ' కొట్టడంలోనే వాటి విశేషం తెలియవస్తుంది.

ఈనాడు సంఘ సంస్కారానికి, రాజకీయాల ప్రచారానికి కవిత్వం సాధనమైనట్లుగానే ఆనాడు మత ప్రచారానికి సాధనమైంది. నన్నయగారు, తిక్కనగారు వేద మతోద్ధరణకోసం భారతం వ్రాశారని చెప్పుకుంటూనే ఉన్నాంకదా! సోమన్న వీరశైవంకోసం వ్రాశాడు.

వీరశైవానికి బసవన్న ప్రవక్త. మల్లన్న ప్రయోక్త. సోమన్న లక్ష్య లక్షణ సంగ్రహీత.

బసవన్న అనుభావం స్పర్శవేది. ఆయన తాకినంతమాత్రాన ఇనుము బంగారమౌతుంది. మట్టి మాణిక్యమౌతుంది. హాలాహలం అమృతమౌతుంది. ఆయన మతంలో వాదాలులేవు. భేదాలులేవు. కేవలం భక్తులయొక్క అనుభూతి విశేషం ఆధారంగా ఆయన తన మతాన్ని ప్రచారం చేశాడు. భక్తి దాని ఊపిరి. విశ్వాసం దాని ప్రాణం.

మల్లన్న మహాపండితుడు. పండితారాధ్యుడు. బసవన్న మతానికి తన హితాన్ని జోడించి ఆధారాల వెదకి, ప్రమాణాలను కూర్చి, వాదాలు పెంచి, సమస్త జనులకు ఆదరం అయ్యేట్లుగా సుప్రతిష్ఠితం చేశాడు. అవసరమైతే తలను త్రెంచుకున్నాడు. నిప్పులు మూట కట్టాడు.

"గౌరీశుమీద దైవంబు లేడని
తల యిచ్చి బడయుదు నంటు బట్టుదును
శివునిమీద నొకడు కలడన్న
నా యరకాలెత్తి వాని నడుదల దన్నుదు." అని ఆయన ప్రతిజ్ఞ.

సోమన్న కిద్దరూ మార్గదర్శకులే! వారి అడుగుల జాడలలో సంచరించి పురాణేతిహాస స్తోత్ర సిద్ధాంత గ్రంథాలను రచించి వీరశైవానికి తిరుగులేని సింహాసనం ఏర్పరచాడు. ఆయనలేని వీరశైవ వాఙ్మయంలేదు. ఆయన శైవానికి అపరవ్యాసుడు.

సోమన్న బసవన్న పురాణం వ్రాశాడు. పండితయ్య చరిత్ర వ్రాశాడు. ఇందులో ఒక క్రమం ఉంది. విశేషం ఉంది. అది కావ్యం. ఇది శాస్త్రం. అది శక్తి. ఇది యుక్తి. ఒకటి హృదయాన్ని ఆనంద డోలికలలో ఊగిస్తుంది. వేరొకటి బుద్ధికి నైశిత్యం కల్పిస్తుంది.

ఒకటి శాంత గంభీరమైన మహానది. వేరొకటి ఉత్తుంగ తరంగ విలసితమైన మహాసముద్రం.

పండితయ్య చరిత్ర ఒక వ్యక్తి చరిత్ర కాదు. ఒక విజ్ఞాన సర్వస్వం. సర్వ విద్యలకు, సమస్త కళలకు, అనేకానేక వాదోపవాదాలకు మనోహర వర్ణనలకు, అద్వితీయ వ్యక్తి చిత్రణలకు ఆటపట్టు తన 'చతుర్వేద సారం'లో ఒక పద్యం వ్రాసుకున్నాడు సోమన్న.

"వైదికులిది శుద్ధ వైదికంబని యన
శాస్త్రజ్ఞులిది ధర్మశాస్త్ర మనగ
తార్కికులిది మహాతర్కంబనగ పౌ
రాణికు లిదియె పురాణ మనగ
ఆగమ విదులు దివ్యాగమంబిది యన
మంత్రజ్ఞులిది వీరతంత్ర మనగ
భక్తవారంబిది భక్తి మార్గం బన
ముక్త్యర్థులిది మహాముక్తి యనగ
కవులు భువిని నిదియె కావ్యంబనంగ..."

'చతుర్వేదసారం' మతికెక్కుతుంది అన్నాడు. చివరలో పేరుమార్చి 'పండితారాధ్య చరిత్ర' అని చదువుకుంటే అక్షరాలా అన్వయిస్తుంది ఇది కావ్యరూపం పొందిన శైవ దర్శనం. చిలుకూరివారి మాటలలో "భక్తికవులు ఆంధ్ర గ్రంథములలో మహాభారత మెట్టిదో శివకవుల రచనలలో పండితారాధ్య చరిత్ర మట్టిదని చెప్పడ మతిశయోక్తి కానేరదు."

ఏది చెప్పాలో తెలిసినవాడు పండితుడు. ఎలా చెప్పాలో తెలిసిన వాడు కవి. సోమన్న పండితకవి. ఆయన పలుకు పలుకులో వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, ఇతిహాసాలు, ఆగమాలు పూవుల జల్లులా కురుస్తూ ఉంటాయి. ఔను తెనుగుమధ్య, మహాప్రవాహంలో కొండరాళ్ళలా, సంస్కృత సూక్తులూ, ఉక్తులూ ఒదిగి మదిగి కరిగిపోతూ ఉంటాయి. ఐనా ఆ మహాప్రవాహం ఆగదు. సుడి వడదు. నిరంతరం నిరాఘాటంగా సాగిపోతూనే ఉంటుంది. ఆ చాతుర్యం, ఆ సంవిధానం 'నభూతో నభవిష్యతి.'

మన పండితులలో కొందరకు ఆయన సిద్ధాంతాలు, నియామకాలు, నిష్ఠలు వచ్చలేదు. ముఖ్యంగా ఆయన అణపరాని ఉద్రేకం వారికి కొరుకుడు పడలేదు. "ఈ ఉద్రేకపు టూకదంపులకు తోడుగ నిక్కాదిశ, తలాతోకలేని పవాడముల పునరుక్తులతో సోమనాథుని గ్రంథములు నిండినవి. ఇతడు ఉత్తమోత్తమ కవియని మనమింకను అనుకొనుట కర్తవ్యమేమనగా మన కావ్య రసానుభవ సంస్కారము ఎక్కవలసిన మెట్లింకను గొన్ని కలవనుటయే" అని శ్రీ రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మగారు నిరసించారు. ఆలోచించిమాస్తే ఈ విమర్శ చాలా అన్యాయమని అనిపించకపోదు. సోమన్న మతద్రష్ట, ఈనాడు మనకు రుచించకపోవచ్చు. ఆనాడి ఆవేశం మనకు అందరానిదే కావచ్చు. కాని వీటిని ప్రక్కన పెట్టి ఆయన కవితాకళకు, తెనుగు బాసకు చేసిన సేవను, బలహీనవర్గాలకు ఇచ్చిన చేయూతను పరిశీలించినప్పుడు ఆంధ్రకవులలో అగ్రగణ్యుడని ఒప్పుకోక తప్పదు. మత ప్రచారం తప్పని అనలేము. మతరహిత రాజ్యాంగాన్ని ఏర్పాటు చేసుకున్న ఈరోజులలోకూడా మత ప్రచారం సాగుతూనే ఉన్నది కదా? ఆకపోతే ఆరోజులలో మతాన్ని మినహాయించి జీవితంలేదు. నన్నయగారు, తిక్కనగారూ గంటముచేత బట్టింది వైదికమత ప్రచారం కొరకే! వారియెడ తప్పుకానిది సోమన్న చేసుకున్న పాపమేమిటి? ఇలాగే ఆవేశంకూడా! నన్నయగారు భవ్యకవితావేశుడు. నిండుసభలో, మహారాజుల సమక్షంలో, సభామర్యాదలను మరచి సహదేవుడు 'చరణ' మెత్తాడు. ఇది ఆవేశంకాదా! స్వయముగా శ్రీ శర్మగారు "లింగ విభక్తులు తెలియని పండితులు వాదానికి పూనుకుంటే సహృదయులు క్షమించలేరు' అని అన్నారుకదా! ఇందులో ఆవేశం లేదంటారా? నిన్న మొన్నటి మన పండితుల వాదోపవాదాల మాటేమిటి? ఒక వ్యక్తిని విమర్శించేముందు ఆతడి సమకాలీన పరిస్థితులను ముందు సమగ్రంగా పరిశీలించాలి. లేకపోతే అవ్యక్తికి న్యాయం చేకూర్చలేము. 20వ శతాబ్దపు కొలబద్దతో 13వ శతాబ్దపు వ్యక్తులను కొలవ బూనడం అసమంజసమేకాక అసంగతంకూడా! మనం ఏదైనా ఒక విషయాన్ని త్రికరణ శుద్ధిగా విశ్వసించి ఆత్మైక్యం పొందినప్పుడు ఆవేశం తప్పదు. వాచవ సోమునికాలం, వైశిష్ట్యం తమకు విశ్వసనీయం కాకపోవటంచేతనే కదా నడకుదుటి వారితో తలపడినది. తమకు న్యాయమైనది ఇతరులకు కాదనడం సహృదయుంకాదు. సోమన్న బసవన్న మతాన్ని నమ్ముకున్నాడు. తన సర్వస్వాన్ని ధారపోశాడు. దానికోసం ఎంతకైనా తెగించాడు. ఆతడి నిజాయితీని, గుండెధైర్యాన్ని మెచ్చుకోలేక పోవడం మన తప్పు.

ఈ వాదోపవాదాలు ఎట్లాఉన్నా సోమన్న తెలుగు వారికి ఆదరపాత్రుడు. పండితులు కవులు మత దురభిమానంచేత కావాలని నిరసించినా, ఈసడించినా ప్రజలు తమలో వాడిగా ఆదరించారు. ప్రజలకోసం అతడు పుట్టాడు. వారిని తన కవితా సామ్రాజ్యానికి పట్టం కట్టి వారి అనుభవాలను, అనుభూతులను, సుఖాలను, దుఃఖాలను తరతరాలకు అందించాడు. అతడు ప్రజాకవి. అతడు విప్లవకవి.

'వరసర్వజ్ఞ శిఖామణిన్ ప్రథిత సద్వార ప్రమోదాకరున్
నిరతోద్యచ్ఛివ ధర్మ సంచరు గళా నీకాంచితా వాసు భా
స్వర లింగాన్విత దేహు సర్వ విబుధ వాతామృతాధారు భా
సురు పాదున్ గళితారి బొల్కురికి న శున్ గొల్తు సోమాహ్వయున్!"

(అత్తలూరి పాపయామాత్యుడు)

పాంథశాల

శ్రీ మధురాంతకం రాజారాం

"ఏమండీ! మా బాబాయిగారింటికి వెళ్ళొచ్చారా?" అంటుంది జానకి.

'ఓ' అంటాను నేను. అంటూ నా ముఖం ఆమెకు కనిపించకుండా వెన్ను చూపిస్తాను. 'వెన్నుచూపించడ' మన్న మాటకు యుద్ధరంగంలో వేరే అర్థముంది. దానికి మా ఆవిడ సాన్నిధ్యంలో వున్న అర్థం యింకొకటి.

"నిజంగా? మా పిన్ని ఎలావుంది? వసంత ఏమంది? నాగరాజు ఉద్యోగం మాట ఏమైంది?" అంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తుంది జానకి. కురిపిస్తూ నాఎదుట కొచ్చేస్తుంది.

సత్యపీఠంమీద నిల్చుంటే అపద్ధం చెప్పడం కుదరదంటారు. ఆ అనుభవ మెలాంటిదో నాకు తెలియదు. కానీ మా ఆవిడ ముఖంకేసి చూస్తూ, చూస్తూ అపద్ధం చెప్పగలగడమనేది—నాకు పెళ్ళయి పది పన్నెండేళ్ళయినా—యింకా సాధ్యం కావడంలేదు.

"మరి...చూడు జానకీ! నేను మరి..." అంటూ నీళ్ళు నములుతాను.

"అంతేలెండి! నాకు తెలియదా? మన బంధు ప్రేమల వైభోగం అంతలోవుంది! ఏంచేద్దాం! మా బాబాయిగారు బతికున్న కాలంలోనైతే నేరుగా ఆఫీసుకేవెళ్ళి అయిదు నిమిషాలో, పది నిమిషాలో మాటాడి, చక్కా బస్టాండుకు దూసుకునేవారు, ఇప్పుడది గూడా లేకపోయింది..." నన్నిలా ముద్దాయినిగాజేసి, అపరాధపు బోనులో నిల్చోబెట్టి, తాను న్యాయమూర్తిలా వ్యవహరించడంతో వూరుకోకుండా మళ్ళీ క్రాసు పరీక్షకుగూడా సిద్ధమౌతుంది మా ఆవిడ.

—మరైతే—నేను మొదట్లో మా బాబాయిగారింటికి వెళ్ళొచ్చారా అని అడిగితే 'ఓ' అన్నారెందుకండీ?"

"అదా జానకీ! ఏందుకన్నానంటే...చెబుతున్నాగా! వినిపించుకోకపోతే ఎలా..."

ఒద్దు బాబూ ఒద్దు! నాకు తెలుసు! మీరేదైనా కథ చెబుతారు. కథలు చెప్పి లోకాన్ని మభ్యపెట్టడం మీచేతనౌను. నా దగ్గర మీ పితలాటకాలు సాగవు..." ముఖం ముడుచుకుని, రుసరుసలాడుతూ దూరంగా వెళ్ళిపోతుంది మా ఆవిడ.

అంతెనండి సంగతులు! మా జానకి సమక్షంలో నేను ప్రారంభించిన వాక్యానికి పూర్తయ్యే అదృష్టం సర్వ సాధారణంగా సమకూరేదిగాదు.

'ఓ' అని ఎందుకన్నానో, అలాగనడం ఏంతవరకు సబబో—మా ఆవిడ వినిపించుకోకపోతే పోయింది— మీరైనా అవధరించండి!

* * *

జానకి ఎవరినైతే బాబాయిగారుగా వ్యవహరిస్తుందో ఆయన తనకు బాబాయి మట్టుకేగాదు, నాకు మేనమామగూడా! నాకిద్దరు మేనమామలు. పెద్ద మామయ్య మొదటిభార్య కొకేకూతురు — జానకి. తండ్రి రెండో పెళ్ళి చేసుకున్న తర్వాత ఆ కుటుంబంలో జానకికున్న స్థానం పలచబడిపోతూవచ్చింది. పెళ్ళయ్యాక సంగతి సరేసరి. మా పెద్దమామయ్య ఒక దురదృష్టజీవి. ఆయన బడి పంతులుగా పనిచేశాడు. సంపాదించినదాంట్లో ఎక్కువభాగం విలవ చెయ్యాలనేది ఆయన ఆశ, ఆదర్శం. అవసరాలు సరిగ్గా తీరకపోవడంతో రెండోభార్య, ఆవిడ పిల్లలు ఆయన్ను ఆదినుంచీ విరోధి పక్షంలోని మనిషిగానే లెక్కగడుతూ వచ్చారు. ఆ యింటికి వెళ్తే ఏ క్షణాన్నయినా రగడ చెలరేగడానికి వీలున్న శత్రుగుడారాల మధ్యన వున్నట్టే వుండేది. మనుషుల్ని పీడించే దయ్యాలు ఎక్కడో వున్నాయనుకుంటాం! అశాంతి, అలజడి, అపనమ్మకాలకన్నా దెయ్యాలెక్కడున్నాయి? భగవంతుడు ప్రత్యక్షమై ఒక్కటే వరం కోరుకోమంటే మానవుడు రెండో ఆలోచనలేకుండా అన్యోన్య దాంపత్యాన్ని కోరుకోవాలనుకుంటాను. ఇది మా పెద్ద మామయ్యగారి దాంపత్యాన్ని చూసిన తర్వాత కలిగిన ఊహే అయివుండాలి. కాపురంలో భార్యాభర్తలొద్దికగా వుండకపోవడం మూలాన చెడిపోయేవాళ్ళు పిల్లలు. పిల్లలు చెడిపోవడమంటే భవిష్యత్తు పాడుగావడం. డబ్బిచ్చి పిల్లల్ని 'మ్యాట్నీ'కి పంపించి, చదువుకోడానికి వెళ్ళారని చెబుతుండేది తల్లి. సాయంకాలాల్లోనైనా యింటిపట్టున వుండి పిల్లల చదువుపట్ల శ్రద్ధ తీసుకోవలసిన తండ్రి విధిగా మఠంలో జరిగే వేదాంతోపన్యాసాలకు హాజరు. ప్రోగ్రెస్ కార్డులు యింటికొచ్చినరోజున కుటుంబం నిప్పుల కుంపటి. "నీ ముదిగారంవల్లనే పిల్లలు చెడిపోతున్నా"రని ఇంటాయన ఆరోపణ. 'మీ నిరసాకంతో బాగుచేయలేకపోయారా' అని ఇంటావిడ ఫిర్యాదు. ఆ వుక్రోషంతో ఎప్పుడైనా చదువు చెప్పడానికని కూర్చుంటే మా పెద్ద మామయ్య చచ్చేది, బతికేదీ తెలియకుండా పిల్లల్ని బాదేసేవాడు. 'అయ్యో, బిడ్డల్ని తన పొట్టన పెట్టుకున్నాడు గదమ్మా!' అంటూ అత్తయ్య శోకాలు తీసేది. మళ్ళీ యథాప్రకా

5

రంగా యింట్లో అరాచకం నెలకొనక తప్పేదిగాదు. ఇలా కాలం జరిగి జరిగి రిటయరయ్యే రోజులు దగ్గరి కొచ్చేసరికి బిడ్డలకు చదువబ్బలేదన్న దిగులుతో, యింకా యిద్దరు కూతుళ్ళు పెళ్ళిగాకుండా మిగిలే వున్నారన్న ఆందోళనతో మా మామయ్య తీరని అసంతృప్తికి గురయ్యాడు. చివరికా అసంతృప్తి ఒక జబ్బురూపంలో ఆయన శరీరాన్ని గూడా క్రుంగదీసింది. 'క్లోస్' గాకముందే కంటికి కనిపించకుండా పోయిన 'ఫైల్'లా ఆయన కాలగర్భంలో కలిసిపోయాడు.

ఎటొచ్చీ యిప్పుడు చెప్పబోతున్న కథకున్నూ, మా పెద్ద మామయ్య జీవితానికిన్నీ అట్టే సంబంధంలేదు. లేదంటే-పరస్పర విరుద్ధమైన వాటిలో ఒకదాన్ని గురించి తెలుసుకుంటే, యింకొకటెలా వుంటుందో ఊహించడం సులువు. సంపాదించడమన్నది మా చిన్నమామయ్యను ఒక సమస్యలా ఎదుర్కోలేదు. సంపాదించినదాన్ని పదిలంగా దాచిపెట్టుకునే ఉపాయాలు ఆయనకు స్ఫురించి వుండకపోవచ్చునని ఎవరైనా చెబితే ఆ మాట మనం నమ్మొచ్చు. మైదాసు రాజు ముట్టుకుంటే తిండీ నీళ్ళయినా బంగారంగా మారిపోయేవట! మా చిన్న మామయ్య కెదురైన కష్టం అంతకు తక్కువైనదేమీ గాదు. ఆయన కేవస్తువులైతే కావలసివస్తాయో, అవి డబ్బుతో అవసరం లేకుండానే యింటికొచ్చి పడిపోతుండేవి. కిరాణా గిడ్డంగి ఆసామిని 'ఎలా వున్నాయండీ బేరసారాలు?' అని పలకరించడమే అపరాధం. మరునాటి సాయంకాలానికల్లా పప్పుదినుసులు, నూనె డబ్బాలు, పోపు మసాలా పొట్లాలు, బియ్యపు బస్తాలతో సహా యింటికొచ్చి వాలిపోయేవి. బట్టలంగడి ప్రొప్రయిటర్ని 'చాలా రోజులైంది గదండీ కనిపించి' అని పరామర్శించడమే నేరం. ఇంట్లో ఎందరెందరున్నారో అందరికీ చెరొక వరసబట్టలు-పుట్టింటివారు ఉగాదిసాంగ్యం నడిపినట్టుగా సరఫరా అయిపోయేవి. మా చిన్న మామయ్యను సమర్థించడానికని నేనొక క్రొత్త వాదాన్ని లేవదీస్తున్నానని మీ రనుకుంటే నేనేమి చెప్పలేనుగానీ, ఒక్కొక్కప్పుడు పరిస్థితులన్నీ కలిసి మానవుడిపైన కుట్ర చేస్తాయనిపిస్తుంది. ఆయన ఎవర్నీ పలకరించడు. మరెవర్నీ పరామర్శించే సాహసానికి పోడు. తలవంచుకుని తనపాటుకు తాను వెళ్ళిపోతాడు. ఈ మూకీభావం గూడా మరింత గడ్డుచిక్కుకే దారితీసేది. 'ఆఫీసరుగారెందుకో మనపైన పీకలదాకా కోపంగా వున్నారోయ్' అన్న అనుమానం వాళ్ళను తొలుచుక తినేదేమో! వినాయకుణ్ణి ప్రసన్నుణ్ణి చేసుకోవాలంటే రకరకాలపళ్ళు తీసుకరావాలి. ఉండాళ్ళు చేసిపెట్టాలి. పాయసం నైవేద్యమివ్వాలి. ఇలాంటి ఆనవాయితీలన్నీ వాళ్ళకు కొట్టినపిండే! జవాన్లద్వారా కొన్ని, దొడ్డిగుమ్మంగుండా కొన్ని, చీకటి పడ్డాక కొన్ని-యిలా అత్యవసరమైన వాటితోబాటుగా, హంగుగా మాత్రమే పనికొచ్చే వస్తువులు గూడా తమకే కాళ్ళొచ్చి నడిచి వచ్చినట్టుగా ఆ యిల్లు చేరుకునేవి. మా కమలమ్మత్తకయినా ఆదిలో కాస్త జంకూ, గొంకూ వుండేవేమో! నీళ్ళొస్తున్నకొద్దీ చెరువు మునకలో పొలాలు మరుగుపడిపోయినట్టుగా కాలక్రమంలో ఆ జంకుగొంకులు మాసిపోతూ వచ్చాయి. వాళ్ళున్నది యివ్వడానికే, తాముున్నది పుచ్చుకోడానికేనన్న ధీమా నిండిన చెరువులో నానుతూ ఆమెతో కలిసిపోతూ వచ్చింది. ఎంత పెద్దకానుకనైనాసరే, చిన్ని చిరునవ్వయినా లేకుండా స్వీకరించడం ఆఫీసరుగారి భార్యకుండాల్సిన ప్రాథమికలక్షణం. మా చిన్నమామయ్యకు ఆఫీసరుగా ప్రమోషను వచ్చిరాక మునుపే, కమలమ్మత్తకు ఆ లక్షణం పట్టుబడింది.

అన్నట్టు మా చిన్నమామయ్యపేరు రంగనాథం!

అనుకూల దాంపత్యమనేది భగవంతుడి అనుగ్రహంవల్ల లభ్యమయ్యేదైతే, ఆ వరం మా రంగనాథం మామయ్యపైకి యిబ్బడిముబ్బడిగా ప్రసరించిందని చెప్పాలి. ఒక్క బాహ్యవ్యవహారాల శాఖను మాత్రమే భర్తకు కేటాయించి, గృహరాజ్యానికి సంబంధించిన మిగిలిన సమస్త శాఖల్నీ కమలమ్మత్త తన అధీనంలో వుంచేసుకుంది. పిల్లల చదువును గురించిగానీ, ఆరోగ్యాన్ని గురించిగానీ బెంగపెట్టుకోవలసిన అవసరం లేకపోవడంతో మామయ్యకు కావలసినంత స్వేచ్ఛ సమకూరినట్టయింది. వరుసగా బిడ్డల పేర్లు చెప్పమంటే ఆయన చెప్పగలిగేవాడే! కానీ ఆ బిడ్డలు ఏయే క్లాసుల్లో వున్నారో ఆయనకు తెలిసివుండదు. అట్లాగే ఏ బిడ్డ ఏ వూళ్ళో పుట్టిందని అడిగినప్పుడు ఆయన బిక్కరించేవాడు. జీవితాన్ని ఒక వినోదయాత్రగా తీసుకుని, వీలయినంతలో ఏ సుఖంనుంచిగానీ వంచితుడు గాకుండా వుండాలన్నది ఆయన ఆశయం. రాత్రుల్లో ఏ పదకొండుకో, పన్నెండుకో ఆయన యింటికొచ్చేవాడు. క్యాంపుకు వెళ్ళిపోతే రెండు మూడురోజులదాకా యింటికి రాకుండా వుండిపోవడంకద్దు. హైదరాబాదుకని బయల్దేరితే మళ్ళీ తిరిగి రావడమెప్పుడో ఆయనకైనా తెలిసేదిగాదు. ఆయన ఎప్పుడెప్పుడు, ఎక్కడెక్కడ, ఎలాంటెలాంటి వ్యాసంగాల్లో నిమగ్నుడై వుంటాడన్న ధ్యాస మా కమలమ్మత్తకు లేకపోయిందనిమాత్రం మనమిక్కడ ఒప్పుకోవాలి. కమలమ్మత్తకు నీతిపట్ల చాలా పట్టింపులున్నాయి. పనిమనిషి ఒకతె మొగుణ్ణి వదిలిపెట్టి మరొకడితో లేచివచ్చిందని తెలియడంతో ఆమె వున్నపాటున దాన్ని పనినుంచే తొలగించింది. కూరగాయల బేరంలో కమీషన్ కొట్టాడన్న కారణంపైన ఒక జవానుకు మళ్ళీ యింట్లో అడుగుపెట్టే అవకాశం లేకుండా దేవిడీమన్నా చేసింది. క్రమశిక్షణ విషయంలో ఆమె మాట తిరుగులేని శాసనం. ఆ యింట్లో పిల్లలొకటిగాదు, గడియారంలో ముళ్ళొకటిగాదు. ఎక్కడివాళ్ళక్కడ 'కీ' యిచ్చి వదిలిపెట్టిన మరబొమ్మల్లా మసలుకోవలసిందే! ఎటొచ్చీ మామయ్య విషయంలోమాత్రం కమలమ్మత్త తన నియమాల నన్నింటినీ సడలించి పారేసింది. మామూలు మనుషులకులేని కొన్ని స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, కొంతడబ్బు వెచ్చిస్తేగానీ సమకూరని వినోద విలాసాలు ఒక ఆఫీసరుగారికి అందుబాటులో వుండాలన్న విషయంపట్ల ఆమె తన పూర్తిఆమోదాన్ని ప్రకటించింది.

ప్రభుత్వ వ్యవహారాలన్నింటిలోను కీలకమైనది 'హోం డిపార్టుమెంటు'. దీనికి సంబంధించి, రక్షణ ఏర్పాట్ల విషయంలో కమలమ్మత్త అలివిమాలినంత శ్రద్ధ తీసుకుంది. గాదెలనిండుకూ ధాన్యాలుంటాయి. వాటిలో ఎలుకలూ, పందికొక్కులు చేరకుండా వుండడం ముఖ్యం. మాటలతో గాకపోయినా, చేతలద్వారా ఆమె తనదైన ఈ యింగితాన్ని బంధువుల్లో ప్రతి ఒక్కరికీ తెలియజేయగలిగింది. స్వంత పనిమీద ఆ వూరికంటూ వెళ్ళి, వెళ్ళిన పనితొందరగా ముగిసి,

ప్రయాణానికింకా కొంత వ్యవధి వున్నప్పుడు ఏ బంధువులైనా మామయ్య యింటికి వెళ్ళిరావాలని అనిపిస్తుంది. బంధుజనుల ఓపికను పరీక్షింప దలుచుకున్నట్లుగా ఆ యిల్లు పట్నానికొక చివరగా వుంది. పూలూ పళ్ళూ కొనుక్కొని, రిక్షా వేసుకుని వెళ్ళినంత దూరం వెళ్ళి బంధువాయింటి గుమ్మంలో దిగుతాడు. ఏడెనిమిది గదులు, పెద్దహాలు, చుట్టూ పూలతోట, బాల్కనీ, కారుషెడ్డు హంగులన్నింటితోను అలంకంత యిల్లు. స్థానభ్రంశంపొందిన వస్తువులను ఎప్పటికప్పుడు సర్ది పెట్టే పనిమనుషులుండడంవల్ల, ఆ యిల్లు నీటైన మ్యూజియంలా కానరావడంలో ఆశ్చర్యమేమీలేదు. ద్వారం దగ్గర అలికిడికాగానే హాల్లోవున్న పిల్లలు కనురెప్పలుమాత్రం పైకెత్తి, ఆగంతకుడివైపు చూస్తారు. చెరువులో గులకరాయి పడినంత స్వల్ప సంచలనం. ఎంతసేపు వేచిచూచినా అంతకుమించిన సంచలనం పొడసూపక పోయేసరికి, నిల్చోగలిగినంతసేపు నిల్చుని బంధువత్సలుడు చివరికొక కుర్చీలో కూచుంటాడు. కొద్ది నిమిషాలపాటు అలా మౌనముద్ర సాధన చేసిన తర్వాత తన ఆగమనవార్త యింటావిడకు తెలిసిందో, లేదోనన్న అనుమానంతో, వుండి వుండి గొంతు సవరించుకుంటాడు అప్పటికైనా 'రెస్పాన్సు' వుండడం సందేహమే! ఆఖరుకెప్పుడో, తనకేదో ఒక వస్తువు కావలసివచ్చి హాల్లోకి రావడం తటస్థించిన కమలమ్మత్త బంధువువైపోసారి నిశ్చలంగాచూచి, ఆశ్చర్యం గానీ, ఆనందంగానీ, వ్యక్తంగాని మామూలు గొంతుకతో 'ఇవేనా రావడం' అంటుంది. దేనికోసమైతే వచ్చిందో ఆ వస్తువును తీసుకున్న తర్వాత హాల్లోనుంచి లోపలికి వెళ్ళిపోతూ 'మంచినీళ్ళు పుచ్చుకుంటారా' అంటుంది. బ్రాందీ, సారాల విషయంలో కొందరికి పట్టింపులుండొచ్చు. ఆరోగ్యానికి సరిపడని పరిస్థితుల్లో కొందరు కాఫీ, టీల విషయంలో గూడా అభ్యంతరం చెప్పవచ్చు. కాని మానవమాతులందరూ నిరాఘాటంగా ఆస్వాదింపదగిన (వలసిన) సాదా పానీయమేగదా మంచినీళ్ళు! అపాటి మంచినీళ్ళు తెచ్చి యివ్వడానికి తన పర్మిషన్ ఎందుకో తెలియక బంధువు బిక్కచచ్చిపోతాడు. గాలి గూడా స్తంభించిపోయినట్లున్న ఆ వాతావరణంలో ఊపిరాడక ఉక్కిరిబిక్కిరైపోతాడు. ఆఖరుకు సంచిలోనుంచి తాను తీసుకొచ్చిన పూలూ పళ్ళూ పైకితీసే ఓరవగూడా అతడికి లేకపోతుంది. ధైర్యం తెచ్చుకుని పైకిలేచి వెళ్ళొస్తానని తెలియజేస్తే? ఒకవేళ యిల్లాలు 'ఎలాగూ రానేవచ్చారు. భోజనంచేసే వెళ్ళమని సెలవిస్తే? భగవంతుడా! ఇంకా రెండు మూడు గంటలపాటు ఈ మొదటి తరగతి జైలుశిక్ష అనుభవించడానికి తానేం నేరం చేసినట్లు? అంతకంటే ఎలా లోపలికి వచ్చాడో, అలాగే జారుకుంటే నయంకదూ?...ఇలా విచికిత్సలో పడ్డ తర్వాత ఆ బంధువరేణ్యుడు మెల్లగా పైకిలేచి, ఏదో పచారు చేస్తున్న నాటకంతో ప్రహరీగోడదాకావచ్చి, అక్కడినుంచి రయిమంటూ రోడ్డుదారి పట్టితే అందులో ఆశ్చర్య పడవలసిందేమీ కనిపించదు.

బింకం చంపుకోలేక ఎవరో బంధువని అన్యాపదేశంగా చెప్పుకున్నానేగానీ, అలాంటి పర్యాటకు పాత్రులైన వారిలో (ఎంత దగ్గరి బంధునైనా) నేనూ ఒక్కణ్నిగాక పోలేదు.

మళ్ళీ కొద్ది మాసాలు గడిచేలోగా ఎవ్వడైనా హఠాత్తుగా మా చిన్న మామయ్యతో తారసిల్లడం జరుగుతుండేది. ఒకవేళ అలా కలుసుకోడం జరగకపోతే, క్యాంపుల మీద వూళ్ళు తిరుగుతూ వుండడంలో ఎలాగో వీలు చేసుకుని ఆయన మా యింటికే వచ్చివెళ్ళడం కద్దు. పట్నం తాతయ్య వచ్చాడంటే ఆ రోజు మా యింట్లో పిల్లలకందరికీపండుగ. ఆయనపొట్లాలుపొట్లాలుగా బిస్కట్లు, పిప్పరమిట్లు తెస్తాడు. బుట్టలనిండుగా పళ్ళు తీసుకొస్తాడు. ఆయన వున్నంతసేపు మా యింటి వాతావరణంలో సముద్రానికి పోటువచ్చినంత హంగామా.

"అమ్మాయ్, జానకీ! అదేమిటమ్మా, అలాచిక్కి చిక్కి సలికిరిలాతయారైపోయావు? నీవేమైనా నీఅతీగతీ పట్టించుకుంటున్నట్టా, లేనట్టా? సర్లే, వీడంతా వాళ్ళ పెద్దమామయ్య చాలు. ఇద్దరికిద్దరే డబ్బు మనుషులు! వీడి జోలికెందుకు గానీ, నువ్వు బయల్దేరి చక్కా నాతోగూడా వచ్చెసెయ్! రామారావు డాక్టరు దగ్గర పరీక్ష చేయించుకోడం మంచిది. మందులు, టానిక్కులు రాసిస్తే మళ్ళీయిక్కడికొచ్చి కూడా పుచ్చుకోవచ్చు...ఒరేయ్, రాజశేఖరం! అమ్మాయిని పంపించరా పది రోజులుండి వస్తుంది గానీ!"—ఇదీ వరస.

ఉన్న మాట చెప్పుకోవాలి గదా! లోలోపల నాకు సంబరంగానే వుండేది. మా జానకి కున్న బంధుప్రేమకుతగిన జుల్మానా పదిరోజుల పర్యంతమైన మొదటి తరగతి జైలు శిక్షే !

"ఒరేయ్ రాజశేఖరం! నేనింతకాలంగానైతే ఊళ్ళు పట్టుకుని దేశం పైన తిరుగుతూవుండిపోతిని. మీరు గూడా దూరాభారమని నన్నువెదుక్కుంటూ రాకపోతిరి. ఇప్పుడలా కాదు గదరా? ఇల్లూ వాకిలీస్థిరంగా ఏర్పాటు చేసుకుని యికమీదట యిక్కడి నుంచీ కదలబోవడంలేదని భీష్మించుకున్నాను గదా! ఇప్పుడు మీరొచ్చి నాయింట్లో నాలుగు రోజులుండకుండగూడదురా? ఛా ఛా, ఎం నామర్దా రోజులొచ్చాయిరా బాబూ! మనుషుల మధ్య మమకారాలకే దరిద్రమొచ్చిపడిపోయింది గదరా పాడూ!"

అంతటి అచ్చమైన బంధు ప్రేమకు ముఖంచాటి వుంటుందేమో మా జానకి- కళ్ళల్లో గిర్రున తిరుగుతున్న కన్నీరు మామయ్యకి కనిపించకుండా ముఖాన్ని గోడవైపుకు త్రిప్పుకుని "ఈ బిడ్డల్నివెంట బెట్టుకుని నాకు రావడమెక్కడ కుదురుతుందిలే బాబాయ్! అప్పుడప్పుడూ నువ్వొచ్చి చూచి పోతున్నావు గదా! అంతే చాలు" అనేది.

మామయ్య మా యింటికి వచ్చినరోజున ఆయన వెంటవచ్చిన ఆఫీసు సిబ్బంది కంతటికీ ఆటవిడుపు, ఆయన గూడా ఉన్నకాసేపు ఆఫీసు గొడవలు మరచి పోయే వాడు.

"ఒరేయ్ రాజశేఖరం ! మా రాధమ్మ పిన్ని మనవడు రామ్మూర్తి తెలుసునా నీకు ? ఉద్యోగం లేకుండా తిరుగుతుండేవాణ్ణి నేనే మా డిపార్టుమెంటులో ఓ అటెండరు పోస్టులో దూర్చాను. ఆ మధ్య ప్రమోషను గూడా వచ్చిందని వ్రాశాడు. వాడికిప్పుడో అమ్మాయి కావాలిట! నీ ఎరుకలో ఏదైనా సంబంధముంటే చెబుతావా"?

మా మామయ్య భోళాతనానికి నాకు నవ్వొచ్చేది. ఆయనకు పెళ్ళికావలసివున్న కూతుళ్ళు యిద్దరుముగ్గురున్నారు. పెద్దమ్మాయికి

ఏప్పుడో పదేళ్ళకుమునుపే పెళ్ళి కావలసింది. రెండో అమ్మాయికి గూడా పెళ్ళి వయసు మీరి పోతున్నట్టే లెక్క. ఏటొచ్చీ మూడో అమ్మాయికి యిప్పుడిప్పుడే చేయకపోయినా పరవాలేదు. మగ పిల్లల కైనా సకాలంలో పెళ్ళిళ్ళు చేయవలసిందే నన్న పట్టింపు పెట్టు కుంటే మామామయ్యగారి పెద్దబ్బాయిగూడా పెళ్ళిచేసుకోదగ్గ వయసు లోనే వున్నాడు. పిల్లలేమైనా అనాకారులా అంటే అదేం లేదు. చూడ ముచ్చటగా వుంటారు. చదువుల్లోనందే నా, వాళ్ళు సిసింద్రీలు. పెద్దమ్మాయి ఒకటికిరెండు డిగ్రీలు తెచ్చుకొని లెక్చరరుగా పని చేస్తోంది. రెండో అమ్మాయి ఎమ్మెస్సీలో క్లాసు తెచ్చుకుంది. పోనీ, పెళ్ళిళ్ళు చెయ్యడానికి అవసరమైన స్థితి గతుల్లో మామయ్యకేమైనా లోపముంటే అది వేరే మాట! ఆ మాట చెప్పడానికే వీల్లేదు గదా! అన్ని లక్షణాలూ అమరికగానే వున్నా మామయ్య పిల్లలిలా పెళ్ళిళ్ళు గాకుండా వుండిపోవడం తలుచుకుంటే 'అంగట్లో అన్నీవున్నా' అన్న సామెత మాత్రమే గుర్తుకొచ్చేది. ఏం లాభం? అల్లుడి నోట్లో శని వుండి పోయాక!

“ఏం చెయ్యమంటావురా రాజశేఖరం!” అనే వాడు మామయ్య. “నాకు మాత్రం పెళ్ళిళ్ళు చేసెయ్యాలని లేదా? మీ అత్తయ్య దైతే ఒకటే పోరనుకో! ఏం చేద్దాం? దేనికైనా కాలం కలసి రావాలి గదా! కాలం కలిసిరావడమంటే గుర్తు కొచ్చింది. మా ఆఫీసులో కేశవులని ఒక జవాను. తన వుద్యోగం తాను చేసుకుంటూ వాడు బుద్ధిగా వుండొచ్చు గదా! ఉండలా. అదొక మహత్కార్యమైనట్లు చూచిచూచి ఓ అమ్మాయిని ప్రేమించేశాడు. తనకా అమ్మాయితో పెళ్ళంటూ జరక్కపోతే జగత్తుకంతా ప్రళయమొచ్చేస్తుందని వాడి నమ్మకం. సరే, ఆ హీరోయిన్ తండ్రి వున్నాడే, వాడిది పక్కా విలన్ పాత్ర వాడు త్రాగుబోతు. జూదగాడు. చాలనిదానికి తానున్న యిల్లు గూడా మూడువేలకు తనఖా పెట్టేశాడు. మూడువేలిచ్చి అయింటినెవడైతే తనఖాను విడిపిస్తాడో వాడు మాత్రమే తనకుమార్తెను పెళ్ళాడ్డానికి అర్హుడని ప్రకటన ఒకటి జారీచేశాడు. ఈ కేశవులు గాడెక్కడ నుంచీ తెస్తాడు మూడు వేలు? నా దగ్గరికివచ్చి బోదిబోమని మొత్తుకున్నాడు. నేనో కాగితం తీసుకరమ్మని చెప్పి 'కేశవులు పెళ్ళికోసం విరాళాలు' అని హెడ్డింగు వ్రాసి, అందుకుగాను నా విరాళం మూడు వందలని వేసి, ఆకాగితం వాడిచేతికిచ్చేశాను. వాడుటౌను పైకి వెళ్ళొచ్చి ఆ సాయంకాలానికల్లా జాబితాలో మొత్తం అయిదు వేలు దాటించాడు. డబ్బుకు దారిదొరికి పోయాక అడ్డేముంది? డోలుకొట్టడమేమో, తాళికట్టడమేమో! ఆ పెళ్ళికి మా ఆఫీసు స్టాఫంతా వెళ్ళొచ్చాము. ఇంతకంటే తమాషా యింకొకటి. శివసుందరరావని నాకు స్నేహితుడొకాయన వున్నాడు. రిటయరయ్యాడు. గుండెజబ్బొచ్చింది. మనిషి తిన్నగా నాలుగడుగులు నడవ లేడు ఇలాంటి పరిస్థితిలో అమ్మాయికి పెళ్ళి కుదిరింది. పెళ్ళన్నాక పది చోట్లకు తిరిగి, పది మందితో మాట్లాడాలి గదా! తనకా ఓపిక లేక డబ్బు మాత్రం తీసుకొచ్చి నా చేతికిచ్చేశాడు. మన వేంకటరమణస్వామి ఆలయంలోనే జరిగింది పెళ్ళి. ఫలానావాళ్ళకు ఫలానా పని అని నిర్ణయించడం వరకే మన వంతు! దేవుడి పెళ్ళికి అందరూ పెద్దలేనట! క్లబ్బు మెంబర్లు, ఆఫీసు ఉద్యోగులు, యింకా కొందరు స్నేహితులు అందరూ తలాఒక సాయం చేశారేమో, పెళ్ళి సవ్యంగా జరిగిపోయింది. అసలింతకూ చిత్రమేమి టంటే రాజశేఖరం, ఊళ్ళో చాలా మంది నేను నా కూతురికే పెళ్ళి చేస్తున్నానని అనుకున్నారట గూడా!”

చూచారా! ఇలా ఎంత సేపయినా జరిగిపోయిన పెళ్ళిళ్ళకు మేళాలు వాయించడమేగానీ, ఈయన జరగవలసిన వాటిని గురించి ఆలోచించడంవుండదు. చిరాకుతో ఒళ్ళుమండు కొచ్చి “ఇంతకూ వసంత పెళ్ళిని గురించి నువ్వొక నిర్ణయానికి వచ్చే దెప్పుడు మామయ్యా?” అంటూ అడ్డు తగిలే వాణ్ణి.

“ఇందులో నేను తీసుకునే నిర్ణయమేముందిరా రాజశేఖరం?” దైన్యంగా ప్రశ్నించేవాడు మామయ్య. “వరుణ్ణి ఎన్నికచేయవలసింది వసంత. సంబంధం తాలూకు మంచిచెడ్డల్ని భేరీజు వెయ్యవలసింది మీ అత్తయ్య. కాదంటే వాళ్ళనాన్నగారు. తెలుసుగదా, మా మామ గారు కచ్చితంగా జ్యోతిష్యశాస్త్రం ఒప్పుకుంటేగాని సంబంధాన్ని రైటుచెయ్యడు. వచ్చిన సంబంధాలన్నింటిని జాబితాకట్టి చెబితే నోరు నొచ్చును. ఆదినుంచీ చంద్రమౌళి కివ్వాలనుకోడం. ఎవడో దూరపు మనిషి గాకపోయె! స్వయంగా మీ అత్తయ్యకు చిన్నాన్న కొడుకు. అల్లుడి హోదాతో గాకపోయినా అంతటి చొరవతో యింటి కొచ్చి వెళ్తుండేవాడు. హఠాత్తుగా ఏమొచ్చిందోగానీ వాడు వెళ్ళి వెళ్ళి ఓ బెంగుళూరమ్మాయిని వరించేశాడు. పోతే పోయిందని నేను గుండ్లూరు సంబంధం తీసుకొచ్చాను. వాళ్ళొకసారి వచ్చిచూచివెళ్ళి మళ్ళీ జవాబు వ్రాయడమే మానుకున్నారు. ఆతరువాత రాఘవయ్య గారని ఒకాయన రంగంలో దిగాడు. ఆయన కొడుకున్నూ ఎం. యే. దాకా చదువుకున్నవాడే! హైదరాబాదులో వుద్యోగనుట! పెళ్ళి కాగానే అమ్మాయి తన వుద్యోగానికి 'రిజైన్' చేసి హైదరాబాదుకు వచ్చేయవలసి వుంటుందన్నాడు. అక్కడేదైనా కాలేజిలో చేర్పించడం తన చేతనౌవన్నాడు. 'నాజీతంమీదనేగదా వాళ్ళకు మోజు, ఆ సంబంధానికి నేనొప్పుకోన'నేసింది వసంత. ఇంకొకతను వచ్చాడు. డాక్టరట! కాస్త ముదురు మనిషిలా కనిపించాడు. పరవాలేదు లెమ్మని సరి పెట్టుకోజూచాం. ఇంకానయం! పత్రికలచ్చెయ్యడంకోసం ప్రెస్సుకు బయల్దేరబోతుండగా అతడు రాసిన వుత్తరం చేతికొచ్చింది. ప్రయివేట్ ప్రాక్టీసులో తాను నెలకొక వెయ్యిరూపాయలదాకా సంపాదిస్తున్నాడట! 'మీ అమ్మాయికి ఉద్యోగపు బాదరబందీలేవీ వుండనక్కర్లేదు. ఇంటిపట్టునవుండి వంటచేసి పెడితేచాలు' నని వ్రాశాడు. నేనింత చదువు చదివింది వంటలక్కా ఉద్యోగానికా అని వసంత మొరాయించుకుని కూచుంది. ఈలోగా వేకన్సీవుందని తెలిసినచోటి కల్లా అప్లికేషన్లు వ్రాసి పడేసినట్లు యిద్దరు ముగ్గురు నిరుద్యోగులు గూడా అమ్మాయిని చూచిపోవడానికొచ్చారు. వాళ్ళకు వంటచేయడం చేతనౌతుందేమో తెలుసుకోమంది అమ్మాయి...”

“పోనీ, ఒప్పుకుందాం. అమ్మాయిని నిరుద్యోగి కివ్వడం కుదరదు. కానీ మొన్నటికి మొన్న ఏవరో ఇంజనీరువచ్చి వెళ్ళాడటగదా! అమ్మాయి ఉద్యోగంచేస్తే చేయనివ్వు, మానుకుంటే మానుకోనివ్వు! వివాహం కాగానే కొత్త కాపురానికి వచ్చినా సరే, లేకుంటే అప్పుడప్పుడు నేనే వచ్చివెళ్తాను- అంటూ అతడు హిరణ్యాక్ష వరాల కన్నింటికీ ఒప్పుకున్నాడట గూడా! పాపం అతడిమీద

నైనా పెద్ద మనసు పెట్టి వుండగూడదా మామయ్యా?''

"అవునవును. ఆ కుర్రాడేమో నాకున్నూ నచ్చాడు. మీ అత్తయ్యగూడా 'పోనీ, యిచ్చేద్దాములెండి' అనేసింది. కానీ మా మామగారొప్పుకోలేదే! ఆయన కొత్తకోట శాస్త్రుర్ల దగ్గర జాతకాలు చూపించుకొచ్చి ఈ సంబంధానికి రజ్జు పొంతనాలు చాలడం లేదన్నాడు...''

"అంతకు మునుపు కొన్ని సంబంధాలకు జంతుపొంతనం కుదరడంలేదని చెప్పలేదా మామయ్యా?''

"అవునా! వరుడి పేరుకు పిల్లి, వధువు పేరుకు ఎలుక తగిలితే యింకేమైనా వుందా? పిల్లి ఎలుకను గుటుక్కున మింగెయ్యదూ?''

సూటిగా గురిపెట్టకుండా, యిలా గాలిలోకి తూటాలు పేల్చినట్టుగా సాగేది మామయ్య ప్రసంగం. అమ్మాయి పెళ్ళి విషయంలో జాప్యం జరగడానికి ఆయన చెబుతున్న కారణాలు, ఇంటిలో పారవేసుకున్న వస్తువును వీధిలో వెదకడంకన్నా సబబైనవి కావని నాకు తెలుసు. ఏవరి పిల్లల్ని వారు గారాబంగానే చూసుకోవచ్చు. కాని ముదిగారం మరీ ఎక్కువైనప్పుడు పిల్లలకు తమపట్ల తమకు చాలా పెద్ద అభిప్రాయం ఏర్పడిపోతుంది. వాళ్ళ దృష్టికి యితర మానవులందరూ ఎంతో క్షుద్రజీవుల్లా కానవస్తారు. ప్రేమ గుడ్డిదైనా చాలా సందర్భాల్లో అది మనిషికి మేలే చేస్తుంది. స్వాతిశయం మావును, గుండెను గూడా కుంచింపజేసి హానికలిగిస్తుంది. మా కమలమ్మత్త తన పిల్లలకు మనుషులపట్ల వెగటు కలిగించుకోడమెలాగో, మానసికంగా వాళ్ళను కొన్ని ఆమడల దూరంలో వుంచడమెలాగో నేర్పడంలో కృతకృత్యురాలైంది. ఆ భావనలో తల మునకలైపోయాక ఆమె కూతుళ్ళకు తామొక కొత్తచోటికి వెళ్ళి కొత్త మనుషులమధ్య మసలుతూ ఆ యింటి కోడళ్ళుగా వ్యవహరించడమనేది ఒక ఊహాతీతమైన విషయంగా వుండిపోయింది. అలాకాదని నా అన్నవాళ్ళెవరూ లేని స్వయంభువులాంటి విశిష్టవ్యక్తి ఎవడైనా తారసిల్లితే, ఏవో కారణాలు పుట్టించి ఆ సంబంధాన్ని పీగి పోగొట్టడానికి ఈ మామగారనే ముసలాయన ఒకడు దాపురించాడు. మనవరాళ్ళకు పెళ్ళికాగూడదన్న దురుద్దేశం ఆయనకుండి వుండకపోవచ్చు. కానీ అసంకల్పిత ప్రతీకార చర్యలాంటిది యిందుకు కారణమై వుండొచ్చునేమోనని నా అనుమానం. ఒడిదుడుకులతో, భంగపాట్లతో జీవితాన్ని ఒక ఎడారి పయనంలా గడిపిన ఆ మామగారికి అల్లుడి యిల్లు ఒక పచ్చటి నీడలా ఆశ్రయమిచ్చింది. ఈ పచ్చని పట్టుపైన తనకు పరోక్షంగాగల ఆధిపత్యాన్ని ఏవడో ఒక కొత్తవ్యక్తి అల్లుడి హోదాతో వచ్చి దోచుకోడం ఆయన కిష్టం గాకపోయి వుండొచ్చు...

వింతగా బదిలీ పద్ధమకున్నా మా రంగనాథం మామయ్యకు స్థానచలనం తప్పిందిగాదు. ఉద్యోగ జీవితంలో-అమాటకొస్తే జీవితంలో గూడా చివరి రెండేళ్ళు ఆయన మా కందరికీ వందమైళ్ళ దూరంలో వుండిపోయాడు. ఆ రెండేళ్ళ వ్యవధిలో నేనొక్కసారి మాత్రం ఆయనను కలుసుకోగలిగాను. ఒక పెళ్ళి సందర్భంలో కలుసుకుని కాసేపట్లో విడిపోయాము. డబ్బున్నచోట ఖరీదైన జబ్బులు కొన్ని మూగడంకద్దు. మా మామయ్యకు గూడా అదినుంచీ అంతో యింతో అలాంటి జబ్బుల తాకిడి లేకపోలేదు. పైపెచ్చు యింటి నుంచి దూరంగా వుండవలసి వచ్చినందువల్లనేమో, ఆయన బాగా డస్సిపోయినట్టు కనిపించాడు. అయితే అన్ని కారణాలూ ఒక్కుమ్మడిగా చేరి యింత అర్థాంతరంగా ఓడను ముంచేస్తాయని నేననుకోలేదు. ఉన్నట్టుండి ఓ రోజున టెలిగ్రాం చేతి కందింది...

* * *

పెద్ద దిక్కు పోయాక కుటుంబాని కెదురయ్యే దైన్యానికి బంధువుల ఓదార్పుకన్నా మించిన ఔషధం వుండదేమో! ఆ వుద్దేశంతోనే మామయ్య చనిపోయిన కొత్తలో నేను నాలుగైదుసార్లు ఆ యింటికి వెళ్ళడమంటూ జరిగింది. బల్బులు, ఫ్యాన్లు, రేడియోలు యిలా ఎన్ని హంగులున్నా విద్యుత్ప్రవాహం ఒకటి ఆగిపోతే ఎలా వుంటుందో, అలా ఆ యిల్లంతటా స్తబ్ధత పేరుకుపోయినట్టు తోచింది. బాహ్య ప్రపంచంలోనుంచీ మనుషుల రాకపోకలు బాగా తగ్గిపోయాయేమో, బంధువైన వాడెవడైనా కనిపిస్తే ఆ యింటిలోని చిన్నపిల్లలు వులిక్కిపడి, మాటాడదామా వద్దా అని కొద్ది క్షణాలు తటపటాయించి, చివరికెలాగో తెంపుతెచ్చుకుని ఒకటి రెండు మాటల దాకా మాటాడ్డానికి నేర్చుకుంటున్నారు; కానీ ఈ చైతన్యం యింజనులోనుంచీ శబ్దంమాత్రమే వినవచ్చి, కదలికమాత్రం లేకుండా రోడ్డుపైన ఆగిపోయిన వాహనాన్ని తలపిస్తుంది. మరైతే ఈ వాహనం కదిలేదెప్పుడు?

వయసులో ముప్ఫై యేళ్ళకు తగ్గకుండా ఏ డాక్టరో, ఇంజనీరో, అథవా ఏ లెక్చరరో అయినవాణ్ణి వెదికి తీసుకొస్తే, పెద్దమ్మాయి పెళ్ళి కొప్పుకోవచ్చు. కానీ అంత చదువూ చదివి, అపాటి ఉద్యోగమూ చేస్తున్నవాడు యింకా అవివాహితుడుగా పడివుంటాడా? ఈ పాటికే ఆడబిడ్డల తండ్రో అత్తణ్ణి ఎగరేసుకపోయి వుండడూ?

వివాహమనేది జీవితంలో ఒక పెద్దమలుపు. రైలెక్కి యిదివరకెప్పుడూ వెళ్ళని కొత్త ప్రాంతాలకు వెళ్ళి, కొత్త అనుభవాలను చవిచూడడం లాంటిది. నువ్వు స్టేషనుకు వెళ్తావు. వచ్చిన బండ్లన్నింటినీ విడిచిపెట్టేస్తావు. ఇప్పుడే రైలూ నీకోసం ఆగడంలేదు. నీకెలా వుంటుంది, ఉక్రోషంగా వుంటుంది. ఏడుపొస్తుంది. బుద్ధిమాటలుచెప్పి సకాలంలో రైలెక్కించని వాళ్ళని కసిదీరా తిట్టాలని వుంటుంది...

పెళ్ళి లేకపోతేనేమి, నేను బ్రతికినంతకాలం బ్రహ్మచారిణిగానే వుండిపోతాను అంటుందట వసంత! మా కమలమ్మత్త చెబుతుంటుంది.

మరైతే రెండో అమ్మాయిదగ్గరనుంచీ మొదలుపెట్టి పెళ్ళిళ్ళు జరిపించవచ్చుగదా! ఈ ప్రతిపాదన తల్లికి యింపితంగా వుండడం సందేహమే!

అక్కయ్య పెళ్ళిగాకపోవడంలో తన బాధ్యత ఏముంది? ఎంతగా ఒకే కడుపున పుట్టినా అక్కచెల్లెళ్ళలో ఒకరికోసం ఒకరు తాము

కోరుకునే సుఖాలనుంచి దూరంకావలిసిన అగత్యమేముంది... అన్న ఊహ రెండో అమ్మాయికి కలగకపోతేనే మనం ఆశ్చర్యపడాలి...

చదువులు పూర్తిచేసి, ఉద్యోగంలో ప్రవేశించి, వివాహాని కన్నివిధాలా అర్హుడైవున్న మామయ్యగారి పెద్దబ్బాయి మాత్రం అక్కచెల్లెళ్ళకోసమని ఎంతకాలం తన పెళ్ళిని వాయిదా వేసుకుంటాడు?

పరస్పర విరుద్ధమైన ఊహాలతో, అభిప్రాయాలతో ఆయింట్లో ఒక ప్రచ్ఛన్నయుద్ధం జరుగుతున్నట్టేవుంటుంది...

— ఇలా తలపోతలతో తల మునకలై కూచున్నానేమో, ఓరోజు మధ్యాహ్నం మా మామయ్యగారింట్లో నాకు మతి పోయినంత పనైంది. ఉదయం పదిగంటలకనగా నేనక్కడికి వెళ్ళాను. కమలి మ్మత్త పరవాలేదు, భోజనంచేసి వెళ్ళు మనడంతో పంజరంలో చిలకలా చిక్కుబడిపోయాను. ఏకాంక నాటికకోసం తయారుచేసిన స్టేజి లాంటి హాల్లోకి పాత్రలేవో ప్రవేశించి, తమ యిచ్ఛవచ్చినట్టు నటించి తిరిగి లోపలికో బయటికో వెళ్ళిపోతుంటే చూస్తున్నాను, కూనిరాగాలు, ట్రాన్సిస్టరులోనుంచి హిందీ సినిమాపాటలు, 'చేజ్' నవలలు. ఎవరో అంతర్జాతీయ ప్రసిద్ధిపొందిన స్వాములవారి ఉపదేశం మేరకు 'మెడిటేషన్' మొదలైనవి తప్పితే మనసారా ఒకరితో ఒకరు మాట్లాడుకోడంగానీ, గుండె తేలికయ్యేటట్టుగా నవ్వుకోడంగానీ లేని ఆ బరువైన వాతావరణంలో నా తల దిమ్మెక్కిపోయింది. గోడ గడియారం టిక్కు టిక్కుమంటున్న సవ్వడి తలపైన సమ్మెటతో బాదినట్టు ఎడతెరిపి లేకుండా వినిపిస్తోంది. కూర్చోగలిగినంత సేపు కూర్చుని కిటికీలుమూసి ముంతపొగ పెట్టిన గదిలోనుంచి తలుపు బద్దలుగొట్టుకుని బయట పడినట్టుగా నేను రోడ్డుపైకి వచ్చేశాను. ఎండాకాలం. గంట మూడుకావస్తోంది. ఆరింటికిగానీ మావూరికి బస్సులేదు. ఆలోగా నేను చక్కబెట్టుకోవలసిన పనులున్నా లేవు ఊరికే పుర వినోదాలుమాత్రం ఒళ్ళలిసిపోయేలా రోడ్లపైన తిరిగాను. ఓ మూడు రోడ్ల కూడలి దగ్గరికి వచ్చేసరికి నాపాదాలు అప్రయత్నంగా ఆగిపోయాయి. రోడ్డులేని వైపున పేవ్‌మెంటుపైన టౌన్‌బస్సు నిమిత్తం వేచివుండే పయాణీకుల కోసమని నిర్మించిన వెయిటింగ్ షెడ్ ఒకటి. వెనుకవైపున ఒక ప్రహరీగోడ. ముందూ వెనకా గుండ్రని స్తంభాలు కమ్ముల్లో, కాంక్రీటుతో దిట్టమైన పైకప్పు క్రింద సిమెంటు బెంచీలు. ఆ వల్లటిపటు నాకు ఎడారిలో చిన్న ఒయాసిస్సులా కానవచ్చింది. అయితే — తిరిగి తిరిగి ఆఖరుకు గమ్యస్థానం చేరుకున్నా నన్న సంతృప్తి కలిగి నందుకు అది ఒయాసిస్సులా కానరావడమొక్కటే కారణంగాదు. అందుకు కారణం షెడ్డు తాలూకు పైకప్పు అంచు పొడుగునా కానవచ్చిన అక్షరాలు. కీ. శే. రంగనాథంగారి జ్ఞాపకార్థం 'వరానాకబ్బివాళ్ళు' దాన్ని కట్టించారన్న వివరణ.

నిజం చెప్పొద్దూ! ఆ నీడలోకి వెళ్ళేసరికి 'ఏరా అబ్బాయ్! బాగున్నావా?' అంటూ మా చిన్న మామయ్య పలకరిస్తున్నట్టేతోచి నాశరీరం పులకించింది. మామయ్య సౌజన్యం ఆఖరుకిలా రూపు కట్టిందా అనుకునేసరికి కనుగొలకుల్లో రెండు కన్నీటి ముత్యాలు గూడా నిలిచాయి. బాగుంది! ఇదే బాగుంది! అవధుల్లేని మామయ్య మంచితనంలాగే ఈ వెయిటింగ్ షెడ్డుకుగూడా అడ్డుగోడలు లేవు. ఎండలోపడి నడిచివచ్చినవాళ్ళు — వాళ్ళు ముసలివాళ్ళయినాసరే, పసిపాపలైనాసరే; పురుషులైనా సరే, స్త్రీలయినాసరే; మతంమాట తలపొద్దు. కులంమాట ఎత్తడానికే వీల్లేదు; ఎవరైనాసరే యిక్కడ కాసేపు సేదదీరవచ్చు. ప్రపంచమే ఒక పాంథశాల అంటాడు ఉమర్ ఖయ్యాం! మరైతే 'ఆత్మ' పాలిటికి మనుగడ మట్టుకు పాంథశాలగాకపోతుందా? మామయ్య జీవించినంతకాలం ఆయన సాన్నిహిత్యం ఆశ్రితులకు, మిత్రులకు, బంధువులకు ఆదరణ, ఆప్యాయత, అభిమానమూ పంచిపెడుతూ ఒక పాంథశాలలాగే నిలిచింది. చనిపోయిన తర్వాతగూడా ఆయన పేరిట ఒక పాంథశాల వెలసింది. జీవిత సార్థక్యత కింతకుమించి మరేం కావాలి?

* * *

టౌనుకు వెళ్ళినప్పుడల్లా ఎన్ని తొందర పనులున్నా ఏలాగో వీలుచేసుకుని ఓ అయిదు నిమిషాలపాటయినా ఆ వెయిటింగ్ షెడ్డులో కూర్చుంటాను. తిరిగి వెళ్ళగానే "ఏమండీ! మా బాబాయి గారింటికి వెళ్ళొచ్చారా?" అని అడుగుతుంది జానకి. 'ఓ' అంటాను నేను. ఆమె నమ్మదు. నేను వివరించడానికి ప్రయత్నిస్తాను. తాను చెవిలో వేసుకోదు. 'పునరపి జననం, పునరపి మరణం, పునరపి జననీ జఠరేశయనం' అన్నట్టుగా అన్ని కథలూ మళ్ళీ ప్రారంభమైన చోటికే వచ్చి చేరుకుంటాయనిపిస్తుంది... ...

ఇడ్లీ - సాంబారు - ఉప్మా

శ్రీ బండి నాగరాజు

ఈనాడు "ఇడ్లీ"కున్న ప్రాముఖ్యం-ముఖ్యంగా అరవప్రాంతంలోను, తత్పరిసర ప్రాంతాలలోనేగాక-దరిదాపులన్ని ప్రాంతాలలోను ఎక్కువే. అది లేనిదే గడపనివాళ్లు ఎంతోమంది వున్నారు. ఇడ్లీకి తోడు మరింతగా రుచి తెచ్చేది "సాంబారు."

"ఉప్మా" గూడా తెలుగుదేశంలో బాగా వాడుకే. సాధారణంగా పెళ్ళిళ్లలో ఉపాహారంగా ఉప్మా వాడుతుంటాము. కొంచెం తేలికపాటి వంట. ఇడ్లీ పెట్టటం 'వచ్చు' పని.

ఇప్పుడు ఈ పదాలను గూర్చి కొంచెం చర్చించడం, వ్యుత్పత్తిని ఆలోచించడం యీ వ్రాతకు మూలం. దోసె, అట్టు, కుడుము-వంటి పదాలు గూడా అనేకం వున్నాయి.

ఇడ్లీ

ఇడ్లీ అనేది 'ఇడ్డరి' శబ్దవికృతమని, "తల్లి సమస్త భాషలకు దైవత భాషయు" అని నమ్మే విద్వాంసుల ద్రావిడ ప్రాణాయామం. అది సంస్కృత భవమైతే వచ్చిన రుచిగాని, అరుచిగాని ఏమీలేదు అన్నిపదాలూ సంస్కృతమంచే ఏర్పడ్డాయని తంటాలు పడేవారి భ్రాంతికి- పెడర్థానికి పెద్దరోగానికి మందు లేదన్నట్టు-మనం చెయ్యగలిగిందిలేదు.

'ఇడ్డెన' అని తెనుగు దేశ్యపదం వున్నది. ఇప్పటికీ పల్లెటూరి వాళ్లు ఇడ్డెన, ఇడ్డెన్లు, ఇడ్డీలు అంటుంటారు. పల్లెటూరి వాడుక ప్రకారం ఇడ్డీ, క్రమంగా ఇడ్లీ అయింది. నకారానికి లకారం వాడుకలో వస్తున్నది తెనుగు. తెలుగు; మునగ, ములగ; ఎంజ, వంజ; చాలా, చానా-ఇట్లాంటివి కొన్ని చూపవచ్చు. ఈ పద్ధతిలో ఇడ్లీ ఏర్పడి వుండాలి.

ఇప్పటికీ ఎవరైనా పల్లెటూళ్ళవాళ్ళు ఇడ్డెన్లు, పొప్పుపులుసు (పప్పు పులుసు అంటే సాంబారు అన్నమాట) తెమ్మని హోటల్ సర్వరుతో అంటే, ఆ పల్లెవాళ్ళని అనాగరికులని మాట సరిగా తెలియని వాళ్లని మనం అనుకుంటుంటాము. ఇడ్లీ అనేది అంతకంటే భ్రష్టరూపమని మనకు తెలియదన్నమాట. ఇప్పుడు ఇడ్లీ అనేది ఇంగ్లీషు పదమేమో నన్నంత భ్రమలో ఉంటున్నాము మనం. నాలుగు ఇడ్లీ, తొమ్మిది యిడ్లీ అని నిత్యైకవచనంగా గూడ వాడుతున్నాము.

సరే, యింతకీ అసలు 'ఇడ్డెన' అనేది ఎట్లా ఏర్పడింది, దీని అర్థమేమిటి అని చూడాలి. దువ్వెన, ఈర్పెన, నిచ్చెన, బొచ్చెన-వంటి పదాలతో ఇడ్డెనకు సామ్యం చెప్పవచ్చు. దువ్వు+ఎన దువ్వుటకు ఉపయుక్తమైన సాధనము అని శబ్దరత్నాకరం అర్థం చెప్తున్నది.

బహుజనపల్లి వారి త్రిలింగ లక్షణశేషములో కృదంత పరిచ్ఛేదములో 3వ సూత్రం ఈ సందర్భంగా చూడవచ్చు.

"ఈర్చుబ్బు కందుదువ్వు వడ్డించుల కెన వర్ణకంబగు. అగుచో ఈర్చు-ఉబ్బుల చకార బకారంబులు వకారంబులగు. వడ్డించుకు ఇంచు లుప్తంబగు"

(1) ఈర్చు—ఈర్వు
ఈర్వు + ఎన ఈర్వెన]

(2) ఉబ్బు—ఉవ్వు
ఉవ్వు + ఎన=ఉవ్వెన

(3) కందు + ఎన=కందెన

(4) దువ్వు + ఎన=దువ్వెన

(5) వడ్డించు-ఇంచు=వడ్డ్
వడ్డ్ + ఎన=వడ్డెన

అయితేమరి ఇడ్డెన ఎట్లా ఏర్పడుతుంది అని యీ ప్రక్రియా పద్ధతినిబట్టి సందేహం రావచ్చునేమో?

ధాతువుల (క్రియాపదాల)మీద "ఎన" అనే కృత్ ప్రత్యయం వచ్చి కృదంతరూపం ఏర్పడుతుంది. దువ్వు అనేమాట క్రియ. దువ్వడం అనే పనిని తెల్పుతున్నది. దీనిమీద సదరు ప్రత్యయం వచ్చి దువ్వెన అయింది. దువ్వే సాధనము అని అర్థం ఏర్పడింది. ఇట్లాగే యిడ్డెన ఏర్పడుతుందా?

ఇడ్డెన అంటే వాసెన కుడుము అని అర్థం. వాసెన అంటే ఆవిరిపోక యెసటికుండ మూతి మూసి కట్టిన గుడ్డ అంటే ఆవటి కుడుము అని అర్థమన్నమాట.

ఇప్పటి ఇడ్లీల పద్ధతి వాడుకలోకి రాకముందు ఎసరుపోసిన వెడల్పుమూతి కుండకు లేదా చట్టికి ఆ యెసటి ఆవిరి పోకుండా

మూతిని మూసేసి గుడ్డకట్టి ఆ గుడ్డమీద ఒకే ఇడ్లీగా పెద్దది పెట్టేవాళ్లు. బియ్యం మినప్పప్పు నానేసి రుబ్బి కొంచెం ఉప్పువేసి దాన్ని కుడుముగా అంటే పెద్ద సైజు ఇడ్లీగా పెట్టేవారు. ఆవిరికి ఉడికిన దాన్ని తీసి సమభాగాలుగా కోసి తినేవారు. ఇటువంటి ఇడ్లీని ఆవిటికుడుము అనీ, వినాయకుడికి ఉండ్రాళ్లతోపాటు చేసేవాటికి ముద్దకుడుములనీ వాడుక. సారాంశ మేమిటంటే ఇడ్లీ అనేది ఆవిరి గుడ్డమీద పెట్టి (ఇడి) ఉడికించిన పదార్థమన్నమాట.

'ఇడు' అంటే ఉంచు, పెట్టు అని అర్థం. ఇడ్లీ పెట్టారు అని అంటాము. పెట్టడం (ఇడుట) ఇక్కడ ముఖ్యమన్నమాట. ఆవిరి గుడ్డపై పెట్టబడినది (ఇడ్డ—) కాబట్టి "ఇడు+విన" అయివుంటుందని భావించవచ్చు. ఊత కోసం ఇడు డకారానికి ద్విత్వం చెప్పకోవాలి. అప్పుడు

"ఇడ్డు+విన—ఇడ్డెన" ఏర్పడుతుంది.

ఇప్పుడు ఇడ్లీతయారైపోయింది. అందులోకి సాంబారుకూడా పడితే మజాగావుంటుంది. మా ప్రాంతం వాళ్ళకి పప్పులుసు అలవాటు మరి. ఐతే అదే సాంబారుగూడాను. చారు (చేరు) అనడానికి బదులు రసం అంటున్నాముగద! ఇప్పుడు పప్పులుసు, చారు అడిగితే విగతాళిగా చూస్తున్నారు. సాంబారు, రసం పోయించుకోవాలి.

సాంబారు

సంభారము అనే సంస్కృతపదం వున్నది. పదార్థ సంచయము అని అర్థము. సంబారము పైదానికి వైకృతము (ఒత్తులేని పదము). ఉప్పు చింతపండు లోనగు వేసవారము (వంటదినుసులు) అని అర్థము. సంబారముయొక్క రూపాంతరము సంబారు. సంబారము అనే మాటకే ఉప్పు చింతపండు లోనగు వంట దినుసులు అనే అర్థము కాక, "వండిన సాదకము (కూర)" అనే అర్థంలో శ్రీనాథుడు వాడినాడు: "శాక పాకములతో సంబారములతోడ, పరిపక్వమగు పెసరప్పుతోడ" (భీమేశ్వర పురాణం, 1-61) ఇక్కడ సంబారములు వంట వస్తువులుగాక సాంబారువంటి కూరలు (పులుసు మొ.) అని అర్థం వస్తుంది. సంబారముకు రూపాంతరమైన సంబారుకు, దాని వాడుక రూపముగా చెప్పదగిన సాంబారుకు పప్పుపులుసు అనే అర్థం రూఢమైంది.

సంభారము — ప్రకృతి.
సంబారము — వికృతి.
సంబారు — రూపాంతరము
సాంబారు }
సాంబార్ } — ప్రస్తుతపు వాడుకగా సాలు.

ఇడ్లీ సాంబారు పదాలు మనవైతే, అరవలు వాటిని తయారు చెయ్యటంలో అందెవేసినవారు. ఉప్మాపదం అరవ వారిదైతే దాన్ని మనం కొట్టేశాము. చిత్రమేమరి.

ఉప్మా

ఇంతకు పూర్వం మనవాళ్ళుగూడా ఉప్పిండి అనేమాట వాడేవాళ్ళు. ఉప్పుపిండి అన్నమాట. చక్కెర పిండిని ఉక్కెర అంటారు. బెల్లపు పిండిని ఆవిరికి ఉడకబెట్టితే దాన్ని పిట్టు అంటాము. పిండివంటి సన్నటి నూక (రవ)తో తిరుగబోత సామాను వగైరావేసి ఉడకబెట్టి చేసినదే ఉప్పుపిండి. ఇందులో తీపు ప్రధానం గాక, ఉప్పు ప్రధానమవుతుంది. ఉప్పు పొంగలి, చక్కెర పొంగలి వేరే వేరేగా ఉన్నవిగద! అట్లనే.

అరవంలో ఉర్పు, ఉప్పు రెండు రూపాలూ వాడుకలో ఉన్నాయి. పిండిని వాళ్ళు మావు అంటారు. ఉప్పుపిండి వాడుక తప్పి కాల్రకమాన ఉప్పుమావు వాడుక పడింది. అదే ఉప్మావు. పల్లెటూరివాళ్ళు ఉప్మావు అని వాడుతుంటారు. మనకు నవ్వు వస్తుంది. కారణం మన అజ్ఞానమే. ఉప్మావు చివరికి ఫాషన్‌గా ఇంగ్లీషు స్వరాలు సంతరించుకొని 'ఉప్మా' అయికూర్చుంది.

మనకిప్పుడు ఏ హోటల్లో చూచినా ఇడ్లీ, ఉప్మా తప్ప ఇడ్డెన్లు, ఉప్పుమావు కనబడవు. కాలాను గుణంగా వాటితోనే సర్దుకోవాలి మరి!



అగస్త్య పండితుడు - అతని అమూల్య గ్రంథద్వయం*

శ్రీ బులుసు వేంకటరమణయ్య

దక్షిణ భారతదేశ చరిత్రలో పద్నాలుగవ శతాబ్దం ప్రాధాన్యం వహించి ఉన్నది. కాకతీయ సామ్రాజ్య పతనం, విజయనగర సామ్రాజ్య స్థాపన ఆ శతాబ్దంలో జరిగినవే! దండయాత్రలకు గురియై దేశం అల్లకల్లోల పరిస్థితులలో ఉన్నా అప్పుడున్నూ సాహిత్యవ్యాసంగం సాగుతూనే ఉండేది. 13వ శతాబ్ది చివరనూ, 14వ శతాబ్ది మొదటనూ ఉండిన కాకతీయ ప్రభువు ద్వితీయ ప్రతాపరుద్రుని కాలంలో ఆయన ఆస్థానంలో విద్యానాథునితో సహా విద్వన్మహాకవులు ఎందరో ఉండేవారు. వారిలోనివాడే అగస్త్య పండితుడు. బహు గ్రంథకర్త. ఈయన ప్రతిభా పాండిత్యాలనూ, బహుగ్రంథకర్తృత్వాన్నీ ఉగ్గడిస్తూ గంగాదేవి తన మధురా విజయ కావ్యంలో—

'చతుఃషష్టి కావ్యోక్తి వ్యక్త వైదుష్య సంపదే,
అగస్త్యాయ జగత్యస్మిన్ స్పృహయేత్ కో న కోవిదః'
[మధురా. 1–14]

అని యీ మహాకవి డెబ్బయి నాలుగు గ్రంథాలను రచించినట్లు చెప్పినది. గంగాదేవి గొప్ప విదుషీమణి. 14వ శతాబ్దిలో విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన మొదటి బుక్కరాయల కుమారుడూ, రాజప్రతినిధీ అయిన వీరకంపరాయల దేవేరి. మధుర సుల్తాను మీదికి యుద్ధానికి వెళ్ళిన భర్తతోకూడా ఆమె అక్కడికి వెళ్ళి కంపరాయల విజయవృత్తాంతాన్ని 'మధురా విజయ' మనే మహాకావ్యంగా రచించినది. అందలి కవిస్తుతిలో అగస్త్య పండితుని గురించి పై విధంగా ఉన్నది. ఈ మహావిద్వాంసుని మేనల్లుడు విశ్వనాథుడు గంగాదేవికి విద్యాగురువు. అందువల్ల ఈతనిని ఆమె తన గ్రంథంలో పేర్కొనడం సహజమే!

అగస్త్య పండితుడు డెబ్బయి నాలుగు గ్రంథాలు రచించినా ఇప్పటికి మూడు మాత్రమే లభించాయి. అవి బాలభారతం, నలకీర్తి కౌముది అనే రెండు పద్యకావ్యాలు, కృష్ణచరితమనే గద్య కావ్యమున్నూ. పద్యకావ్యాలు రెండూ అసమగ్రాలే! అంటే వాటిలో ఉపలబ్ధ భాగం అతిస్వల్పమూ, అనుపలబ్ధ భాగం అత్యధికమున్నూ. బాలభారతంలో కొద్ది సర్గలే దొరికాయి. అవి యెన్నడో ముద్రితాలయినాయి. నలకీర్తి కౌముది సంగతి చాలాకాలంవరకూ ఎవరికీ తెలియనే తెలియదు. 1929-30 సంవత్సరాలలో ఆంధ్రసాహిత్య పరిషత్పత్రికలో శ్రీ పెండ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రిగారు దీనిని ప్రకటించిన తర్వాతనే దీని ఉనికి తెలిసింది. దానితోపాటు ప్రతాపరుద్రీయాన్ని రచించిన విద్యానాథుడే ఆ అగస్త్యుడై ఉంటాడనే భ్రాంతి కూడా ఏర్పడింది. ఎందుచేతనంటే - విద్యానాథుడు తన అలంకార శాస్త్ర గ్రంథమైన ఆ ప్రతాపరుద్రీయంలో గుణీభూత వ్యంగ్య భేదమైన అగూఢ వ్యంగ్యానికి

'ఔన్నత్యం యది వర్ణ్యతే శిఖరిణః కుధ్యంతి నీచైః కృతాః
గాంభీర్యం యది వర్ణ్యతే జలధయః క్షుభ్యంతి గాధీకృతాః
తత్రాహం వర్ణయితుం బిభేమి యది వా జాతో౽స్మ్యగస్త్యః స్థితః
త్వత్కీర్త్యే గుణరత్న రోహణగిరే శ్రీ వీరరుద్ర ప్రభో.''

అని ఉదాహరించి "అత్ర యదివా జాతో౽స్మ్యగస్త్యః స్థితః" అనే దానివల్ల తాను అగస్త్యుడనగుటవల్ల తనకు సముద్ర పర్వతాల వల్ల భయమేమీ లేదనే వ్యంగ్యం అగూఢమని వివరించాడు. దీనిని బట్టి ప్రతాపరుద్రీయ కర్త పేరు అగస్త్యుడని, 'విద్యానాథుడు' అతని బిరుదనామమనీ అనుకొనే అవకాశం ఏర్పడింది. కాని, బాగా ఆలోచించిచూస్తే విద్యానాథుడనేది కవినామమే కాని బిరుద నామం కాదనీ, పయి శ్లోకంలోని 'అగస్త్య' పదం అగస్త్యత్వారోపకం మాత్రమే అనీ తెలియక మానదు. విద్యానాథుడు తన ప్రతాపరుద్రీయంలో "విద్యానాథ కృతిశ్చేయం" అనియే తెలిపి యున్నాడు. ఆ యీ ప్రకర

---

* 1 నలకీర్తి కౌముదీ. అగస్త్య పండిత రచన. డెమ్మీ 90 పుటలు. వేలురకం కాగితము. చక్కని క్యాలికో బైండు. వెల 30 రూ. ప్రకాశకులు డి. కె. పబ్లిషింగ్ హౌస్, 73-బి ఆనందనగర్, ఢిల్లీ-110035.

2 కృష్ణచరితమ్. అగస్త్య పండితకృతము. డెమ్మీ 50+118 పుటలు. వేలు కాగితం. క్యాలికోబైండు, తంజావూరు సరస్వతీ మహల్ లైబ్రరీ ప్రచురణ. ఈ రెండు సంస్కృత గ్రంథాలు. ఈరెండింటికీ సంపాదకులు శ్రీ టి.వేంకటాచార్య, సంస్కృత ప్రొఫెసర్, టొరంటో యూనివర్సిటీ, టొరంటో, కెనడా.

ణాల చివరి గద్యలలోనూ 'విద్యానాథకృతే' అనే ఉన్నది. అప్పయ దీక్షితులవారూ, జగన్నాథపండితరాయలూ విద్యానాథుడనే చెప్పారు గాని అగస్త్యుడని చెప్పలేదు. ప్రతాపరుద్రీయ వ్యాఖ్య రత్నాపణాన్ని రచించిన కుమారస్వామిన్నీ. రత్నశాణమనే వ్యాఖ్య వ్రాసిన చిలకమర్రి తిరుమలాచార్యులున్నూ ఆ విధంగానే చెప్పియున్నారు. గద్యకావ్యాల్లో కథకూ, ఆఖ్యాయికకూ భామహుడు భేదం చూపిస్తే దండి భేదం లేదన్నాడు. ప్రతాపరుద్రీయకారుడు భామహుణ్ణి అనుసరించి భేదం చూపినాడు. కృష్ణచరితాన్నిబట్టి చూస్తే భేదం కానరాదు. అందువల్ల కృష్ణచరితం రచించినవాడూ, ప్రతాపరుద్రీయకర్తా విభిన్న వ్యక్తులనియే చెప్పక తప్పదు. వీటన్నిటినీబట్టి విద్యానాథుడనేది బిరుదనామం కాదనీ, అతడూ, అగస్త్యపండితుడూ వేరు వేరు వ్యక్తులనీ తెలుస్తున్నది. పయి విషయాల నన్నిటినీ కృష్ణచరిత పీఠికలో వివరిస్తూ ప్రొఫెసర్ వెంకటాచార్యగారు విభిన్నవాదాన్ని చక్కగా సమర్థించారు. మరొక సంగతి. బంధకవిత్వం చెప్పేటప్పుడు కవులు పద్యాల్లో తమపేరు ఇరికించడం సంప్రదాయం. ప్రతాపరుద్రీయంలోని చక్రబంధంలో విద్యానాథునిపేరే కానవస్తున్నది కాని అగస్త్యుని పేరు లేదు. దీన్నిబట్టి కూడా అగస్త్యుడూ, విద్యానాథుడూ వేర్వేరు వ్యక్తులనే చెప్పవలసి ఉన్నది.

నలకీర్తికౌముది యిప్పుడు సమగ్రంగా కాక, స్వల్పభాగం మాత్రం లభించినా-ఒకప్పుడిది మంచి ప్రచారంలో ఉండినదనీ, జనాదరణ పొందినదనీ మనం నిర్ణయించవచ్చును. రామరాజభూషణుని వసుచరిత్రలో సుప్రసిద్ధమైన నాసికావర్ణన పద్యానికి మూలం యిందులో కానవస్తున్నది-

వసుచరిత్రలోని పద్యం యిది-

'నానాసూనవితానవాసనల నానందించు సారంగ మే
లా నన్నొల్లదటంచు గంధఫలి బల్కాకం దపంబొంది యో
షానాసాకృతిఁబూని సర్వసుమనస్సౌరభ్యసంవాసియై
పూనెం బ్రేక్షణమాలికా మధుకరీపుంజంబు నిర్వంకలన్.''
[వసుచరిత్రము-ఆశ్వా. 2. పద్య 46]

దీని మూలం ఇలా ఉన్నది-

''భృంగానవాప్తి ప్రతిపన్నఖేదా
కృత్వా వనే గంధఫలీ తపోఽలమ్,
తన్నాసికాభూ దనుభూతగంధా
స్వపార్శ్వ నేత్రీకృత భృంగసేవ్యా.'
[నలకీర్తి కౌముదీ. సర్గ 2-శ్లో. 74]

రెండింటికీ కల్పనలో ఏమీ భేదం లేదు. మూలంలోని 'గంధఫలీ, తప' శ్శబ్దాలు యథాతథంగా గ్రహించబడినవి.

వసుచరిత్ర పద్యాన్నిగురించి ఒక ప్రవాద ప్రసిద్ధంగా ఉన్నది. ఈ పద్యాన్ని రచించిన కవి నంది-తిమ్మన్న అనీ, ముక్కునుగురించిన చక్కని పద్యం చెప్పబట్టే అతనికి ముక్కు-తిమ్మన్న అనే పేరు వచ్చినదనీ, ఆ పద్యాన్ని వసుచరిత్రకారుడు తీసుకుని తనదిగా చేసుకున్నాడనీ ఆ ప్రచారం. అట్టి పద్యం వ్రాయడానికి రామరాజభూషణునికి సామర్థ్యం లేకపోలేదని కొందరివాదం. అగస్త్యపండితుని శ్లోకాన్ని బట్టి పయి ఊహలన్నీ పరాస్తమై, అసలు కల్పన అగస్త్యునిదే అని తేలిపోయింది.

భారతంలోని నలచరిత్ర ననుసరించి వ్రాయబడిన మహాకావ్యం నలకీర్తికౌముది. దీని సర్గాంతగద్యలలో ''అగస్త్యపండిత విరచితే నల కీర్తి కౌముద్యాఖ్యే లక్ష్మీ క్రమపదలాంఛనే మహాకావ్యే'' అని ఉన్నది. ఈ నలచరిత్రను నైషధకావ్యంగా రచించిన శ్రీహర్షమహాకవి నల దమయంతుల వివాహాంతకథతోనే గ్రంథాన్ని ముగించాడు. శ్రీనాథుడున్నూ అతని పద్ధతినే అనుసరించాడు. అగస్త్యుని కావ్యంలో లభించిన రెండు సర్గలలో మొదటిదైన ద్వితీయసర్గలో నలుని దౌత్యమూ, రెండవదైన చతుర్థసర్గలో కథ వివాహానంతరం నలదమయంతుల నిషధరాజధాని కల్యాణపురికి రావడంతో ప్రారంభమై ఆ దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె కలగడంతో ముగిసింది. ఇంకో గ్రంథం చాలా సర్గలు ఉండి ఉంటుందని తోస్తుంది. గ్రంథ నామాన్నిబట్టి నలుని యశస్సును వివరించాలంటే నలచరిత్రను పూర్తిగా వర్ణించవలసి ఉన్నది. అగస్త్యపండితుడు అట్లే రచించి ఉంటాడు. అందువల్లనే యిది మహాకావ్యమయింది. పయి విషయాలను గమనించకుండా డాక్టర్ రాఘవన్‌వంటి మహాపండితుల పర్యవేక్షణలో తయారైన మద్రాసు విశ్వవిద్యాలయంవారిచే ప్రకటించబడిన కేటలాగస్ కేటలాగురం మొదటి వాల్యూంలో నలకీర్తికౌముది ఖండకావ్యమని చెప్పబడడం మిక్కిలి శోచనీయం.

ఇందలి కవిత్వం ఎలా ఉన్నదీ తెలుసుకొనుటకు ఇదివరకు ఉదాహరించిన నాసికావర్ణనశ్లోకం ఒక్కటే చాలును. గ్రంథం పూర్తిగా లభించకపోవడం మన దురదృష్టమే! సంపాదకులు శ్రీ వెంకటాచార్యగారి విలువైన పీఠిక, నోట్సు దీనికి మెరుగు పెడుతున్నవి.

సంస్కృతభాషలో గద్యకావ్యాలకంటె పద్యకావ్యాలే ఎక్కువ, వాటిలోనూ బాణభట్టు కాదంబరి, దండిమహాకవి దశకుమారచరిత, వామనభట్టు వేమభూపాల చరిత్రను ప్రసిద్ధాలయి ఎక్కువ ప్రచారానికి వచ్చాయి. ఈ కృష్ణచరితం కూడా ఆ కోవకు చెందినదే! ఇందులో భాగవతంలోని దశమస్కంధకథ ఉన్నది. అయినా దశమస్కంధం ఉత్తరభాగంలోని కథలన్నీ లేవు. నరకాసురుణ్ణి చంపిన తర్వాత ఇంద్రలోకానికిపోయి పారిజాతాన్ని తీసుకురావడంవరకే ఉన్నది. కుచేలవృత్తాంతాదులు లేవు. రుక్మిణీకల్యాణ కథలో రుక్మిణీదేవి శ్రీ కృష్ణునికి బ్రాహ్మణునిద్వారా రాయబారం పంపించుట, గౌరీపూజ లేవు.

కృష్ణచరితం పూర్తిగా లభించినా, మొదటి మూడుపత్రాలు లోపించాయి. తంజావూరు సరస్వతీమహల్ లైబ్రరీలోని గ్రంథాక్షరి లిపిలో ఉన్న ప్రతి ఒక్కటే దీనికి ఆధారం. ఆ తాళపత్రప్రతిలో 93 పత్రాలున్నవి. అయితే నాల్గవ పత్రంనుంచే గ్రంథం లభిస్తున్నది. దానిని అనుసరించి వ్రాయబడిన తెలుగులిపి ప్రతిలో కూడా ఆ మూడు పత్రాల గ్రంథం లేదు. వ్రాయసకాడు తెలుగులో కాపీ

చెయ్యడానికి ప్రారంభించినప్పటికే ఆ పత్రాలు లేనట్లు తెలుస్తున్నది. అందులో సామాన్యంగా గ్రంథారంభంలో ఉండే శ్లోకాలు కొన్ని ఉండవచ్చుననీ, లోపించిన గద్యభాగం కొద్దిగా ఉండవచ్చుననీ సంపాదకుల అభిప్రాయం. ముద్రితప్రతిలో రెండవ పుటనుంచీ ఉపలబ్ధగ్రంథం ప్రారంభమయింది. దానిని అనుసరించి సంపాదకులే ఊహించి స్వయంగా రచించి ఆ లోపాన్ని సరిచేసి మొదటిపుటను నింపారు. దీనిని ఆయన అధస్సూచిక (Foot Note)లో తెలిపారు. వారు అలా చెప్పకపోతే మొదటి పుటలోని విషయం లిఖితప్రతిలో ఉన్నదే అని అనుకోవలసి ఉండేది. శైలిలో ఏమాత్రమూ వ్యత్యాసం లేకుండా సందర్భశుద్ధిసహితంగా రచించిన శ్రీ వెంకటాచార్యగారి సామర్థ్యం ప్రశంసించదగినది.

ఈ గ్రంథం ముద్రణభాగ్యాన్ని పొందినది ఇప్పుడు మాత్రమే. తంజావూరులోని మహారాజా శరభోజి సరస్వతీమహల్ లైబ్రరీవారు చాలా గ్రంథాలు ముద్రింపించి ప్రకటించినా దీనినిమాత్రం ప్రకటించ లేదు. ముప్పయియేళ్ళక్రితం దీనిలోని కొంతభాగాన్ని మాత్రం తమ జర్నల్‌లో ప్రకటించారట! చక్కగా, నిర్దుష్టంగా జరిగిన తొలి ముద్రణ యిదే!

ఈ గ్రంథం వ్రాత ప్రతులవివరాలనుఇస్తూ, గ్రంథాన్ని గురించి సంపాదకులు విపులంగా వ్రాసిన పీఠికమాత్రమే కాకుండా దీనికి టొరంటో విశ్వవిద్యాలయంలోభారతీయభాషాశాఖాధ్యక్షులూ, సంస్కృత శాఖలో ప్రొఫెసరు అయిన శ్రీ ఎ. కె. వార్డర్ పండితుడు వ్రాసిన తొలిపలుకు కూడా ఉన్నది. అందులో ఆయన గద్యకావ్యాల విశిష్టతనూ, కథకూ, ఆఖ్యాయికకూ ఉండే తారతమ్యాన్నీ చక్కగా వివరించారు. కవి ఏదయినా గ్రంథం రచించడానికి సమకాలీనపరిస్థితులు కొంత దోహదమిస్తాయనీ, 14వ శతాబ్దిలో దక్షిణభారత ప్రాంతాలలో జరిగిన మహమ్మదీయుల దండయాత్రలను మనస్సులో పెట్టుకొనే అగస్త్యపండితుడు కంసవధ, నరకుడు మున్నగు రాక్షసవధలను వివరించే కృష్ణచరితను రచించి ఉండవచ్చుననీ తెలియజేశారు. వారి అభిప్రాయం యుక్తియుక్తంగా ఉన్నది.

కాళిదాస మహాకవికి వాల్మీకి మహామునియందు ప్రగాఢమైన భక్తి ఉన్నట్లు అతని రచనలవల్ల తెలుస్తున్నది. ఆ రీతిగానే అగస్త్య పండితుని వ్యాసమహర్షియందు దృఢమైన భక్తి కానవస్తుంది. ఇతని బాలభారతం, నలకీర్తి కౌముది, కృష్ణచరితం వ్యాసుని భారతభాగవతాల ననుసరించి రచించబడినవే! ఎవరు రచించినదో తెలియదుకాని కృష్ణచరితం సమాప్తమైనతర్వాత గ్రంథాక్షరివ్రాతప్రతిలో ఈ అభిప్రాయాన్ని తెలియజేసే క్రింది శ్లోకం కానవస్తున్నది—

"అనాదృత్య శ్లాఘ్యాన్ భువి కణనిబంధా ననిరతిం
కృత్వా వైయాసక్యాం రచయితు మగస్త్యస్య విదుషః
వసంతీ వాగ్దేవీ కృతిని రసనాగ్రే విజనుతే
న పర్యంకే పంకేరుహి మహతి పంకే విహరణమ్"

వైయాసకీ కృతి అంటే వ్యాసరచితమైన గ్రంథమన్న మాట.

కృష్ణచరితం ఒక విశిష్ట రచన. గద్యబంధంలో చూర్ణిక, వృత్తగంధి, ఉత్కలికా ప్రాయభేదాలున్నవి. అవన్నీ యిందులో ఎలా ఉన్నదీ, ఉత్కలికకు ఎట్టు ప్రాముఖ్యం ఇయ్యబడినదీ సంపాదకులు చక్కగా వివరించారు. కథాసంవిధానం ఎట్లున్నదీ స్పష్ట పరిచారు. ఉత్ప్రేక్ష, విరోధాభాస, ఉపమ, రూపకం, దీపకం, ఉల్లేఖాలంకారం, స్వభావోక్తి, శ్లేషలకు విపులంగా ఉదాహరణలు చూపారు. వర్ణనవైచిత్ర్యాన్ని తెలియజేశారు. గ్రంథాన్ని చదివేముందు విపులమైన ఈ ఆంగ్ల పీఠికను చదవడం ఎంతో అవసరం. దీన్ని చదివినమీదట గ్రంథం సులభంగా అవగాహన అవుతుంది. అగస్త్య పండితుని రచనా సౌష్ఠవానికి ఒక చిన్న ఉదాహృతి—

"అథ కతి పయ దివ సావసానే వసుదేవసుతః కదాచిత్ విగత ప్రతిపక్షతయా వినోదమపర మపశ్యన్ రైవతకాసన్న కాననేషు మృగయాం విధాతుకామః ప్రత్యుషస్యుత్థాయ తదర్హ కృతానాదిశత్ తత్‌క్షణాదుప తోరణ మాధోరణ నివర్త్యమాన యామ వారణ గహన బృంహితోప బృంహిత ప్రసరః సరభస ప్రయుక్తవల్లభ కౌలేయ కాక ర్ణితః సౌధ గర్భకందరానివ పూరయన్ మృగయు మనోరథానా మంతణశబ్ద ఇవ పిశితగ్రాసాయ శునాముత్పతిత విశ్వాత ఇదవన చరయూథికస్య మృగయా సంనాహశంసీ వియదధ్వని లితస్ఫార శంఖ ధ్వనిః"
(కృష్ణచరితమ్. పుట 93)

ఇది శ్రీకృష్ణుడు వేటకు ప్రయాణమయే సందర్భంలోనిది.

ఈ ఉత్తమ గ్రంథాన్ని వెలుగులోకి తెచ్చి అందంగా ముద్రింపజేసి ప్రకటించి శ్రీ వెంకటాచార్యగారు సంస్కృత వాఙ్మయానికి విద్వల్లోకానికి మహోపకారం చేశారు.

ఈవిధంగా ఈ గ్రంథద్వయాన్ని పరిష్కరించి విన్నో అమూల్య విషయాలతో కూడిన ఉపోద్ఘాతాలతో ఎడిట్‌చేసి ముద్రింపించిన శ్రీ ఆచార్యులవారికీ, ఇవి బయటికి రావడానికి ఆర్థికంగా ఎంతో సహాయపడిన కనడా హ్యుమానిటీస్ రిసెర్చి కౌన్సిల్ వారికీని సంస్కృతభాషాభిమానులంతా ఎంతో కృతజ్ఞతను చూపవలసి యున్నది.

కలగూరగంప

'లీలావతి' హిరణ్యకశిపుని భార్య పేరుకాదు

హిరణ్యకశిపుని భార్యపేరు, అంటే ప్రహ్లాదుని తల్లిపేరు 'లీలావతి' గా ఆంధ్ర లోకంలో రూఢి అయింది. ఎందరో పెద్దలూ, పండితులూ భాగవతాన్ని పరిష్కరించి ముద్రించడం, పాఠ పరిశోధనలు చెయ్యడం–ఇలాంటివెన్నో జరిగివున్నా ఈ 'లీలావతి' విషయం మాత్రం కనుమరుగవుతూనే వచ్చింది. దానికి ప్రధానకారణం పోతనగారి తప్పుకాదుగాని, ఆంధ్రలోకం భాగవతాన్ని పదపదార్థ విమర్శన పూర్వకంగా చదువక పోవడమనే తోస్తుంది.

నేనొక పనిగా భాగవతాన్ని చూస్తుంటే, హిరణ్య కశిపుని భార్య లీలావతి కాదనీ, జంభాసురుని కుమార్తెయైన 'దత్త' అనీ–తేలింది. హిరణ్యకశిపుడికి ఒక్క ప్రహ్లాదుడేగాక ఇంకా ముగ్గురు కొడుకులున్నట్లుగూడా స్పష్టమయింది. అదెలాగో చూద్దాం–

పోతన భాగవతంలోని ప్రహ్లాద చరిత్రలో

"లీలోద్యాన లతావితానములలో
లీలావతీ యుక్తుడై
హేలాపాన వివర్తమాన మద లో
లావృత్త తామ్రాక్షుడై
కేళిందేలగ, నేమ తుంబురుఁడు సం
గీత ప్రసంగంబులన్
వాలాయంబుఁ గరంగఁజేయుదుము దే
వ ద్వేషి సుర్వేశ్వరా !"

రాజసూయంలో నారదుడు, ధర్మరాజుకు హిరణ్యకశిపుని వృత్తాంతం చెబుతున్న ఘట్టంలోని దీ పద్యం.

మూలంలో ఈభాగానికి సంబంధించిన రెండు శ్లోకాలు చూడండి –

"తమంగ మత్తం మధునోరు గంధినా
వివృత్త తామ్రేక్షమశేష దిష్ణ్యపాః।
ఉపాసతో పాయన పాణిభిర్వినా
త్రిభిస్తపోయోగ బలౌజ సాం పదం॥

జగుర్మహేంద్రాసన మోజసాస్థితం
విశ్వావసుస్తుంబురు రస్మదాదయః।
గంధర్వసిద్ధా ఋషయోఽస్తు వన్ముహుః
విద్యాధరా అప్సరసశ్చ పాండవ॥" (7-4-13-14)

ఈ శ్లోకాల్లో ఎక్కడాకూడా 'లీలావతి' పేరులేదు దాన్ని సూచించే మరో పదమూలేదు. 'అంగమత్తం' అంటే 'అంగనామత్తం' అంటున్నారు కొందరు. అది యుక్తంకాదు. ఉరుగంధి నామధునా–మత్తాని అంగాని యస్యసః–తం–అని అర్థం చెప్పుకోవాలి. ఇకపోతే రెండో శ్లోకంలో స్త్రీల ప్రస్తావన లేదుగాని 'అప్సరసః' అన్నపదం వుంది. అయినా యిక్కడ 'అప్సరసః – అస్తువన్ – (స్తుతించారు) అన్నాడు కాబట్టి ఇందులో లీలావతి' అన్న పదానికి ఆస్కారంవుండదు.

ఈరెండు శ్లోకాలకు పైన 'సుదతీ వృందారం ముఖమ్' అన్న శ్లోకాంతం ఒకటుంది. ఇందులో సుదతీ శబ్దాన్ని తీసుకొని పోతన 'లీలావతీయుక్తుడై' అని వ్రాశాడు. పాపం ఆయనతప్పులేదు గాని, ఆంధ్ర సాహితీలోకం దీన్ని అర్థంచేసుకోవడంలో పొరపడింది కాబోలు. 'లీలావతీభిః యుక్తః' అంటే స్త్రీలతోకూడుకొన్నవాడు అని అర్థం చెప్పడం సమంజసం. అంతేగాని దీన్నిపేరుగా భ్రమించడం దొడ్డతప్పవుతుంది. అసలు విషయం చూడండి

షష్ఠస్కంధంలో సవిత్రువంశ ప్రస్తావనలో హిరణ్యకశిపుడికి జంభాసురతనయయైన 'దత్త' భార్య అనీ, ఆమెకు ప్రహ్లాద, హ్లాద సంహ్లాద, అనుహ్లాదు లనే నలుగురు కుమారులున్నా. సింహిక అనే ఒక కుమార్తెయూ వున్నట్లుంది. (భాగ-6-506). ఇక్కడ 'లీలావతి' ప్రస్తావనే ఆయన చెయ్యలేదు.

పోతన, భాగవతంలో ఒకే ఒక్కచోట 'లీలావతి' పదం వాడాడు. అదిగూడా యతికోసమేనని మనకు దృఢమవుతుంది. 'లీలోద్యాన లతావితానములలో లీలావతీ యుక్తుడై.' ఈ సందర్భంలో ఈపేరే, మరోచోట ఎక్కడేనావుండివుంటే మనం దాన్ని అంగీకరింపక తప్పదేమో !

ఈ విషయంగా నేనొకర్ని ప్రశ్నిస్తే 'లీలావతి' హిరణ్యకశిపునికి మరోభార్యగా ఎందుకుండరాదన్నారు. ఆ ప్రశ్నకు ఆస్కారం లేకుండానే 'దత్త'కు ప్రహ్లాదుడు జన్మించినట్లు చెప్పాడు పోతన. ఇదిలావుండగా పూర్వగాథాలహరి కర్త ఈ లీలావతిని హిరణ్య కశిపుని భార్యగానే వ్రాశారు. అక్కడ, వారుగూడా పూర్తిగా, సప్తమ స్కంధాన్నే అనుసరించారు. అయితే 'హిరణ్య కశిపుడు' అన్న పేరు క్రింద 'దత్త' హిరణ్య కశిపునికి మరో భార్యగా వున్నట్లు వ్రాశారు, ఈ సందర్భంలో వారు సంస్కృత భాగవతం చూడలేదనిపిస్తుంది. (ప్రక్షిప్త శ్లోకాలలో ఈపేరుందేమో అనటానికిగూడా ఆస్కారం లేకుండా 'దత్త'కు ప్రహ్లాదుడు పుత్రుడని చెప్పబడింది.) బహుశః వారలా వ్రాయడానికి కారణం, అప్పటికే 'లీలావతి' జనప్రచారం పొందివుండడమే ననుకుంటాను.

ప్రబంధ పరమేశ్వరుడైన శ్రీరన నృసింహపురాణంలో ఎక్కడా కూడా హిరణ్యకశిపుని భార్యపేరు చెప్పలేదు. పేరుకు బదులుగా 'దైత్యరాజమహిషి, దానవరాజపత్ని' ఇత్యాదిగా వాడుతూ వచ్చాడు.

సుప్రసిద్ధ సంస్కృతాంధ్ర పండితులు శ్రీ॥ శ్రీ॥ డా॥ పాటిబండ మాధవశర్మగారు 'భక్తరక్షణ' అనే తమనాటికలో (ప్రస్తుతం తొమ్మిదవ తరగతి తెలుగు పాఠ్యగ్రంథంలో ఒక పాఠం) హిరణ్యకశిపుని భార్యపేరు 'లీలావతి' గానే వ్రాశారు. పేరు సౌమ్యంగా వుండడంతో ఈ 'లీలావతి' అందరి హృదయాల్లోనూ నాటుకుంది. 'అలాంటి రక్కసుడికి ఇలాంటి భార్యనా' అనిపించుకుంది లీలావతి

ఏది ఏమైనా అసలు విషయాన్ని గుర్తించకతప్పదు. ఒకవేళ పాశ్చాత్య పండితులే 'హిరణ్య కశిపుని భార్య ఎవర'ని మనల్ని ప్రశ్నించి వుంటే మనం చెప్పేది 'లీలావతి' అనే. దానిమీద వాళ్ళు తర్జన భర్జనలు చేసి అసలు విషయం బయటకు లాగితే అది మనకు ఎంత చిన్నచూపో చూడండి.

అకాడమీ వారి భాగవత పరిష్కరణలో ఎంతో వుద్దండ పండితులు పాల్గొన్నారు. వారు మూలాన్ని చాలా జాగత్తగా పరిశీలించా, రనడం అతిశయోక్తి కాదు. అయినా ఈ విషయాన్ని వారు ఎత్తి చూపిస్తుంటే మరింత బాగుండేది ఇంకా యిలాంటి వెన్నున్నాయో చూసాం మని. ఈ విషయంపై చర్చలుంటే మరో సంచికకు అందించాలి పరిశ్రాలోకం.

—శ్రీ పణతుల రామేశ్వర శర్మ

ఔచిత్య వివేచనము

మహాకవి,కవిసార్వభౌముడూ అని పేరువడసి తెనుగునాట కావ్యరచనచేసి 'సెబాసు' అని పండిత ప్రకాండుల మన్ననల బడిసి, అష్ట దిగ్గజ కవుల క్షేమా తము తీసిపోని శ్రీనాథ కవిసార్వభౌముడు శృంగారనైషధ కావ్యము తెనుగు బాసలో మాతృకానుసారము. (అతని మాటగా) వ్రాసి కృతార్థుడైన సంగతి ఆంధ్ర పాఠక జనవిదితము. అందు అనగా నైషధ కావ్యమునందేగాక, తదితర కావ్యములందు (హరవిలాసము మొదలగు కావ్యములందు) అతని ఔచిత్య వివేచనము ప్రశంసనీయము; జగత్ప్రసిద్ధము.నైషధమునుండి లేదా హరవిలాసాది కావ్యములనుండి తదితరములనుండి, ఆతని ఘనతను ప్రదీపింపజేయు నుదాహరణములుగా నెన్నేని వర్ణనా చమత్కృతిగల మనోహర పద్యావళిని నేను 'భారతి' పత్రికా ముఖమున ప్రకటింపగలను. ఆ మహాకవి ప్రతిపద్యమున ఔచితియు, రసవివేకము, కవితామర్మజ్ఞత ప్రస్ఫుటమగుచుండును.

శ్రీ ముదిగొండ ఈశ్వరచరణ్‌గారు జనవరినెల 'భారతి'లో 'యోషపీడన, మను సంస్కృతమూలమగు హర్షవర్ధనమహాకవి పదమునకు తెనుగున "పాలిండ్లకొత్తుగా పరిరంభణముసేసి"యని ఇందుని మాటగా చేడియలచే దమయంతితో బలికినట్లు తన (కవి) మాటగా శ్రీనాథునియనువాదమునుతిరస్కారభావముతో "ప్రమాదోధీమతామపి" యనుకొనవచ్చునుగదా యని సందేహించిరి. యోషపీడనమన 'పాలిండ్లకొత్తుగా' అనుటలో అర్థమేమైయుండినను, కవిరచనా పద్ధతి మాతృకానుసారము, ఔచితీసహితమనుటలో సందేహము గనుపింపదు.

నా మాటగా శ్రీనాథుడు వ్రాసిన ప్రతి రచన కావ్యజగత్తులో శిలాక్షరమేయైనది. ఆయన ప్రాచీన కవిస్తుతిపాత్రుడు. ఆధునిక కవులలో అనగా జీవితులగు ప్రస్తుత కవులు గాకపోయినను శ్రీ కీ. శే. విశ్వనాథసత్యనారాయణగారి నీరాజనమునకు పాత్రుడగు శైవ ప్రధాన కావ్యరచయిత శ్రీనాథుడు. ఆయన గౌడడిండిమభట్టు కంచుఢక్కాను పగులగొట్టినవాడు అటువంటి ఈశ్వరచరణ్‌గారి విమర్శకు పాత్రుడుగా తెల్లవోవు అగత్యము వచ్చెనా!

ఇంద్రునికి 'అహల్యాజారు'డను మరొక పేరుగలదు ఆతనికి దమయంతిని పెండిలి చేసికొను నుద్దేశమును గలదు. అట్టితరి యాతడు తండ్రియైనవాడు తన కూతురుతో మాటాడు పద్ధతి నవలంబించినచో చల్లకువచ్చి ముంతదాచినట్లు గాక మరేమగును? ఆతనికి శతమఖుడని పేరుగలిగియున్నను యజ్ఞముజేసిన సోమయాజియే యనుకొందము. ఇంద్రపదవి నధిష్ఠించిన రంభాద్యప్సరసాలోలుడు, వ్యభిచారి యనియు చెప్పుకొనదగువాడు. కావ్యములు కాంతా సమ్మితములు. వర్ణనోన్ముఖమగు రసము శృంగారము. మీదుమిక్కిలిగా వాగ్మిగానుండిన కవి శప్తుడగు సహ సభగవానుడగు దేవరాజే యయిన వానిచే నామాట పలికించిన శ్రీనాథ మహాకవీశ్వరుని పై ఈశ్వరచరణ్‌గారి యాభాండమగు నభిప్రాయము సర్వథా చెల్లనేరదు. సంపాదకులు యథాతథముగా ప్రకటించుటలో సామంజస్యము గలదు. శ్రీనాథుని నేరమిందేమియు గానుపింపదు. కవులు స్వతంత్రులై సర్వదా రచనలు ప్రకటించుచుందురు.

రావణుడు సీతాచోరుడు గదా? అతడు సీతావ్యభిచారి కాజాలడు.

అతడు గొప్ప శివభక్తుడు, రాజనీతిజ్ఞుడు 'పరోధబుద్ధ్యైవ నారిం ప్రయామి' అనినవాడు. కావున ఇంద్రునికన్న ఉత్తమోత్తముడు రావణుడును రంభాలోలుడను విషయము సత్యము. ఇదుప్పటికీ యీ దుష్టబుద్ధి యున్నదే! నాయీ లేఖలో శ్రీ ఈశ్వరచరణ్‌గారి వ్రాతకు సమాధానము నే వ్రాసితిని గాని ఎట్టి దూషణము లేదు. సదా వారి శ్రేయస్సును కాంక్షించుచు వారి సద్విమర్శనా పటిమకు స్వాగతము చెప్పువాడను—సెలవు.

—శ్రీ దోరంతి గోపాలకృష్ణ

సాహిత్య కుంభకోణము

శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు నన్నెచోడుని కుమార

సంభవాన్ని సెళ్ళగించి తెనుగుజాతికి మహోపకారం చేశారు. ఈ కుమార సంభవము అవతారికలో నన్నెచోడుడు తెనుగు సాహిత్య చరిత్రను గురించి స్పష్టముగ చెప్పియున్ననూ, కొందఱు పసిబాలుర వాదనల్లాంటి వ్యాఖ్యలతో మాయజేసియున్నారు. వెనుకనున్న కుంభకోణము బయల్పడునని కాబోలు 'నన్నయ ముందా-నన్నెచోడుడు ముందా' అను వాదనా సముద్రంలో తెనుగువారిని ముంచుట జరిగినది. నన్నెచోడుడు నన్నయ తర్వాతివాడని నిరూపించినచో వెనుక జరిగిన కుంభకోణము చెక్కుచెదరకుండ ఉండగలదని కొందఱి ఆలోచన కాబోలు!

నన్నెచోడుడు కుమారసంభవము అవతారికలో సంస్కృతాంధ్రములలో తప్ప మఱి ఏ ఇతర భాషలలోను సాహిత్యము లేదని స్పష్టపఱచి యున్నాడు. తాను తెనుగు లిపిని మార్చుచున్నట్లు కూడా స్పష్టముగ చెప్పియున్నాడు. నన్నయ మహాభారతము అవతారికలో కొందఱు పండితులు తెనుగుభాష లిపి ఒప్పిదముగ లేదని అంటున్నట్లు తెల్పెనే గాని తాను లిపిని మార్చుచున్నట్లుగానీ, సృష్టిస్తున్నట్లుగానీ, తనతో తెనుగు సాహిత్య మారంభమైనదనిగానీ తెలుపలేదు. కనుక నన్నయ 'గ్రుడు' వ్రాయవలసిన అవసరములేదు. ఈ 'గ్రుడు'ను, లిపిని మార్చుచున్నట్లు తెల్పినందున, నన్నెచోడుడే వ్రాసియుండవలెను (కళావిలాసము!?!)

నేటి తమిళనాటి నడిబొడ్డున ఆనాడు నన్నెచోడుడు (పాకనాటికి అతని పాలనను పరిమితం చేయుట మఱొక మాయ) కూర్చొని స్పష్టముగ తెనుగు సాహిత్య చరిత్రను గురించి చెప్పిన ప్రకారము, 'తమిళ సాహిత్యము చాల ప్రాచీన మనుమాట, తర్వాత కన్నడ సాహిత్యము పుట్టిన దనుమాట, తర్వాత నూటయాభై సంవత్సరములకు తెనుగుసాహిత్యము ఉద్భవించిన'దను వాదము పూర్తిగ వీగిపోవుచున్నవి. శ్రీకృష్ణునివలె నారాయణభట్టు తోడ్పడినందున నన్నయతో కావ్యారంభమైనదను మాయతో తెనుగు వారిని గప్పి, తప్పుదారిని బట్టించుట జరిగినది. (ఈ 'నారాయణభట్టు మాయ'ను ప్రఖ్యాత పరిశోధకులు, కళాప్రపూర్ణ, డా॥ నిడుదవోలు వేంకటరావు గారు బద్దలు చేసియున్నారు-''భారతి''-జూన్, 1976. అయితే ఈ 'పాయక పాకశాసనికి' పద్యాన్ని 'భారతములోనికి జొప్పించినవారే ఒక ప్రమాణాన్ని సృష్టించుటకోసమై అప్పకవీయములోనికి కూడా ఎక్కించియుందురు).

కనుక తొలుత తెలుగుభాష కేర్పడిన లిపిని (కీ. శ. 631/632) తమిళ లిపి అనుకొనుటయు, నన్నెచోడుడు మార్చిన లిపిని కన్నడ లిపియనియు, కొంతకాలము కన్నడ లిపిని మన ముపయోగించుకొని తర్వాత స్వతంత్ర లిపిని ఏర్పఱచుకున్నామన్న మాయలో మనలి పడద్రోయుట జరిగినది.

ఈ లిపి పరిణామము గ్రహించకపోవుటచే మొట్టమొదట వ్రాసిన లక్ష్యలక్షణ గ్రంథాలు, నిఘంటువు, అలంకారాది సర్వశాస్త్రములు, ఇతర కావ్యములు (తమిళ లిపి అని భ్రమపడుటచే) తమిళ భాష కేర్పడినవన్న అపోహలో పడవలసి వచ్చినది. (లండన్ లైబ్రరీలో పింగళి నిఘంటువు, మారన అలంకార శాస్త్రము కన్నీరు గార్చుచున్నవి.) నన్నెచోడుని లిపి మార్పుతో తమిళ సాహిత్యం తర్వాత కన్నడ సాహిత్యము పుట్టినదన్న మఱొక మాయ బయలుదేరినది. ఈ మాయలో మనము చిక్కియుండుట సాధ్యమైనన్ని కావ్యములను తగిన మార్పు కూర్పులతో కుంభకోణ హృదయులు తమిళ కన్నడ కావ్యములుగ మార్చివేసిరి. (శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారి మిగడ తఱకలు—37వ పేజీ తప్పక చూడతగినది.)

తెనుగువారు, మహోజ్జ్వలమైన దేశ-సాహిత్య చరిత్రలుండియున్ననూ, వారి అమాయకత్వము వలననూ, పై సాహిత్య కుంభకోణమువలననూ, చివరికి ఏమియు లేనివారైరి. లిపిని మార్పుట వలన ఇంత చరిత్రను పోగొట్టుకొనవలసిన విషయమును తెలిసికొనక పోవుటచే, నేడు తెనుగు కన్నడ లిపులను ఒకటిగ చేయవలెనను ప్రయత్నము చేయుచున్నాము. అమాయకత్వము వలన మనము ఒప్పుకున్ననూ, కన్నడిగులు దీనికి సుముఖత చూపరు. కారణము—లిపి మార్పువలన సాహిత్యచరిత్రకు జరిగే అపకారము మనకంటె వాళ్ళకు బాగుగా తెలియును గదా!

ఈ కుంభకోణమువలన ద్రావిడ కుటుంబము పెద్దదైనది!! తెనుగువారు కూడా ద్రావిడులన్న అభూత కల్పన జరిగినది. కొందఱు స్వార్థంతో చేసిన ఈ సాహిత్య కుంభకోణము వలన ఈనాడు దక్షిణ భారతము నాలుగు ముక్కలైనది, భాషారాష్ట్రాల పేరుతో! ప్రాచీనతను ఆపాదింపజేకొని ఈ మాయాభాషావాదనతో భారతదేశాన్నుండి కూడా విడిపోవాలన్న ధోరణిలో తీవ్రపరిణామాలకు దారితీస్తున్నది. ఈ బొట్టబొమ్మ గుట్టు ఇంకా బట్టబయలు చేయాలంటే కేంద్ర ప్రభుత్వమువారో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమువారో సజ్జనులైన ప్రతినిధులను దక్షిణాది రాష్ట్రాలలో ప్రత్యేకాలు సాగిస్తున్న సాగించబోవు సమయాలలో స్థలాలలో నియమించుట అవశ్య కర్తవ్యము! (నాకు లభ్యమైనంతవఱకు నన్నయ పూర్వసాహిత్య చరిత్రను నా శుభోదయ కావ్యంలో తెల్పాను). సత్యమేవ జయతే

అనృతమను గడ్డివామి కొండంతయైన
నిజమనంబడు నొక చిన్న నిప్పురవ్వ
కాల్చి మసిచేయు జాలదె కాలగతిని!
భరతభూమికి సత్యంబె పట్టుగొమ్మ!

—శ్రీ బైరవరసు త్రివిక్రమరావు

విజయనగర సామ్రాజ్య స్థాపనకు ప్రేరకులు : వివరణము

1977 జనవరి 'భారతి' సంచిక 'కలిగూరగంప' ప్రకరణమునందలి శ్రీ పాయసం సుబ్రహ్మణ్యంగారి 'విజయనగర సామ్రాజ్య స్థాపనకు ప్రేరకులు' అను రచనను నేను చాలా ఆలస్యంగా చదవడం జరిగినది. ఆ రచనను చదివి ఏకకాలంలో నేను విచార-విస్మయము

లనుభవించితిని. ఆ రచనలో వారు వెలిబుచ్చిన విషయాలనుబట్టి చూడగా 1962 నుండి 1972 వరకూగల ఒక దశాబ్దకాలంలో మేము రచించి ప్రచురించిన 'సంపూర్ణ విజయనగర సామ్రాజ్యేతిహాసము' (క్రీ. శ. 1224 నుండి 1656 వరకు) గల 'విద్యానగర చరిత్ర నవలామాలిక' 20 భాగములలో దేనినిగాని వారు చూడడం-చదువడం జరుగలేదేమోనని అనుమానించవలసివచ్చినది. శ్రీ సుబ్రహ్మణ్యంగారు అంతటి చారిత్రక జిజ్ఞాస గలవారయ్యును, మీదు మిక్కిలి మా జిల్లావారై యుండియు మా విద్యానగర చారిత్రక నవలామాలికలోని వింశతి భాగములలో ఒక్కటైననూ వారి దృష్టిని పడకపోవడంవలన ఆ నవలాకర్తలలో ఒకడినైన నేను చాలా విచారిస్తున్నాను.

ఇచ్చట కొంత స్వవిషయము చెప్పవలసివచ్చినందులకు మన్నింతురుగాక! 'శుభశ్రీ'–'సింహశ్రీ'–'రమాకాంత్'–'అనంతశ్రీ'–'రమ్యశ్రీ' అను లేఖిని నామములతో సాహితీలోకమునకు చిరపరిచితులమైన మేము అయిదుగురు సోదరులము కలిసి 'శ్రీనివాసపురం సోదరులు' అను సమిష్టి నామముతో విజయనగర సామ్రాజ్య చరిత్రను 20 భాగములుగా నవలారూపమున వెలువరింపదలచి యిప్పటివరకు 19 భాగములు వెలుగులోనికి తీసుకొని వచ్చితిమి. (ఆకస్మికముగా విజయవాడలోని మా ప్రచురణకర్త మరణించుటచే 18వ, భాగమైన 'దీవికోట' ప్రచురణమాత్రం ఆగిపోయినది. దానినికూడా త్వరలో ప్రచురింతుము) మా యీ నవలలన్నియును ప్రతిజిల్లా–, తాలూకా గ్రంథాలయములలో చదువరులకు లభించుచున్నవి. శ్రీ సుబ్రహ్మణ్యంగారు యీ నవలా మాలికలోని పంచమ కుసుమమైన 'రాజ్యోదయము' అను గ్రంథమును జదివి యుండిన పై రచనలో వారు వెలిబుచ్చిన వారికి కలిగిన సంశయము లన్నియును తీరి యుండెడివి. ఇప్పటికైనను సమయము మించిపోలేదు! విజయనగర స్థాపన; ప్రాభవ; క్షీణ; పతనములను గురించిన సంపూర్ణేతిహాసమును తెలుసుకొనగోరుచో వారు మా చారిత్రక నవలలను జదివిన బాగుగా నుండుననుకొందును. ఒక అప్రస్తుతమైన ఈ అంశమునటుంచి ప్రస్తుతమునకు వత్తును.

శ్రీ శర్మగారు వారి రచనలో ముఖ్యముగా చర్చించిన అంశములు రెండు. 1. విజయనగర సామ్రాజ్యస్థాపనకు ప్రేరకులెవరు? 2. క్రియాశక్తి దేవుడు విద్యారణ్యస్వామి ఎందుకు కాకూడదు? అనునవి.

పై రెండు అంశములకు నా సంగ్రహమైన సమాధానము.

విద్యానగర లేక విజయనగర సామ్రాజ్యోత్పన్నమునకు మూలరంగమైన దేవగిరిని పాలించిన యాదవులలో సుబాహుడను రాజు కాలమున నాసికాక్షేత్రము మొదలు దేవగిరి వరకుగల యాదవ సామ్రాజ్య భూభాగము నాలుగు పాయలుగా చీలిపోయినది. ఈ సుబాహుడు శ్రీకృష్ణుని పౌత్రుడైన అనిరుద్ధుని మనుమడగు ప్రతిభానుని కుమారుడు.

దేవగిరి యాదవులు వెలిగించిన స్వాతంత్ర్యపు దివ్వెకు, కంపిలమువారు ఆత్మార్పణ తైలమును పోసిరి. వారి నాశముతో దేశ స్వాతంత్ర్యజ్యోతి కరుడుగట్టి ఆరిపోవుస్థితికి వచ్చినది. ఈ స్వాతంత్ర్యజ్యోతికి ధైర్య-సాహస–అనుపమ త్యాగములను తైలమును నింపవలసి వచ్చిన తరుణమున, ఈ పవిత్ర కార్యమునకు తన జీవితము నంకిత మొనరించి, పూర్వాశ్రమంలో మాధవాచార్యులుగా వెలసిన శ్రీ విద్యారణ్యస్వామి శ్రీ భువనేశ్వరీమాతచే ప్రేరేపితుడై–ఆయమ యాజ్ఞానువర్తియై. శ్రీ విరూపాక్షస్వామి కృపాకటాక్షమున శాలివాహన శకము 1258లో ధాతృనామ సంవత్సర వైశాఖశుక్ల సప్తమీ తిథిని, పుష్యమీ నక్షత్రమున సింహలగ్నము (గురువారము) నకు సరియగు క్రీ. శ. 1336వ, సంవత్సరమున విజయనగర నిర్మాణమునకు పూనుకొని సామ్రాజ్య స్థాపనాచార్యులుగాను — హరిహరుడు పరిపాలించిన ఈ సామ్రాజ్యమునకు తానే మహామంత్రిత్వము వహించినట్లు చరిత్ర నుడువుచున్నది. ఈ అంశములనుబట్టి చూడగా విజయనగర సామ్రాజ్య స్థాపనకు ప్రేరకులెవరు ? అను ప్రశ్నమునకు మానవ మాత్రులుగాక శ్రీ భువనేశ్వరీ మాతయే ప్రేరకురాలని తెలియుచున్నది గదా !

ఇక క్రియాశక్తి దేవుడు విద్యారణ్యస్వామి ఎందుకు కాగూడదు? అన్న శ్రీ సుబ్రహ్మణ్యంగారి అభిప్రాయమునకు సమాధానము. క్రియాశక్తి దేవుడు నూతన సామ్రాజ్యస్థాపనకై యత్నించుచున్న విద్యారణ్యులను ముష్కర తురుష్కులు పట్టి వధింప ప్రయత్నములు చేయుచున్న సమయమున, (అనగా సుమారు క్రీ. శ. 1330 సంవత్సరముల ప్రాంతమున) భువనేశ్వరీమాత ఆదేశాను సారుడై వారి రక్షణకై వచ్చిన వ్యక్తియని అనేకములైన చారిత్రకాధారములు చెప్పుచున్నవి. ఈ క్రియాశక్తిదేవుని పూర్తినామధేయము శ్రీ కాశీవిలాస క్రియాశక్తి పండితుడనికూడ చరిత్రయే తెలుపుచున్నది. ఇట్లుండ–విద్యారణ్య క్రియాశక్తులను భిన్నవ్యక్తులను శ్రీ సుబ్రహ్మణ్యంగారభిప్రాయపడినట్లు ఒకరేనని అనుకొనుట యెట్లు పొసగును? సంగ్రహముగా ఇది వారికి నా సమాధానము. ఈ విషయమింకను విపులముగా దెలియగోరుచో 'రాజ్యోధయ' మను మా చారిత్రక నవలను జదువ వలసినదిగా వారికి విన్నవించుచున్నాను.

— శ్రీ శ్రీనివాసపురం రామాచార్యులు (రమ్యశ్రీ)

పావులూరి మల్లన: ఒక పరిశీలన

ఆంధ్రదేశమున పూర్వమునుండియు అన్ని కళలవలెనే గణిత శాస్త్రమును సముచిత స్థానము నాక్రమించియున్నది. వేంగీ చాళుక్య వంశాధీశులు పాలించునాడు, తెలుగు భారతమునకు శ్రీకారము చుట్టబడినది. అసురక్తుడును, అవిరళ జపహోమ తత్పరుడును అగు నన్నయ భట్టారకులు రాజరాజ నరేంద్ర నియోగమున భారతాంధ్రీకరణమునకు బూనుకొనిరి. నారాయణభట్టారకుల సాయము వారికి లభించినది. భారతము ముచ్చటగా తెలుగున రూపుదిద్దుకొన్నది. అట్లే గణితశాస్త్ర అధ్యయన, అభ్యాస ప్రయోగములుగూడ నాడున్నతిని పొందినవి. అలనాటి వేంగిరాజుల శాసనములలో మున్నన

గణితశాస్త్రకారుడుగా విఖ్యాతినిగని, రాజసన్మానములనందుకొన్నట్లు చెప్పబడినది. ఈ మల్లన యింటిపేరు పావులూరివారు. ఈయన వ్రాసిన క్షేత్ర గణితము మిక్కిలి ప్రాచుర్యమునంది, ఉపయోగింపబడినట్లు తెలియుచున్నది.

ఈ మల్లన ఎప్పటివాడు? ఎందుండి రాజమహేంద్రవర పురాధీశుల కడకు చేరి, వారిమెప్పు వడసినాడు? ఇంచుక పరిశీలింతము.

రాజరాజనరేంద్రుడీ పావులూరి మల్లనకు 'నవఖండనాడ'ను అగ్రహారముగానిచ్చి, ఆదరించినాడని శాసనస్థమైన విషయము. కాగా యీ మల్లన స్వస్థలమేది? ప్రస్తుతము ప్రకాశంజిల్లాలో ఇలపావులూరు అను గ్రామమున్నది. ఇది అనాదినుండియు రాజ్యములకు, జిల్లాలకు, తాలూకాలకుకూడా ఒకహద్దుగా, ఎల్లగా నుంటూయున్నందున యీ యిలపావులూరు గ్రామమును "ఇది ఎల్లపావులూరు"— అని చమత్కారోక్తిగా ఆచార్యశ్రీ పింగళి లక్ష్మీకాంతముగారు పలికియున్నారు. మల్లనచెప్పిన క్షేత్రగణితం యీ గ్రామకరణాలు సంప్రదాయపరంపరగా వాడుచున్నట్లును, కంఠస్థముచేయబడి విస్తీర్ణ సమస్యా పరిష్కారములకు అవసరమైనప్పుడుపయోగింపబడుచున్నట్లును, పందొమ్మిదవ శతాబ్దిలో యిలపావులూరి కరణంగా పనిచేసిన శ్రీ యిలపావులూరి రామయ్యగారి దస్తూరితో వ్రాయబడినటువంటి ఒక వ్రాతప్రతినిబట్టి తెలియుచున్నది. ఈ వ్రాతప్రతిలో చాళుక్యుల నాటి పలుకుబడి, లిపి కన్పించుచున్నవి.

సీ॥ సురపతి దిక్కున జాడంగ్గ పశ్చిమంద్దు - దక్షిణంబ్బునైదు
దనరగల్లి ... ...
దీని ఫలమెంత గణితజ్ఞ - తెలుపవయా॥

వంటి పద్యములలోగల ప్రయోగములు నాటి లిపి అనుసరణమును తెలుపుచూ — యీ మల్లన ఆ చుట్టనాడేనని ఊహించుటకు తావిచ్చుచున్నవి. గ్రంథమున 'భోగికేయూర శ్రీగిరి పురవిహార' అని యున్నది. ఈ మల్లన శివపూజా తత్పరుడనియు తెలుపుచున్నది. ఒకచోట 'యిర్గనమంతీ!' యని సంభోధన. మల్లనకాలమున దాక్షారామ భీమన ఆలయమునగల శాసనములవలన నాటికి ధరామరవంశ్యులైన దండనాధ నాగార్జున, తమ్మప్రోలయమంత్రివంటి మంత్రులపేర్లు (డా॥ రామయ్య పంతులుగారి శాసనపద్యములు-25)కన్పట్టుచున్నందున యీ యిర్గనమంత్రియు తత్కాపుడైన ఒక అమాత్యుడని తెల్లమగుచున్నది. ఇట్లు చారిత్రకముగా చూడగా జూడ యీ గణిత శాస్త్రకారుడు మల్లన యిలపావులూరి గణక చక్రవర్తియే అయివుండవచ్చునని నా భావన. ఇందలి యదార్థమును విజ్ఞులు పరిశీలించి, మల్లన ఏ గ్రామమున నివసించి, గణిత శాస్త్రమునకు, క్షేత్రగణితమునకు, కావ్య గౌరవము గల్గించెనో విశదీకరించగలరని నా ప్రార్థనము. అది ఏ గ్రామమైనను, వాసిని పెంచుకొనుటకు తగిన సాహిత్య, గణితములను ముచ్చటగా ముద్దులొలుకు పద్యములలో నిబంధించిన, గ్రంథకర్తను గాంచినందున, ధన్యమగుననుమాట నేననిన, గురుజనులు మన్నింతురుగదా!

— శ్రీ ఇలపావులూరి శేషగిరిరావు

నిడదవోలువారికి లేఖ

భారతి మార్చి 1977 మాసపత్రికలో కావలి వేంకట రామస్వామిగారి "బయోగ్రాఫికల్ స్కెచెస్ ఆఫ్ ది డెక్కన్ పోయట్స్" (Kavali Venkata Ramaswami's Biographical Sketches of the Dekkan poets క్రీ॥ శ॥ 1829లో ప్రచురించబడినది) గ్రంథమును గూర్చి కళాప్రపూర్ణ నిడదవోలు వేంకటరావుగారు వ్రాశారు.

అందులో గ్రంథవిశిష్టత-కవుల చరిత్రము నందు ఆయా కవులను పేర్కొంటూ క్రీ॥ శ॥ 1810లో కృతికన్యకాపురాణ యక్షగానమును వ్రాసిన తిమ్మయను పస్తావించారు.

ఈ తాళపత్ర ప్రతిని నేను చూశాను. అందులో యిది క్రీ॥ శ॥ 1810లో వ్రాయబడినట్లు వున్నది.

వేంకటరావుగారు ఇలా అన్నారు:

"తాళపత్ర ప్రతులలో స్పష్టముగా నీతని యింటిపేరు 'ఇటికెల'వారని కలదు కావుననే పై యక్షగాన వాఙ్మయ చరిత్రమున ఇటికెల తిమ్మయ అని యీతని చరిత్ర వ్రాయబడినది. ఇతడు వైశ్యుడు. తండ్రిపేరు చెన్నయసెట్టి, తాత గురువసెట్టి కావుననే రామస్వామి యీతనిని తిమ్మయసెట్టి అని పేర్కొనినాడు."

ఇటికెల తిమ్మయను వైశ్యుడనుటకు ఆధారము లేదు. రామస్వామిగారు 'సెట్టి' అనుపదమునుచూసి వైశ్యుడని ఊహించి ఉందురు.

'మొల్ల రామాయణము'ను రచియించిన ఆతుకూరి మొల్లమాంబ తన గ్రంథమున అవతారికయందు తన తండ్రిని కేసవ సెట్టిగా పేర్కొనినది.

ఇంతమాత్రంచేత మొల్లను వైశ్యులని చెప్పలేము-కుమ్మరి, బలిజ మొదలగు కులములలో తమ పేర్ల వెనుక సెట్టి అని చేర్చుకొను ఆచారము అనాదిగా వున్నది. ఆ యా గ్రామ రికార్డులు ఈ విషయమును బుజావు పరుస్తున్నాయి—

ఇటికెల తిమ్మయకు తెలియని కులమును అంటగట్టుటకంటే అతనిని యక్షగాన కర్తగా వ్యక్తిగా గౌరవించుట మంచిది—

ఏ కులము వాడైతేనేమి?

కులముల ప్రస్తావన ఇంకానా?

అతనిని "ఇటికెల తిమ్మయ"గానే పేర్కొనిన బాగుండేదికదా? నిడదవోలువారు అన్యధా భావించరాదు.

— శ్రీ పాయసం సుబ్రహ్మణ్యం

"ఒక సందేహము" - సమాధాన ప్రయత్నము

జనవరి నెల 'భారతి'లో జిజ్ఞాసువులు శ్రీ పి. వి. కృష్ణమాచార్యులుగారు పై శీర్షికతో ఒక చిన్న వ్యాసమును ప్రకటించినారు. ఆంధ్రశబ్ద చింతామణిలో "కగచజడదబయుగ టడణ తదన పబమ యర లవ సహళంతు హల్వర్గః" అని కలదు. ఇందు హకారము ఆచ్ఛిక వర్ణసమామ్నాయమున పేర్కొనబడినది. దీనిపై వెలిబుచ్చిన సందేహమిట్లున్నది. "ఆ నాటికి అచ్చతెనుగు పదములలో హకారమున్నటు వంటివి నన్నయ భారత భాగమున ఒకపదమయినను లభింపదు ఆంధ్ర శబ్ద చింతామణిలో (హకారము) తెనుగు వర్ణముగా ప్రక్షిప్తమా! ఆనాటికి హకార ఘటితములు అచ్చతెనుగు పదము లేవైన గలవా? పండితులు ఈ సందేహమును తీర్పవలయునని ప్రార్థన" అన్నారు.

ఆంధ్ర శబ్ద చింతామణిలో హకారము ప్రక్షిప్తము కాదు. తెనుగు కన్న కొన్ని శతాబ్దులు పూర్వమే వాఙ్మయావస్థనందిన తమిళ కన్నడ వర్ణసమామ్నాయములలో హకారము కలదు. కాన నారాయణ భట్టునకు సహాధ్యాయి అగు నన్నయ అచ్చతెనుగువర్ణసమామ్నాయమున హకారమును చెప్పి ఉండుట సంభావ్యమే. అది అట్లుండనిండు.

ఇక నన్నయ భారతములో హకారఘటితమగు అచ్చతెనుగుపద మొక్కటయినను లేదా? అన్నచో ఉన్నవన్నదే సమాధానము. ఓహో తక్షక [ఆది 2-234] ఓహోచాలు (అరణ్య 3 344) అని నన్నయ "ఓహో" అను పదమును ప్రయోగించెను. ఇందు హకారముగలదు. హకారము ఆచ్ఛిక వర్ణ సమామ్నాయమున పేర్కొనుట కది పదాదినే ఉండనక్కరలేదు. ఙ-ళ లు పదాది వర్ణములుగా ఉండకున్నను వర్ణసమామ్నాయమున లేవా? అట్లే హకారమును, ఉండవచ్చును. ఇంతేకాక, "హనుమ కనిలజుండనియెన్ [అరణ్య 3-345] అని నన్నయ హనుమ శబ్దమును ప్రయోగించెను. శబ్ద రత్నాకరమున హనుమ శబ్దము కడ ఈ నన్నయ ప్రయోగమే సూచింపబడి ఉన్నది. హనుమాన్‌- సంస్కృతము. హనుమా-ప్రాకృతము. హనుమ—ప్రాకృత సమము. ప్రాకృతసమ మన్నను ప్రాకృతభవ మన్నను, అచ్చతెనుగే అగును. ఆహో-శబ్దము శబ్దరత్నాకరమున వైకృతముగా చెప్పబడెను. ఇది తద్భవము. కాగా, హకారఘటితములగు ఆచ్ఛిక పదములు నన్నయభారతమున కలవని తేలుచున్నది.

ఒక గ్రంథకర్త పేర ఒక గ్రంథము వెలయుచున్నప్పుడు, ఆ గ్రంథకర్తయే ఆ గ్రంథమును రచించియుండుననుటకు, ఏపాటి ఆధారము కనబడినను అపోహలతో గ్రంథకర్తృత్వమును తారుమారు చేయరాదు. ఆ గ్రంథకర్త పట్ల, న్యాయస్థానము లనుసరించు "అనుమాన ప్రయోజనమును" (Benefit of doubt) పరిశోధకు లనుసరించవలెను. చింతామణి వికృతివివేకములు నన్నయాథర్వణ రచితములే అనుటకు అవేకములగు అంతస్సాక్ష్యములు చూపబడియే ఉన్నవి.

కాగా ఆంధ్రశబ్దచింతామణిలో ఆచ్ఛికవర్ణ సమామ్నాయమున, హకారము పేర్కొనబడి ఉండుట నిర్వివాదము. అది ప్రక్షిప్తము కాదు; గ్రంథకర్తృత్వమునకు బాధకమును కాదు అని మనవి. శ్రీ ఆచార్యులగారి సందేహ నివృత్తికిది చాలును గాన ఇంతతో విరమిస్తి.

—శ్రీ వంతరాం రామప్రసాద్

లేఖలు

'మరుపూరు'గారి సమీక్ష-లోపాలు

జనవరి 1977 'భారతి'లో శ్రీ మరుపూరు కోదండరామ రెడ్డిగారు "తేజస్సు నా తపస్సు" అన్న నారాయణరెడ్డిగారి కవితా సంపుటిని సమీక్షించారు. అందులో ఆయన వెలిబుచ్చిన కొన్ని అభిప్రాయాలతో నేను విభేదిస్తున్నాను.

నారాయణరెడ్డిగారి బాణిని గురించి చెప్తూ "విష్ణు రోచిష్ణు, జిష్ణు, సహిష్ణు, కృష్ణ అని పోతనవలె కేవల పదాడంబరానికి పాకులాడకుండా, యమక గమకాలతో ఒక క్రొత్త సొబగును సంపాదించుకొన్నారు" అని ఒకమాట అన్నారాయన. ఇది బాగా ఆలోచించి చెప్పిన మాటకాదని నా అభిప్రాయం. ఎందువల్లనంటే పోతనలో పదాడంబరం అక్కడక్కడ ఉన్నా, కేవలం అది మాత్రమేకాక అపారమైన కవితాశక్తి అడుగడుగున మనకు గోచరిస్తుంది. అదీకాక నారాయణరెడ్డిగారితో పోలిస్తే పోతనలోని పదాడంబర ప్రియత్వం తక్కువే. వారి కవిత్వాన్ని జాగ్రత్తగా తారతమ్య పరిశీలన చేసిన ఎవ్వరికైనా ఈనిజం తెలుస్తుంది. ఆయనే కొంచెం తర్వాత "సూటిగా చెప్పాలంటే ఈయన కవితలు మొదలూ తుదలు కవితాశిల్ప దీపకాలుగా ఉంటవి" అన్నారు. అంటే మధ్యలో కవితాశిల్పం ఉండదనే కదా అర్థం. మరి ఆ నారాయణరెడ్డిగారికంటె పోతనను తక్కువ చెయ్యడం ఏం సబబుగా ఉంటుంది చెప్పండి?

"ప్రబంధాల పంజరాలని, వ్యాకరణాల ఇనుపపెట్టెలను నిరసించడం నేడు తెలుగుకు బట్టిన తెగులను కొందాం" అని మరొకమాట అన్నారు. అసలు వ్యాకరణమంటే ఏమిటి? భాషా శాస్త్ర నిర్వచనం ప్రకారం భాషలో అంతర్లీనమైయున్న కొన్ని నియమాలు వ్యాకరణం. వ్యాకర్త తనశక్తినిబట్టి ఆ నియమాలను గ్రహిస్తాడు. నిత్యవ్యవహారంలోని భాషని పట్టించుకోకుండా కేవలం కావ్యభాష, అందులోనూ కొద్దిమంది కవుల కావ్యభాషకి రాసిన వ్యాకరణాల్ని నిరసించడం తప్పేమీకాదు. అలా నిరసించడం 'తెగులు' అనుకోవడం మన సంకుచిత దృక్పథాన్ని తెలియజేస్తుంది తప్ప మరొకటికాదు.

నియమాల ఊచలతో నిర్మించబడిన ప్రబంధాలు నిజంగా పంజరాలే అందులో సందేహమేమీలేదు. 'వీరు ప్రబంధాలను చదువక వేభాషకు అస్తిభారం నిర్మించుకొన్నారో?" అని ప్రశ్నించారు. అస్తిభారం కోసమే ప్రబంధాలు అని ఒప్పుకొంటే మరి ఆ పని నిఘంటువులుకూడా చేస్తాయిగా? "నిన్న మొన్నటిదాక నీరు ఛందస్సు శృంఖలాలనుకోలేదే!" అని ఆశ్చర్యపోయి, "ఇది కాలపు నేర్పరి అను

కొందాం" అని సమాధానం చెప్పుకొన్నారు. ఒకమార్గం సరైనది కాదని నిర్ణయించుకొన్నప్పుడు అది నిన్నమొన్నటివరకు అనుసరించిన దైనా వదిలెయ్యడం వివేకవంతుడి లక్షణం. నిన్న మొన్నటిదాకా అనుసరించామని ఎవాళకూడా దానినే పట్టుకొని వేలాడటం తిరోగామి దృష్టిని తెలుపుతుంది. 'స్వైరి' అంటే అదే. "వీటిని తమ విద్యార్థులకు చెప్పడం మానివేస్తారా?" అని నారాయణ రెడ్డిగారిని ఆయన ప్రశ్నించారు. కాని విశ్వవిద్యాలయంలో ఆ పాఠాలు చెప్పడం అనేది ఉద్యోగధర్మం. పద్యపాఠాలు చెప్పినంతమాత్రాన పద్యాలే రాయాలనడం మోకాలికీ, బోడి గుండుకీ ముడిపెట్టినట్టుంటుంది.

ఛందస్సును తిరస్కరించడంలాంటి ప్రవృత్తి "ప్రపంచమంతా పాకి వారు సర్దుకొంటున్నారు" అని అన్నారాయన. కానీ నాకు తెలిసినంత వరకు అలాంటి వెనుకమాపెక్కడా లేదు. ఆయన ఉదాహరణలు చూపిస్తే సంతోషిస్తాం. ఒకవేళ ఎక్కడన్నా ఒకచోట (పొరపాటున) కనిపించినా మనం మన దృక్పథాన్ని మార్చుకోవాల్సిన అవసరం లేదు.

— శ్రీ యం. వి. రమణయ్య

శ్రీ సోమసుందర్‌గారి 'శేషేంద్ర దజాలం'పుస్తక సమీక్షపై శ్రీ తిరునగరి గారి లేఖ ఫిబ్రవరి సంచికలో చదివేను. ఐతే, శ్రీ తిరునగరి గారి లేఖలోని అంశాలతో నేను ఏకీభవిస్తాను కారణమేమంటే, శ్రీ శేషేంద్ర కవిత-త్వరగా తినాలనిపించే కొబ్బరికోడలాంటిది! అలా ఎందుకన్నానంటే-వారి కవిత మళ్ళీ మళ్ళీ చదవాలనిపించేంత మధురంగాను, ఆలోచనా పేరితంగానూ, అంతకంత భావం క్లిష్టంగానూ వుంటుంది. పోతే, శ్రీ సోమసుందర్‌గారు శ్రీ శేషేంద్ర కవితకు తన్మయులై పరవశించి. బాకాలా ఈ శేషేంద్రజాలాన్ని మన పైకి ఊదేరవడం పొరపాటు అవుతుంది. ఒక్కొక్క 'బిట్'ను ఎంతో సూక్ష్మంగా ఆలోచించి-పరిశీలనాత్మకంగా వ్రాసేరు. అందుకు శ్రీ సోమసుందర్‌గారిని ఎంతైన కొనియాడాలి. అభినందించాలి! శేషేంద్ర ప్రభావం ఫలానా వారి కవితలలో చోటు చేసుకుందంటే ఆశ్చర్యం అనవసరం! ఎప్పుడో అనుకరించిన సుధాసు, నాయని కృష్ణకుమారి, డా॥ ఆరపిరాల విశ్వం దాకా ఎందుకు? గత ఫిబ్రవరి 'భారతి'లో శ్రీ వై. శ్రీరాములుగారి కవితనే తీసుకుందాం. 'సౌందర్యం' కవితలో-'సంద్రంలో తడిసిన నీలిమేఘాల మేలిమును గుర్రి ఉరుములు పిండుతుంటే...'అని, 'ఈ ప్రకృతిమండి ఎన్నెన్ని మాటల్ని పాటల్ని పిండుకున్నా'నని వ్రాసేరు. పై ఉదాహరణలో శ్రీ శేషేంద్ర మనకు కన్పిస్తారు! మరోచోట, అదేకవితలో-'దిక్కుల్ని నా రెక్కలుగాచేసుకుని ఈ ప్రపంచాన్ని లేవదీసుకుపోతా' అన్నదాన్లో శ్రీ శేషేంద్ర కలుస్తారు-వారి 'స్మృతిసై మారిపోతా' కవితలో ఆఖరి రెండు వాక్యాలు గమనిస్తే మీకే అవగత మవుతుంది.

'లోకంలో ఉన్న రంగుల్ని మింగి పోయిగా నవిపోయి

ఒక చిన్న స్మృతినై ఎగిరిపోతా-'. ఇలా ఎందరో యువ కవుల్ని ప్రభావితం చేసిన శ్రీ శేషేంద్ర కవితకు-మండే సూర్యుడికీ, గైడ్ లాంటిది ఈ శేషేంద్రజాలం!

—శ్రీ యన్నంరెడ్డి వెంకటరెడ్డి

"భారతి" జనవరి సంచికలో డాక్టర్ సి. నారాయణరెడ్డిగారి కవితా సంపుటి సమీక్షను చూసిన తర్వాత ఈ ఉత్తరం వ్రాస్తున్నాను సమీక్షకులు శ్రీ మరుపూరు కోదండరామరెడ్డిగారు. సమీక్షకుల కొన్ని అభిప్రాయాలు ఆశ్చర్యం కలిగించేవిధంగా ఉన్నాయి. వారు, పోతన పదాడంబరానికి పాకులాడినాడన్నారు. నారాయణరెడ్డిగారు, పోతనవలెకాక, శ్రీనాథునివలె ఆంధ్ర వాఙ్మయంలో 'తనముద్రను చెరిగిపోకుండా' ముద్రించుకొన్నాడన్నారు. మరి సమీక్ష మొదలు పెడుతూనే 'తిక్కనను పాటూరు, కొట్టరువు అని అనాలనా? అట్లనే నారాయణరెడ్డికి డాక్టరు బిరుదం తగిలించవలసిన అగత్యంలేదు'— అని ప్రవచించినారు - బహుశః బిరుద నామాలకూ, వంశనామాలకూ ఉన్న భేదం మరచిపోయి. (తిక్కనను కవి బ్రహ్మ అనీ, ఉభయ కవిమిత్రుడనీ చెప్పుకోవడంలేదా!)

పోతనగారి పదాడంబరానికి వారు 'విష్ణు రోచిష్ణు జిష్ణు సహిష్ణు కృష్ణ' అని ఉదాహరణ చెప్పారు. ఈ పదబంధం సరిగా వారెక్కడనుండి తీసుకొన్నారో చెప్పడం కష్టం (ఇది ఏ పద్య పాదానికీ సరిపోదు), కాని ఇందులో ఒక్క పునరుక్తి అయినా లేనే, ఏ పదానికి కాపదం ప్రత్యేక లక్షణార్థాన్ని కలిగిఉంది. ఇక్కడ శబ్దాలంకారం సహజంగా భావావేశాన్ని స్ఫురింపజేస్తూ ఉన్నది. భావస్ఫోరకం కాని పదాలు పోతన వాడలేదు భావుక ప్రధానమైన పద్యాలలో ('అదె వందవందమండంతర్నితుండయ్యె. పాటలీ తరులార,పట్టరమ్మ!',శబ్దాడంబరానికి పాకులాడనూ లేదు పోతనగారి కంటగట్టిన ఈ అపకీర్తిని కోదండరామరెడ్డిగారివంటి విజ్ఞులు తమ భుజస్కంధాలపై మోయడం తెలుగువారు చేసుకొన్న దురదృష్ట మనవచ్చు.

శ్రీ కోదండరామరెడ్డిగారి వ్యక్తిగతాభిప్రాయానుసారము శ్రీనాథుడు పోతనకన్నా గొప్పవాడు కావచ్చునేమో కాని, సి. నారాయణరెడ్డిగారిని శ్రీనాథునితో పోల్చడంలో ఔచిత్యమేమో తెలియదు (బహుశః రెడ్డిరాజుల ఆదరణ కారణమా!). నారాయణరెడ్డిగారి కవిత్వాన్ని చిన్నబుచ్చడం కాదుగాని, కేవల శబ్దాశయమైన కవిత్వానికి ప్రస్తుత సమీక్షలోనే పలు నిదర్శనాలు కనిపించునని. వారి కావ్య సంపుటి పేరు 'తేజస్సు నా తపస్సు' అనడంలో ప్రత్యేకమైనంచి అర్థమేమున్నది? తేజస్సును గురించి తపస్సు అనా. లేక తేజమ్మే తపస్సు(?) అనా-"తరుణ పల్లవాలు" (వృద్ధ పల్లవాలు కాదు) "ఫలాల పాపలు" (ఫలాలు కామారావస్థలో పిందెలౌతాయో?" వేతంబులు కిలంబులు కావే" ఇంతకన్నా బాగున్నది) ఇవి వారు దర్శించిన తపస్ఫలాలు. "సమత నా తల్లి, సౌహార్దం నా తండ్రి, ఆనాది నా జనవం" ఇందులో శబ్దాతీతమయిన ఏ భావుక సౌందర్యం పిలిపిల్లుతున్నదో ?

శ్రీ నారాయణరెడ్డిగారి కవిత్వం ఇతఃపూర్వము రసికజన మనోరంజకం కాలేదనికాదు, ఇకముందు కాదనీ కాదు: కాని వారు వ్రాసినదల్లా సబంధ శకలమని అప్రస్తుత ప్రశంస గుప్పించడం, అందులోను శ్రీనాథ పోతనలను కించపరుస్తూ వ్యాఖ్యానించడం సాహిత్యంలో లబ్ధ ప్రతిష్ఠులయినవారు చేయకూడని పనిగా 'భారతి' పాఠకులు భావిస్తారు.

—శ్రీ సి. చంద్రశేఖర్

"కులాలుడు-రజకుడు"

1977 ఫిబ్రవరి 'భారతి' కలగూరగంపలో శ్రీ తి.మోహన రావు, [హిందూపురం.] గారికి "కులాలుడు – రజకుడు." అన్న విషయంపై తట్టిన "గొప్పఊహ"కు నా చిన్న సమాధానం ఇది.

రెండవతరగతి తెలుగు పాఠ్యపుస్తకంలో "కులాలుడు" "రజకుడు" అని వాడబడిన పదములను గురించి ప్రస్తావిస్తూ, మోహనరావుగారు పాఠ్యపుస్తకములు వ్రాసే పండితుల బారినుండి రెండవ తరగతి పసిపిల్లలను కాపాడవలసినదిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

5 సంవత్సరముల ఈడుగల పిల్లలకు బడిలో ప్రవేశించునప్పటికే "కుండలు చేయువాడు కుమ్మరి" అని, "బట్టలు ఉతికి తెచ్చువాడు చాకలి" అని తెలియును. కావున 6 సంవత్సరముల వయసుగల రెండవ తరగతి పిల్లలకు ఆ వ్యక్తుల పరిచయమును "కుమ్మరి" "చాకలి" అను పదముల తో చేయవక్కరలేదు. కాగా పిల్లలకు రాను రాను అంచెలంచెలుగా భాషాజ్ఞానమును పెంచుటయే విద్యావిధాన లక్ష్యము. మనము "కుమ్మరి" అను వానిని "కులాలుడు" అనికూడా అందురనియు, అట్లే చాకలిని రజకుడు అని అందురనియు పిల్లలకు తెలుపుట ముఖ్యము. అందువలననే ఆ నూతన పదపరిచయము గావించబడినది. ఈ చిన్న విషయమునే గ్రహించక, ఇట్లు ఏల ఉపయోగించుదురో అవగాహన చేసుకొనక, ఏదో వ్రాయవలెను "తప్పుపట్టవలెను" అను ఉద్దేశముతో నుండుట మంచిదికాదు. "కొమ్ములు తిరిగిన పండితులైనను పసిపిల్లలను తమ భాషపటిమచే బెదిరించరు" అను వాస్తవమును శ్రీ మోహనరావుగారు గుర్తించెదరు గాక!

— శ్రీ అమళ్ళదిన్నె వేంకటరమణ ప్రసాద్

ఈమధ్య 'భారతి' సంచికలలో 'కవిత్వంలో సృజన' గురించిన చర్చ చదివాను. 'సృజన' అనే వస్తువును ప్రతిపాదించిన సుదర్శనం గారికి గాని, దానిమీద చర్చను లేవదీసిన తిరుమలరావుగారికి గాని అసలు కలగూరగంపలోని విమర్శకసోదరులకుగాని సృజనకు అసలు రూపం అర్థంకాలేదనుకుంటాను. ధ్వని... రసం; కాదు తనకు పూర్వకవులనుండి విడివడేశక్తి, అదికాదు పరిస్థితుల ప్రభావమున రచయితలో కలిగే ఉత్ప్రేరణ...యిలా 'సృజన' అనే దానికేం నిర్వచనమివ్వాలో ప్రతిపాదకులకే అర్థం కాలేదని తోస్తోంది. పూర్తిగా కాకపోయినా చాలవరకు సహేతుకంగా తిరుమలరావుగారు అందరి లోపాలను యెత్తిచూపారుకాని వారుకూడ సృజనకు సరైన నిర్వచనం యివ్వలేకపోయారు. తిరుమలరావుగారిని విమర్శించిన విమర్శక సోదరులలో తిరుమలరావుగారంటే వారికేదో వ్యక్తిగత వైషమ్యమున్నట్లు తోస్తుందేకాని వారికి అర్థంకాలేదనుకోవాలి. అందుకు నిదర్శనం వారి ప్రశ్నే.

సృజనకర్థం ధ్వని, రసాదులయినప్పుడు యిప్పుడు ప్రత్యేకించి పేర్కొనవలసిన అవసరంలేదు ధ్వని, రసాదులులేనిది కావ్యముకాదు కనుక కవిత్వానికి మరొకపేరుగా 'సృజన' నంగీకరించాలి. లేదా కథ, నాటకము, నవల మొదలగు ప్రక్రియలనుండి ఛందోబద్ధ (పూర్వ లాక్షణికులననుసరించుచు) మైన పద్య రచనా ప్రక్రియను ప్రత్యేకంగా వేరుచేసినప్పుడు సర్వేశాయి తిరుమలరావుగారి దృష్టిలోని కవిత్వమనే పదానికి స్థానం లేదు కాబట్టి ఆస్థానాన్ని 'సృజన' ఆక్రమించు కుంటుంది

అట్లుకాక ఒక వినూతన ప్రక్రియాపాదన, భావసృష్టి మాత్రమే 'సృజన' అనుకున్నప్పుడు పై చెప్పిన అర్థం వర్తించదు. ఇట్టి శక్తికి 'ప్రతిభ' అని పూర్వులు గుర్తించే వున్నారుగనుక దానికిది మరోపేరవుతుంది. ఇంతమాత్రానికి తర్క వితర్కాలనవసరమని నా యూహ.

— శ్రీ చింతలపూడి వెంకటేశ్వర్లు

కులాలుఁడు-రజకుఁడు

ఫిబ్రవరి 'భారతి'లో శ్రీ తి.మోహనరావు (హిందూపురం) గారి లేఖ చదివాను. వారు రెండవ తరగతి వాచక కర్తలైన పండితులను విమర్శిస్తూ – కులాలుడు. రజకుడు వంటి పదాలుగల యీ వాచకాలు "అయ్యవారిని చెయ్యబోతే కోతి అయి" నట్లు తయారయి నాయని – ఇకనైనా పండితుల బారినుండి పసిపిల్లలను కాపాడవలసినదిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు.

కుమ్మరి, చాకలి పదాలు రెండవ తరగతి పిల్లలకు రోజూ వాడుకలోనున్నవే! తెలిసినవే. తెలియని పదాలను ప్రవేశపెట్టాలనే ఉద్దేశంతో-రచయితలు పై కులాలుడు రజకుడు మొదలగు నాలుగక్షరాల పదాలను ప్రవేశపెట్టారని శ్రీ తి. మోహనరావుగారు గ్రహిస్తే సంతోషిస్తాను.

అంతేకాదు ఆ పదాలు వ్రాతకు ఉచ్చారణకు సులభమైనవి. పసిపిల్లలకు వీటిని నేర్చుకోమటవలన ఏ ప్రమాదమూలేదు. పైగా కులాలుడంటే కుమ్మరి అనీ, రజకుడంటే చాకలి అనీ, వారి వారి పనుల బట్టి ఊహించి అర్థం చేసుకుంటారుకూడ!

శ్రీ మోహనరావుగారు తొందరపాటుతో పండితులను, ప్రభుత్వాన్ని దూషించడం బాగాలేదు. వారికీ పదాలతో పనిలేకపోవచ్చు. ఆంధ్ర బాలబాలికలకు భవిష్యత్తులో వీటి అవసరం ఉంటుందని వారు గ్రహించవలసి వుంటుంది –

— శ్రీ పాయల సత్యనారాయణ, దత్తి

గ్రంథ విమర్శలు

బుద్ధ చరితము

[అశ్వఘోషుని సంస్కృత కావ్యమునకు ఆంధ్ర వచనానువాదము. రచన: శ్రీ దివాకర్ల వేంకటావధాని. సాహిత్య అకాడమీ ప్రచురణ డెమ్మీ 98 పుటలు. గట్టి బైండు వెల రూ-7-50. ప్రతులకు సాహిత్య అకాడమీ, మద్రాసు 6]

ఇతర భాషలో ఉన్న అమూల్య గ్రంథాలను తర్జుమా చేయించి ఆయా ప్రాంతాలవారికి అందజేయడానికి పూనుకొని సాహిత్య అకాడమీ సాహిత్యాభివృద్ధికి ఎంతో కృషిచేస్తున్నది. అట్టి గ్రంథాలలో అశ్వఘోషుని బుద్ధచరితం ఒకటి.

బుద్ధచరితం అతి ప్రాచీన సంస్కృత కావ్యాలలో ముఖ్యమైనది. కాని, అది సమగ్రంగా దొరకలేదు. 28 సర్గల ఆ మహాకావ్యంలో పద్నాలుగు సర్గలు మాత్రమే లభించాయి. అశ్వఘోషుని సుప్రసిద్ధ గ్రంథాలయిన బుద్ధచరిత, సౌందరనంద, శారీపుత్ర ప్రకరణాలు మూడూ బౌద్ధమత విషయ ప్రతిపాదకాలే. బుద్ధచరితం కేవలం బుద్ధచరితకు సంబంధించినది. తక్కినవి యితరులకు సంబంధించినవి. అశ్వఘోషుడు బుద్ధచరితాన్ని చాలా సరళమైన శైలిలో జనసామాన్యానికి సులభంగా అర్థమయే రీతిని రచించాడు. తన పాండిత్య ప్రకర్షను ప్రకటించే ఉద్దేశంతోనే వ్రాస్తే యిది ఎంతో ప్రౌఢంగా ఉండేది. అలా వ్రాయాలనే అభిప్రాయం అతనికి ఉన్నట్లులేదు. బౌద్ధగ్రంథాల పద్ధతే యిది!

బుద్ధచరితం 28 సర్గల మహాకావ్యం. అయినా అందులో సగం భాగమే-14 సర్గలు మాత్రమే లభించాయి. లభించిన భాగంలోకూడా మొదటి సర్గలోను, పద్నాలుగవ సర్గలోనూ కొంత భాగం లుప్తమయింది. ఇందలి 14 సర్గలలోనూ క్రమంగా భగవత్ప్రసూతి, అంతఃపురవిహారం, సంవేగోత్పత్తి, స్త్రీవిఘాతనం, అభినిష్క్రమణం, ఛందకనివర్తనం, మహావనప్రవేశం, అంతఃపుర విలాపం, కుమారాన్వేషణ, శ్రేణ్యాభిగమనం, కామవిగర్హణం, ఆరాడదర్శనం, మారవిజయం, జ్ఞానప్రకాశం అనే విషయాలున్నవి. లలిత విస్తరంవలె ఇది సమగ్రంగాలేదు. పూర్తిగ్రంథం లభిస్తే ఎన్నో విషయాలు తెలిసి ఉండేవి.

అశ్వఘోషుని గ్రంథం ఇదివరకే ఎన్నడో ప్రకటించబడింది. ఇ. హెచ్. జాన్స్టన్‌గారు తమ ఆంగ్లానువాదంతో కూడా 1972 సంలో ప్రకటించిన గ్రంథమే నవీనం. ఆయన లుప్తమైన భాగాలను టిబెటన్ అనువాదాన్ని అనుసరించి పూరించారు. వారి గ్రంథాన్ని ఆధారం చేసుకునే డాక్టర్ వేంకటావధానిగారు దీన్ని వచనకావ్యంగా తర్జుమా చేశారు. సంస్కృతాంధ్రాంగ్లాలలో సమర్థులైన విద్వాంసులు కావడంవల్లనూ, సుప్రసిద్ధులైన రచయిత లగుటవల్లనూ వారి యీ అనువాదం చక్కగా తయారయినది. దీన్ని యిదివరలో తిరుపతి వెంకటకవులు పద్యకావ్యంగా అనువదించారు. కాని, వచన కావ్యంగా ఎవ్వరూ అనువదించినట్లు కానరాదు. ఆ పద్యకావ్యంకూడా ఇప్పుడు అలభ్యంగానే ఉన్నది. బుద్ధుని చరిత్రను తెలుసుకొనుటకు లలిత విస్తర గద్యానువాదం తప్ప మరే గ్రంథమూ ఇప్పుడు లభ్యం కాదు. అది బృహద్గ్రంథం. బుద్ధచరితం సంగ్రహ రూపమైనది. ఇట్టి స్థితిలో ఈ ఉత్తమ కావ్యాన్ని అనువదింపజేసి కేంద్ర సాహిత్య అకాడమీవారు ఆంధ్రులకు పెద్ద ఉపకారం చేశారని చెప్పవలసి యున్నది.

డాక్టర్ వేంకటావధానిగారు తమ 'తొలిపలుకు'లో అశ్వఘోషుని కాలాన్నిగురించీ, రచనలను గురించీ, రచనలలోని విషయాన్ని గురించీ విపులంగా తెలియజేశారు. అది సంస్కృత వాఙ్మయ పరిశోధకులకు ఎంతగానో ఉపకరిస్తుంది.

ఈ ఆంధ్రానువాదం సలక్షణమైన గ్రాంథికభాషలో సరళంగా సాగినది. పాఠకులకు సులభంగా అర్థంకాగలదు. చదువుటకు ఆసక్తినీ కల్గిస్తుంది. అశ్వఘోషుని బుద్ధచరితలోని విషయాన్ని సంస్కృతం చదివి అర్థంచేసుకోలేనివారు దీన్ని చదివితే ఆ విషయం సులభంగా తెలుస్తుంది. దీన్ని రచించిన వేంకటావధానిగారూ, ప్రకటించిన సాహిత్య అకాడమీవారూ ఆంధ్రుల కృతజ్ఞతలను తప్పక అందుకోగలరు.

—శ్రీ బులుసు వేంకటరమణయ్య

శ్రీమదాంధ్ర భగవద్గీత

[పద్యకావ్యం. కర్త: కార్యంపూడి - రాజమన్నారుగారు, ఎం. ఏ., బి. ఎల్. క్రౌను సైజు 16+155 పేజీలు. వెల: రూ. 4-50. ప్రతులకు-శ్రీ టి. శ్రీకంఠం. బి.ఏ.,బి.ఎల్.ఎల్.బి. అడ్వొకేట్, బ్రాడీపేట, గుంటూరు-2, లేక పి. రవీంద్రరావు, హైదరాబాద్ సన్ ప్రెస్, 1-1-201/8 చిక్కడపల్లి, హైదరాబాద్-20 లేక శ్రీ కె. రాజమన్నారు, 14-86, గాంధీపురం-2, రాజమండ్రి-3.]

ఆధ్యాత్మిక విషయాలలో ఆసక్తివుండి, కవిత్వం చెప్పగలశక్తి వున్న విద్వాంసుల దృష్టి భగవద్గీతలపైకి ప్రసరించడం పరిపాటి. అందువల్లనే భగవద్గీతకు వ్యాఖ్యానాలతోను, వచనానువాదాలతోను పాటు ఎన్నో పద్యానువాదాలు వంద ఏళ్లకు క్రిందటినుంచీ తెలుగులోకి వస్తూనే ఉన్నవి.

ప్రస్థానత్రయమని ప్రసిద్ధమైన ఉపనిషత్తులకూ, బ్రహ్మ

సూత్రాలకూ, భగవద్గీతకూ మత త్రయాచార్యులు వారి వారి సంప్రదాయాలకు అనుగుణంగా వ్యాఖ్యలు రచించారు. రాజమన్నారుగారు అద్వైత మతాభిమానులు. అందువల్ల శ్రీ శంకరభగవత్పాదుల భాష్యానుసారంగా శ్లోకాలన్ని అవగాహన చేసుకుని దీనిని రచించారు.

వేదాంత గ్రంథాలు సులభశైలిలోనూ, అనుష్టుప్ మున్నగు చిన్న ఛందస్సులలోనూ ఉండడం అవసరం. భగవద్గీత ఎక్కడో కొలది శ్లోకాలు తప్ప తక్కిన శ్లోకాలన్నీ అనుష్టుప్ ఛందస్సులోనే ఉన్నాయి. అనుష్టుప్ ఛందస్సుకు తెలుగులో గీత పద్యమే అనువాదానికి అనుకూలంగా ఉంటుంది. భగవద్గీతకు పద్యానువాదం కూర్చినవారందరూ తేటగీతులనే వాడారు. రాజమన్నారుగారుకూడా ఆ పద్ధతినే అవలంబించారు. అందువల్ల విషయాన్ని సులభంగా చెప్పటకు సాధ్యపడింది. రచన చాలా సులభమైన శైలిలోనే నడిచింది. ఒక్క ఉదాహరణ మూలం –

'కర్మణ్యే వాధికారస్తే
మా ఫలేషు కదాచన,
మా కర్మ ఫల హేతుర్భూః
మా తే సంగోఽస్త్వ కర్మణి''

అనువాదం —

''కలదు నీ కధికారంబు కర్మమందె;
యెప్పుడును లేదు ఫలముల నెందునైన!
కర్మఫలముల గాంక్షింపగాదు నీ క
కర్మమందును నెట్టి సంగంబు వలదు''

(పుట 20. రెండవ అధ్యాయము)

దీనికి 'భూమిక'ను వ్రాసిన మధుర సంతుల సత్యనారాయణ శాస్త్రిగారు ''శ్రీ కార్యమపూడి–రాజమన్నారుగారు తాము శ్రవణ మననములచే వయోనుభవాను భావములచే పరిపాకమునకు వచ్చిన చిత్తముతో శ్రీమదాంధ్ర భగవద్గీతను రచించి తెలుగు పాఠకుల కిచ్చుచున్నారు'' అని సముచితంగానే తెలియజేస్తున్నారు. రచయితను అభినందిస్తున్న కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు ''ఇందులో ఏ పద్యము జదివినను ధారాశుద్ధిగా వెళ్ళును. అది యీ పుస్తకములోని ప్రధాన గుణము. తెలుగు చదువరులు కాంక్షింప దగిన విషయము'' అని తెలుపుచున్నారు.

ఆధ్యాత్మికం పైని ఆసక్తి గల తెలుగు చదువరులు దీనిని చదివి భగవద్గీతా సారాన్ని గ్రహించి సంతోషించగలరని భావిస్తున్నాను.

— "ఆంగీరస"

ఉపనిషన్మధువు

[రచయిత: శ్రీ దేవత సుబ్బారావు, బి. ఏ. బి. ఎల్. (1976) పేజీలు 62. మూల్యము రెండు రూపాయలు. ప్రతులకు: దేవత సుబ్బారావు కన్వీనరు, అధ్యాత్మసాధక సమితి B.H.E.L. రామచంద్రపురం హైదరాబాదు-500032.]

ఉపనిషత్తులు భారతీయతత్త్వ మూలాధారసారమేకాక, అధ్యాత్మిక చింతనమునందు తత్త్వదర్శనమునందు హేతుపూరితము లైన విశ్వజనీనవాక్యములుగా విఖ్యాతినొంది ప్రాచ్యపాశ్చాత్య ధర్మ చింతనములను ప్రభావితంచేసాయి. ఉపనిషత్తులు అనేకములుగా ఉన్నను వానిలో పది ఉపనిషత్తులు ప్రసిద్ధంగా ఉన్నాయి. ఆ పది ఉపనిషత్తుల ప్రసక్తి, ఈ గ్రంథంలో ఉన్నది. అవి కఠోపనిషత్తు, ఈశావాస్యోపనిషత్తు, కేనోపనిషత్తు, శ్వేతాశ్వతరోపనిషత్తు, తైత్తిరీయోపనిషత్తు, ఛాందోగ్యోపనిషత్తు, ముండకోపనిషత్తు, బృహదారణ్యకోపనిషత్తు, మాండూక్యోపనిషత్తు, ప్రశ్నోపనిషత్తు. కఠోపనిషత్తులో శ్రేయ ప్రేయో మార్గములు, ఆత్మస్వరూపము వివరించబడినాయి. వీనికి సంబంధించిన మంత్రాలు భగవద్గీతలోని ఆత్మస్వరూప వివరణ శ్లోకాలు సామ్యముకలిగి ఉంటాయి. ఈశావాస్యోపనిషత్తులో ఈశ్వరుని సర్వాంతర్యామిత్వము, దేహాత్మల సంబంధము చెప్పబడినాయి. కేనోపనిషత్తులో పరమాత్మ స్వరూపము, బ్రహ్మతత్వము తెలుపబడినాయి. శ్వేతాశ్వతరోపనిషత్తులో సర్వభూతాంతరాత్మని గోచరింప జేసికొను సాధనము నిర్దేశించబడింది. ''ఏకోదేవః సర్వభూతేషుగూఢం'' అన్న పరమ సత్యమును, పరమాత్మ జీవాత్మల సంబంధమును ఇందు పేర్కొనబడినాయి. దీనిలో మౌలికమైన వేదాంత సూత్రాలు పొందుపరచబడినాయి. తైత్తిరీయోపనిషత్తులో విద్యాసముపార్జనము, గురుశిష్య సంబంధములు తెలుపబడినవి. ఈ మంత్రములు నేటికీ కొన్ని విశ్వవిద్యాలయ స్నాతకోత్సవములలో పట్టభద్రులచే పఠింపజేయుచున్నారు. ఛాందోగ్యోపనిషత్తులో కార్యకారణ ప్రసక్తి చర్చించబడినది. ముండకోపనిషత్తులో ఉత్తమానుత్తమ విద్యల తారతమ్యమును ఉత్తమవిద్య నభ్యసించవలసిన విధానము ముచ్చటించబడినాయి. బృహదారణ్యకోపనిషత్తులో అపరోక్షమను బ్రహ్మస్వరూపము వర్ణించబడినది. ''ఓమ్ పూర్ణమదః పూర్ణమిదమ్'' అనే ప్రఖ్యాత శాంతి వచనములో ఈ ఉపనిషత్తు ప్రారంభమౌతుంది. మాండూక్యోపనిషత్తు ఓంకార ప్రభావమును తెలుపుచు 'ఓంకార విదుడే ఆత్మవిదుడని'' వివరిస్తున్న దీని నుండి అద్వైత

తత్వము విపులీకరించబడినదని చెప్పుదురు. పదవది ప్రశ్నోపనిషత్తు. సుకేతుడు, సత్యకాముడు, గార్గ్య కౌశల్యా భార్గవాదులు బ్రహ్మజ్ఞానాన్ని అర్థించి పిప్పలాదుడను ఋషినర్థించినప్పుడు ఆయన ఇచ్చిన ఉత్తరములే ఈ ఉపనిషత్తు: వీనిలో ఆత్మ పంచభూతములు, జీవాత్మ అమృత స్వరూపము మున్నగు వానిగురించి ఈ ప్రశ్నోత్తరములు జరిగినవి.

అపారమైన ఉపనిషద్విజ్ఞానమును వివరిస్తూ అనేకములైన మహాగ్రంధాలు ఆనాకాలమునుండి వస్తూనే యున్నవి. ప్రతిదినమూ ఉదయించే సూర్యభగవానుని ఉషఃకాంతులు నిత్యనూతనముగా కనపడేటట్లు సనాతనమైన ఈ ధర్మచింతన నిత్యమూ నవోదితంగానే మనలను ప్రభావితం చేస్తుంది. అందుకే ఉపనిషద్ధర్మాలను ఎవ్వరు ఎప్పుడెన్ని విధాలుగా వివరించినా అవి నిత్యనూతనంగాఉండి హృదయాలను హత్తుకొంటాయి, బృహద్గ్రంధాలను, వానిని చదివి మననం చేసికోజాలని వారికి అందుబాటులో ఉంచడానికి కొన్ని సంగ్రహ రచనలు కూడ ఉన్నాయి. వానిలో సి. రాజగోపాలాచారిగారు ఆంగ్లంలో వ్రాసిన ''ఉపనిషత్తులు'' ఒకటి. దీనిని భారతీయ విద్యాభవనం ప్రచురించింది. దేవత సుబ్బారావుగారి 'ఉపనిషన్మధువు' ఈ శ్రేణిలో చేరినదే.

పరిచయ వాక్యాలలో శ్రీ శివశంకరస్వామిగారు చెప్పినటుల సుబ్బారావుగారి ''ఉపనిషన్మధువు అనువాదముకాదు. వ్యాఖ్యానం కాదు. వ్యాఖ్యానముకాదు. కానీ గ్రంధకర్త తన అనుభవములో సమకూడిన కొన్ని కొన్ని ఘట్టములలో సత్యస్వరూపమును సొంత మాటలతోగాక ఉపనిషత్ వాక్యాలతో సమకూర్చి పదనువాదము ఇచ్చినట్లు తోచుచున్నది.'' పాఠకులు ఈ భావములో పూర్తిగా ఏకీభవించవచ్చును. జటిలమైన, ఉన్నతమైన ఆధ్యాత్మిక విషయము శ్రీ సుబ్బారావుగారు సుబోధకంగా, సరళమైన, నిర్దుష్టమైన తెలుగు భాషలో ఈ గ్రంధరూపమున అందిచ్చినారు. ఉపనిషత్తులలో ముఖ్యమైన సారాంశాలను సంగ్రహంగా తెలిసికొని అనుభవించి ఆనందించడానికి సుబ్బారావుగారి ఉపనిషన్మధువు ఆస్వాదయోగ్యంగాఉంది. ఈ గ్రంథాన్ని రచయిత తను ఇష్టదైవమైన షిర్డీ సాయిబాబాకు అంకితమిచ్చారు.

జీవయాత్రాచరిత్ర

[వెన్నె కంటి సుబ్బారావు (1784-1839) జీవయాత్రా చరిత్ర (ఆంగ్లగ్రంధానికి అనువాదము) అనువాదకులు డా॥ అక్కిరాజు రమాపతిరావు (1976) పేజీలు 126. మూల్యం రూ. 6-50. శ్రీ భారతీ ప్రచురణలు. సికింద్రాబాదు.]

19వ శతాబ్దంలో ఈస్టు ఇండియా కంపెనీ పరిపాలనలో ఉద్యోగులుగానున్న ఆంధ్రులు, విదేశీయులు కూడ నాటి రాజకీయ సాంఘికార్థిక సారస్వత చరిత్ర విశేషాలను తెలిసికోడానికి ఉపయోగపడే అనేక రచనలను చేసినారు. అట్టి రచనలలో, తెలుగుభాష, తెలుగు దేశములోని శాసనములకు సంబంధించిన గ్రంధాలు చాలా ముఖ్యమైనవి. వెన్నెలకంటి సుబ్బారావు జీవయాత్రా చరిత్ర ఆ కోవకు చెందిన గ్రంధాలలో ఒకటి. అయితే దీని విశిష్టత ఒకటి ఉంది. ఇది ఒక స్వీయచరిత్ర వంటిది. ఆధునిక సాహిత్యంలోనే స్వీయచరిత ఒక క్రొత్త ప్రక్రియ. వెన్నెలకంటి సుబ్బారావు 'స్వీయచరిత్ర'ను వ్రాసిన మొట్టమొదటి తెలుగువాడని చెప్పవచ్చును.

వెన్నెలకంటి సుబ్బారావు క్రీ. శ. 1784లో ఒంగోలు దగ్గర నున్న ఓగూరు అనుగ్రామంలో పుట్టినాడు. క్రీ. శ. 1839లో మరణించినాడు. జీవితమంతా విశేషభాగం ఈస్టు ఇండియా కంపెనీ ఆంగ్లపాలకులవద్ద, కంపెనీ పరిపాలనా వ్యవస్థలోచేరి, ముఖ్యంగా న్యాయస్థానాలలో నౌకరీ చేసాడు. తన అనుభవాలను సమకాలిక చరిత్రాంశాలను ఈ స్వీయచరిత్రరూపంలో సుబ్బారావు భావితరాలవారికి తెలియచేసాడు. ''సుబ్బారావు దీనిని ఇంగ్లీషుభాషలో వ్రాయడం ఇంకొక విశేషం. ఆయన 1839లో A life journey of V. Soob row' అను పేరుతో తన జీవిత యాత్రాచరిత్ర ఇంగ్లీషులో వ్రాసిపెట్టి పోయినాడు. ఆయన మరణించిన తర్వాత ఆయన కుమారుడు ఈ గ్రంథాన్ని 1873లో మద్రాసులోని ఫాస్టరు ప్రెస్సులో అచ్చు వేయించి ప్రకటించినాడు. సుబ్బారావు భారతీయాంగ్ల రచయితలలో మూడవవాడని ప్రసిద్ధి. దీనిని స్వీయచరిత్ర అనడంకంటె దినచర్య రచనగా పరిగణించడం ఎక్కువఉచితంగా కన్పడుతుంది. బ్రిటిషు పాలన కాలానికి చెందిన దినచర్య గ్రంధాలు, చారిత్రకాధారాలుగా చాల ప్రసిద్ధి పొందినాయి. తమిళ భాషలో ఆనందరంగపిళ్లై వ్రాసిన డైరీ (దినచర్య రచన) ప్రకటితమై దక్షిణ భారతచరిత్ర పరిశోధనకు ఎంతో తోడ్పడింది. తెలుగులో ఏనుగుల వీరాస్వామయ్యగారి (1780-1836) కాశీయాత్ర కూడ ఇట్టి గ్రంథమే. దానిని ఆంధ్రప్రదేశ్ ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారము ఆంగ్లభాషలో ప్రకటించి చరిత్ర పరిశోధనకు సదుపాయము వృద్ధిచేసినారు. కావలి వెంకటబొర్రయ్య ((1776-1803)లో ఇంగ్లీషుభాషలో దినచర్య రచించినట్లు చెప్పబడింది.

ఈ గ్రంథములో వెన్నెలకంటి సుబ్బారావు బాల్యదశ, విద్యాభ్యాసము, వైవాహిక జీవితము, ఉద్యోగ నిర్వహణము విపులంగా వర్ణించబడినాయి. ఈయన తెల్లదొరల మన్ననలకు పాత్రుడై వారి ప్రశంసల నందిన విషయములు దీనిలో విస్తారంగా పేర్కొన్నాడు. ఆ ఉద్యోగంలోని సాధక బాధకాలను తెలిపేటప్పుడు అనాటి ఆంధ్ర దేశంలోని ఆర్థిక పరిస్థితులను, ఆస్తిపాస్తుల వివరాలను వర్ణించాడు. గ్రంథంలో ఆయన కాశీయాత్ర కొంత ప్రధాన భాగంగా ఉన్నది. తెలుగు వాఙ్మయంలో కాశీయాత్ర వర్ణనలు చారిత్రక విషయాలను తెలిపేవీ, జానపద గాధలకు సంబంధించినవీ కూడా ఉన్నాయి. కాశీయాత్ర ఇతివృత్తం ఆవిధంగా రచయితలను ఆకర్షించి కొన్ని చక్కటి రచనలను తెలుగు వాఙ్మయానికి ప్రసాదించింది. ఈ గ్రంథంలో మిక్కిలి ఆకర్షణీయమైన విషయం ఇంకొకటి ఉన్నది. అది విద్యావిధానానికి సంబంధించినది. వెన్నెలకంటి సుబ్బారావు మదరాసులోని స్కూలు బుక్ కమిటీకి సభ్యుడుగా నియమితుడైనాడు. ఆ సంద

త్రంలో ఆయన మదరాసు స్కూలుబుక్ సొసైటీ కార్యదర్శికి వ్రాసిన వేదన (సుదీర్ఘలేఖ) ఈ గ్రంథంలో 2వ అనుబంధంగా ముద్రిత మైనది. గ్రంథంలో సుబ్బారావు ఆనాటి విద్యాసంస్థలను గూర్చి వ్రాసిన విశేషములు, ఈ లేఖలోని అంశములు. అవి ఆ దినములలో టన విద్యావిధానము ఎట్టి నీరస స్థితిలో ఉండేదో స్పష్టంగా తెలియ జేస్తాయి. దేశమంతటా శిక్షితులున్నా విమర్శులైన ఉపాధ్యాయులు అరిదిగా ఉండేవారు. స్కూళ్ళలో వ్యాకరణం నేర్పకపోవడం, నీతిపూరిత మైన ఉద్గ్రంథాలు చదివించకపోవడం, దేశ భాషలయెడల నిర్లక్ష్యం నాటివిద్యావిధానంలోని పెద్ద లోపాలుగా ఆయన భావించాడు. ఈ విష యాలే కాకుండా ఆనాటి తెలుగువారి సాంఘికాచార సంప్రదాయా లకు సంబంధించిన వివరాలు కూడ అక్కడక్కడా ఈ గ్రంథంలో గోచరిస్తాయి. నాటి వివాహ వ్యవస్థ, కుటుంబ వ్యవస్థ, న్యాయ పద్ధతి, కుటుంబ సమస్యలు మొదలగువానిని గురించి గ్రంథంలో అనేకచోట్ల ఆయన విపులంగా వర్ణించి వ్రాసినాడు.

బహుముఖముగా ఆనాటి దేశ చరిత్రాంశములను, ముఖ్యంగా ఆర్థిక సాంఘిక విద్యాపరిస్థితులను తెలిసికొనడానికి ఈ గ్రంథం అమూల్య రచనగా పనికివస్తుంది. ఇంగ్లీషులో వ్రాసిన ఈ గ్రంథాన్ని తెనుగు భాషలోనికి అనువదించి డాక్టరు అక్కిరాజు రమాపతిరావు గారు తెలుగులో చారిత్రక పరిశోధనకు మిక్కిలి ఉపయుక్తమైన పుస్తకాన్ని విద్యార్థులకు, పరిశోధకులకు అందించారు. అనువాదము సులభ గ్రాహ్యంగా ధారాళంగా చేసినారు. గ్రంథం చివరనున్న నాలుగు అనుబంధములు ఇంగ్లీషులో ఉన్నాయి. వానిలో మూడవ అనుబంధంలో సుబ్బారావు జీవితంలోని సాధారణ అంశాలు ముఖ్యఘట్టాలు కాలాను క్రమణంగా పేర్కొనబడినాయి. వీనిని ఆయనయే స్వయంగా వ్రాసి పెట్టినారు. గ్రంథాంతమున ఇచ్చిన సూచికలు ఇట్టి గ్రంథమునకు అవసరమైన, ప్రయోజనకరమైన చేర్పుగా ఉన్నాయి. చరిత్ర పరి శోధకులకు విద్యాసంస్థల గ్రంథాలయాలకు, ఇది చాల ఉపయుక్త మైన గ్రంథమవడానికి సందేహంలేదు.

—శ్రీ వై. వి. రమణ

నవ్యపథం

[నల్లగొండజిల్లా రచయితల విశేషసంచిక. జూన్ 1976. క్రౌన్ 1/4—50 పేజీలు; వెల రు. 5/- ప్రచురణ - యువ రచయితల సమితి, నల్లగొండ.]

తెలంగాణా సాహిత్య చరిత్ర

ఇప్పుడు ప్రతిమండలంలో ఒక రచయితల సంఘం ఏర్పడి సమావేశాలు జరిపి, ప్రత్యేక సంచికల వెలువరించడం ప్రయోజన కరమైన విధానం. ఇందు చాలా సంచికలు విలువైన కానుకనే పాఠకు లకు సమర్పిస్తున్నవి-అట్టిదే ఈ నల్లగొండ సంచిక.

ఈ సంచికలో యీ సంఘ వివరాలు తెలుపబడినవి.

పూర్వకవులు - తెలంగాణము

విశ్రుతాంధ్రుడు-సాహిత్య అకాడమి కార్యదర్శి - శ్రీ దేవుల పల్లి రామానుజరావుగారు సభను ప్రారంభిస్తూ చేసిన భాషణం చాలా మంచి విషయాలతో నిండియున్నది: పూర్వాంధ్ర సాహిత్యం పుట్టి పెరిగినది ఎక్కువగా తెలంగాణా రాయలసీమలలోనే. నిజాం పాలనలో తెలంగాణా చొరరాని కారడవిగా ఉండినందున, దాని చరిత్ర అక్కడి సాహిత్య వికాసం విస్మృతి గర్భంలో నిదురబోయినవి. అందుచేతనే వేములవాడ భీమకవిని పోతనను ఈ ప్రాంతంవాడుగా చేసుకొన్నాము. రామానుజరావుగారు ఆ ప్రాంత - ప్రత్యేకంగా నల్లగొండ మండల చరిత్రను సాహిత్య వికాసమును ప్రశంసించి ఉత్తేజపరుస్తున్నారు. పూర్వంకంటె ఇప్పుడు సాహిత్యసీమలు సాంఘిక అవధులు దూరంగా పోకిపోవుటచే రచయితల బాధ్యత క్రమ ఎక్కువైన పనుల యోచనాపూర్వకవచనం. కాబట్టి కొత్తపోకడలు తలెత్తినవన్నారు.

నల్లగొండ మహాకవులు

నల్లగొండ సాహిత్య చరిత్రను కాంచనపల్లి చినవెంకట రామా రావుగారు సనిక్షిప్తజనకంగా వర్ణిస్తూ అపూర్వ విషయాలను బయట పెట్టుతున్నారు: సామాన్యులలో చదువుతక్కువైనా, ఈ ప్రాంతంలో 13వ శతాబ్దంలోనే కవితా వికాసం ప్రాదుర్భవించినది. తెనుగు కవితలో, భాషారీతిలో విప్లవ పతాకం ఎగగట్టిన ద్విపదకవి, శివకవి పాలకురికి సోమనాథుడు ఈ వీలగిరివాడు. శైవానికి ఆంధ్రకవిత ఆచార్య పీఠమైనది. ఈ పోతుగడ్డనబుట్టి, ఆయన వీర్యవంతమైన మతానికి తేజోవంతమైన దేశిభాషను అందించినాడు.

వెలమనాయకులు

కాకతీయ సామ్రాజ్య పతనానంతరం, రాచకొండ - దేవర్కొ వెలమ నాయకుల యుగంలో కవితకు పెండ్లి పందిళ్ళు పెట్టబడినవి. వీరు పండితులై కవులై కవిపోషకులై కొండవీటి రెడ్లతో పోటీపడి నారు. ఇమ్మడి సర్వజ్ఞ సింగభూపాలుడు (1384-1400)

నాటకకర్త, ఆలంకారికుడు. సంగీత మర్మజ్ఞుడు. సంగీత సాహిత్య గ్రంథాలను చాలా సంస్కృతంలో ఈ సర్వజ్ఞుడు రచించినాడు. ఈయన ఆస్థానంలో, చమత్కార చంద్రిక అనే లక్షణ గ్రంథాన్ని వ్రాసిన విశ్వేశ్వరకవి, అమరానికి వ్యాఖ్యానం వ్రాసిన బొమ్మకంటి అప్పళాచార్యులు, గౌరన మహాకవి-మొదలగువారుండినారు. అనేక సంస్కృత గ్రంథ వ్యాఖ్యానాలతో అఖిల భారత ప్రసిద్ధిగాంచిన కొలచలము మల్లినాథసూరి ఈయన సమకాలికుడు.

రావు మాధవసేని అనేరాజు (1421-1430) రామాయణానికి వ్యాఖ్య వ్రాసినాడుగాని, అది దొరకడంలేదు. రెండో రాచకొండ శాఖ-దేవరకొండ పాలకుడు పెదవేదగిరి నాయుడి ఆస్థానకవి, అయ్యలార్యుడు భాస్కర రామాయణ శేషాన్ని పూరించినాడు. ఈ అయ్యలార్యుని కొమారుడే ద్విపద హరిశ్చంద్ర కావ్యమును వ్రాసిన ప్రఖ్యాత కవి-గౌరన.

నక్షత్రక పాత్ర

హరిశ్చంద్ర కథలో నక్షత్రకు ఉత్తరదేశానికి లేదు; ఇతడు దక్షిణదేశంలో సృష్టింపబడిన తరువుకాడు. ఇది గౌరన కల్పన అని యీ వ్యాసకర్త అంటాడు. ఇది డాక్టర్ పి. యశోదారెడ్డిగారి సూచన. కాని గౌరనకు ముందే కన్నడంలో ఈ నక్షత్రకుడు పుట్టినాడని డాక్టర్ తిమ్మావజ్ఝల కోదండరామయ్య అంటున్నాడు. ఏమైనా-దక్షిణాదివాడే.

రాచకొండ ముమ్మడి సింగన-సర్వజ్ఞ బిరుదాంకితుడు (1420-1470) పండితకవి; ఈయనే శ్రీనాథకవి సార్వభౌముని హడలుగొట్టించినది. పోతనామాత్యుడు మొదట ఈయన ఆస్థానంలో ఉండినాడు. (బమ్మెర గ్రామం జనగాం తాలూకాలోనిది; ఇది ఇప్పుడు వరంగల్లు జిల్లాలో చేర్చబడినది.)

పిల్లలమఱ్ఱి పినవీరభద్రకవి ఈ ప్రాంతంనుండి, పాత నెల్లూరుజిల్లా సింగరాయకొండ దగ్గర, సోమరాజుపల్లె చేరినాడు. [ఈయన బడిలోనే శ్రీనాథుడు, అవిసి తిప్పయ్యశెట్టి సావాసగాండ్రుగా విద్య నభ్యసించినారు.]

కుతుబ్‌షాహీల కాలం

రాచకొండయుగం తర్వాత గోలకొండ కుతుబ్ షాహీలయుగ వచ్చినది. ఈ కాలంలో నల్లగొండ మండలంలో పొన్నగంటివా యయాతి చరితబుటి, అచ్చతెనుగు వాతకు అంకురార్ప చేసినది. సింగ్రాచార్యుడు తిట్టు కవిత్వంలో దిట్ట అనిపించుకొన్నాడు ఈయన సాహిత్యపు సర్కస్‌లో అనేక విధములైన ఫీట్లు చేసిన చి విచిత్రకవి; నల యాదవ రాఘవ పాండవీయము అనే నాలుగు అర్థా ప్రబంధం వ్రాసిన మొనగాడు.

దొర అయిన దొంగ

వెంకటనరసింహాచారి అనే గ్రంథకర్త. కర్పూరం కృష్ణమాచారి భగవద్గీత ద్విపదగా వ్రాసినాడు. ఇదే తెనుగులో మొద గీతా గ్రంథం కావచ్చును.

ఈ కవితలు ఒక ఎత్తు. సర్వాయ పాపడి బైరగీతం (జంగ కత-Ballad) ఇంకొక ఎత్తు. ఇది ఎవరో ఒక అజ్ఞాత కవికృత ఈ పాపడు దుర్గాలు పట్టుకొని, కాసేపు గోలుకొండ సింగపుగద్దె ముడ్డిమోపిన తెంపరి వీరుడు. ఈ కథ బొబ్బిలి కథవలె వీరరసా ఒక అగ్నిపర్వతం. దేశదిమ్మరులు ఇప్పటికీ దీనిని (చిన్నపరెడ్డి గుఱ్ఱాల గోపిరెడ్డి కథలవలె) రసవత్తరంగా పాడుతుంటారు.

ఆధునిక యుగం

ఆధునికయుగంలోగూడ నల్లగొండ సాహిత్య రాజకీయ చ తెల్లటి కీర్తితోనే ప్రకాశిస్తున్నది. ఏ ఉద్యమంలోను వెనుకాడ పత్రికలు గ్రంథాలయాలు నెలకొల్పబడినవి. రావి నారాయణ బోటి స్వాతంత్ర్య వీరులేగాక, వినోభాభావే భూదానోద్యమ ఈ మండలంలోని పోచంపల్లి పురిటిల్లు అయినది.

ఈ సంచికలో ఇంకా కొన్ని మంచి వ్యాసాలు, కవితాఖం ఇంపు గూరుస్తున్నవి. ఇది అందరూ చదువవలసిన సంకలనము

—శ్రీ మరుపూరు కోదండరామ

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radhakrishna at the Andhra P
Press, Gandhinagar, Vijayawada-3. Editor S. Radhakrishna, Vijayawada. Phones: 75667 & 752